SUPREME AUDIT INSTITUTION OF INDIA
लोकहितार्थ सत्यनिष्ठा
Dedicated to Truth in Public Interest

# 2022 మార్చితో ముగిసిన కాలానికి భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

2025లో 5 వ నివేదిక

(పనితీరు మరియు నియమపాలన తనిఖీ–సివిల్ )

# 2022 మార్చితో ముగిసిన కాలానికి
# భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్
# నివేదిక

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

2025లో 5వ నివేదిక

(పనితీరు మరియు నియమపాలన తనిఖీ–సివిల్)

# విషయసూచిక


| అంశం | సంబంధిత | |
|---|---|---|
| | పేరా | పేజీ |
| **ముందుమాట** | | vii |
| **అవలోకనం** | | ix |
| **1వ అధ్యాయం – సాధారణ అంశాలు** | | |
| ఈ నివేదిక గురించి | 1.1 | 1 |
| ప్రధాన మహాగణకుల (తనిఖీ) కార్యాలయం | 1.2 | 1 |
| తనిఖీ చేయుటకు అధికారం | 1.3 | 2 |
| తనిఖీ ప్రణాళిక, నిర్వహణ మరియు తనిఖీ నివేదికల తయారీ | 1.4 | 2 |
| తనిఖీ చేయబడే సంస్థల స్వరూపం | 1.5 | 2 |
| తనిఖీ పరిశీలనలపై శాఖల ప్రతిస్పందన | 1.6 | 3 |
| ***కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్లు మరియు బీమా వైద్య సేవల శాఖ*** | | |
| **2వ అధ్యాయం – 'భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం' పై పనితీరు నివేదిక** | | |
| పరిచయం | 2.1 | 6 |
| సంస్థాగత నిర్మాణం | 2.2 | 6 |
| తనిఖీ లక్ష్యాలు | 2.3 | 8 |
| తనిఖీ ప్రమాణాలు | 2.4 | 8 |
| తనిఖీ పరిధి, ప్రక్రియ | 2.5 | 8 |
| భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టాలు, నియమాలు మరియు సంస్థలు, లబ్ధిదారుల నమోదు/పునరుద్ధరణ మధ్య అనుగుణ్యత | 2.6 | 9 |
| సంస్థలు, లబ్ధిదారుల నమోదు | 2.7 | 12 |
| సెస్సు మదింపు, వసూలు, సేకరణ మరియు బదిలీ | 2.8 | 15 |
| సంస్థల్లో భద్రత మరియు సంక్షేమ చర్యలను అందించడం | 2.9 | 24 |
| తనిఖీల నిర్వహణ | 2.10 | 24 |
| సంక్షేమ పథకాల అమలులో నిధుల నిర్వహణ, వినియోగం | 2.11 | 25 |
| ***పాఠశాల విద్యా శాఖ*** | | |
| **3వ అధ్యాయం – 'మనబడి నాడు-నేడు మొదటి దశ' పథకంపై నియమపాలన తనిఖీ** | | |
| పరిచయం | 3.1 | 33 |
| ఆడిట్ పరిశీలనలు | 3.2 | 36 |
| పర్యవేక్షణ | 3.3 | 49 |

| అంశం | సంబంధిత | |
|---|---|---|
| | పేరా | పేజీ |
| ***స్త్రీ, శిశు, వికలాంగ మరియు వయో వృద్ధుల శాఖ*** | | |
| **4 వ అధ్యాయం – 'సంపూర్ణ పోషణ' పథకంపై నియమపాలన తనిఖీ** | | |
| పరిచయం | 4.1 | 51 |
| తనిఖీ పరిశీలనలు | 4.2 | 56 |
| ముగింపు | 4.3 | 77 |
| సిఫార్సు | 4.4 | 77 |
| ***పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ*** | | |
| **5వ అధ్యాయం – 'ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ పనితీరు' పై నియమపాలన తనిఖీ** | | |
| పరిచయం | 5.1 | 79 |
| భూమి యొక్క అభివృద్ధి | 5.2 | 82 |
| భూ కేటాయింపులు & రద్దులు | 5.3 | 89 |
| **6వ అధ్యాయం – నియమపాలన తనిఖీ పేరాలు** | | |
| ***ఉన్నత విద్యా శాఖ*** | | |
| కాంట్రాక్టు గరిష్ట డిమాండ్ (సీఎండీ) పునఃగణన చేయని కారణంగా ₹ 1.89 కోట్ల నివారించదగిన వ్యయం | 6.1 | 107 |
| ***గిరిజన సంక్షేమ శాఖ*** | | |
| శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గిరిజన సంగ్రహాలయ భవనాల నిర్మాణాన్ని పునః ప్రారంభించకపోవడం వల్ల నిష్ఫలమైన ఖర్చు – ₹ 75.25 లక్షలు | 6.2 | 110 |
| ***యువజనాభివృద్ధి, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ*** | | |
| భవానీ ద్వీపం వద్ద పక్షుల సమూహ ప్రాంతం, సింహాల పార్కు మరియు సముద్ర క్షీరదాలతో కూడిన కృష్ణా నదీ వన్యప్రాణి ఉద్యానవనం – ₹ 1.33 కోట్ల నిరుపయోగమైన వ్యయం | 6.3 | 112 |
| ***రవాణా, రహదారులు & భవనాల శాఖ*** | | |
| ప్రత్యేక అద్దె బస్సు చార్జీల నియమాలను అవలంబించకపోవడం | 6.4 | 113 |
| ప్రమాద పరిహార క్లెయిమ్‌లను రికవరీ చేయకపోవడం | 6.5 | 115 |
| కాంపౌండింగ్ రుసుమును తక్కువగా విధించడం లేదా అసలు విధించకపోవడం | 6.6 | 117 |
| ఫిట్‌నెస్ ప్రమాణపత్రాల పునరుద్ధరణపై పర్యవేక్షణ లేకపోవడం | 6.7 | 119 |
| రవాణా వాహనాలపై త్రైమాసిక పన్ను మరియు అపరాధ రుసుమును వసూలు చేయక పోవడం | 6.8 | 120 |
| ***ఆంతరంగిక శాఖ*** | | |
| నిర్వహణ మరియు మరమ్మతుల కోసం నిధుల లేమి కారణంగా నిరుపయోగంగా ఉంచబడిన ఫాస్ట్ ఇంటర్‌సెప్టర్ బోట్లు | 6.9 | 121 |

# అనుబంధాలు


| అనుబంధం సంఖ్య | వివరాలు | సంబంధిత పేరా | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| 1.1 | శాఖల వారీగా బకాయిగా ఉన్న తనిఖీ నివేదికలు మరియు పేరాలు | 1.6.1 | 125 |
| 1.2 | 2023 జూన్ 30 నాటికి బకాయిగా ఉన్న వివరణాత్మక నివేదికలు | 1.6.3 | 126 |
| 1.3 | 2023 జూన్ 30 నాటికి బకాయిగా ఉన్న మరియు తీసుకున్న చర్యలపై నివేదికలు | 1.6.4 | 127 |
| 2.1 | బీఓసీడబ్ల్యూ చట్టం 1996 మరియు ఓఎస్‌హెచ్‌డబ్ల్యూసీ కోడ్ 2020 పోలిక | 2.6.1 | 129 |
| 2.2 | చెల్లించిన, చెల్లించాల్సిన మరియు తిరస్కరించిన, బకాయిలో ఉన్న వివరాలను చూపే పట్టిక | 2.11.1 | 131 |
| 3.1 | భౌతిక ధ్రువీకరణ కోసం ఎంచుకున్న పాఠశాలల జాబితాను చూపించే పట్టిక | 3.1.1 | 133 |
| 3.2 | మచ్చుకు తనిఖీ చేసిన పాఠశాలల్లో తాగునీటి వ్యవస్థలు పనిచేయడం లేదని చూపించే పట్టిక | 3.2.2.7(ii) | 138 |
| 3.3 | మన బడి నాడు నేడు కింద రంగులు వేసే/చిత్రలేఖన పని కోసం ఎమ్. బుక్ రికార్డు కంటే ఎక్కువగా చెల్లించిన మొత్తాన్ని చూపే పట్టిక | 3.2.2.7(iii)(b) | 140 |
| 3.4 | డ్యూయల్ డెస్కులు సరిపోకపోవడంతో నేలపై కూర్చున్న విద్యార్థుల సంఖ్యను చూపే పట్టిక | 3.2.2.7(iv) | 143 |
| 3.5 | లోతట్టు ప్రాంతం 30 ఘనపు మీటర్ల కంటే మించిపోయిన పాఠశాలలను చూపే పట్టిక | 3.2.2.7(vi) | 144 |
| 3.6 | తల్లిదండ్రుల కమిటీల బ్యాంకు ఖాతాలలో నిష్క్రియంగా ఉన్న మనబడి-నాడు నేడు మొదటి దశ నిధుల నిల్వల వివరాలు | 3.2.2.7(vii) | 145 |
| 4.1 | వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం యొక్క ఆహార నమూనాల వివరాలు & అంచనా వ్యయం | 4.1.5 | 147 |
| 4.2 | వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం యొక్క ఆహార నమూనాలు మరియు అంచనాల వ్యయం వివరాలు | 4.1.5 | 149 |
| 4.3 | భారత ప్రభుత్వం నుండి మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖకు విడుదల చేసిన వివరాలను చూపే పట్టిక | 4.1.5 | 151 |
| 4.4 | నమూనా జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ మరియు ఈఓలు, ఐసీడీఎస్ ప్రాజెక్టులు, అంగన్ వాడీ కేంద్రాలు | 4.1.8 | 154 |
| 4.5 | బాలామృతం ఇండెంట్‌లో సరఫరా వ్యవస్థ నిర్వహణ పోర్టల్ టీఎస్ఎన్‌సికి జారీ చేయబడిన వాస్తవ ఇండెంట్ మధ్య వైవిధ్యాలు | 4.2.2(a) | 155 |
| 4.6 | 2020-21 నుండి 2021-22 మధ్యకాలంలో ఏపీడీడీసీఎఫ్ఎల్‌కి సరఫరా వ్యవస్థ నిర్వహణ పోర్టల్ మరియు వాస్తవ ఇండెంట్ మధ్య పాల ఇండెంట్‌లో వైవిధ్యాలు | 4.2.2(a) | 156 |

| అనుబంధం సంఖ్య | వివరాలు | సంబంధిత పేరా | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| 4.7 | సరఫరాదారు ద్వారా బియ్యం, పప్పు మరియు నూనెకు/సరఫరాకు సరాఫరా వ్యవస్థ నిర్వహణ పోర్టల్ ఇండెంట్ మరియు జారీ చేయబడిన వాస్తవ ఇండెంట్ల మధ్య వ్యత్యాసాలు | 4.2.2(a) | 156 |
| 4.8(ఎ) | పాల కొరత | 4.2.3.1(i)&(ii) | 160 |
| 4.8(బి) | 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు జిల్లాల వారీగా పాల కొరత | 4.2.3.1(i)&(ii) | 160 |
| 4.9 | 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు ప్రాజెక్ట్ వారీగా పాల కొరత | 4.2.3.1(iii) | 161 |
| 4.10 | 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు రాష్ట్రం మొత్తం మీద బాలామృతం కొరత | 4.2.3.2 | 162 |
| 4.11(ఎ) | 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు జిల్లాల వారీగా గుడ్ల కొరత | 4.2.3.3 | 163 |
| 4.11(బి) | 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు ప్రాజెక్టు వారీగా గుడ్ల కొరత | 4.2.3.3 | 163 |
| 4.12(ఎ) | మచ్చుకు తనిఖీ చేసిన అంగన్ వాడీ కేంద్రాలలో భౌతిక ధ్రువీకరణ | 4.2.5 | 164 |
| 4.12(బి) | లబ్దిదారుల సర్వే ఫలితాలు | 4.2.5 | 165 |
| 4.13 | 2022 జనవరి 31 నాటికి ఏడబ్ల్యూసీలలో జిల్లాల వారీగా మౌలిక సదుపాయాలు | 4.2.6(b) | 166 |
| 5.1 | ముందస్తు రుసుములు విధించని & తక్కువ సేకరణను చూపే పట్టిక | 5.3.1.3 | 167 |
| 5.2(ఎ) | నిర్ణీత సమయంలోగా 'ఒప్పందం అమ్మకానికి' అమలు చేయకపోవడం | 5.3.2.1 | 168 |
| 5.2(బి) | నిర్ణీత సమయం తర్వాత కార్యకలాపాలను ప్రారంభించకపోవడం | 5.3.2.1 | 168 |
| 5.3 | 2022 మార్చి నాటికి ఐఏఎల్ఏల ద్వారా ఆస్తి పన్ను వసూలు స్థితి | 5.3.3.2 | 169 |
| 5.4 | 2022 మార్చి నాటికి మాతృ స్థానిక సంస్థకు ఆస్తి పన్ను చెల్లింపు చేయలేదని చూపే పట్టిక | 5.3.3.3 | 169 |
| 5.5 | 2017-18 నుండి 2021-22 వరకు జరిగిన పరిపాలనా వ్యయం వివరాలను చూపే పట్టిక | 5.3.3.5 | 170 |
| 6.1 | సీడీపీ-172 యొక్క విద్యుత్ వినియోగ నమూనాను చూపే పట్టిక | 6.1 | 171 |
| 6.2 | సీడీపీ-692 యొక్క విద్యుత్ వినియోగ నమూనాను చూపే పట్టిక | 6.1 | 173 |
| 6.3 | సీడీపీ-233 యొక్క విద్యుత్ వినియోగ నమూనాను చూపే పట్టిక | 6.1 | 173 |
| 6.4 | సీడీపీ -264 యొక్క విద్యుత్ వినియోగ నమూనాను చూపే పట్టిక | 6.1 | 174 |

| అనుబంధం సంఖ్య | వివరాలు | సంబంధిత పేరా | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| 6.5 | విజయవాడలో జరిగిన బీసీ మహాసభలకు సరఫరా చేసిన బస్సులకు సంబంధించి ఆడిట్ లెక్కించిన ప్రత్యేక అద్దె ఛార్జీలు | 6.4 | 175 |
| 6.6 | 2022 మార్చి నాటికి గాయపడిన వారికి/మరణించిన వారిపై ఆధారపడిన వారికి/దెబ్బ తిన్న ఆస్తి యాజమానులకు పరిహారంగా చెల్లించిన మొత్తం | 6.5 | 181 |
| 6.7 | డిపాజిట్ మొత్తం మరియు వడ్డీ నష్టాన్ని చూపే పట్టిక | 6.5 | 181 |
| 6.8 | సవరించిన కాంపౌండింగ్ రుసుమును తక్కువగా వసూలు చేయడాన్ని చూపే పట్టిక | 6.6 | 187 |
| 6.9 | కాంపౌండింగ్ రుసుము విధించక పోవడం/వసూలు చేయలేకపోవడాన్ని చూపే పట్టిక | 6.6 | 187 |
| 6.10 | రెండవ మరియు తదుపరి నేరానికి సంబంధించి కాంపౌండింగ్ రుసుమును తక్కువ రేట్లకు వసూలు చేసినట్లు చూపే పట్టిక | 6.6 | 188 |
| 6.11 | బకాయిలో ఉన్న కేసులు మరియు వసూలు చేయని మొత్తాలు ఉన్న కార్యాలయాల జాబితా | 6.6 | 188 |
| 6.12 | రవాణా వాహనాల నుండి ఫిట్‌నెస్ ధ్రువీకరణ రుసుములను వసూలు చేయని వివరాలను చూపే పట్టిక | 6.7 | 189 |
| 6.13 | త్రైమాసిక పన్ను మరియు విధించబడని జరిమానా కేసుల సంఖ్యను చూపే పట్టిక | 6.8 | 189 |
| | **పదకోశం** | | **191** |

# ముందుమాట

భారత రాజ్యాంగంలోని 151వ అధికరణను అనుసరించి 2022 మార్చితో ముగిసిన సంవత్సరానికి సంబంధించి భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ వారి నివేదికను రాష్ట్ర శాసనసభ ముందు ఉంచడం కోసం ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌కు సమర్పించడానికి రూపొందించబడింది.

ఈ నివేదికలో 2017-18 నుండి 2021-22 మధ్య కాలానికి సంబంధించి కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్‌లు మరియు బీమా వైద్య సేవల శాఖ క్రింద భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమంపై పనితీరు తనిఖీ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజనాభివృద్ధి, పర్యాటకం మరియు సాంస్కృతిక శాఖ, ఆంతరంగిక శాఖ, ఉన్నత విద్య; పరిశ్రమలు & వాణిజ్యం; పాఠశాల విద్య; రవాణా, రహదారులు & భవనాలు; ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమం మరియు స్త్రీ, శిశు, వికలాంగులు & వయో వృద్ధుల శాఖల నియమపాలన తనిఖీ యొక్క ముఖ్యమైన ఫలితాలు ఉన్నాయి.

ఈ నివేదికలో 2021-22 మధ్య కాలంలో మచ్చుకు నిర్వహించిన తనిఖీల్లో గమనించిన అంశాలు, అదే విధంగా మునుపటి సంవత్సరాల్లో ఆడిట్ దృష్టికి వచ్చి, గత నివేదికల్లో పొందుపరచని అంశాలు ఉన్నాయి. 2021-22 తరువాతి కాలానికి సంబంధించిన అంశాలను కూడా అవసరమైన చోట్ల చేర్చడమైనది.

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ జారీ చేసిన ఆడిటింగ్ ప్రమాణాలకు అనుగుణంగా ఆడిట్ నిర్వహించబడింది.

ఆడిట్ నిర్వహణ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మరియు వివిధ శాఖల అధికారులు అందించిన సహాయ సహకారాలకు ఆంధ్రప్రదేశ్ ప్రధాన మహా గణకుల కార్యాలయం (తనిఖీ) కృతజ్ఞతలు తెలుపుతుంది.

ఈ తెలుగు నివేదిక, మూలమైన ఆంగ్ల నివేదికకు యదార్ధ అనువాదం మాత్రమే. దీనిలో ఏవైనా సందేహాలుంటే మూలాధారమైన ఆంగ్ల నివేదికను ప్రామాణికంగా తీసుకోగలరు.

# అవలోకనం

# అవలోకనం

## పరిచయం

ఈ నివేదిక, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సీఏజీ) యొక్క, ఆంధ్రప్రదేశ్‌లోని 'భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం'పై పనితీరు తనిఖీ, 'మన బడి నాడు నేడు మొదటి దశ' పథకం, 'సంపూర్ణ పోషణ' పథకం మరియు 'ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ పనితీరు'లపై నియమపాలన తనిఖీ, అలాగే ఉన్నత విద్యా శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, యువజన, అభివృద్ధి, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ, రవాణా, రోడ్లు & భవనాల శాఖ మరియు ఆంతరంగిక భద్రత శాఖలలో నియమపాలన తనిఖీ పరిశీలనలతో రూపొందించబడింది.

తనిఖీ నివేదికలో చేర్చబడిన ముఖ్యమైన పరిశీలనలు ఈ క్రింది పేరాల్లో క్లుప్తంగా పొందుపరచబడ్డాయి:

## ఎ) కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్లు మరియు వైద్య బీమా సేవల శాఖ

### *ఆంధ్రప్రదేశ్‌లోని భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమంపై పనితీరు తనిఖీ*

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై పనితీరు తనిఖీ (i) ఈ చట్టం కింద ప్రభుత్వం ప్రకటించిన నియమాలు చట్టాల స్ఫూర్తికి అనుగుణంగా ఉన్నాయా, (ii) సంస్థలు మరియు లబ్ధిదారుల నమోదుకు సమర్థవంతమైన వ్యవస్థ ఉన్నదా, (iii) సెస్సును మదింపు చేయడం, వసూలు చేయడం మరియు నిధికి బదిలీ చేయడం సమర్థవంతంగా ఉన్నదా, (iv) ప్రభుత్వం తగిన ఆరోగ్య మరియు భద్రతా నిబంధనలను సూచించిందా, (v) కార్మిక సెస్సు ఎగవేతను మరియు యజమానులు ఆరోగ్య మరియు భద్రతా నిబంధనలకు అనుగుణంగా పని చేస్తున్నారో లేదో తనిఖీ చేయడానికి ప్రభుత్వం పారదర్శకంగా మరియు ప్రభావవంతంగా తనిఖీల వ్యవస్థను అమలు చేసిందా, మరియు (vi) రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన చట్టం మరియు నియమాల ప్రకారం సంక్షేమ పథకాల అమలుపై బోర్డు ద్వారా నిధుల నిర్వహణ మరియు వినియోగం సమర్థవంతంగా మరియు ప్రభావవంతంగా ఉన్నదా అని అంచనా వేయడానికి నిర్వహించబడింది.

పనితీరు తనిఖీ యొక్క ప్రధాన పరిశీలనలు క్రింద ఇవ్వబడ్డాయి:

- కార్మిక శాఖ నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రతా ప్రయోజనాలను భారత ప్రభుత్వం రూపొందించిన నమూనా సంక్షేమ పథకాల ప్రకారం విస్తరించలేదు.

  *నమోదు కాబడిన నిర్మాణ కార్మికులకు కావలసిన సామాజిక భద్రతా ప్రయోజనాలను విస్తరించడానికి నమూనా సంక్షేమ పథకాలకు అనుగుణంగా బోర్డు పద్ధతులను రూపొందించాలని సిఫార్సు చేయడమైంది.*

- చట్ట ప్రకారం అందించబడుతున్న ప్రయోజనాలను పొందడానికి, అర్హత ఉన్న కార్మికులను గుర్తించి బోర్డులో నమోదు చేసుకోవడానికి మరియు నమోదును కాలానుగుణంగా పునరుద్ధరించడానికి విభాగం ఎటువంటి విధానాన్ని రూపొందించలేదు.

  బోర్డు పనితీరులో పూర్తి పారదర్శకత మరియు జవాబుదారీతనం సాధించడానికి, సంస్థలు, కార్మికుల నమోదు, సెస్సు వసూలు, క్లెయిమ్‌ల అకౌంటింగ్, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల ప్రయోజనాల పరిష్కారం కోసం నవ నిర్మాణ కార్మికుల యాప్‌ను అభివృద్ధి చేయడానికి ₹54 లక్షలు ఖర్చు చేసినప్పటికీ, 2023 మే నాటికి ఈ ప్రాజెక్టు అసంపూర్ణంగా ఉంది.

  *అన్ని సంస్థలు మరియు అర్హత కలిగిన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులను గుర్తించడానికి మరియు వారు సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు నమోదు చేసుకునే విధంగా ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను రూపొందించాలని లేదా ఎండ్ టు ఎండ్ ఆన్‌లైన్ దరఖాస్తును అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి*

*సిఫార్సు చేయడమైనది. నమోదు కాబడిన సంస్థలు, వాటిలో ప్రతి ఒక్క సంస్థ నియమించిన కార్మికుల సంఖ్యల సమాచారంతో పాటు యజమానుల సమాచార నిధిని బోర్డు నిర్వహించాలి.*

- 2017-18 నుండి 2021-22 వరకు వార్షిక ఆదాయంలో, సంక్షేమ పథకాలకు ఖర్చు చేసిన మొత్తం 25.12 శాతం నుండి 0.53 శాతానికి తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వం ఇతర విభాగాల ద్వారా ఇలాంటి పథకాలను అమలు చేస్తున్నందున, అవే ప్రయోజనాలు మళ్ళీ పొందడాన్ని నివారించడానికి సంక్షేమ పథకాలను నిలిపివేయాలని 2020 మార్చిలో ప్రభుత్వం ఆదేశించడం దీనికి కారణం. పరిపాలనా వ్యయాన్ని మొత్తం వ్యయంలో ఐదు శాతానికి పరిమితం చేయడంలో బోర్డు విఫలమైంది. ఇది 2019-20 నుండి 2021-22ల మధ్య 13 నుండి 63 శాతం వరకు నమోదైంది.

- భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల క్లెయిమ్‌లను పూర్తిగా చెల్లించలేదు, 2017-22లో శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ల శాతం 0.26 నుండి 100కి పెరిగింది. దీని ఫలితంగా అవసరమైన కార్మికులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలను బోర్డు నిరాకరించినట్లైంది.

- వార్షిక ఖాతాల నివేదికను తయారు చేయడానికి అవసరమైన నగదు పుస్తకం మరియు నగదు ప్రవాహ నివేదికలను బోర్డు నిర్వహించలేదని గమనించడమైనది. బ్యాంకులో ఉన్న నిల్వతో నగదు నిల్వలను కూడా బోర్డు సమన్వయం చేయలేదు. 2017-18 నుండి 2021-22 వరకు ఆర్థిక సంవత్సరంలో బోర్డు యొక్క అన్ని సంక్షేమ మరియు ఇతర కార్యకలాపాలను ప్రముఖంగా చూపే వార్షిక నివేదికలను కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించలేదు, ఎందుకంటే చార్టర్డ్ అకౌంటెంట్ అంతర్గత ఆడిట్ సకాలంలో నిర్వహించలేదు. 2017-18 నుండి 2021-22 సంవత్సరాలకు తుది ఖాతాలను చార్టర్డ్ అకౌంటెంట్ 2023 మేలో మాత్రమే తనిఖీ చేశారు, దీని కారణంగా సంబంధిత అకౌంటింగ్ సంవత్సరం చివరిలో బోర్డు యొక్క ఆర్థిక స్థితి తెలియలేదు. ఆ విధంగా, ఖాతాలు సకాలంలో నిర్వహించక, సిద్ధం చేయబడలేదు మరియు తనిఖీ చేయబడలేదు.

  *అవసరమైన తనిఖీల ద్వారా సరిచూసుకున్న తర్వాత మాత్రమే, వార్షిక ఖాతాలను సకాలంలో తయారు చేశారని నిర్ధారించుకోవాలని బోర్డుకు సిఫార్సు చేయడమైంది.*

- 2017-18 నుండి 2021-22 వరకు ప్రభుత్వ వార్షిక ఖాతాల ప్రకారం వ్యక్తిగత డిపాజిట్ (పీడీ) ఖాతాలలో తేడాలు ₹13 కోట్ల నుండి ₹205.22 కోట్ల వరకు ఉన్నాయి. బోర్డు లెక్కల ప్రకారం పీడీ ఖాతాలలో తక్కువ నిల్వలు గమనించబడ్డాయి. వీటిని సమన్వయం చేయాలి.

- మచ్చుకు తనిఖీ చేసిన ఇంజనీరింగ్ విభాగాల పని బిల్లులలో ₹5.11 కోట్ల లేబర్ సెస్సు తక్కువగా వసూలు చేయబడింది. ఇంకా, కమీషనర్ మరియు పురపాలక పరిపాలన సంచాలకులు (సీడీఎంఏ) ₹196.79 కోట్ల లేబర్ సెస్సును వసూలు చేసి బోర్డుకు బదిలీ చేయడానికి బదులుగా తమ వద్దనే ఉంచుకున్నారు.

  *లైన్ విభాగాలు వసూలు చేసే సెస్సును సరిగ్గా లెక్కించి, బోర్డు ఖాతాలకు బదిలీ చేసేలా చూసుకోవడానికి బోర్డు ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని సిఫార్సు చేయడమైంది.*

- కార్మిక శాఖ 2017-22 కాలానికి సంస్థలపై ఎటువంటి తనిఖీలు నిర్వహించనందువల్ల వివిధ సంస్థలు చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయని కార్మిక శాఖ/బోర్డు నిర్ధారించలేక పోయింది.

  *అర్హత కలిగిన అన్ని సంస్థలను/నిర్మాణ పనులను కార్మిక సెస్సు పరిధిలోకి తీసుకురావడానికి శాఖ క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సిఫార్సు చేయడమైంది.*

- రాష్ట్ర ప్రభుత్వం ఇతర విభాగాల ద్వారా ఇలాంటి పథకాలను అమలు చేస్తున్నందున, ప్రయోజనాలు పునరావృతం కాకుండా ఉండటానికి సంక్షేమ పథకాలను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించినందున, 2020 మార్చి తర్వాత బోర్డు ఎటువంటి సంక్షేమ పథకాలను అమలు చేయలేదు. బోర్డు నిధులను సుప్రీంకోర్టు

ఆదేశాలకు విరుద్ధంగా, నమోదిత కార్మికుల ప్రత్యక్ష సంక్షేమానికి సంబంధం లేని ఇతర ప్రయోజనాల కోసం రుణాలు మరియు అడ్వాన్సులుగా ₹2,405.14 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు.

*మళ్లించబడిన నిధులు తక్షణమే తిరిగి పొందేటట్లు, సెస్సు మొత్తాన్ని నమోదిత లబ్ధిదారుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఉపయోగించుకునేలా బోర్డు నిర్ధారించుకోవాలి.*

## బి) పాఠశాల విద్యా శాఖ

### *'మన బడి నాడు నేడు పథకం మొదటి దశ'పై నియమపాలన తనిఖీ*

2019-20లో ప్రారంభించబడిన మన బడి నాడు నేడు (ఎంబీఎన్ఎన్ ఫే-I) పథకం మొదటి దశ ద్వారా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (జీఓఏపీ) రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను మూడు సంవత్సరాల కాలంలో తొమ్మిది విభాగాలలో ప్రాథమిక మౌలిక సదుపాయాలను దశలవారీగా మెరుగుపరిచి, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పనులను తల్లిదండ్రుల కమిటీలు (పీసీ) సామాజిక ఒప్పందం ద్వారా నిర్వహించాలి. సేకరణ, అమలు మరియు చెల్లింపులు ఇప్పటికే ఉన్న నియమాలు మరియు నిబంధనలను పాటిస్తున్నాయో లేదో మరియు పర్యవేక్షణ విధానాలు పథకం మార్గదర్శకాల ప్రకారం అమలులో ఉన్నాయో లేదో నిర్ధారించడానికి ఈ తనిఖీ చేపట్టబడింది.

నియమపాలన తనిఖీ యొక్క ప్రధాన పరిశీలనలు క్రింద ఇవ్వబడ్డాయి:

- మన బడి నాడు నేడు మొదటి దశలో మరమ్మతులు చేయడం, రంగులు వేయడం, బల్లలు, పంఖాలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌లు, స్మార్ట్ టీవీలు వంటి కొన్ని వస్తువుల సేకరణ ఉన్నాయి. శాశ్వత స్వభావం గల ఆస్తులు కొత్తగా సృష్టించబడనప్పటికీ, మొత్తం ఖర్చును రెవెన్యూ వ్యయానికి బదులుగా మూలధన వ్యయం కింద చూపించారు.

- స్కూల్ ట్రాన్స్ఫర్మేషన్ మానిటరింగ్ సిస్టమ్ (ఎస్‌టీఎంఎస్) సేకరణ కోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ ఎంపిక పోటీతత్వ మరియు పారదర్శక ప్రక్రియకు బదులుగా నామినేషన్ ప్రాతిపదికన జరిగింది.

  *గుత్తేదార్లు/ఏజెన్సీల ఎంపికలో నామినేషన్ ప్రాతిపదికన కాకుండా, ప్రభుత్వం పోటీతత్వ మరియు పారదర్శక ప్రక్రియను అనుసరించాలని సిఫార్సు చేయడమైంది.*

- బహుళ తనిఖీ/నాణ్యతా పరీక్షల నివేదికల ప్రకారం, పరీక్షించబడిన 157 పంఖాల్లో 71 (45.22 శాతం) పంఖాలు అంగీకరించిన ప్రామాణికం 210 కంటే తక్కువ సీఎంఎం (ప్రతి నిమిషానికి ఘనపు మీటర్లు) కలిగి ఉన్నాయి, పరీక్షించబడిన 220 పంఖాల్లో 67 (30.45 శాతం) పంఖాలు 380 కంటే తక్కువ ఆర్‌పీఎం (ప్రతి నిమిషానికి భ్రమణాలు) కలిగి ఉన్నాయి.

- పరీక్షించిన 108 పాఠశాలల్లో 33 (31 శాతం) పాఠశాలల్లో గ్రీన్ చాక్ బోర్డులు నిరుపయోగంగా ఉండటం, ₹76.80 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన తాగునీటి వ్యవస్థ పనిచేయకపోవడం వంటి అంశాలను గుర్తించింది. ఇంకా, విద్యార్థులకు, సిబ్బందికి ఫర్నిచర్ కాంపోనెంట్ అందించినప్పటికీ, డ్యూయల్ డెస్క్‌ల సేకరణ కోసం ₹383.51 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, మచ్చుకు తనిఖీ చేసిన 108 పాఠశాలల్లో 32 లో (30 శాతం), 1,973 మంది విద్యార్థులు నేలపై కూర్చున్నారు.

  *ఇండెంట్ పెట్టే ముందు పాఠశాలల్లో ఏదైనా వస్తువు యొక్క వాస్తవ అవసరాన్ని నిర్ధారించే వ్యవస్థను రూపొందించడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా, అవసరాలకు మించి వస్తువులను ఇండెంట్ చేసిన అధికారులను ప్రభుత్వం బాధ్యులను చేయాలి.*

## సి) మహిళ, శిశు, వికలాంగ మరియు వయోవృద్ధుల శాఖ

### *'సంపూర్ణ పోషణ' పథకంపై నియమపాలన తనిఖీ*

'సంపూర్ణ పోషణ' పథకం ఆంధ్రప్రదేశ్‌లో (2020 మార్చి నుండి అమలులో ఉంది) అంగన్‌వాడీ కేంద్రాల (ఏడబ్ల్యూసీ) ద్వారా గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, ఆరు నుండి 72 నెలల వయస్సు గల పిల్లలకు అనుబంధ పోషకాహారాన్ని అందించడం; పిల్లలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపం, రక్తహీనత స్థాయిలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. (i) ఆహారం మరియు పోషకాహార కిట్‌ల సమయపాలన మరియు నాణ్యతను నిర్ధారించడానికి అందరు వాటాదారులు వాడుకలో ఉన్న మార్గదర్శకాలను పాటించారా, (ii) అర్హత కలిగిన అందరు లబ్ధిదారులు ఈ పథకంలో కవర్ చేయబడ్డారా, వారు హక్కుల ప్రకారం అనుబంధ పోషకాహారాన్ని పొందుతున్నారా అని చూడడానికి ఈ తనిఖీ నిర్వహించబడింది.

నియమపాలన తనిఖీ యొక్క ప్రధాన పరిశీలనలు క్రింద ఇవ్వబడ్డాయి:

- మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖకు 'ఈ-సాధన' అనే సరఫరా వ్యవస్థ నిర్వహణ (ఎస్‌సీఎం) పోర్టల్ ఉంది, దీని ద్వారా లబ్ధిదారుల వివరాలు, బియ్యం, పప్పు, నూనె, గుడ్లు, పాలు, బాలామృతం వంటి ఆహార పదార్థాల ఇండెంట్లు, రసీదులు నిర్వహించబడతాయి. అందుబాటులో ఉన్న నిల్వలను పరిగణనలోకి తీసుకోకుండా ఆహార పదార్థాలకు ఇండెంట్లు, పూర్ణ సంఖ్యలకు బదులుగా దశాంశాలలో చూపబడిన గుడ్లు, బాలామృతం పరిమాణాలు మరియు అంగన్‌వాడీ కేంద్రాల (ఏడబ్ల్యూసీలు) రికార్డులతో సరిపోలని పోర్టల్ సమాచారం వంటి లోపాలను ఎస్‌సీఎం పోర్టల్ పనితీరులో ఆడిట్ గమనించింది.

  సంబంధిత సరఫరాదారులకు శాఖ పంపిన బాలామృతం, పాలు, బియ్యం, పప్పు, నూనెల ఇండెంట్లు, ఎస్‌సీఎం పోర్టల్‌లో ఉంచిన ఇండెంట్లతో సరిపోలేదు.

- శాఖ ఇండెంట్ చేసిన 21.7 కోట్ల లీటర్ల పాలలో, ఏపీ డైరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీడీడీసీఎఫ్) 2020 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు 17.71 కోట్ల లీటర్ల పాలను సరఫరా చేసింది, దీనివల్ల అర్హత కలిగిన లబ్ధిదారులకు పోషకాల ప్రయోజనం అందకుండా పోయింది.

  1,11,984.30 మెట్రిక్ టన్నుల (ఎంటీ) బాలామృతం ఇండెంట్‌లో, తెలంగాణ రాష్ట్ర పోషకాహార మండలి (టీఎస్ఎన్‌సీ) కేవలం 83,874.30 ఎంటీలను మాత్రమే సరఫరా చేసింది, దీని ఫలితంగా 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు 28,110 ఎంటీ (25.10 శాతం) సరఫరా తగ్గింది.

  అందువల్ల, 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు అన్ని రాష్ట్ర, జిల్లా మరియు ప్రాజెక్ట్ స్థాయిలలో ఏజెన్సీల ద్వారా పాలు, బాలామృతం సరఫరా తగ్గాయి.

- మచ్చుకు తనిఖీ చేసిన 21 అంగన్‌వాడీ కేంద్రాలలో, ఆరు నెలల్లో మొత్తం 4,761.90 లీటర్ల పాలు తక్కువగా సరఫరా చేయబడ్డాయి, దీని ఫలితంగా మొత్తం 3,788 మంది లబ్ధిదారులలో 1,697 మందికి (44.8 శాతం) తమ అర్హత ప్రకారం పాలు అందలేదు. తగినంత పాలు అందుబాటులో ఉన్న ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాలలో మొత్తం 590.50 లీటర్లు తక్కువగా పంపిణీ చేయబడ్డాయి.

  ఆరు నెలల్లో, 13 అంగన్‌వాడీ కేంద్రాలలో లబ్ధిదారులకు (20.39 శాతం) గుడ్ల పంపిణీ తక్కువగా జరిగింది. తగినంత గుడ్లు అందుబాటులో ఉన్న తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలలో, 311 మంది లబ్ధిదారులకు గుడ్లు తక్కువగా పంపిణీ చేయబడ్డాయి.

  నమోదు చేసుకున్న 799 మంది లబ్ధిదారులలో, ఆరు నెలల్లో 799 బాలామృతం ప్యాకెట్లకు గానూ 558 ప్యాకెట్లు (69.84 శాతం) మాత్రమే 10 అంగన్‌వాడీ కేంద్రాలలో సరఫరా అయ్యాయి.

ఆ విధంగా, మచ్చుకు తనిఖీ చేయబడిన అంగన్‌వాడీ కేంద్రాలకు తక్కువ మరియు ఆలస్యమైన సరఫరా కారణంగా లబ్ధిదారులకు ఆహార పదార్థాల పంపిణీ తక్కువగా జరిగింది.

- అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రాథమిక మౌలిక సదుపాయాల కొరత ఉండటం వలన సంపూర్ణ పోషణ మరియు ఇతర పూర్వ విద్యా కార్యక్రమాల అమలు పిల్లలు మరియు మహిళలపై ప్రభావం చూపుతుంది. అయితే, మచ్చుకు తనిఖీ చేయబడిన అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలైన సరైన భవనాలు, మరుగుదొడ్లు మరియు తాగునీటి సౌకర్యాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేవని ఆడిట్ గమనించింది, ఇది లబ్ధిదారులను అనారోగ్యకరమైన పరిస్థితులకు గురిచేసింది.

  నాలుగు జిల్లాల్లోని 16 ఐసీడీఎస్ ప్రాజెక్టులలో 3160 అంగన్‌వాడీ కేంద్రాలను ఆడిట్ మచ్చుకు తనిఖీ చేయగా, 44 శాతం అంగన్‌వాడీ కేంద్రాలలో పారిశుధ్యం (మరుగుదొడ్ల సౌకర్యం), 57 శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి కుళాయి కనెక్షన్లు లేవని, 15 శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్ లేదని; 31 శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక వంటగది లేదని తెలిసింది.

*ఇండెంట్ చేయవలసిన వస్తువులపై అంగన్‌వాడీ కేంద్రాల నుండి వాస్తవ సమాచారాన్ని సంగ్రహించడం మరియు వాటి సకాలంలో పంపిణీని నిర్ధారించడానికి అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగా సేకరణలు చేయడం వంటి సరఫరా వ్యవస్థ నిర్వహణ పోర్టల్ పనితీరులో ఉన్న లోపాలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఫార్సు చేయడమైంది.*

## డి) పరిశ్రమలు మరియు వాణిజ్యం

### *'ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ పనితీరు' పై నియమపాలన తనిఖీ (ఏపీఐఐసీ)'*

'ఏపీఐఐసీ పనితీరు' పై నియమపాలన తనిఖీ క్రింది విషయాలను అంచనా వేయడానికి చేపట్టబడింది:

i) పరిశ్రమల స్థాపనలో ఏపీఐఐసీ లక్ష్యాలైన మౌలిక సదుపాయాలను ప్రోత్సహించడం, సహాయం చేయడం, సహకరించడం, అందచేయడం, అభివృద్ధి చేయడం మొదలైన వాటిని చూసుకుంటూ, పారిశ్రామిక పార్కు నిబంధనల ప్రకారం భూమి అభివృద్ధి జరిగిందా, కేటాయింపు నిబంధనల ప్రకారం భూమి ధర హేతుబద్ధంగా నిర్ణయించబడిందా, (ii) భూ కేటాయింపు, కేటాయింపుల రద్దులో కేటాయింపు నిబంధనలలోని నియమాలు అనుసరించబడ్డాయా, (iii) ఈ విషయంలో రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా, పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థలు (ఐఏఎల్ఏలు) స్థాపించబడి, స్థానిక సంస్థలుగా పనిచేస్తున్నాయా, (iv) ఏపీఐఐసీకి మేలు చేసే విధంగా నిధుల నిర్వహణ జరుగుతుందా.

నియమపాలన తనిఖీ యొక్క ప్రధాన పరిశీలనలు క్రింద ఇవ్వబడ్డాయి:

- ప్రభుత్వేతర భూముల సేకరణలో సాధ్యాసాధ్యాలను అంచనా వేయకుండా ఏపీఐఐసీ ప్రచురణ ఛార్జీల కోసం ₹9.18 కోట్ల వ్యర్థ ఖర్చు చేసింది.

  *ప్రభుత్వేతర భూములను సేకరించే ముందు సముపార్జన సాధ్యాసాధ్యాలు మరియు భూమి అనుకూలతను నిర్ధారించడానికి సరైన సర్వే చేయమని ప్రభుత్వం ఏపీఐఐసీని ఆదేశించాలని సిఫార్సు చేయడమైంది.*

- ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం గడిచిన తర్వాత కూడా తగిన అధికారుల నుండి లేఅవుట్ ఆమోదం పొందకుండానే మౌలిక సదుపాయాల కోసం ₹48.13 కోట్ల నిరుపయోగ ఖర్చు చేసింది. ఇంకా, ఐదు పారిశ్రామిక పార్కులకు వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు తయారు చేయబడలేదు.

- కేటాయింపు నిబంధనల్లో పేర్కొన్న విధంగా ఉమ్మడి నిర్గత శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేయకుండా, మురుగునీటిని సక్రమంగా శుద్ధి చేసి సురక్షితంగా పారేలా చూడకుండా, ఏపీఐఐసీ *రెడ్ కేటగిరీ* పరిశ్రమలకు పారిశ్రామిక పార్కులో భూములు కేటాయించింది.

*అవసరమైన కాలుష్యం మరియు పర్యావరణ అనుమతులు పొందిన తరువాతే రెడ్ కేటగిరీ పరిశ్రమలు పనిచేసేలా చూడాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయడమైంది.*

- నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన రుసుములైన ప్రాసెస్ ఫీజు, నిర్వహణ రుసుములను విధించకపోవడం వల్ల ₹5.07 కోట్ల ఆదాయం కోల్పోయింది. ఇంకా, భూమి విలువను తప్పుగా అంచనా వేయడం వల్ల ₹0.74 కోట్ల తక్కువ వసూళ్లు జరిగాయి.

- అమ్మకపు ఒప్పందాలను అమలు చేయకపోవడం, కేటాయింపుదారులు ప్రాజెక్టులను ప్రారంభించకపోవడం వల్ల కేటాయింపులను రద్దు చేయడంలో తగిన చర్యలు తీసుకోవడంలో అతి జాప్యం మరియు కేటాయింపుదారులు ప్రాజెక్టులను ప్రారంభించకపోవడం వల్ల 955.86 ఎకరాల భూమి నిరుపయోగంగా మారింది, వాయిదా వేసిన దరఖాస్తులను రద్దు చేయకపోవడం వల్ల ₹8.63 కోట్ల ఆదాయం కోల్పోయింది.

  *ఏపీఐఐసీ, ఆక్రమణల నుండి భూమిని రక్షించడానికి సరైన పర్యవేక్షణ యంత్రాంగాన్ని రూపొందించాలని; భూములను నిరుపయోగంగా ఉంచడం, ప్రాజెక్టుల ప్రారంభంలో జాప్యాన్ని నివారించడానికి కేటాయింపుదారులపై సత్వర చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేయడమైంది.*

- సేవా సొసైటీలు ఏర్పాటు చేయకపోవడం, ఏపీఐఐసీ ద్వారా ఐఏఎల్ఏలపై పర్యవేక్షణ యంత్రాంగం లేకపోవడం మరియు ఐఏఎల్ఏల అసమర్థమైన పనితీరు కారణంగా కేటాయింపుదారుల నుండి ఆస్తి పన్ను వసూలు కాలేదు, సంబంధిత స్థానిక సంస్థలకు న్యాయంగా చెల్లించవలసిన ఆస్తి పన్ను తక్కువగా చెల్లించడం, అనధికార నిర్మాణాలను గుర్తించడంలో జాప్యం, ఆమోదయోగ్యమైన పరిమితులకు మించి పరిపాలనా వ్యయం జరిగింది.

  *పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థల (ఐఏఎల్ఏలు) పనితీరును పర్యవేక్షించడానికి లోప రహిత అంతర్గత నియంత్రణ యంత్రాంగాన్ని ఏపీఐఐసీ అభివృద్ధి చేయాలని సిఫార్సు చేయడమైంది.*

- ఏపీఐఐసీ ₹2,000 కోట్ల ఋణ మొత్తాన్ని సక్రమంగా వినియోగించకపోవడం, ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌కి ₹220 కోట్ల అసురక్షిత స్వల్పకాలిక ఋణాన్ని మంజూరు చేయడం, రెవెన్యూ అధికారుల నుండి ₹140.91 కోట్ల ఖర్చు చేయని భూమి విలువను వసూలు చేయకపోవడం, నివాసితుల నుండి ₹3.12 కోట్ల అద్దె రుసుములను వసూలు చేయకపోవడం మరియు కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా ఋణాలు పొందిన కొంతమందికి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలను అక్రమంగా జారీ చేయడం అసమర్థమైన, ప్రభావహీన ఆర్థిక నిర్వహణకు సమానం.

  *ఏపీఐఐసీ ఆర్థిక వనరులను సమర్థవంతంగా, ప్రభావశీలంగా, ఆర్థిక దుర్వినియోగం లేకుండా నిర్వహించాలి. ఖర్చులు చేయడంలో, ఆదాయాలను సాధించడంలో, మెరుగైన ఆర్థిక నిర్వహణ కోసం సాధారణ ఆర్థిక సూత్రాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సిఫార్సు చేయడమైంది.*

## ఇ) ఇతర నియమపాలన తనిఖీ పేరాలు

### i) ఉన్నత విద్యా శాఖ

**ఒప్పందిత గరిష్ఠ డిమాండ్‌ను (సీఎండీ) పునఃపరిశీలన చేయని కారణంగా ₹ 1.89 కోట్ల నివారించదగిన వ్యయం**

ఇడుపులపాయలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన మరియు సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ), వాస్తవ అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని ఒప్పంద గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయడంలో, వినియోగ విధానాన్ని కాలానుగుణంగా సమీక్షించడంలో మరియు సకాలంలో డీరేషన్ కోరడంలో విఫలమైంది. దీని ఫలితంగా, అనివార్యంగా ₹1.89 కోట్ల అదనపు వ్యయం జరిగింది.

### ii) గిరిజన సంక్షేమ శాఖ

**శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గిరిజన సంగ్రహాలయ భవనాల నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించకపోవడం వల్ల నిష్ఫలమైన వ్యయం – ₹ 75.25 లక్షలు**

కన్సల్టెన్సీ సేవలకు ₹34.27 లక్షలు మరియు సివిల్ పనులకు ₹41 లక్షలు ఖర్చు చేసిన తర్వాత, శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గిరిజన సంగ్రహాలయ భవన నిర్మాణం ప్రభుత్వ ఉత్తర్వుల వల్ల నిలిచిపోయింది, తద్వారా ఖర్చు నిష్ఫలమైంది.

### iii) యువజనాభివృద్ధి, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ

**భవానీ ద్వీపం వద్ద పక్షుల సమూహ ప్రాంతం, సింహాల పార్కు మరియు సముద్ర క్షీరదాలతో కూడిన కృష్ణా నదీ వన్యప్రాణి ఉద్యానవనం – ₹1.33 కోట్ల నిరుపయోగమైన వ్యయం**

విజయవాడలోని భవానీ ద్వీపం వద్ద వన్య ప్రాణి ఉద్యానవన అభివృద్ధికి వెచ్చించిన ₹1.33 కోట్ల ఖర్చు ప్రభుత్వ విధానంలో మార్పు కారణంగా నిరుపయోగంగా మారింది.

### iv) రవాణా, రహదారులు & భవనాల శాఖ

#### ఎ) ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీల నియమాలను అవలంబించకపోవడం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అద్దె ప్రాతిపదికన ఇచ్చిన బస్సులకు ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీలను వసూలు చేయడంలో విఫలమైనందున ₹1.66 కోట్ల ఆదాయ నష్టం వాటిల్లింది. దీని ఫలితంగా ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీలపై వస్తు సేవల పన్ను విధించకపోవడం వల్ల ప్రభుత్వానికి ₹1.57 కోట్ల నష్టం వాటిల్లింది.

#### బి) ప్రమాద పరిహార క్లెయింలను రికవరీ చేయకపోవడం

మోటారు ప్రమాదాల క్లెయిమ్‌ల ట్రిబ్యునల్‌లో చేసిన ₹1.58 కోట్ల డిపాజిట్లకు గాను అద్దె బస్సు యజమానుల నుండి ప్రమాద పరిహార క్లెయిమ్‌ను తిరిగి పొందేందుకు ఒప్పందంలోని నిబంధనలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలు చేయలేదు. తిరిగి వసూలు చేయకపోవడం వల్ల ₹0.76 కోట్ల వడ్డీ నష్టం కూడా జరిగింది.

#### సి) కాంపౌండింగ్ రుసుము అసలు వసూలు విధించకపోవడం/తక్కువ విధించడం

వాహన తనిఖీ నివేదికల (వీసీఆర్) లో నివేదించబడిన నేరాలకు కాంపౌండింగ్ రుసుము యొక్క పెంచిన రేట్లు విధించబడనందున మరియు మోటారు వాహన చట్టం, 1988 ప్రకారం తనిఖీ

అధికారులు వాహన తనిఖీ నివేదికలను సంబంధిత రోడ్డు రవాణా అధికారులకు పంపించకపోవడం వలన ₹13.16 కోట్ల వరకు కాంపౌండింగ్ రుసుము తక్కువగా పొందింది లేదా అసలు పొందలేదు.

### డి) ఫిట్‌నెస్ ప్రమాణపత్రాల పునరుద్ధరణపై పర్యవేక్షణ లేకపోవడం

రవాణా వాహనాల ఫిట్‌నెస్ ప్రమాణపత్రాల పునరుద్ధరణను రవాణా శాఖ పర్యవేక్షించలేదు. దీనివల్ల ఫిట్‌నెస్ రుసుము ₹1.45 కోట్లను కోల్పోవడమే కాకుండా రోడ్డు భద్రతకు ప్రమాదం ఏర్పడే అవకాశం సంభవించింది.

### ఇ) రవాణా వాహనాలపై త్రైమాసిక పన్ను, అపరాధ రుసుమును వసూలు చేయకపోవడం

ఆంధ్రప్రదేశ్ మోటారు వాహనాల పన్ను చట్టం, 1963 ప్రకారం నిర్దేశించిన త్రైమాసిక పన్ను, అపరాధ రుసుమును నిర్ణీత సమయంలోగా రవాణా వాహనాల యజమానుల నుండి వసూలు చేయని ఫలితంగా ₹6.51 కోట్ల ఆదాయం పొందే అవకాశం కోల్పోయింది.

## v) ఆంతరంగిక శాఖ

### నిర్వహణ మరియు మరమ్మతులకు నిధుల లేమి కారణంగా నిరుపయోగంగా ఉంచబడిన ఫాస్ట్ ఇంటర్‌సెప్టర్ బోట్లు

తీరప్రాంతంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిరోధించడానికి పోలీసింగ్ చేసే లక్ష్యంతో భారత ప్రభుత్వం అందించిన 18 ఫాస్ట్ ఇంటర్‌సెప్టర్ బోట్‌లు (ఎఫ్ఐబీలు) మరమ్మతులు మరియు నిర్వహణ కోసం నిధులు విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల తీర ప్రాంత భద్రతతో రాజీ పడుతూ 2018 నుంచి పనికిరాకుండా పోయాయి.

# 1వ అధ్యాయం

# సాధారణ అంశాలు

# సాధారణ అంశాలు

## 1.1 ఈ నివేదిక గురించి

ఈ నివేదిక, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి & ఏజీ) యొక్క ఆంధ్రప్రదేశ్‌లోని 'వన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం' పై పనితీరు తనిఖీ నివేదిక; 'మన బడి నాడు నేడు, మొదటి దశ' పథకం, 'సంపూర్ణ పోషణ పథకం', 'ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ పనితీరు'; ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ శాఖలు చేసిన ఖర్చుల లావాదేవీల నియమపాలన తనిఖీ నుండి ఉత్పన్నమైన తొమ్మిది ఆడిట్ పేరాలను కలిగి ఉంది.

పనితీరు తనిఖీ అనేది ప్రభుత్వ లేదా లాభాపేక్ష లేని సంస్థ యొక్క విధానాలను స్వతంత్రంగా పరిశీలించడాన్ని మరియు ఒక పథకం, పనితీరు, కార్యకలాపం, లేదా సంస్థల నిర్వహణను సూచిస్తుంది, ఇది అందుబాటులో ఉన్న వనరులను వినియోగించటంలో సంస్థ పొదుపుగా, సమర్థవంతంగా, ప్రభావవంతంగా పనిచేస్తుందో లేదో అంచనా వేస్తుంది. నియమపాలన తనిఖీ అనేది, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు మరియు సేవా నిబంధనలు) చట్టం, 1971 ప్రకారం, భారత రాజ్యాంగంలోని నిబంధనలు, వర్తించే చట్టాలు, నియమాలు మరియు నిబంధనలు, తగు అధికారం కల అధికారులు జారీ చేసిన వివిధ ఆదేశాలు మరియు సూచనలు పాటించబడుతున్నాయో లేదో తెలుసుకోవడానికి తనిఖీ చేయబడిన సంస్థల లావాదేవీల పరిశీలనను సూచిస్తుంది.

ఈ నివేదిక యొక్క ప్రాథమిక ఉద్దేశ్యం తనిఖీ యొక్క ముఖ్యమైన ఫలితాలను రాష్ట్ర శాసనసభ దృష్టికి తీసుకురావడం. కార్యనిర్వాహకులు దిద్దుబాటు చర్యలు తీసుకుంటూ సముచిత విధానాలను రూపొందించడానికి, సంస్థల నిర్వహణను మెరుగుపరచడానికి, మెరుగైన పాలనకు దోహదపడే ఆదేశాలను జారీ చేయడానికి తనిఖీ ఫలితాలు దోహదపడతాయని భావించడమైనది.

క్రింది అంశాలకు సంబంధించిన తనిఖీ ఫలితాలు క్రింది అధ్యాయాలలో వివరించబడ్డాయి:

**2వ అధ్యాయం** 'భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం' పై పనితీరు తనిఖీ

**3వ అధ్యాయం** 'మన బడి నాడు నేడు మొదటి దశ' పథకంపై నియమపాలన తనిఖీ

**4వ అధ్యాయం** 'సంపూర్ణ పోషణ పథకం' పై నియమపాలన తనిఖీ

**5వ అధ్యాయం** 'ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ పనితీరు' పై నియమపాలన తనిఖీ మరియు

**6వ అధ్యాయం** వివిధ శాఖలకు చెందిన నియమపాలన తనిఖీ పరిశీలనలు/పేరాలు.

## 1.2 ప్రధాన మహాగణకుల (తనిఖీ) కార్యాలయం

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సిఏజీ) ఆదేశాల మేరకు, ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన మహాగణకుల (తనిఖీ) కార్యాలయం, 40 విభాగాలు మరియు స్థానిక సంస్థలు/ప్రభుత్వ రంగ సంస్థలు/ స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలతో కూడిన 16 క్లస్టర్ల తనిఖీను నిర్వహిస్తుంది. వీటిలో తొమ్మిది విభాగాలతో కూడిన ఆరు క్లస్టర్లకు సంబంధించిన అంశాలు ఈ నివేదికలో ఉన్నాయి. 2021-22 సంవత్సరానికి సంబంధించిన ఈ పనితీరు మరియు నియమపాలన తనిఖీ నివేదిక (i) కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు మరియు బీమా వైద్య సేవలు (ii) పాఠశాల విద్య (iii) స్త్రీ, శిశు, వికలాంగ మరియు వయో వృద్ధులు (iv) పరిశ్రమలు మరియు వాణిజ్యం (v) ఉన్నత విద్య (vi) గిరిజన సంక్షేమం (vii) యువజనాభివృద్ధి, పర్యాటక మరియు సంస్కృతి (viii) రవాణా, రహదారులు & భవనాలు మరియు (ix) ఆంతరంగిక శాఖ అనే తొమ్మిది శాఖలకు సంబంధించిన అంశాలను కలిగి ఉంది.

## 1.3 తనిఖీ చేయుటకు అధికారం

తనిఖీ కోసం సీఏజీ యొక్క అధికారం భారత రాజ్యాంగంలోని 149 మరియు 151 అధికరణలు, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు మరియు సేవా నిబంధనలు) చట్టం, (సీఏజీ యొక్క డీపీసీ చట్టం) 1971 నుండి తీసుకోబడింది. సీఏజీ, డీపీసీ చట్టం 1971 సెక్షన్ 13[1] కింద శాఖల వ్యయాలను మరియు డీపీసీ చట్టంలోని సెక్షన్ 19 (2) [2] ప్రకారం ప్రభుత్వ కంపెనీలు మరియు కార్పొరేషన్ల ఖాతాలను తనిఖీ చేస్తుంది.

వివిధ తనిఖీలకు సంబంధించిన నియమాలు మరియు విధానాలు తనిఖీ ప్రమాణాలు మరియు ఆడిట్ & అకౌంట్స్ నిబంధనలు, 2020; అలాగే సీఏజీ ద్వారా లేదా దాని తరపున జారీ చేయబడిన ఇతర మార్గదర్శకాలు, మాన్యువల్ లు మరియు సూచనలలో సూచించబడ్డాయి.

## 1.4 తనిఖీ ప్రణాళిక, నిర్వహణ మరియు తనిఖీ నివేదికల తయారీ

శాఖలు/సంస్థలు/స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలు/పథకాలు మొదలైన వాటికి సంబంధించిన ఖర్చు, క్లిష్టమైన/కార్యకలాపాల సంక్లిష్టత, ప్రభుత్వం సూచించే ప్రాధాన్యత, అప్పగించిన ఆర్థిక అధికారాల స్థాయి, అంతర్గత అంచనా, వాటాదారుల నియంత్రణలు మరియు ఆందోళనకర అంశాల ఆధారంగా నష్టకారకాలను అంచనా వేయడంతో తనిఖీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియలో మునుపటి తనిఖీ ఫలితాలు కూడా పరిగణించబడతాయి. ఈ నష్టకారకాల అంచనా ఆధారంగా, తనిఖీ యొక్క తరచుదనం, పరిధి నిర్ణయించబడి తనిఖీ కొరకు వార్షిక తనిఖీ ప్రణాళిక రూపొందించబడుతుంది. ప్రతి యూనిట్ యొక్క తనిఖీ పూర్తయిన తర్వాత, తనిఖీ ఫలితాలను కలిగి ఉన్న నివేదికను, (ఇన్స్పెక్షన్ రిపోర్ట్-ఐఆర్) ఒక నెలలోపు ప్రత్యుత్తరాలను అందించమనే అభ్యర్థనతో యూనిట్ అధిపతికి జారీ చేయబడుతుంది. ప్రత్యుత్తరాలు వచ్చినప్పుడల్లా, తనిఖీ ఫలితాలు పరిష్కరించబడతాయి, లేదా సమ్మతి కోసం తదుపరి చర్యకు సూచించబడుతుంది. ఈ ఐఆర్‌లలో సూచించబడి, ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిలో శ్రద్ధ అవసరం ఉన్న ముఖ్యమైన పరిశీలనలు, ఈ తనిఖీ నివేదికలో చేర్చడం కోసం ప్రక్రియ చేయబడ్డాయి.

ఈ తనిఖీ నివేదికలు భారత రాజ్యాంగంలోని 151వ అధికరణను అనుసరించి రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టడం కోసం ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌కు సమర్పించబడతాయి.

## 1.5 తనిఖీ చేయబడే సంస్థల స్వరూపం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖలు 2017-18 నుండి 2021-22 వరకు ఐదు సంవత్సరాల కాలంలో చేసిన ఖర్చుల సారాంశం **పట్టిక 1.1**లో ఇవ్వబడింది

1 (i) రాష్ట్ర సంచితనిధి నుండి అన్ని లావాదేవీలు, (ii) ఆపత్కాల నిధి మరియు ప్రభుత్వ ఖాతాకు సంబంధించిన అన్ని లావాదేవీలు, (iii) రాష్ట్ర శాఖలచే నిర్వహించబడుతున్న అన్ని వ్యాపార, తయారీ, లాభ & నష్టాల ఖాతాలు, బ్యాలెన్స్ షీట్లు & ఇతర అనుబంధ ఖాతాల తనిఖీ

2 పార్లమెంటు చేసిన చట్టం ద్వారా లేదా దాని ప్రకారం స్థాపించబడిన కార్పొరేషన్ల (కంపెనీలు కాదు) ఖాతాల తనిఖీకి సంబంధించి కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ యొక్క విధులు మరియు అధికారాలు సంబంధిత చట్టాల నిబంధనలకు అనుగుణంగా అతనిచే నిర్వహించబడతాయి మరియు అమలు చేయబడతాయి

**పట్టిక-1.1: శాఖలచే చేయబడిన వ్యయం**

*(₹ కోట్లలో)*

| క్రమ సంఖ్య | శాఖ పేరు | వ్యయం చేయబడిన ఖర్చు | | | | |
|---|---|---|---|---|---|---|
| | | 2017-18 | 2018-19 | 2019-20 | 2020-21 | 2021-22 |
| 1 | యువజనాభివృద్ధి, పర్యాటక మరియు సంస్కృతి | 301.74 | 154.08 | 87.12 | 56.78 | 94.19 |
| 2 | ఆంతరంగిక శాఖ | 5,101.18 | 5,636.08 | 6,354.99 | 6,430.33 | 7,018.36 |
| 3 | ఉన్నత విద్య | 2,148.06 | 1,711.66 | 1,573.91 | 1,692.94 | 1,912.38 |
| 4 | పరిశ్రమలు. మరియు వాణిజ్యం | 1,549.02 | 1,480.87 | 984.41 | 2,353.29 | 1,004.40 |
| 5 | కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్లు మరియు బీమా వైద్య సేవలు | 444.00 | 671.21 | 401.49 | 223.97 | 307.54 |
| 6 | పాఠశాల విద్య | 16,978.12 | 17,506.20 | 24,313.62 | 21,921.00 | 23,353.66 |
| 7 | రవాణా, రహదారులు & భవనాలు | 2,525.74 | 2,610.41 | 3,011.72 | 5,395.46 | 5,121.33 |
| 8 | గిరిజన సంక్షేమం | 1,738.45 | 1,136.56 | 2,197.61 | 2,531.76 | 1,569.65 |
| 9 | స్త్రీ, శిశు, వికలాంగ మరియు వయో వృద్ధులు | 1,546.32 | 1,997.89 | 2,490.46 | 3,093.39 | 2,548.22 |
| | **మొత్తం** | **32,332.63** | **32,904.96** | **41,415.33** | **43,698.92** | **42,929.73** |

***మూలం:*** *సంబంధిత సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యొక్క కేటాయింపు ఖాతాలు*

## 1.6 తనిఖీ పరిశీలనలపై శాఖల ప్రతిస్పందన

### 1.6.1 గత తనిఖీ నివేదికలకు ప్రతిస్పందన

కార్యాలయాల అధిపతులు లేదా వారి పై అధికారులు తనిఖీ నివేదికల (ఐఆర్‌లు)లో ఉన్న పరిశీలనలకు ప్రతిస్పందించి, తగిన దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఐఆర్‌లలో తెలియజేయబడిన తనిఖీ పరిశీలనలు సంబంధిత శాఖల అధికారులతో ప్రధాన మహాగణకుల కార్యాలయ అధికారులు నిర్దేశిత కాల వ్యవధిలో జరిపే జిల్లా/రాష్ట్ర స్థాయి సమావేశాలలో కూడా చర్చిస్తారు.

మునుపటి సంవత్సరాలకు సంబంధించిన 18,053 పేరాలను కలిగి ఉన్న 2,596 ఐఆర్‌లు **పట్టిక 1.2** లో వివరించబడినట్లు 2022 డిసెంబర్ 31 నాటికి పరిష్కారం కోసం పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో, 4,381 పేరాలతో కూడిన 364 ఐఆర్‌లకు సంబంధించి ఎలాంటి ప్రత్యుత్తరాలు రాలేదు. శాఖల వారీగా వివరాలు ***అనుబంధం 1.1*** లో ఇవ్వబడ్డాయి.

**పట్టిక-1.2: తనిఖీ నివేదికల పరిస్థితి**

| సంవత్సరం | 2022 డిసెంబర్ నాటికి ఐఆర్‌లు/పేరాల సంఖ్య | | ఏ ప్రత్యుత్తరమూ అందని ఐఆర్‌లు/పేరాలు | |
|---|---|---|---|---|
| | ఐఆర్‌లు | పేరాలు | ఐఆర్‌లు | పేరాలు |
| 2017-18 మరియు అంతకుముందు సంవత్సరాలు | 2,049 | 12,913 | 100 | 1,505 |
| 2018-19 | 216 | 2,098 | 74 | 924 |
| 2019-20 | 191 | 1,962 | 105 | 1,242 |
| 2020-21 | 18 | 192 | 4 | 98 |
| 2021-22 | 122 | 888 | 81 | 612 |
| మొత్తం | **2,596** | **18,053** | **364** | **4,381** |

***మూలం:*** *ఆంధ్రప్రదేశ్ ప్రధాన మహాగణకులు (తనిఖీ) కార్యాలయంచే నిర్వహించబడిన దస్త్రాలు*

ఈ నివేదికలలో పేర్కొన్న ఐఆర్‌లు మరియు తనిఖీ పేరాలపై చర్య తీసుకోకపోవడం తీవ్రమైన ఆర్థిక అవకతవకలను శాశ్వతం చేసే ప్రమాదం ఉంది. ఇది పాలనా ప్రక్రియలో అంతర్గత నియంత్రణలను పలుచన చేయడం, ప్రభుత్వ కార్యకలాపాలు/సేవల అసమర్థత లేదా అసమర్థ పంపిణీ, మోసం, అవినీతి మరియు ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించవచ్చు. కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఐఆర్‌లు మరియు తనిఖీ పేరాలను సమీక్షించడానికి తగిన

యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి మరియు వీటిలో పేర్కొన్న అంశాలను పరిష్కరించడానికి వేగవంతమైన చర్య తీసుకోవాలి.

### 1.6.2 తనిఖీ పరిశీలనలకు ప్రభుత్వ ప్రతిస్పందన

కాగ్ నివేదికలో చేర్చడానికి ప్రతిపాదించిన పనితీరు తనిఖీ/ముసాయిదా తనిఖీ పేరాలు/నియమపాలన తనిఖీ నివేదికలకు తమ ప్రతిస్పందనలను అన్ని శాఖలు ఆయా నివేదికలు అందిన ఆరు వారాల్లోగా పంపవలసి ఉంటుంది. 2022-23 కాలంలో, తనిఖీ ఫలితాలపై వారి దృష్టిని ఆకర్షించి, వాటిపై ఆరు వారాల్లో ప్రతిస్పందనని పంపమని అభ్యర్థిస్తూ, ఒక పనితీరు తనిఖీ, తొమ్మిది ముసాయిదా తనిఖీ పేరాలు, మూడు నియమపాలన తనిఖీ నివేదికలు సంబంధిత శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు/ముఖ్య కార్యదర్శులు/కార్యదర్శులకు పంపబడ్డాయి. ఈ పేరాలు/నివేదికలు భారత సీ & ఏజీ యొక్క పనితీరు/నియమపాలన తనిఖీ నివేదికలలో చేర్చబడే అవకాశం ఉందనీ, రాష్ట్ర శాసనసభ ముందు ఉంచబడతాయనీ, తనిఖీ పరిశీలనలపై వారి వ్యాఖ్యలు/ప్రతిస్పందనలను చేర్చడం అవసరమని వారి వ్యక్తిగత దృష్టికి తీసుకురాబడింది. ఈ కార్యాలయం అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఈ నివేదికను ఖరారు చేసిన తేదీ నాటికి ఐదు శాఖలు[3] ఏడు ముసాయిదా పేరాలకు ప్రత్యుత్తరం ఇవ్వలేదు. ప్రభుత్వ స్పందనలు, అందిన చోటల్లా నివేదికలో సముచితంగా పొందుపరచబడ్డాయి.

### 1.6.3 మునుపటి తనిఖీ నివేదికలలో పొందుపరచిన తనిఖీ పరిశీలనలపై ప్రభుత్వ ప్రతిస్పందన

పరిపాలనా శాఖలు తనిఖీ నివేదికలలో చేర్చబడిన పేరాలు మరియు సమీక్షలపై తీసుకున్న లేదా తీసుకోవలసిన చర్యలను సూచిస్తూ, రాష్ట్ర శాసనసభకు సమర్పించిన మూడు నెలలలోపు వివరణను సమర్పించవలసి ఉంటుంది. ఇందు కోసం, ప్రజా పద్దుల కమిటీ నుండి ఏదైనా నోటీసు లేదా పిలుపు కోసం శాఖలు వేచి ఉండాల్సిన అవసరం లేదు. 2023 జూన్ 30 నాటికి 2014-15 నుండి 2018-19 సంవత్సరాలకు సంబంధించిన తనిఖీ నివేదికలలో పొందుపరచబడిన 93 పేరాలు/పనితీరు తనిఖీ సమీక్షలకు సంబంధించి 20 విభాగాల నుండి వివరణలు[4] ఇంకా అందవలసి ఉంది. 2023 జూన్ 30 నాటికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజనకు[5] ముందు కాలం నుండి కూడా 15 విభాగాలకు సంబంధించి 62 పేరాలు/పనితీరు తనిఖీ సమీక్షలకు వివరణలు కూడా ఇంకా అందవలసి ఉంది. వివరాలు ***అనుబంధం 1.2*** లో ఇవ్వబడ్డాయి.

### 1.6.4 ప్రజా పద్దుల కమిటీ సిఫార్సులపై ప్రభుత్వ ప్రతిస్పందన

పరిపాలనా శాఖలు ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) సిఫార్సులపై తీసుకున్న చర్యల వివరాలను (ఏటీఎన్‌లు) సిఫార్సులను స్వీకరించిన తేదీ నుండి ఆరు నెలల్లోగా సమర్పించాలి. 2023 జూన్ 30 నాటికి, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఐదు విభాగాలకు సంబంధించి 12 ఏటీఎన్‌లు[6] మరియు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణకు ముందు కాలానికి సంబంధించిన 12 విభాగాలకు సంబంధించి 499 ఏటీఎన్‌లు[7] ఇంకా అందాల్సి ఉంది. వివరాలు ***అనుబంధం 1.3*** లో ఇవ్వబడ్డాయి.

---

3 యువజనాభివృద్ధి, పర్యాటక మరియు సంస్కృతి, ఆంతరంగిక శాఖ, ఉన్నత విద్య, రవాణా, రహదారులు & భవనాలు, గిరిజన సంక్షేమ శాఖలు

4 ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన సమస్యలకు సంబంధించి

5 ఒకప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి (అనగా 2006-07 నుండి 2013-14 వరకు గల తనిఖీ నివేదికలలో పొందుపరచబడినవి)

6 ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన సమస్యలకు సంబంధించి

7 ఒకప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి

# పనితీరు తనిఖీ

# 2వ అధ్యాయం

# ‘భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం’ పై పనితీరు తనిఖీ

# కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్లు మరియు బీమా వైద్య సేవల శాఖ 'భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం' పై పనితీరు తనిఖీ


## సారాంశం

2017-18 నుండి 2021-22 మధ్య కాలానికి గాను 2022 డిసెంబర్ నుండి 2023 జూన్ వరకు, ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు కార్యదర్శి & ప్రధాన కార్యనిర్వహణాధికారి, కార్మిక కమీషనర్ మరియు నాలుగు జిల్లాల్లో ఎంపిక చేయబడిన నాలుగు ఉప లేబర్ కమీషనర్ కార్యాలయాలు, నాలుగు నగర పాలక సంస్థలు, నాలుగు పురపాలక సంస్థలు మరియు ఎనిమిది ఇంజినీరింగ్ డివిజన్లలో తనిఖీ నిర్వహించబడింది. దస్త్రాల పరిశీలన సమయంలో, ఆడిట్ క్రింది విషయాలను గమనించింది:

- *అర్హులైన కార్మికులను గుర్తించి నమోదు చేసుకోవడానికి వారికి సముచిత ప్రయోజనాలు అందించడానికి బలీయమైన విధానాలను రూపొందించలేదు.*
- *2017-18 నుండి 2021-22 మధ్య కాలంలో ఆర్జించిన వార్షిక ఆదాయంలో సంక్షేమ పథకాలపై ఖర్చు చేసిన మొత్తం 25.12 నుండి 0.53 శాతానికి తగ్గింది.*
- *2020 మార్చి తర్వాత సంక్షేమ పథకాలు అమలు కాలేదు. భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల క్లెయిమ్‌లు పూర్తిగా చెల్లించబడలేదు. శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ల శాతం 2017-22లో 0.26 నుండి 100కి పెరగడం వల్ల, నిరుపేద కార్మికులకు బోర్డు సంక్షేమ పథకాల కింద ప్రయోజనం నిరాకరించబడింది.*
- *వార్షిక ఖాతాలు సకాలంలో నిర్వహించబడలేదు, సిద్ధం చేయబడలేదు మరియు తనిఖీ చేయబడలేదు.*
- *2017-18 నుండి 2021-22 మధ్య కాలంలో ప్రభుత్వ మరియు బోర్డు వార్షిక ఖాతాల ప్రకారం పీడీ ఖాతాలలో తేడాలు ₹13 కోట్ల నుండి ₹205.22 కోట్ల వరకు ఉన్నాయి. పీడీ ఖాతాలలో తక్కువ నిల్వ ఉండడాన్ని బోర్డు ఖాతాల ప్రకారం సరిచూడాల్సిన అవసరం ఉంది.*
- *పురపాలక పరిపాలన శాఖ, ఇంజినీరింగ్ విభాగాల వంటి లైన్ శాఖలు వసూలు చేసే సెస్సు సరిగా వసూలు చేయబడుతుందనీ, బోర్డు ఖాతాలకు బదిలీ చేయబడుతున్నదనీ నిర్ధారించడానికి ఎలాంటి యంత్రాంగం రూపొందించబడలేదు.*
- *సంస్థలపై ఎలాంటి ఆన్లైన్ లేదా భౌతిక తనిఖీలను కార్మిక శాఖ నిర్వహించలేదు.*
- *ఇతర ప్రయోజనాల కోసం లేదా ఋణాలు మరియు అడ్వాన్స్‌లుగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మళ్లించబడిన బోర్డు నిధులు తిరిగి చెల్లించబడలేదు.*

## 2.1 పరిచయం

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులు, అత్యధిక సంఖ్యలో అత్యంత బాధిత స్థితిలో ఉండే అసంఘటిత కార్మికులుగా వీరి యొక్క పని స్వభావాన్ని బట్టి గుర్తింపబడతారు. అనిశ్చిత పని గంటలు, యజమానితో తాత్కాలిక సంబంధాలు, ప్రాథమిక సౌకర్యాల కొరత మరియు అసంపూర్ణ సంక్షేమ సౌకర్యాలు వంటివి కూడా దీన్ని నిర్ధారిస్తున్నాయి.

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల ప్రయోజనాల కోసం కార్మికులను అనిశ్చితి నుండి రక్షించడానికి, సామాజిక భద్రతా పథకాలు మరియు సంక్షేమ చర్యలను అందించడానికి మరియు పర్యవేక్షించడానికి ప్రతి రాష్ట్రంలో కార్మిక సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం భావించింది. కార్మిక సెస్సు (సెస్) విధించడం/ వసూలు చేయడం ద్వారా, నిర్మాణ కార్మికుల ప్రయోజనం కోసం వారికి భద్రత, ఆరోగ్యం మరియు సంక్షేమ చర్యలను అందించడం కోసం, భారత ప్రభుత్వం (జీఓఐ) (1996 ఆగస్టు) భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల (ఉపాధి నియంత్రణ మరియు సేవా నిబంధనలు) చట్టం, 1996 (బీఓసీడబ్ల్యూ చట్టం) మరియు భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం, 1996 (సెస్ చట్టం) ను రూపొందించింది. అంతేకాకుండా, భారత ప్రభుత్వం కూడా (1998 నవంబర్) భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల (ఉపాధి నియంత్రణ మరియు సేవా షరతులు) కేంద్రీయ నియమాలు, 1998 (నియమాలు) మరియు భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్సు నియమాలు, 1998 (సెస్ నియమాలు) రూపొందించింది. ఈ చట్టం ప్రకారం, ప్రతి రాష్ట్ర ప్రభుత్వం, చట్టం ద్వారా దఖలు పడిన అధికారాలను వినియోగిస్తూ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడం, దాని నిబంధనలను రూపొందించడం తప్పనిసరి.

పై కేంద్ర చట్టం ఆధారంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1999లో, ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల నిబంధనలను రూపొందించింది. 2007 ఏప్రిల్లో ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు (బోర్డు) ను కూడా ఏర్పాటు చేసి, సెస్‌ల మదింపు (2009 జనవరి) మరియు వసూలు (2009 డిసెంబర్) కోసం సూచనలను జారీ చేసింది. ఈ చట్టం రద్దు చేయబడి, 2020 యొక్క కొత్త చట్టం సంఖ్య 37 – వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్, 2020 తో భర్తీ చేయబడింది.

## 2.2 సంస్థాగత నిర్మాణం

చట్టం అమలును పర్యవేక్షించడానికి, సెస్ చట్టం క్రింద, రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ అధికారులను నమోదు అధికారులుగా, లేబర్ కమీషనర్ (సీఓఎల్) స్థాయి నుండి సహాయక లేబర్ ఆఫీసర్స్ (ఏఎల్ఓ) స్థాయి వరకు సెస్ కలెక్టర్‌లు గాను, సీఓఎల్ స్థాయి నుండి సహాయక కమీషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్) స్థాయి వరకు మదింపు అధికారులుగాను నియమించింది.

రాష్ట్రంలోని కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్లు & బీమా వైద్య సేవల శాఖామాత్యులు, బోర్డ్‌కు ఎక్స్-అఫిషియో చైర్మన్‌గా వ్యవహరిస్తారు. బోర్డు కార్యదర్శి & ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా వ్యవహరించే లేబర్ కమీషనర్ (సీఓఎల్); ప్రధాన కార్యాలయం మరియు జిల్లా స్థాయిలలో సంక్షేమ పథకాలు మరియు సాధారణ పరిపాలనను పర్యవేక్షించడానికి/అమలు చేయడానికి ఉప కమీషనర్‌లు (డీసీఎల్‌లు), సహాయక కమీషనర్‌లు (ఏసీఎల్‌లు) మరియు సహాయక లేబర్ ఆఫీసర్‌లు (ఏఎల్ఓలు) సహకారం అందించే అదనపు లేబర్ కమీషనర్ సలహాదారుగా బోర్డు ఏర్పాటవుతుంది. డీసీఎల్ నేతృత్వంలో 13 జిల్లా కార్యాలయాలు ఉన్నాయి, వీటిలో సెస్సు వసూలు మరియు నిర్మాణ కార్మికుల నమోదు చేయబడుతుంది. బోర్డు యొక్క సంస్థాగత నిర్మాణం **పటం 2.1** లో చూపబడింది.

**పటం 2.1: సంస్థాగత నిర్మాణం**



## 2.3 తనిఖీ లక్ష్యాలు

క్రింది విషయాలను నిర్ధారించుటకు ఈ పనితీరు తనిఖీ (పీఏ) నిర్వహించబడినది –

- చట్టం క్రింద ప్రభుత్వం ప్రకటించిన నియమాలు చట్టాల స్ఫూర్తికి అనుగుణంగా ఉన్నాయా
- సంస్థలు, లబ్ధిదారుల నమోదు కోసం సమర్థవంతమైన వ్యవస్థ ఉన్నదా
- మదింపు, వసూలు, నిధికి సెస్సు బదిలీ సమర్థవంతంగా జరుగుతున్నదా
- ప్రభుత్వం తగిన ఆరోగ్య, భద్రతా నిబంధనలను నిర్దేశించిందా
- యజమానులు సెస్సు ఎగవేయకుండా కార్మికులకు ఆరోగ్య, భద్రతా నిబంధనలు సమర్థవంతంగా పాటించేలా, తనిఖీ చేయడానికి ప్రభుత్వం పారదర్శక తనిఖీ వ్యవస్థను కలిగి ఉన్నదా, మరియు
- బోర్డు ద్వారా సంక్షేమ పథకాల అమలుపై పరిపాలన, నిధుల వినియోగం సమర్థవంతంగా, ప్రభావవంతంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన చట్టం, నిబంధనల ప్రకారం ఉన్నదా.

## 2.4 తనిఖీ ప్రమాణాలు

తనిఖీ ప్రమాణాలు క్రింద పేర్కొన్న నియమాలను ప్రామాణికంగా తీసుకుని అంచనా వేయబడ్డాయి:

- భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల (ఉపాధి నియంత్రణ మరియు సేవా నిబంధనలు) చట్టం, 1996
- వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్, 2020
- భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సెస్సు చట్టం 1996, సెస్సు నియమాలు, 1998
- రాష్ట్ర భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల (ఉపాధి నియంత్రణ మరియు సేవా నిబంధనలు) చట్టం, 1999
- రాష్ట్ర ఆర్థిక నియమాలు
- బోర్డు ఆమోదించిన తీర్మానాలు
- రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తనిఖీ విధానం

## 2.5 తనిఖీ పరిధి, ప్రక్రియ

పనితీరు తనిఖీ 2017-18 నుండి 2021-22 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలానికి సంబంధించి 2022 డిసెంబర్, 2023 జూన్ మధ్య నిర్వహించబడింది. కార్మిక శాఖ, బోర్డు, యూనిట్ కార్యాలయాల (జేసీఎల్/డీసీఎల్‌లు) యొక్క రికార్డులను 4 జిల్లాల్లో పరిశీలించాము. జిల్లాలు, సర్కిళ్ల వారీగా సంక్షేమ పథకాలపై పెట్టిన ఖర్చు, సేకరించిన సెస్సును పరిమాణంగా తీసుకుని 'పునరావృతం కాని ఎంపిక' చేసే విధానం ద్వారా నాలుగు జిల్లాలు[8] ఎంపిక చేయబడ్డాయి. ప్రతి ఎంపికైన జిల్లాలో రెండు పట్టణ స్థానిక సంస్థలు[9], తగిన దామాషాలో పునః స్థాపన చేయని పద్ధతిలో ఎంపిక చేయబనడిన నాలుగు జిల్లాల్లోని కార్యాలయాలు; రెండు పట్టణ స్థానిక సంస్థలు అనగా ఎంపిక చేయబడిన ప్రతి జిల్లా నుండి ఒక నగరపాలక

8 తూర్పు గోదావరి, గుంటూరు, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి

9 తూర్పు గోదావరి జిల్లాలోని రాజమండ్రి, పిఠాపురం, గుంటూరు జిల్లాలోని గుంటూరు, నరసరావుపేట, విశాఖపట్నం జిల్లాలోని విశాఖపట్నం, నర్సీపట్నం, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు, తణుకు

సంస్థ, ఒక పురపాలక సంస్థ; ఆర్ & బీ, ప్రజారోగ్యం, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యవసాయ డివిజన్ల[10] నుండి ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయబడిన రెండు డివిజన్ల దస్త్రాలు మచ్చుకు తనిఖీ చేయబడ్డాయి.

ఎంపిక చేయబడిన జిల్లాల్లో నమోదైన 100 మంది నిర్మాణ కార్మికుల లబ్ధిదారుల సర్వే కూడా నిర్వహించబడింది. 2023 మే 22 న బోర్డు కార్యదర్శి మరియు ప్రధాన కార్యనిర్వహణాధికారితో ప్రారంభ సమావేశం నిర్వహించబడింది. ఇందులో తనిఖీ లక్ష్యాలు, తనిఖీ పరిధి మరియు ప్రక్రియల గురించి వివరించబడింది. తనిఖీ పరిశీలనలపై వారి అభిప్రాయాలను అభ్యర్థిస్తూ, ముసాయిదా తనిఖీ నివేదికను (2023 ఆగస్టు) ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, కార్మిక శాఖకు పంపబడింది. 2024 ఫిబ్రవరి 12 న శాఖతో ముగింపు సమావేశం నిర్వహించబడింది. ప్రభుత్వం నుండి స్వీకరించబడిన (2024 మే 16) ప్రత్యుత్తరాలు నివేదికలో సముచితంగా పొందుపరచబడ్డాయి.

### ఆడిట్ కనుగొన్న అంశాలు

## 2.6 భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టాలు, నియమాలు మరియు సంస్థలు, లబ్ధిదారుల నమోదు/పునరుద్ధరణ మధ్య అనుగుణ్యత

### 2.6.1 వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పనిచేసే పరిస్థితుల కోడ్, 2020 ను అవలంబించుట

2020 సెప్టెంబర్ నుండి వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పనిచేసే పరిస్థితుల కోడ్, 2020 (ఓఎస్‌హెచ్‌డబ్ల్యూసీ) అమల్లోకి వచ్చింది. కోడ్ యొక్క సెక్షన్ 135 (1) ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం మునుపటి ప్రచురణ యొక్క షరతులకు లోబడి ఈ కోడ్ నిబంధనలను అమలు చేయడం కోసం నోటిఫికేషన్ ద్వారా నియమాలను రూపొందించవచ్చు. కోడ్ సెక్షన్ 143 (1) (ఎమ్) ప్రకారం, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులు (ఉపాధి నియంత్రణ మరియు సేవా నిబంధనలు) చట్టం, 1996 రద్దు చేయబడింది. అంతేకాకుండా ఈ కోడ్ యొక్క మునుపటి చట్టం/నిబంధనలతో కూడిన సంబంధిత నిబంధనలు ఈ కోడ్ యొక్క నిబంధనలకు విరుద్ధంగా లేనంత వరకు అమలులో ఉంటాయి.

ఓఎస్‌హెచ్‌డబ్ల్యూసీ, 2020 యొక్క నిబంధనలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమాలను రూపొందించలేదని ఆడిట్ గుర్తించింది. కొత్త కోడ్ ప్రకారం, రాష్ట్ర వృత్తిపరమైన భద్రత, ఆరోగ్య సలహా బోర్డు (ఎస్ఓఎస్‌హెచ్ఏబీ) గా పిలవబడే ఒక బోర్డును ఏర్పాటు చేస్తూ, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అందులో కలిపివేయాలి. కొత్త కోడ్ ప్రకారం కొన్ని నిర్వచనాలు అనగా మొత్తం పని ఖర్చు, సంస్థ యొక్క నిర్వచనము, ప్రభుత్వమనగా, సంస్థల నమోదు ప్రక్రియ, సంస్థ నమోదును రద్దు చేయడం, ప్రతి సంస్థలో భద్రతా అధికారుల సంఖ్య ఇత్యాదివి, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టం, 1996కు అనుగుణంగా లేవని ఆడిట్ గుర్తించింది. ఇవి ***అనుబంధం 2.1*** లో వివరించబడ్డాయి.

### 2.6.2 బోర్డు ద్వారా నిర్మాణ కార్మికుల నమోదు కోసం జారీ చేయబడిన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టాలు మరియు నియమాలకు కట్టుబడి ఉండటం

ఈ చట్టం క్రింద లబ్ధిదారునిగా నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికుడు 60 ఏళ్ల వయస్సు వచ్చినప్పుడు లేదా భవనం లేదా ఇతర నిర్మాణ పనుల్లో సంవత్సరానికి 90 రోజుల కంటే తక్కువ నిమగ్నమైనప్పుడు ఆ వ్యక్తి యొక్క సభ్యత్వాన్ని ఆపివేయాలని భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టం 1996 లోని సెక్షన్ 14 నిర్దేశిస్తుంది. ఇంకా, నిబంధనలలోని సెక్షన్ 33(ఎ) (2) ప్రకారం, అధీకృత వ్యక్తులు లేదా అధికారులు జారీ చేసిన ఉద్యోగ ధ్రువీకరణ పత్రంతో నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి.

[10] తూర్పు గోదావరిలోని కాకినాడ ఆర్ & బీ; గుంటూరులోని గుంటూరు మరియు తెనాలి ఆర్ & బీలు; విశాఖపట్నంలోని మర్రిపాలెం ఆర్ & బీ; తూర్పు గోదావరిలోని తుని పీఐపీఎల్ఎమ్‌సీ; విశాఖపట్నంలోని యలమంచిలి పీఐపీఎల్ఎమ్‌సీ; పశ్చిమ గోదావరి జిల్లాలోని కొవ్వూరు పీఐపీఆర్ఎమ్‌సీ, పోలవరం పీఐపీహెచ్‌డబ్ల్యూ డివిజన్

నమోదు కోసం ఉపాధి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని పట్టుబట్టకుండా, కనీసం 90 రోజులపాటు నిర్మాణ పనుల్లో నిమగ్నమవ్వాల్సిన విషయాన్ని బోర్డు తనిఖీ చేయకపోవడం గమనించడమైనది.

చట్టం లేదా నిబంధనల ప్రకారం, ఉద్యోగ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కానందున దానిని సమర్పించాల్సిన అవసరం లేదని బోర్డు సమాధానం ఇచ్చింది. నమోదు పునరుద్ధరణకు, వ్యాపారానికి సంబంధించిన కార్మికుడిని ధృవీకరించే స్వీయ-ప్రకటన ధ్రువీకరణ పత్రం, గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్ఓ)/వార్డు కార్యదర్శి వంటి స్థానిక అధికారి నుండి ధ్రువీకరణ పత్రం సరిపోతుందని పేర్కొంది.

యజమాని నిర్వహించే నిర్దేశిత రిజిస్టర్‌లో కార్మికుని ఉపాధిని, అధీకృత అధికారులు జారీ చేసిన ఉద్యోగ ధ్రువీకరణ పత్రాన్ని తనిఖీ చేసి బోర్డు ధ్రువీకరించాలి కాబట్టి సమాధానం ఆమోదయోగ్యం కాదు.

ఈ విధంగా చట్టం/నిబంధనల గురించి బోర్డుకు తెలియనందున, అనర్హుల లబ్ధిదారుల నమోదుపై ఎలాంటి హామీ లేదు.

### 2.6.3 నమూనా సంక్షేమ పథక మార్గదర్శకాల ప్రకారం సామాజిక భద్రతా పథకాల అమలు

భారత ప్రభుత్వ కార్మిక & ఉపాధి మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ (కార్మిక సంక్షేమం), నిర్మాణ కార్మికులకు ఎమ్‌డబ్ల్యూఎస్ యొక్క సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించడం కోసం గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలకు (2018 జూలై 4) అనుగుణంగా నమూనా సంక్షేమ పథకాలను (ఎమ్‌డబ్ల్యూఎస్) రూపొందించారు.

- **మాతృ సంరక్షణ** – నమూనా సంక్షేమ పథకాల ప్రకారం, రాష్ట్ర భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు నమోదిత నిర్మాణ కార్మికులకు 90 రోజుల నుండి 26 వారాల వరకు రెండు ప్రసవాల వరకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను అందించాలి.

  మహిళా కార్మికులకు రాష్ట్ర బోర్డు అటువంటి సదుపాయం ఏదీ అందచేయలేదని లేబర్ కమీషనర్ పేర్కొన్నారు (2023 జనవరి).

- **చదువు** – నమూనా సంక్షేమ పథకాల ప్రకారం, లబ్ధిదారుల పిల్లల చదువు కోసం కనీస ఆర్థిక సహాయం సంవత్సరానికి ఒక బిడ్డకు ఇవ్వాలి, అనగా 1 నుండి 5వ తరగతికి ₹1,800 చొప్పున; 6 నుండి 10వ తరగతికి ₹2,400 చొప్పున, 11 నుండి 12వ తరగతి వరకు ₹3,000 చొప్పున, గ్రాడ్యుయేషన్ కోర్సులకు ₹10,000 చొప్పున, ఐటీఐ/వృత్తి విద్యా కోర్సు/ప్రొఫెషనల్ కోర్సులకు ప్రభుత్వ సంస్థలు/కళాశాలల వార్షిక రుసుముతో సమానమైన రేటుతో అందచేయబడుతుంది. ప్రభుత్వ పథకం నుండి పొందే ఇతర ప్రయోజనాలకు అదనంగా పైన పేర్కొన్న ప్రయోజనాలు అందచేయబడాలి.

  రాష్ట్ర బోర్డు, ఆర్థిక సహకారం అందించడానికి తమ బడ్జెట్లో, అటువంటి నిబంధన ఏదీ పొందుపరచలేదని లేబర్ కమీషనర్ పేర్కొన్నారు (2023 జనవరి).

- **పింఛను** – నమూనా సంక్షేమ పథకాల ప్రకారం, రాష్ట్ర భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు నమోదు చేసుకున్న కార్మికులకు కనీసం 10 సంవత్సరాలు పింఛను అందచేయాలి.

  భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు ఎటువంటి పింఛను పథకాన్ని రూపొందించలేదని లేబర్ కమీషనర్ పేర్కొన్నారు (2023 జనవరి).

  గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ రూపొందించిన నమూనా సంక్షేమ పథకాల ప్రకారం కార్మిక శాఖ నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించలేదు.

***సిఫార్సు 2.1: నమోదిత నిర్మాణ కార్మికులకు అవసరమైన సామాజిక భద్రతా ప్రయోజనాలను విస్తరించడానికి, నమూనా సంక్షేమ పథకాలకు అనుగుణంగా బోర్డు విధివిధానాలను రూపొందించాలి.***

### 2.6.4 రాష్ట్ర ప్రభుత్వంచే బోర్డు మరియు కమిటీల ఏర్పాటు

పథకం/కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి మరియు ఉద్దేశించిన లక్ష్యాలను సాధించడానికి సంస్థాగత యంత్రాంగం అవసరం. పథకాలు/కార్యక్రమాల సమర్థవంతమైన ప్రణాళిక మరియు అమలు కోసం రాష్ట్ర/జిల్లా సంబంధిత అధికారుల భాగస్వామ్యాన్ని ఇది ఆశించింది. భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టంలోని సెక్షన్ 18(1) ప్రకారం, ప్రతి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి [11].

ఆంధ్రప్రదేశ్‌లో, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించేందుకు, చట్టం మరియు జిల్లా సంక్షేమ కమిటీల (2015 నవంబర్) నిర్వహణలో ఉత్పన్నమయ్యే విషయాలపై ప్రభుత్వానికి సలహా ఇవ్వడానికి రాష్ట్ర సలహా కమిటీ (2007 జూన్), భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులను గుర్తించడానికి, ప్రయోజనాలను పొడిగించడానికి వారి నమోదు/పునరుద్ధరణ కోసం, ఇతర సభ్యులతో[12] పాటు కార్మిక మంత్రి ఎక్స్-అఫీషియో అధ్యక్షునిగా ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు 2007 ఏప్రిల్లో ఏర్పాటు చేయబడింది. ఇంకా, లబ్ధిదారులుగా నమోదు చేసుకున్న నిర్మాణ కార్మికులకు సంక్షేమ చర్యలను అందించడం కోసం భవన, ఇతర నిర్మాణ పనులను చేపట్టే యజమానుల నుండి సెస్సు (నిర్మాణ వ్యయంపై ఒక శాతం) వసూలు చేయడానికి సెస్సు నియమాలు[13], 2009 ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చింది.

బోర్డు పదవీకాలం గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి మూడు సంవత్సరాలు. కానీ దీనికి విరుద్ధంగా బోర్డులు, మూడు సంవత్సరాల ప్రారంభ పదవీకాలం (2010 ఆగస్టు) పూర్తయిన తర్వాత, బోర్డు ఆలస్యంగా 2015 సెప్టెంబరులో[14] మరియు 2021 జూలైలో వరుసగా రెండు, మూడు సంవత్సరాలు గడిచిన తర్వాత మాత్రమే ఏర్పాటు చేయబడింది.

ఈ విధంగా, 2010 ఏప్రిల్ నుండి 2015 ఆగస్టు మరియు 2018 అక్టోబర్ నుండి 2021 జూలై వరకు, బోర్డు లేని సమయంలో, ఆ విధులను కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణాధికారి (లేబర్ కమీషనర్) నిర్వర్తించారు.

బోర్డు పదవిలో లేనప్పుడు, కార్మికుల సంక్షేమం కోసం వార్షిక వ్యయ ప్రణాళికలను రచించక, బడ్జెట్ అంచనాలు సిద్ధం చేయలేదు. ప్రచార/ప్రకటనల ఖర్చులు అధికంగాను/అసమగ్రంగాను చేసిన సందర్భాలు ఉన్నందున ఖర్చుపై నియంత్రణ లేదు. ఇంకా, రసీదుల యొక్క సరైన వివరాలను చూపించే వార్షిక తనిఖీ నివేదికలు తయారు చేయబడలేదు.

### 2.6.5 రాష్ట్ర సలహా కమిటీ

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టం, 1996లోని సెక్షన్ 4 ప్రకారం, చట్టం యొక్క అమలులో ఉత్పన్నమయ్యే విషయాలపై వారికి సలహా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర సలహా కమిటీ (ఎస్ఏసీ)ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఎస్ఏసీ కనీసం ఆరు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలి. రాష్ట్ర ప్రభుత్వంచే నియమించబడిన ఛైర్‌పర్సన్, ఇద్దరు రాష్ట్ర శాసనసభ సభ్యులు, భారత ప్రభుత్వం నుండి ఒక సభ్యుడు, ముఖ్య ఇన్‌స్పెక్టర్ మరియు లేబర్ కమీషనర్ ఎక్స్-అఫీషియో సభ్యునిగా, యజమానులు, నిర్మాణ కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వంచే ఎంపిక చేయబడిన ఏడు నుండి పదకొండు మందిని రాష్ట్ర సలహా కమిటీ కలిగి ఉండాలి.

చట్టం ప్రవేశపెట్టిన 11 సంవత్సరాల తర్వాత 2007 జూన్‌లో రాష్ట్ర సలహా కమిటీ ఏర్పాటైందని ఆడిట్ గుర్తించింది. అయితే, రాష్ట్ర సలహా కమిటీ, 2010 వరకు, తన మూడేళ్ల పదవీకాలంలో కేవలం రెండుసార్లు మాత్రమే సమావేశమైంది.

---

[11] బోర్డులో, కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసే ఒక వ్యక్తి ఛైర్‌పర్సన్‌గా పదిహేను మందికి మించకుండా, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఇతర సభ్యులు ఉంటారు. బోర్డు, యజమానులు, నిర్మాణ కార్మికులు సమాన సంఖ్యలో సభ్యులను కలిగి ఉండాలి, కనీసం ఒక మహిళ సభ్యురాలుగా ఉండాలి

[12] ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎక్స్ అఫీషియో సభ్యునిగా; కార్మిక శాఖ కమీషనర్ (మెంబర్ కన్వీనర్); కార్మికులు, యజమానుల సమూహానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు సభ్యులు; భారత ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యుడు

[13] ఎల్ ఈటీ & ఎఫ్ శాఖ జీఓఎమ్ఎస్ సంఖ్య 111 & 112, తేదీ 15/12/2009

[14] ఎల్ ఈటీ & ఎఫ్ (ల్యాబ్– II) శాఖ జీఓఎమ్ఎస్ సంఖ్య.17, తేదీ 04/09/2015

ఆ తర్వాత, 2016 జూన్‌లో పునర్నిర్మించబడిన ఎస్ఏసీ 2019 జూన్‌లో దాని పదవీకాలం పూర్తి కావడానికి ముందు కేవలం రెండు సమావేశాలు మాత్రమే నిర్వహించింది. 2019 జూలై నుండి ఇప్పటి వరకు రాష్ట్ర సలహా కమిటీని ఏర్పాటు చేయలేదు.

అందువల్ల, 2019 జూలై నుండి 2021 జూన్ వరకు, చట్ట నిబంధనల నిర్వహణకు సంబంధించిన విషయాలపై సలహాలు అందించడానికి బోర్డు మరియు రాష్ట్ర సలహా కమిటీ కూడా లేవు.

రాష్ట్ర సలహా కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను 2023 జూలై 25 మరియు 2024 ఫిబ్రవరి 13న ప్రభుత్వానికి సమర్పించామని, ఈ అంశం ఇంకా ప్రభుత్వ పరిశీలనలో ఉందని లేబర్ కమీషనర్[15] పేర్కొన్నారు. ప్రభుత్వం (2024 మే 16) ఆడిట్ పరిశీలనను అంగీకరించింది.

ఆ విధంగా, అత్యున్నత స్థాయిలో ఉండవలసిన పాలకమండలి ఉనికిలో లేదు.

### 2.6.6 జిల్లా స్థాయి సమన్వయ కమిటీ

జిల్లాకు చెందిన డీసీఎల్ మెంబర్ కన్వీనర్‌గా, సెస్సు చట్టం కింద సెస్సు వసూలు కోసం, జిల్లా స్థాయి సమన్వయ కమిటీలను (డీఎల్‌సీసీలు) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది[16] (2009 సెప్టెంబర్). సెస్సు వసూళ్లకు సంబంధించిన ప్రగతి నివేదిక, తదుపరి నెల 10వ తేదీన ప్రభుత్వానికి అందేట్లు, డీఎల్‌సీసీ మెంబర్ కన్వీనర్ ప్రతి నెలా లేబర్ కమీషనర్ ద్వారా పంపవలసి ఉంటుంది.

నెలవారీ ప్రగతి నివేదికలను 2017-18 నుండి 2021-22 మధ్య మూడు జిల్లాలు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి మరియు కృష్ణా జిల్లాలకు చెందిన మెంబర్ కన్వీనర్లు అంటే, ఉప లేబర్ కమీషనర్ (డీసీఎల్) ప్రభుత్వానికి సమర్పించినట్లు ఆడిట్ గుర్తించింది. ఇతర 10 జిల్లాల డీసీఎల్ లు నెలవారీ ప్రగతి నివేదికలను అందించలేదు.

పది జిల్లాల డీసీఎల్ లు నెలవారీ ప్రగతి నివేదికలను సమర్పించనందున నెలవారీ ప్రాతిపదికన సెస్సు రాబడి, బాకీల వివరాలు లేబర్ కమీషనర్‌కు తెలియడంలేదు.

ప్రభుత్వం ఆడిట్ పరిశీలనను అంగీకరిస్తూ డీఎల్‌సీసీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, ప్రతి నెల 5వ తేదీన సెస్సు వసూలుపై ప్రగతి నివేదికలను సమర్పించాలని డీసీఎల్ లను, సీఓఎల్ ఆదేశించారని[17] పేర్కొంది. సెస్సు వసూలు అంచనాలపై జిల్లా స్థాయిలో రికార్డులు నవీకరిస్తూ నిర్వహించాలి. డిమాండ్, రాబడి, బాకీల పట్టికలను సిద్ధం చేయడానికి, సేకరించిన సెస్సును జమ చేయడానికి, సెస్సు వసూలు చేసే అధికారులతో సమన్వయం చేసుకోవాలి. అయితే, ప్రత్యుత్తరంలో పేర్కొన్న విధంగా తీసుకున్న చర్యను నిర్ధారించడానికి పత్రాలు లేదా రికార్డులు అందించలేదు.

## 2.7 సంస్థలు, లబ్ధిదారుల నమోదు

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టం, 1996లోని సెక్షన్ I (4) ప్రకారం, గడిచిన పన్నెండు నెలల్లో ఏ రోజునైనా, ఏదైనా భవనం లేదా ఇతర నిర్మాణ పనిలో పది లేదా అంతకంటే ఎక్కువ మంది నిర్మాణ కార్మికులను నియమించుకున్న లేదా నియమించిన ప్రతి సంస్థకు ఈ చట్టం వర్తిస్తుంది. ఇందు కోసం, సంస్థలో నియమించబడిన భవన కార్మికుల సంఖ్యను గణించడానికి, యజమాని లేదా గుత్తేదారు ద్వారా ఒక రోజులో వేర్వేరు విడతలుగా నియమించబడిన భవన కార్మికులు కూడా పరిగణించబడతారు.

[15] 2024 ఫిబ్రవరి 12న జరిగిన ముగింపు సమావేశంలో

[16] ఎల్ ఈటీ & ఎఫ్ (ల్యాబ్ - II) శాఖ జీ.ఓ.ఎమ్ఎస్ సంఖ్య.84, తేదీ 16/09/2009 ప్రకారం

[17] సర్క్యులర్ మెమో సంఖ్య జె/1460/2023, తేదీ 2023 నవంబర్ 30

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల (ఉపాధి నియంత్రణ మరియు సేవా నిబంధనలు) చట్టం, 1996 [18] లోని సెక్షన్ 7 ప్రకారం నిర్మాణ పనులు చేపట్టే ప్రతి యజమాని, పని ప్రారంభించిన 60 రోజులలోపు సంస్థ నమోదు కోసం, నమోదు చేసే అధికారికి దరఖాస్తును సమర్పించాలి.

తనిఖీ కాలావధిలో, నమోదు చేసే అధికారి వద్ద నమోదు చేయబడిన సంస్థల స్థితిని అంచనా వేయడానికి, నమోదు కోసం అనుసరించిన పద్ధతిని, నమోదు చేయబడిన సంస్థల సంఖ్యను అందించమని లేబర్ కమీషనర్‌ను అభ్యర్థించడమైనది.

2017-18 నుండి 2019-20 వరకు జిల్లాల వారీగా నమోదిత సంస్థలు మరియు లబ్ధిదారుల సంఖ్యను జిల్లాల నుండి పొందవచ్చుని లేబర్ కమీషనర్ బదులిచ్చారు (2023 జనవరి). ఇంకా, 2022 మార్చి నాటికి, ఈ చట్టం కింద రాష్ట్రంలో మొత్తం 15,335 సంస్థలు నమోదు చేయబడ్డాయి.

10 మంది కంటే ఎక్కువ మంది నిర్మాణ కార్మికులు పని చేస్తున్న సంస్థలను తప్పనిసరిగా నమోదు చేయాలన్న చట్ట నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయడానికి శాఖ ఎలాంటి పద్దతిని రూపొందించలేదని సమాధానం సూచిస్తుంది. తద్వారా కార్మికులకు చట్టబద్ధమైన సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయి.

యజమాని/ఆక్రమణదారు ఆంధ్రప్రదేశ్ సమగ్ర నమోదుల జారీ మరియు కొన్ని సంస్థల ద్వారా వివిధ కార్మిక చట్టాల ప్రకారం సమిష్టి రిటర్న్‌లను అందించడంలోనే, 2015 చట్టం ప్రకారం, స్వయంగా మీ-సేవా పోర్టల్ లేదా ఆన్‌లైన్ ద్వారా తమ నిర్మాణ సంస్థలను నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2024 మే 15). 2024 మార్చి నాటికి, మీ-సేవ ద్వారా, ఈ చట్టం కింద మొత్తం 19,489 సంస్థలు నమోదు చేయబడ్డాయి.

మీ-సేవ ద్వారా యజమానులు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించినప్పటికీ, పని ప్రారంభించిన 60 రోజులలోపు సంస్థను నమోదు చేసే చట్ట నిబంధనలను పాటించే పద్దతి అందుబాటులో లేదు.

### 2.7.1 కార్మికుల నమోదు మరియు పునరుద్ధరణ

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల (ఉపాధి నియంత్రణ మరియు సేవా నిబంధనలు) చట్టం, 1996లోని సెక్షన్ 12 ప్రకారం, 18 నుండి 60 సంవత్సరాల లోపు వయసు కలిగి, ఏదైనా భవనం లేదా ఇతర నిర్మాణ పనిలో, గడిచిన పన్నెండు నెలల్లో 90 రోజుల కంటే తక్కువ కాకుండా ఉన్న ప్రతి భవన కార్మికుడు, ఈ చట్టం క్రింద లబ్ధిదారు/కార్మికుడుగా నమోదు చేసుకోవడానికి అర్హులు.

నిర్మాణ కార్మికులు నమోదు రుసుము ₹50, వార్షిక సభ్యత్వ రుసుము ₹12 లేదా ఐదు సంవత్సరాలకు ₹60, సంబంధిత సహాయక కార్మికాధికారికి చెల్లించి బోర్డులో నమోదు చేయబడతారు. ఆ తరువాత, కార్మికుడి నమోదు పునరుద్ధరణ చేయబడుతుంది. ఒక లబ్ధిదారుడు ఒక సంవత్సరం కంటే తక్కువ కాకుండా నిరంతర కాలానికి సభ్యత్వ రుసుము చెల్లించడంలో విఫలమైనట్లైతే, అతను నిధి నుండి లబ్ధి పొందడానికి అనర్హుడౌతాడు.

చట్టం క్రింద, బోర్డులో నమోదు చేసుకోవడానికి, అర్హతగల ప్రయోజనాలను పొందేందుకు మరియు వారి నమోదులను కాలానుగుణంగా పునరుద్ధరించడానికి అర్హులైన కార్మికులను గుర్తించడానికి కార్మిక శాఖ ఎటువంటి విధానాన్ని రూపొందించలేదని ఆడిట్ గుర్తించింది. ఆడిట్ ప్రశ్నలకు, శాఖ ప్రతిస్పందనల ద్వారా, రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారుల సంఖ్యను అంచనా వేయడానికి లేదా గుర్తించడానికి ఎటువంటి సర్వే నిర్వహించలేదని తెలిసింది. దీని కారణంగా అర్హులైన నిర్మాణ కార్మికుల నమోదు నిర్ధారించబడలేదు, నమోదు చేయవలసిన అర్హతగల కార్మికుల సంఖ్య కూడా తెలియలేదు.

[18] ఈ చట్టం రద్దు చేయబడి, కొత్త చట్టం సంఖ్య 37, 2020 – వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్, 2020 తో భర్తీ చేయబడింది

ఆ విధంగా, చట్టం కింద అర్హత కల ప్రయోజనాలను పొందేందుకు,బోర్డులో నమోదు చేసుకోవడానికి అర్హులైన కార్మికులను గుర్తించడానికి, కాలానుగుణంగా నమోదును పునరుద్ధరించడానికి, ఎటువంటి ప్రక్రియను రూపొందించలేదు.

మచ్చుకు తనిఖీ చేయబడిన నాలుగు[19] జిల్లాలలో, 18 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల 7,34,345 మంది నమోదిత కార్మికులలో 6,13,856 మంది కార్మికులు పునరుద్ధరణ చేసుకోవలసి ఉండగా, 2024 ఫిబ్రవరి నాటికి **పట్టిక 2.1**లో చూపిన విధంగా వారి నమోదులు పునరుద్ధరించబడలేదు.

**పట్టిక 2.1: నమోదు, పునరుద్ధరించబడిన, పునరుద్ధరణ చేసుకోని కార్మికుల సంఖ్యను సూచించే పట్టిక**

| జిల్లా పేరు | నమోదు చేసుకున్న కార్మికుల సంఖ్య | పునరుద్ధరణ చేసుకున్న కార్మికుల సంఖ్య | పునరుద్ధరణ చేసుకోని/ చేసుకోవలసివున్న కార్మికుల సంఖ్య |
|---|---|---|---|
| తూర్పు గోదావరి | 2,32,989 | 23,477 | 2,09,512 |
| గుంటూరు | 2,29,891 | 35,624 | 1,94,267 |
| విశాఖపట్నం | 1,51,105 | 32,143 | 1,18,962 |
| పశ్చిమ గోదావరి | 1,20,360 | 29,245 | 91,115 |
| మొత్తం | **7,34,345** | **1,20,489** | **6,13,856** |

***మూలం**: శాఖ అందచేసిన సమాచారం*

ఆ విధంగా, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం కోసం అర్హులైన కార్మికులందరినీ గుర్తించి నమోదు చేసుకోవడానికి/పునరుద్ధరించడానికి సంస్థాగత యంత్రాంగం రూపొందించబడలేదు.

నమోదు మరియు నమోదు పునరుద్ధరణ కోసం మండలాలు, జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లేబర్ కమీషనర్ సమాధానమిచ్చారు(2023 జనవరి). ఇంకా, జిల్లాల వారీగా 2017-18 నుండి 2019-20 కాలానికి నమోదు చేసుకున్న కార్మికుల సభ్యత్వ పునరుద్ధరణ వివరాలు జిల్లాల నుండి పొందబడతాయని సమాధానం ఇవ్వబడింది.

10 మంది కంటే ఎక్కువ మంది నిర్మాణ కార్మికులు పనిచేస్తున్న సంస్థలను తప్పనిసరిగా నమోదు చేయాలన్న చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయడానికి, అర్హులైన కార్మికులందరినీ గుర్తించి, చట్టబద్ధమైన సంక్షేమ పథకాలను పొందేందుకు బోర్డులో నమోదు/పునరుద్ధరణ చేసేందుకు శాఖ ఎలాంటి సంస్థాగత యంత్రాంగాన్ని లేదా పద్ధతిని రూపొందించలేదు.

దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఎప్పటికప్పుడు అవగాహన ప్రచారాలను నిర్వహించాలని, కార్మికుల నమోదును సులభతరం చేయాలని బోర్డు జేసీఎల్/డీసీఎల్/ఏసీఎల్ మరియు జిల్లా స్థాయిలోని ఇతర అధికారులకు ఆదేశాలు ఇచ్చిందని; పని ప్రదేశాలు మరియు లేబర్ అడ్డాలను సందర్శించి, పోర్టల్ ద్వారా స్వయంగా ఆన్‌లైన్ నమోదు, పునరుద్ధరణ ద్వారా కార్మికులను బోర్డులో లబ్ధిదారులుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని నమోదు చేసుకునే అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేయబడుతున్నాయని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది(2024 మే 15). 2024 మార్చి నాటికి 20,09,309 మంది కార్మికులు బోర్డులో నమోదు చేసుకున్నారు.

సమాధానాన్ని ధ్రువీకరించడానికి ఎటువంటి ఋజువులు చూపనందున సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 2.7.2 వెబ్‌సైటు పనితీరు

బోర్డు పనితీరులో పూర్తి పారదర్శకత మరియు జవాబుదారీతనం సాధించేందుకు సంస్థలను, కార్మికులను నమోదు చేయడం, సెస్సు వసూలు, క్లెయిమ్‌ల అకౌంటింగ్, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల ప్రయోజనాల సెటిల్‌మెంట్

[19] తూర్పుగోదావరి, గుంటూరు, విశాఖపట్నం, పశ్చిమగోదావరి

కోసం క్రియాశీల పారస్పరిక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించాలని బోర్డును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది (2010 ఆగస్టు) [20].

ఏపీబీ & ఓసీడబ్ల్యూడబ్ల్యూ బోర్డు ₹1.08 కోట్ల వ్యయంతో 'నవ నిర్మాణ కార్మికులు' అనే ఎండ్ టు ఎండ్ ఆన్‌లైన్ మరియు మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేసి మూడు నెలల్లో పని పూర్తి చేయాలని, ఎన్ఐసీకి వర్క్ ఆర్డర్ జారీ చేసింది (2016 జూన్). ఎన్ఐసీకి పని ప్రారంభించడం కోసం తొలి బయానాగా ₹27 లక్షలు (2016 జూన్), రెండు సంవత్సరాల తర్వాత (2018 జూన్) ₹27 లక్షలు విడుదల చేయబడ్డాయి.

ఈ పథకం 2023 మే నాటికి కూడా అసంపూర్తిగా ఉందని, పని ఆగిపోవడానికి కారణాలు మరియు ఈ విషయంలో చేసిన తదుపరి ఉత్తరప్రత్యుత్తరాలు, ఎన్ఐసీ ద్వారా ఆడిట్‌కు సమర్పించబడిన దస్త్రాల ద్వారా స్పష్టత రాలేదని గమనించడమైనది.

శాఖ, ఎన్ఐసీతో సమావేశాన్ని నిర్వహించి, మాడ్యూళ్లను పూర్తి చేయడానికి ప్రయత్నిస్తుందని, ముగింపు సమావేశం సందర్భంగా కార్మిక కమీషనర్ పేర్కొన్నారు

ఈ విధంగా, ₹54 లక్షల ఖర్చు చేసినప్పటికీ, సంస్థల మరియు కార్మికుల నమోదు, సెస్సు వసూలు, క్లెయిమ్‌ల అకౌంటింగ్, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల ప్రయోజనాల సెటిల్‌మెంట్‌పై తక్షణ సమాచారాన్ని కలిగి ఉండేలా ఎండ్ టు ఎండ్ ఆన్‌లైన్, మొబైల్ అప్లికేషన్‌లు అభివృద్ధి చేయబడలేదు.

ఎన్ఐసీ విజయవాడ అభివృద్ధి చేసిన "నవ నిర్మాణ కార్మికులు (https://apbocwwb.ap.nic.in/)" అనే వెబ్ పోర్టల్ ప్రస్తుతం పని చేస్తోందని ప్రభుత్వం బదులిచ్చింది, సంక్షేమ పథకాలు నిలుపుదలలో ఉన్నాయన్న శాఖాపరమైన సమాధానాన్ని ఆమోదించింది. ఇంకా, సంక్షేమ పథకాల మాడ్యూళ్లను మరింత అభివృద్ధి చేయడం కోసం, శాఖ, ఎన్ఐసీకి అంగీకార పరీక్షను అందించలేకపోయిందని, ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు (ఏపీబీఓసీడబ్ల్యూడబ్ల్యూబీ) ద్వారా సంక్షేమ పథకాలు పునరుద్ధరించబడినన తర్వాత, పోర్టల్ ఉపయోగంలోకి తీసుకువస్తామని తెలియచేసింది.

***సిఫార్సు 2.2: సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు అన్ని సంస్థలను మరియు అర్హులైన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులను గుర్తించి నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను రూపొందించాలి లేదా ఎండ్ టు ఎండ్ ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేయాలి. బోర్డు, నమోదు కాబడిన సంస్థలు మరియు యజమానుల సమాచారాన్ని, వారి వద్ద పని చేస్తున్న కార్మికుల సంఖ్యల సమాచారంతోపాటు నిర్వహించాలి.***

## 2.8 సెస్సు మదింపు, వసూలు, సేకరణ మరియు బదిలీ

సెస్సు చట్టంలోని నిబంధనల ప్రకారం, బోర్డుకు ప్రధాన ఆదాయ వనరు సెస్సు విధింపు[21] మరియు వసూలు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ రంగ సంస్థ యొక్క భవన లేదా ఇతర నిర్మాణ పనుల యజమాని నుండి విధించబడిన సెస్సు (నిర్మాణ వ్యయంపై ఒక శాతం) ను తప్పనిసరిగా వసూలు చేయాలి లేదా ఏ స్థానిక అధికారి వద్దనైతే అటువంటి భవన లేదా ఇతర నిర్మాణ పనుల ప్రణాళికలు ఆమోదించబడ్డాయో, వారు ముందస్తుగా సెస్సును వసూలు చేయాలి. దీనికి అదనంగా కార్మికుల సభ్యత్వ నమోదు మరియు పునరుద్ధరణ రుసుము అనేది బోర్డుకు ఒక చిన్న ఆదాయ వనరు.

### 2.8.1 బోర్డు యొక్క ఆదాయం మరియు వ్యయం

బోర్డు యొక్క నిధిలో సెస్సు వసూళ్లు, బ్యాంకు ఖాతాలలోని నిధులపై ఆర్జించిన వడ్డీ ఉంటాయి. బోర్డు తన విధుల నిర్వహణలో, కార్మికులకు ప్రయోజనం చేకూర్చే సంక్షేమ పథకాల అమలు, తన పరిపాలనా ఖర్చుల కోసం ఈ నిధిని

[20] కార్మిక ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల (ఎల్ఏబీ-IV) శాఖ, జీఓఎమ్ఎస్ సంఖ్య 69 తేదీ 03/08/2010

[21] యాజమానిచే ఖర్చు చేయబడిన నిర్మాణ వ్యయం రెండు శాతానికి మించకుండా, రేటు ఒక శాతానికి తగ్గకుండా

వినియోగించాలి. 2017-18 నుండి 2021-22 వరకు బోర్డు యొక్క ఆదాయం మరియు వ్యయం **పట్టిక** 2.2 లో ఇవ్వబడింది, ధోరణి **పటం** 2.2 లో వర్ణించబడింది.

**పట్టిక 2.2: 2017-22 కాలానికి బోర్డు యొక్క ఆదాయ వ్యయాలు**

*(₹ కోట్లలో)*

| సంవత్సరం | ప్రారంభ నిల్వ | ఆదాయం | | | వ్యయం | | | | ముగింపు నిల్వ |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | వసూలు చేసిన సెస్సు | ఇతర ఆదాయాలు ★ | మొత్తం | పరిపాలన వ్యయం | సంక్షేమ పథకాలు (మొత్తం ఆదాయంలో శాతం) | ప్రచార వ్యయం | మొత్తం | |
| 2017-18 | 1,387.04 | 268.09 | 49.82 | 317.91 | 5.10 | 79.87 (25.12) | 18.74 | 103.71 | 1,601.24 |
| 2018-19 | 1,601.24 | 329.11 | 36.09 | 365.20 | 5.25 | 60.69 (16.61) | 52.76 | 118.70 | 1,847.74 |
| 2019-20 | 1,847.74 | 506.40 | 44.68 | 551.08 | 3.31 | 22.50 (4.08) | 0.01 | 25.82 | 2,373.00 |
| 2020-21 | 2,373.00 | 365.60 | 58.81 | 424.41 | 4.55 | 3.31 (0.77) | 0.54 | 8.40 | 2,789.00 |
| 2021-22 | 2,789.00 | 486.09 | 51.20 | 537.29 | 4.81 | 2.85 (0.53) | 0.01 | 7.67 | 3,318.62 |
| మొత్తం | | 1,955.29 | 240.60 | 2,195.89 | 23.02 | 169.22 | 72.06 | 264.30 | |

***మూలం:*** *శాఖ దస్త్రాలు*

*★నమోదు రుసుము, సభ్యత్వ రుసుము, ఫిక్స్‌డ్ డిపాజిట్ రసీదులపై వడ్డీ వంటివి ఇతర ఆదాయంలో కూడి ఉన్నాయి.*

**పటం 2.2: బోర్డు యొక్క ఆదాయ వ్యయాలు**




ప్రభుత్వం ఇతర శాఖల ద్వారా ఇలాంటి పథకాలను అమలు చేస్తున్నందున, అవే ప్రయోజనాలు మళ్ళీ పొందడాన్ని నివారించడానికి కార్మిక సంక్షేమ పథకాలను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం[22] ఆదేశించిందని (2020 మార్చి) బోర్డు పేర్కొంది.

[22] కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్లు & వైద్య బీమా సేవలు (ఎల్ఎఫ్‌బీ & ఐఎంఎస్) శాఖ మెమో సంఖ్య 3404968/కార్మికులు II/ఏ 3/2020 తేదీ 26/3/2020

50 మంది లబ్ధిదారులని ఫోన్ ద్వారా జరిపిన సర్వేలో (సంక్షేమ పథకాల మంజూరు కోసం దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నవారి), రాష్ట్ర ప్రభుత్వం మరియు ఇతర శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదని, అలాగే కార్మిక శాఖ సంక్షేమ పథకాలు కూడా అందలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

2017-18 నుంచి 2021-22 మధ్య కాలంలో సంక్షేమ పథకాలపై ఖర్చు చేసిన మొత్తం, ఆదాయంలో 25.12 నుంచి 0.53 శాతానికి తగ్గింది. ఇంకా, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టం 1996 సెక్షన్ 24 (2) (సి) ప్రకారం, ఏ ఆర్థిక సంవత్సరంలోనైనా, ఏ బోర్డు, తన సభ్యులు, అధికారులు మరియు ఇతర ఉద్యోగులకు జీతాభత్యాలు, ఇతర వేతనాలు, మరియు ఇతర పరిపాలనా ఖర్చుల కోసం, ఆ ఆర్థిక సంవత్సరంలో దాని మొత్తం ఖర్చులలో ఐదు శాతానికి మించి భరించకూడదు. అయితే 2019-20 నుండి 2021-22 మధ్య కాలంలో మొత్తం వ్యయంలో పరిపాలనా వ్యయం 13 శాతం నుండి 63 శాతం వరకు ఉన్నట్లు గమనించబడింది. ఆ విధంగా, 2019-20 నుండి 2021-22 సంవత్సరాలలో మొత్తం వ్యయంలో ఐదు శాతానికి పరిపాలనా వ్యయాన్ని పరిమితం చేయడంలో బోర్డు విఫలమైంది.

బోర్డు ద్వారా అమలు చేయబడిన పథకాల పునరుద్ధరణ కోసం ఏపీబీఓసీడబ్ల్యూడబ్ల్యూ బోర్డు ప్రభుత్వానికి సూచించిన ప్రత్యుత్తరాన్ని, ప్రభుత్వం ఆమోదించింది.

అయితే 2020-21 నుంచి 2021-22 వరకు భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలకు దూరమయ్యారన్నది వాస్తవం.

### 2.8.2 వార్షిక బడ్జెట్‌ను తయారు చేయడం, ప్రభుత్వానికి వార్షిక నివేదికల సమర్పణ

బోర్డు కార్యదర్శి ప్రతి సంవత్సరం జనవరి 31వ తేదీలోపు, నిధుల బడ్జెట్ అంచనాలను, బోర్డు ముందు సమర్పించాలి, మార్చి 15వ తేదీలోపు బోర్డు బడ్జెట్‌ను ఆమోదిస్తుంది. ప్రస్తుత సంవత్సరానికి ఆమోదించబడిన బడ్జెట్‌కు గానూ, బ్యాంక్ డిపాజిట్లు, సంక్షేమ పథకాలు, పరిపాలన మరియు ఇతర ఉప పద్దులపై చేసిన ఖర్చులతో సహా బోర్డు యొక్క అన్ని స్థిర, చరాస్తుల వివరాలు, ప్రస్తుత సంవత్సరంలో బోర్డు పనితీరుపై వివరణాత్మక పురోగతి నివేదిక, బడ్జెట్‌కు అనుబంధంగా ఉంచుతూ, బోర్డు ముందు ప్రవేశపెట్టాలి. ఆ తర్వాత, బడ్జెట్ కాపీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపవలసి ఉంటుంది.

దస్త్రాల పరిశీలనలో క్రింది విషయాలు వెల్లడయ్యాయి:

(ఎ) 2017-18 మరియు 2018-19 కాలానికి రూపొందించిన వార్షిక బడ్జెట్‌లను బోర్డు ఆమోదించింది. 2019-22 కాలానికి బడ్జెట్ తయారు చేయలేదు.

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ వల్ల బోర్డును తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు మార్చడం మరియు కోవిడ్-19 మహమ్మారి కారణంగా 2019-20 నుండి 2021-22 వరకు గల కాలానికి బడ్జెట్‌లు తయారు చేయలేదని శాఖ పేర్కొంది(2024 ఫిబ్రవరి).

ఏపీబీఓసీడబ్ల్యూ నియమాలు 1999లో సూచించిన విధంగా వార్షిక ప్రాతిపదికన కాకుండా 2019-22 కాలానికి సంబంధించి బడ్జెట్ గణాంకాలను బోర్డు 2023లో గతానికి వర్తించే విధంగా తయారు చేసినట్లు ఆడిట్ గుర్తించింది.

(బి) బోర్డు కార్యదర్శి, ఆర్థిక సంవత్సరంలో బోర్డు యొక్క అన్ని సంక్షేమ మరియు ఇతర కార్యకలాపాలను వివరిస్తూ ఒక వివరణాత్మక వార్షిక నివేదికను సిద్ధం చేస్తూ, ఆడిటర్ రిపోర్ట్ మరియు బ్యాలెన్స్ షీట్‌తో పాటుగా తదుపరి ఆర్థిక సంవత్సరం జూలై 15కి ముందు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించాలి.

చార్టర్డ్ అకౌంటెంట్ అంతర్గత తనిఖీ 2023 మే లో మాత్రమే నిర్వహించబడినందున, 2017-18 నుండి 2021-22 వరకు ఆర్థిక సంవత్సరంలో బోర్డు యొక్క అన్ని సంక్షేమ మరియు ఇతర కార్యకలాపాలను ప్రముఖంగా ప్రకటించే వార్షిక నివేదికలు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించబడలేదని ఆడిట్ గమనించింది.

ఆ విధంగా, కార్మికుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలనైనా సూచించడానికి బోర్డు వార్షిక కార్యకలాపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురాలేదు.

(సి) భవన మరియు ఇతర నిర్మాణ పనుల సంస్థల నుండి స్వీకరించబడిన సెస్సు (ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర రంగాల నుండి), నమోదు రుసుము, సభ్యుల సభ్యత్వ రుసుము, ఫిక్స్‌డ్ డిపాజిట్ రసీదులపై వడ్డీ మొదలైనవి నిధుల మూలాలు. 2017-22 కాలంలో సంక్షేమ పథకాల అమలుకు నిధుల కేటాయింపు, విడుదల మరియు వ్యయం **పట్టిక 2.3** లో సూచించినట్లు, **పటం 2.3** లో ధోరణి వర్ణించబడింది.

**పట్టిక 2.3: సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు, విడుదల, వ్యయం**

*(₹ కోట్లలో)*

| సంవత్సరం | కేటాయించబడిన బడ్జెట్ | జిల్లా కార్యాలయాలకు విడుదల చేయబడిన బడ్జెట్ | అయిన వ్యయం | అధికం (-) /ఆదా (+) |
|---|---|---|---|---|
| 2017-18 | 53.45 | 53.45 | 79.87 | (-) 26.42 |
| 2018-19 | 51.57 | 51.57 | 60.69 | (-)9.12 |
| 2019-20 | 18.74 | 18.74 | 22.50 | (-)3.76 |
| 2020-21 | 5.79 | 5.79 | 3.31 | 2.48 |
| 2021-22 | 2.88 | 2.88 | 2.85 | 0.03 |
| మొత్తం | **132.43** | **132.43** | **169.22** | |

*(**మూలం**: శాఖ అందచేసిన సమాచారం)*

*# ఎస్ఎఫ్ఏఆర్‌లో ముందుగా ఆడిట్ చేయబడిన గణాంకాలు స్వీకరించినందున, 2022తో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర ఆర్థిక ఆడిట్ నివేదిక (ఎస్ఎఫ్ఏఆర్) గణాంకాలు భిన్నంగా ఉన్నాయి.*

**పటం 2.3: సంక్షేమ పథకాల బడ్జెట్ మరియు వ్యయం**




2017-20 మధ్య కాలంలో సంక్షేమ పథకాలకు, బడ్జెట్ కేటాయింపులకు మించి ఖర్చు చేసినట్లు పై వాటిని బట్టి తెలుస్తుంది. 2017-18లో అందించిన నిధుల కంటే దాదాపు 50 శాతం అధిక వ్యయం జరిగింది. అదేవిధంగా, 2018-19లో విడుదల చేసిన నిధుల కంటే దాదాపు 17 శాతం అదనపు వ్యయం జరిగింది.

2018-21లో బోర్డు ఉనికిలో లేదని, ఆ కాలానికి సంబంధించిన ఖాతాలు పూర్తయ్యాయని, బోర్డు ఖాతాలను ఆమోదించిందని లేబర్ కమీషనర్ ముగింపు సమావేశంలో తెలియచేశారు (2024 ఫిబ్రవరి).

### 2.8.3 బోర్డు ఖాతాల తనిఖీ

ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల నియమాలు, 1999లోని సెక్షన్ 33 (సి)(8) ప్రకారం, బోర్డు ఖాతాలు, ఇతర సంబంధిత రికార్డులను సరైన రీతిలో నిర్వహించాలి. ఆస్తి అప్పుల పట్టీతో సహా ఆదాయ వ్యయాల ఖాతాలు, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్‌తో సంప్రదింపులు జరుపుతూ, ప్రభుత్వం తెలియజేసిన రూపంలో

ఖాతాల వార్షిక స్టేట్‌మెంట్‌ను సిద్ధం చేయాలి. ఇంకా, బోర్డ్ నిధి ఖాతాలను బోర్డు కార్యదర్శి నిర్వహించాలి, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ఆడిట్ చేయాలి.

ఖాతాల వార్షిక స్టేట్‌మెంట్‌ను సిద్ధం చేయడానికి అవసరమైన నగదు పుస్తకం మరియు నగదు ఫ్లో స్టేట్‌మెంట్‌లను బోర్డు నిర్వహించడం లేదని ఆడిట్ గుర్తించింది. బ్యాంకుతో నగదు నిల్వల సమన్వయం కూడా బోర్డు చేయలేదు.

చార్టర్డ్ అకౌంటెంట్ అంతర్గత తనిఖీ 2023 మే లో మాత్రమే నిర్వహించబడినందున, 2017-18 నుండి 2021-22 వరకు ఆర్థిక సంవత్సరంలో బోర్డు యొక్క అన్ని సంక్షేమ మరియు ఇతర కార్యకలాపాలను ప్రముఖంగా ప్రకటించే వార్షిక నివేదికలు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించబడలేదు.

నగదు పుస్తకాలు, రసీదులు, బ్యాంక్ ఖాతాల సమన్వయంతో సహా ఖర్చుల స్టేట్‌మెంట్‌లు పూర్తయ్యాయనీ, 2014-15 నుండి 2022-23 సంవత్సరాలకు సంబంధించిన తుది ఖాతాలు తయారు చేయబడి, ఆడిట్ కోసం సమర్పించబడ్డాయనీ ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది(2024 మే 15).

ఇంకా, వార్షిక ఖాతాలను సకాలంలో సిద్ధం చేసి, నిర్వహించి, ఆడిట్ చేయనందున, లోపాలు మరియు మోసాలను నిరోధించడానికి, గుర్తించడానికి మరియు సంబంధిత అకౌంటింగ్ సంవత్సరం చివరిలో బోర్డు యొక్క ఆర్థిక స్థితిని తెలుసుకోవడం సాధ్యం కాదు.

***సిఫార్సు 2.3: అవసరమైన లోటుపాట్లను సరిచూసుకుని, నిర్దిష్ట సమయానికి వార్షిక ఖాతాలను సకాలంలో తయారు చేసేటట్లు బోర్డు నిర్ధారించుకోవాలి.***

### 2.8.4 వ్యక్తిగత డిపాజిట్ ఖాతాల నిర్వహణ

బోర్డ్ యొక్క కార్యదర్శి & ప్రధాన కార్య నిర్వహణాధికారి కార్మిక సెస్సు జమ కోసం నిర్దేశించిన వ్యక్తిగత డిపాజిట్ (పీడీ) ఖాతాను నిర్వహిస్తారు. ఏజెన్సీల పని బిల్లుల నుండి మినహాయింపుగా వసూలు చేసిన సెస్సు, హెడ్ ఆఫ్ అకౌంట్ 8443-00-116-01-09-001-001 ఖాతాకి జమ చేయబడుతుంది.

ఈ పద్దుకు అనుబంధ నగదు పుస్తకాలను బోర్డు నిర్వహించలేదని గమనించడమైనది. అందువల్ల, ఖాతాకు జమలు, చెల్లింపుదారుడి వివరాల గురించి బోర్డుకు తెలియడంలేదు. చెల్లింపుదారుల వివరాలను నమోదు చేయడానికి ఎటువంటి జవాబుదారీ వ్యవస్థ లేకపోవడంతో, వసూలు చేసిన సెస్సు మూలాన్ని బోర్డు గుర్తించలేకపోతున్నది.

పనులు చేపట్టే శాఖల [23] వర్క్ బిల్లుల నుండి మినహాయించి వసూలు చేసిన కార్మిక సెస్సు పీడీ ఖాతాలో జమ చేయబడుతుందని బోర్డు సమాధానం ఇచ్చింది(2023 జనవరి). పీడీ ఖాతా స్టేట్‌మెంట్‌లో, బిల్లు నంబర్ మాత్రమే పేర్కొనబడుతుంది, శాఖల వారీగా సెస్సు వసూలు నివేదికను వేరు చేసి అందించడం సాధ్యం కాదు. సంస్థలు/యజమానులు/సెస్సు వసూలు చేసే అధికారులు జమ చేసిన సెస్సు రాబడిని బోర్డు స్వీకరించినప్పటికీ, సంబంధిత సంస్థలు/యజమానులు/ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులు, బోర్డుతో సక్రమంగా నమోదు చేయబడ్డారని నిర్ధారించే ఉద్దేశ్యంతో, ఈ సెస్సు రాబడి ఏ భవన మరియు ఇతర నిర్మాణ పనుల నుండి వచ్చిందో గుర్తించడానికి, సెస్సు జమ చేసే అధికారులతో రాబడిని సరిపోల్చలేదు.

బోర్డు యొక్క ఆడిట్ చేయబడిన ఖాతాల ప్రకారం పీడీ ఖాతా నిల్వలు, దిగువ **పట్టిక 2.4** లో పేర్కొన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలతో గణనీయమైన వ్యత్యాసాలు కలిగి ఉన్నాయని ఆడిట్ గుర్తించింది.

[23] ఆర్ & బీ, పంచాయతీరాజ్, నీటిపారుదల, సీడీఎంఏ, సీఆర్డీఏ

**పట్టిక 2.4: పీడీ ఖాతాల నిల్వలలో వ్యత్యాసాలు**

*(₹ కోట్లలో)*

| సంవత్సరం | ప్రభుత్వ ఖాతాల ప్రకారం పీడీ ఖాతా ముగింపు నిల్వ | బోర్డు వార్షిక ఖాతాల ప్రకారం పీడీ ఖాతా ముగింపు నిల్వ | వ్యత్యాసం |
|---|---|---|---|
| 2017-18 | 272.94 | 67.72 | 205.22 |
| 2018-19 | 237.10 | 67.72 | 169.38 |
| 2019-20 | 288.72 | 275.72 | 13.00 |
| 2020-21 | 372.04 | 343.37 | 28.67 |
| 2021-22 | 479.73 | 434.85 | 44.88 |

*(మూలం: ప్రభుత్వ ఖాతాలు, శాఖాపరమైన దస్త్రాలు)*

2017-18 నుండి 2021-22 మధ్య కాలంలో బోర్డు మారియు ప్రభుత్వ వార్షిక ఖాతా లెక్కల ప్రకారం, పీడీ ఖాతాలలో వ్యత్యాసాలు ₹13 కోట్ల నుండి ₹205.22 కోట్ల వరకు ఉన్నాయి. బోర్డు యొక్క ఖాతాల ప్రకారం పీడీ ఖాతాలలో తక్కువ నిల్వలు ఉండటానికి గల కారణాలను సరిపోల్చాల్సిన అవసరం ఉంది. సెస్సు మొత్తం, వసూలు చేయవలసిన సెస్సు, వాస్తవంగా వసూలు చేసిన సెస్సు మూలాన్ని నిర్ధారించడానికి బోర్డు ఒక యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలి.

ఈ విధంగా, చెల్లింపుదారుల వివరాలను నిర్వహించకపోవడం వల్ల చేసిన పని ఖర్చు, చేపట్టిన నిర్మాణాల వ్యయంతో సహా వసూలు చేయదగిన సెస్, వసూలు మొత్తం మరియు పెండింగ్‌లో ఉన్న బాకీలను బోర్డు తెలుసుకోలేక పోతుంది. ఇంకా, పీడీ ఖాతాల నిర్వహణకు జవాబుదారీతనం లేనప్పుడు, ఈ నిధులను మోసం మరియు/లేదా దుర్వినియోగం చేసే అవకాశాన్ని తోసిపుచ్చలేము.

బోర్డు యొక్క పీడీ ఖాతాకు జమ చేయబడిన రాబడికి సంబంధించి, సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సీఎఫ్ఎమ్ఎస్) లో ఖాతా స్టేట్‌మెంట్ అందుబాటులో ఉందని, పీడీ ఖాతాకు శాఖల వారీగా సెస్సు చెల్లింపులు సీఎఫ్ఎమ్ఎస్‌లో అందుబాటులో లేవని బోర్డు ఇచ్చిన సమాధానాన్ని ప్రభుత్వం ఆమోదించింది (2024 మే 15). ఇంకా, వాస్తవ ప్రాతిపదికన లావాదేవీల పూర్తి వివరాలను పొందడానికి ఏపీబీఓసీడబ్ల్యూడబ్ల్యూబీతో సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థల ఏకీకరణ కోసం బోర్డు ప్రతిపాదించిందని, ఇది సెస్సు చెల్లించబడిన మూలాన్ని గుర్తిస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

### 2.8.5 ఆమోదించిన నిర్మాణ ప్రణాళికలపై విధించబడని లేదా తక్కువగా విధించిన సెస్సు

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్సు చట్టం, 1996 (1996 లోని చట్టం 28)లోని సెక్షన్ 9 ప్రకారం, సెక్షన్ 3 ప్రకారం చెల్లించాల్సిన సెస్సు మొత్తాన్ని సెక్షన్ 5 కింద చేసిన అంచనాలో పేర్కొన్న తేదీలోపు యజమాని చెల్లించకపోతే, అది బకాయిగా ఉన్నట్లు భావించి, ఈ విషయంలో నిర్దేశించిన అధికారి, తగిన విచారణ చేసిన తర్వాత, అటువంటి యజమానిపై సెస్సు మొత్తానికి మించకుండా అపరాధ రుసుమును విధించవచ్చు.

సెస్సు చట్టంలోని సెక్షన్ 3 (1) ప్రకారం, గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎమ్‌సీ)లో, ఒక సందర్భంలో (2017) భవన ప్రణాళికను ఆమోదించేటప్పుడు, నిర్మాణ వ్యయం ₹53.94 కోట్లు కాగా, వసూలు చేయదగ్గ సెస్సు ఒక శాతం అనగా ₹53.94 లక్షలు మరియు దానిపై వడ్డీ గానీ జరిమానా గానీ విధించలేదని గమనించడమైనది.

ఇంకా, 2017-22లో ఐదు భవన ప్రణాళికల అనుమతులకు సంబంధించి ₹3.61 కోట్ల సెస్సు (సెస్సు వసూలు చేయదగినది: ₹4.60 కోట్లు—సెస్సు వసూలు చేసినది: ₹0.99 కోట్లు) తక్కువగా వసూలు చేసినట్లు కూడా గమనించబడింది.

పిఠాపురం పురపాలకసంస్థ, 2017-22లో, ₹9.05 కోట్ల విలువ కల 177 పనుల బిల్లులకు సంబంధించి, ఒక శాతం చొప్పున ₹9.05 లక్షల సెస్సు మినహాయించలేదని గమనించడమైనది.

అదే విధంగా, మచ్చుకు తనిఖీ చేసిన రెండు[24] పట్టణ స్థానిక సంస్థల్లో ₹4.24 కోట్ల సెస్సు వసూలు చేయని మరియు తక్కువ వసూలు చేసిన సందర్భాలు ఉన్నాయి.

కార్మిక సెస్సు వసూలుపై ప్రణాళికలను ఆమోదించే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 మే 15). ఇంకా ప్రభుత్వం పని బిల్లులకు సంబంధించి, నిర్ణీత శాతంలో కార్మిక సెస్సును ఖచ్చితంగా వసూలు చేయాలని, బోర్డుకు ఎలాంటి జాప్యం లేకుండా చెల్లింపులు జరపాలని సంబంధిత బిల్లు పాసింగ్ అధికారులను అభ్యర్థించినట్లు పేర్కొంది.

### 2.8.6 పని బిల్లులపై తక్కువగా విధించబడిన కార్మిక సెస్సు

మచ్చుకు తనిఖీ చేసిన ఆరు ఇంజినీరింగ్ విభాగాలు మరియు జీవీఎమ్‌సీ యొక్క యూనిట్లలో, 2017–18 నుండి 2021–22 మధ్య కాలంలో **పట్టిక 2.5** లో ఇవ్వబడిన విధంగా 38 పని బిల్లులలో తక్కువ సెస్సు వసూలు చేశారని గమనించడమైనది.

**పట్టిక 2.5: ఇంజనీరింగ్ విభాగాలు, జీవీఎమ్‌సీలలో తక్కువగా వసూలు చేయబడిన కార్మిక సెస్సు**

| క్రమ సంఖ్య | మచ్చుకు తనిఖీ చేయబడిన కార్యాలయం పేరు | పనులు/భవన ప్రణాళికల సంఖ్య | వసూలు చేయవలసిన సెస్సు (₹) | వసూలు చేసిన సెస్సు (₹) | తక్కువగా చేసిన వసూలు (₹) |
|---|---|---|---|---|---|
| 1 | ఈఈ, పిఐపిఎల్ఎంసి, తుని | 2 పనులు | 14,36,011 | 12,68,442 | 1,67,569 |
| 2 | ఈఈ, ఆర్ & బీ, కాకినాడ | 6 పనులు | 42,08,789 | 40,69,825 | 1,38,964 |
| 3 | ఈఈ, పిఐపిఎల్ఎంసి, యలమంచిలి | 4 పనులు | 39,65,830 | 36,14,608 | 3,51,222 |
| 4 | ఈఈ, పిఐపిఆర్ఎంసి, కొవ్వూరు | 1 పని | 2,21,865 | 2,04,905 | 16,960 |
| 5 | ఈఈ, పిఐపిహెచ్‌డబ్ల్యూ డివిజన్ –I, పోలవరం | 3 పనులు | 48,99,43,793 | 47,57,44,546 | 1,41,99,247 |
| 6 | యూఎల్బీ, విశాఖపట్నం | 21 పనులు | 14,27,519 | 13,69,714 | 57,805 |
| 7 | ఈఈ, ఆర్ & బీ, మర్రిపాలెం, వైజాగ్ | 1 పని | 9,51,667 | 9,24,601 | 27,066 |
| | **మొత్తం** | **38** | **50,21,55,474** | **48,71,96,641** | **1,49,58,833** |

***మూలం**: శాఖాపరమైన దస్త్రాలు*

ఈ విధంగా, వసూలు చేయవలసిన ₹50.22 కోట్లలో కేవలం ₹48.72 కోట్లు మాత్రమే వసూలయ్యాయి, ఫలితంగా కార్మిక సెస్సు ₹1.50 కోట్లు తక్కువగా వసూలు చేయబడింది.

మచ్చుకు తనిఖీ చేసిన ఇంజినీరింగ్ విభాగాలు, తక్కువగా వసూలు చేసిన మొత్తాన్ని, భవిష్యత్ పని బిల్లులలో వసూలు చేస్తామని సమాధానం ఇవ్వగా, జీవీఎమ్‌సీ మాత్రం సమాధానం ఇవ్వలేదు.

సీఎఫ్ఎంఎస్ ద్వారా ఆమోదం పొందిన పని బిల్లులను పనుల డివిజన్‌ల పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్లు; నాన్–సీఎఫ్ఎంఎస్/నాన్–పీఏఓ బిల్లులను సంబంధిత ఏజెన్సీలు; పరీక్షల నియంత్రణాధికార్లు, స్థానిక సంస్థల ఆర్థిక అధికార్లను రాష్ట్ర ఆడిట్ సంచాలకులు పర్యవేక్షించవచ్చని బోర్డు ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. తమ వైపు చర్యను పేర్కొనకుండా ప్రభుత్వం అదే సమాధానాన్ని ఆమోదించింది.

### 2.8.7 పురపాలక పరిపాలన కమీషనర్ మరియు సంచాలకులచే సేకరించబడిన సెస్సు చెల్లింపు

సెస్సు చట్టంలోని సెక్షన్ 3(3) ప్రకారం, ఉప–సెక్షన్ 2 కింద సేకరించిన సెస్సు ఆదాయాన్ని స్థానిక అధికార సంస్థ లేదా రాష్ట్ర ప్రభుత్వం సెస్సును వసూలు చేసి, సేకరణకు ఐన ఖర్చుగా, సేకరించిన మొత్తంలో ఒక శాతానికి మించకుండా మినహాయించి బోర్డుకు చెల్లించాలి.

2017–18 నుండి 2021–22 మధ్య కాలంలో, **పట్టిక 2.6** లో ఇవ్వబడినట్లు మరియు **పటం 2.4** లో వర్ణించబడినట్లు, కమీషనర్ మరియు పురపాలక పరిపాలన సంచాలకులు (సీడీఎంఏ), మొత్తం రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల

[24] జీవీఎమ్‌సీ, పిఠాపురం పురపాలకసంస్థ

(యూఎల్‌బీలు) అధికార పరిధిలో జరిగిన భవన నిర్మాణాలపై సెస్సు (భవన అనుమతి రుసుములో భాగంగా) ₹466.11 కోట్లు[25] వసూలు చేశారు.

**పట్టిక 2.6: యూఎల్‌బీలచే వసూలు చేయబడిన మరియు చెల్లించబడిన సెస్సులను సూచించే పట్టిక**

*(₹ కోట్లలో)*

| సంవత్సరం | సేకరించిన కార్మిక సెస్సు | బోర్డుకు చెల్లించవలసిన 99% సెస్సు | బోర్డుకు చెల్లించిన సెస్సు | వ్యత్యాసం (2)-(3) | నిలిపి ఉంచుకోగల 1% సెస్సు (1) x 1/100 | సీడీఎంఏ నిలిపి ఉంచుకున్న సెస్సు | వ్యత్యాసం (6)-(5) |
|---|---|---|---|---|---|---|---|
| | (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) |
| 2017-18 | 59.33 | 58.73 | 6.87 | 51.86 | 0.59 | 1.19 | 0.60 |
| 2018-19 | 101.25 | 100.24 | 8.67 | 91.57 | 1.01 | 2.03 | 1.02 |
| 2019-20 | 88.33 | 87.45 | 41.16 | 46.29 | 0.88 | 1.87 | 0.99 |
| 2020-21 | 87.48 | 86.61 | 85.69 | 0.92 | 0.87 | 1.79 | 0.92 |
| 2021-22 | 129.72 | 128.42 | 127.11 | 1.31 | 1.30 | 2.61 | 1.31 |
| మొత్తం | **466.11** | **461.45** | **269.50** | **191.95** | **4.65** | **9.49** | **4.84** |

***మూలం**: శాఖాపరమైన దస్త్రాలు*

**పటం 2.4: యూఎల్‌బీలచే సేకరించబడిన మరియు చెల్లించబడిన సెస్సు**




ఆడిట్ క్రింది విషయాలను గమనించింది :

(i) సెస్సు చట్టం ప్రకారం, సెస్సు వసూలుకైన ఖర్చు, వసూలు చేసిన సెస్సులో ఒక శాతానికి మించరాదు.

అయితే, భవన నిర్మాణ ప్రణాళికల ఆమోదాలు మరియు పని బిల్లుల ఖర్చుపై, చట్టంలోని నిబంధనల ప్రకారం ఒక శాతానికి బదులుగా రెండు శాతం చొప్పున పరిపాలనా రుసుముల వసూలు కోసం సీడీఎంఏతో బోర్డు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది (2018 డిసెంబర్).

ఆ విధంగా, చట్ట నిబంధనలకు విరుద్ధంగా సీడీఎంఏతో బోర్డు ఒప్పందం కుదుర్చుకుంది.

(ii) మొత్తం సెస్సు (₹466.11 కోట్లు) లో ఒక శాతం అంటే ₹4.66 కోట్లకు బదులుగా, సీడీఎంఏ ₹9.49 కోట్లు అంటే 2.04 శాతం సెస్సు వసూళ్లకు సంబంధించి వసూలు/పరిపాలనా రుసుములను నిలిపి ఉంచుకోవటాన్ని పై పట్టిక నుండి చూడవచ్చు. ఈ విధంగా, 2017-22లో పరిపాలనా రుసుములు ₹4.84 కోట్ల అదనపు వసూళ్లు జరిగాయి.

25 సేకరించిన సెస్సు ₹466.11 కోట్లు – చెల్లించినది ₹269.50 కోట్లు = మిగిల్చిన నిల్వ ₹196.61 కోట్లు (సెస్సు కొరకు ₹187.12 కోట్లు + రుసుముల కొరకు ₹9.49 కోట్లు). మిగులు చెల్లించాలి.

ఇంకా, సీడీఎంఏ ₹461.45 కోట్ల (₹466.11 కోట్లలో 99 శాతం) సెస్సు మొత్తాన్ని బదిలీ చేయలేదు మరియు కేవలం ₹269.50 కోట్లను మాత్రమే బోర్డుకు బదిలీ చేసింది, మిగిలిన ₹191.95 కోట్లను తన వద్దనే ఉంచుకుంది.

సీడీఎంఏ నిలుపుకున్న సెస్సు బకాయిలు మరియు అదనపు సెస్సును తిరిగి పొందడానికి చేసిన ప్రయత్నాలకు మద్దతుగా సంబంధించిన రికార్డులను బోర్డు సమర్పించలేదు.

ముగింపు సమావేశం సందర్భంగా, పరిశీలనను సీడీఎంఏ దృష్టికి తీసుకువెళ్లామని మరియు ప్రతిస్పందన కోసం వేచి ఉన్నామని, లేబర్ కమీషనర్ పేర్కొన్నారు.

సెస్సు చట్టం, సెస్సు వసూలు ఖర్చును సేకరించిన సెస్సులో ఒక శాతానికి మించకుండా అనుమతిస్తుంది. అయితే, 2017-22లో కార్మిక శాఖ, పురపాలక పరిపాలనా శాఖను, రెండు శాతం చొప్పున వసూలు ఖర్చును నిలిపి ఉంచుకోవడానికి అనుమతించినందున, ₹4.84 కోట్ల నష్టం వాటిల్లింది.

ఏపీబీఓసీడబ్ల్యూడబ్ల్యూబీకి పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే బదిలీ చేయాలని అభ్యర్థిస్తూ సీడీఎంఏకు బోర్డు లేఖ పంపిందని, మూలం వద్ద సెస్సు మినహాయించబడిన వివరాలను పొందడానికి, తమ వద్ద ఉన్న సెస్సును యూఎల్‌బీలు చెల్లించడానికి సంబంధిత పట్టణ స్థానిక సంస్థలను (యూఎల్‌బీ) సంప్రదించాలని ఫీల్డు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని బోర్డు ఇచ్చిన సమాధానాన్ని ప్రభుత్వం ఆమోదించింది. ఇంకా, సీడీఎంఏ ద్వారా చట్ట ప్రకారం ఒక శాతం వాస్తవ నిబంధనకు విరుద్ధంగా, పరిపాలనా రుసుముల కోసం ఉంచబడిన సెస్సు వసూలులో రెండు శాతంగా ఉన్న ₹9.49 కోట్లకు సంబంధించి, అవగాహనా ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించిందనీ, సెస్సు రుసుముల రూపంలో వసూలు చేసిన సెస్సులో ఒక శాతం మాత్రమే సీడీఎంఏ మినహాయించుకునేలా అనుమతినిస్తూ, అవగాహనా ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్న విషయాన్ని తెలియచేస్తూ ఒక లేఖ పంపామనీ, పరిపాలనా రుసుములుగా తమ వద్ద ఎక్కువగా ఉంచుకున్న మొత్తాన్ని బోర్డుకు చెల్లించవలసినదిగా అభ్యర్థించామని తెలియచేసింది.

ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా, అంటే 2017-22లో ₹4.84 కోట్ల పరిపాలనా రుసుముల అదనపు వసూళ్ల చెల్లింపు జరగాల్సి ఉంది.

***సిఫార్సు 2.4: సంబంధిత శాఖలచే వసూలు చేయబడిన సెస్సు సరిగా లెక్కించబడిందనీ, బోర్డు ఖాతాలకు బదిలీ చేయబడిందనీ నిర్ధారించే వ్యవస్థను బోర్డు రూపొందించాలి .***

### 2.8.8 ఫిక్సెడ్ డిపాజిట్లు

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ప్రకారం, IX షెడ్యూల్ (ప్రభుత్వ కంపెనీలు, సంస్థల జాబితా) లో కానీ లేదా X షెడ్యూల్ (శిక్షణ సంస్థలు/కేంద్రాల జాబితా) లో కానీ, బోర్డు చేర్చబడలేదు. అయితే, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 52 బోర్డు నిధులను, విభజించబడిన రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వారి జనాభాల ప్రాతిపదికన, వరుసగా 58.32 శాతం, 41.68 శాతం చొప్పున పంచబడాలని నిర్దేశిస్తుంది.

పునర్వ్యవస్థీకరణ జరిగిన తరువాత, రెండు రాష్ట్రాల మధ్య పంచడానికి ₹976.77 కోట్ల ఫిక్సెడ్ డిపాజిట్ రసీదులు (ఎఫ్‌డీఆర్) విభజనకు ముందు ఉన్న బోర్డు వద్దే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ బోర్డు వాటా ₹569.65 కోట్లు, తెలంగాణా బోర్డు వాటా ₹407.11 కోట్లుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ బోర్డు, ₹569.65 కోట్లలో, ₹244.59 కోట్లు ఉపసంహరించుకుంది. తదనంతరం, 2018 అక్టోబర్‌లో, ఏపీ మరియు తెలంగాణ బోర్డులకు సంబంధించిన ₹325.06 కోట్లు మరియు ₹405.94 కోట్ల ఎఫ్‌డీఆర్‌ల యొక్క డెబిట్ లావాదేవీలను తెలంగాణ బోర్డు స్తంభింపజేసింది, ఫలితంగా వాణిజ్య బ్యాంకుల్లో నిధులు లాక్ చేయబడ్డాయి. ఫలితంగా, రెండు రాష్ట్రాల్లోని భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉద్దేశించిన నిధులు ఎటువంటి పరిష్కారం లేకుండా బ్యాంకుల్లో నిలిచిపోయాయి.

2014లో తెలంగాణ బోర్డు, బోర్డు ఎఫ్‌డీలను స్తంభింపజేయాలని అన్ని బ్యాంకులకు లేఖ రాసిందని, నిధుల విభజనపై రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర అంగీకారానికి వచ్చి, ఎఫ్‌డీలను విడుదల చేయమనే అభ్యర్థనతో బ్యాంకులను సంప్రదించిన తర్వాత మాత్రమే ఎఫ్‌డీలు విడుదల చేయాలని బోర్డు పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ, రెండు రాష్ట్రాల భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుల ద్వారా ఆస్తులను పంచుకోవడానికి అవసరమైన చర్యలు పురోగతిలో ఉన్నాయని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది.

## 2.9 సంస్థల్లో భద్రత మరియు సంక్షేమ చర్యలను అందించడం

ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల నియమాలు, 1999 లోని 34 నుండి 37 వరకు ఉన్న సెక్షన్ల ప్రకారం, పని చేయించుకునే సంస్థలు/గుత్తేదారు, పని ప్రదేశంలో క్యాంటీన్‌లు, ప్రథమ చికిత్స సౌకర్యాలు, అంబులెన్స్, కార్మికులకు గృహ వసతి వంటి భద్రత మరియు ఇతర సంక్షేమ చర్యలను అందించాలి. అలానే కార్మిక శాఖ యొక్క నమోదు చేసే అధికారి నుండి నమోదు ప్రమాణ పత్రాన్ని పొందవలసి ఉంటుంది. పనుల ఒప్పందాల షరతుల ప్రకారం, గుత్తేదారు, పని చేసే ప్రదేశంలో నియమించిన వివిధ వర్గాల కార్మికుల సంఖ్య, ఎప్పటికప్పుడు, అవసరమైన విధంగా ఇతర సమాచారాన్ని ఇంజనీర్-ఇన్-ఛార్జ్ (ఈఈ) కి సమర్పించాలి.

అయితే, మచ్చుకు తనిఖీ చేసిన పనుల విభాగాలలోని[26] ఇంజనీర్-ఇన్-ఛార్జ్‌లు, తాము భౌతికంగా పరిశీలించి, పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నప్పటికీ, కాంట్రాక్టర్లు కార్మికుల నమోదు మరియు భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల కోసం తీసుకున్న భద్రత/సంక్షేమ చర్యలకు సంబంధించిన నివేదికలను సమర్పించలేదని పేర్కొన్నారు. సంస్థల నమోదు, వాటి కార్మికులు, భద్రత, సంక్షేమ చర్యలు చేపట్టడం వంటి అంశాలను కార్మిక శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని ఇంజనీర్-ఇన్-ఛార్జ్‌లు తెలిపారు.

ఈ విధంగా కార్మిక శాఖ అధికారులు పని ప్రదేశాలను సందర్శించకపోవడం మరియు గుత్తేదార్లు ఇంజనీర్-ఇన్-ఛార్జ్‌కి గానీ, ఉప లేబర్ కమీషనర్‌కు గానీ నివేదికలు సమర్పించకపోవడంతో భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు తగిన భద్రత, సంక్షేమ చర్యలు అందకుండా పోయే ప్రమాదం ఏర్పడింది.

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల భద్రత మరియు ఆరోగ్యాన్ని నిర్ధారించే బాధ్యత యజమాని అంటే పని చేయించుకునే వారు లేదా గుత్తేదారుపై ఉందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. నియమ నిబంధనల అమలు యజమాని యొక్క బాధ్యతగా ఉంటాయి. శాఖకు చెందిన తనిఖీ అధికారులు[27] ఎప్పటికప్పుడు నిర్మాణ సంస్థలను సందర్శించి, భవన నిర్మాణ కార్మికులకు భద్రత, ఆరోగ్యం మరియు సంక్షేమ చర్యలు అందేలా చూస్తారని ప్రభుత్వం పేర్కొంది.

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు భద్రత, ఆరోగ్యం మరియు సంక్షేమ చర్యలను అందించడానికి సహాయ కార్మికాధికార్లు, సహాయ లేబర్ కమీషనర్లు, ఉప లేబర్ కమీషనర్లు, సంయుక్త లేబర్ కమీషనర్లు, అదనపు లేబర్ కమీషనర్లు, లేబర్ కమీషనర్లు బాధ్యత వహించాలనే ప్రభుత్వ ఉత్తర్వుల[28] దృష్ట్యా, యజమాని/గుత్తేదారు బాధ్యత వహించాలన్న శాఖ యొక్క సమాధానం ఆమోదయోగ్యం కాదు.

## 2.10 తనిఖీల నిర్వహణ

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం (2016 ఫిబ్రవరి, 2016 మే) [29], సంస్థల భౌతిక తనిఖీలు అవసరమైతే కోర్టులు/ప్రభుత్వ ఆదేశాలు లేదా లేబర్ కమీషనర్ యొక్క నిర్దిష్ట వ్రాతపూర్వక సూచనల మేరకు మాత్రమే నిర్వహించబడతాయి. ఇంకా

26 ఇంజినీరింగ్ విభాగాలు (ఆర్ & బీ గుంటూరు, తెనాలి, కాకినాడ, మర్రిపాలెం (విశాఖపట్నం), పోలవరం నీటిపారుదల పథకం @ తుని, కొవ్వూరు, పోలవరం, యలమంచిలి)

27 సహాయక కార్మికాధికారి, సహాయక లేబర్ కమీషనర్, ఉప లేబర్ కమీషనర్, సంయుక్త లేబర్ కమీషనర్, అదనపు లేబర్ కమీషనర్, లేబర్ కమీషనర్

28 ఎల్ ఈటీ & ఎఫ్ (ల్యాబ్ - IV) శాఖ జీఓఎమ్ఎస్ సంఖ్య 37, తేదీ 2008 జూన్ 06

29 ఎల్ ఈటీ & ఎఫ్ (ల్యాబ్ - II) శాఖ జీఓఎమ్ఎస్ సంఖ్య 27, తేదీ 2016 మే 31

తనిఖీ అధికారులు ప్రభుత్వ ఉత్తర్వుల (2016[30]) ప్రకారం కంప్యూటర్ ద్వారా కేటాయించిన సంస్థలలో కార్మికుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ పరిశ్రమ ద్వారా చట్టాలను సులభంగా పాటించేలా చూడడానికి రోజువారీగా ఆన్‌లైన్ తనిఖీని చేపట్టాలి. ఆన్‌లైన్ తనిఖీకి సంబంధించిన సమాచారాన్ని శాఖ యొక్క వెబ్ సైట్‌లో ఉంచడం ద్వారా, భౌతిక సందర్శన లేకుండా చట్టబద్ధమైన నిబంధనలను పాటించేలా యజమానికి అవగాహన కల్పించేటట్లు ప్రచారం చేయాలి.

2017-22 ఆడిట్ కాలంలో ఎలాంటి తనిఖీలు జరగలేదని, అందువల్ల వివిధ సంస్థల ద్వారా చట్ట నిబంధనలకు అనుగుణంగా కార్మిక శాఖ/బోర్డు నిర్ధారించలేదని గమనించడమైనది.

తనిఖీలు నిర్వహించకపోవడానికి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈఓడీబీ) విధానంలోని నిబంధనలు కారణమని లేబర్ కమీషనర్ పేర్కొన్నారు, దీనిలో తనిఖీ చేసే అధికారులకు యూనిట్‌లను ఆన్‌లైన్‌లో యాదృచ్ఛికంగా కేటాయించడం ద్వారా తనిఖీలు నిర్వహించబడతాయి, ఆ సాఫ్ట్‌వేర్ కొంతకాలం ఉపయోగించబడింది. 2018-19 తర్వాత పని చేయలేదు. శాఖ యాదృచ్ఛిక ప్రాతిపదికన తనిఖీని సులభతరం చేసే విధానాన్ని అమలులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తుంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశ్రమలు చట్టాలను సులభంగా పాటించేలా కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించేలా తనిఖీ చేసే అధికారులు ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా కేటాయించిన సంస్థలను రోజువారీగా ఆన్‌లైన్ తనిఖీని చేపట్టవలసి ఉంటుంది కాబట్టి ఈ సమాధానం నమ్మదగినది కాదు.

తనిఖీలు నిర్వహించడం ద్వారా సంస్థల్లో సెస్సు చెల్లింపుల ఎగవేతను అరికట్టవచ్చు, ఎటువంటి లోపాలు లేకుండా సెస్సుపై సరైన జవాబుదారీ ఉంటుంది; నిర్మాణ స్థలాలపై మరిన్ని ఎక్కువ తనిఖీలు చేయడం ద్వారా నిర్మాణ కార్మికులను నమోదు చేశారా లేదా అనే దానిపై నేరుగా సమాచారాన్ని కలిగి ఉండటానికి, తగిన చర్య తీసుకోవడానికి శాఖకు వీలు కుదురుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2016 మే 31 నాటి ఎల్ ఈటీ & ఎఫ్ (ల్యాబ్ II) శాఖ యొక్క జీఓఎమ్ఎస్ సంఖ్య 27 ద్వారా తనిఖీల సరళీకరణ, పారదర్శకత మరియు జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి ఆన్‌లైన్ తనిఖీ వ్యవస్థ మరియు ఆన్‌లైన్ తనిఖీ పోర్టల్ ప్రారంభించబడిందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 మే 15). శాఖాధిపతి అనుమతి లేకుండా ఎలాంటి భౌతిక తనిఖీలు నిర్వహించరాదని[31] కార్మిక శాఖ అధికారులను ఆదేశించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఆన్ లైన్ తనిఖీలకు ఎలాంటి ఆంక్షలు లేవని, భౌతిక తనిఖీకి శాఖాధిపతి నుంచి అనుమతి తప్పనిసరి అని ప్రభుత్వం సమాధానమిచ్చింది. అయితే, చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఈ కాలంలో శాఖ ఎలాంటి ఆన్ లైన్ లేదా భౌతిక తనిఖీలు నిర్వహించలేదు.

***సిఫార్సు 2.5: అర్హత గల సంస్థలు/నిర్మాణ పనులన్నింటినీ కార్మిక సెస్సు పరిధిలోకి తీసుకురావడానికి శాఖ క్రమబద్ధ తనిఖీలు చేపట్టాలి.***

## 2.11 సంక్షేమ పథకాల అమలులో నిధుల నిర్వహణ, వినియోగం

### 2.11.1 పథకాల అమలు

రాష్ట్ర ప్రభుత్వం మొదట (2010 నుండి 2018 మధ్య) 14 కార్మిక సంక్షేమ పథకాలను ప్రారంభించింది. ఇందులో కేవలం 10 పథకాలు మాత్రమే అమలు చేయబడుతున్నాయి. కార్మికులు/ఆశ్రితులకు వృత్తి శిక్షణ, జాతీయ పింఛన్ పథకం (ఎన్ పీఎస్-లైట్) 2010 (స్వావలంబన్) అటల్ పెన్షన్ యోజన మరియు వికలాంగ కార్మికులకు కృత్రిమ అవయవాలు, ఇతర ఉపకరణాలను అందించడం వంటి మూడు పథకాలు 2017-22 మధ్య కాలంలో అమలు చేయలేదు.

[30] ఎల్ ఈటీ & ఎఫ్ (ల్యాబ్ - II) శాఖ జీఓఎమ్ఎస్ సంఖ్య 9, తేదీ.2016 ఫిబ్రవరి 27

[31] ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక లేబర్ కమీషనర్, విజయవాడ యొక్క మెమో సంఖ్య ఈఓడీబీ/సూచనలు/2021, తేదీ 2021 జూన్ 22

2017-18 నుండి 2021-22 మధ్య కాలంలో స్వీకరించిన, పరిష్కరించిన, తిరస్కరించిన మరియు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల క్లెయిమ్‌ల సంఖ్యల వివరాలు **పట్టిక** 2.7 లో చూపబడ్డాయి.

**పట్టిక 2.7: సంవత్సరాల వారీగా స్వీకరించిన, పరిష్కరించిన, తిరస్కరించిన మరియు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల క్లెయిమ్‌ల సంఖ్యను చూపే పట్టిక**

| సంవత్సరం | స్వీకరించిన క్లెయిమ్‌ల సంఖ్య | క్లెయిమ్‌ల సంఖ్య | | |
|---|---|---|---|---|
| | | పరిష్కరించినవి | తిరస్కరించినవి | పరిష్కరించవలసినవి (శాతం) |
| 2017-18 | 18,041 | 16,655 | 1,338 | 48 (0.27) |
| 2018-19 | 29,566 | 28,261 | 579 | 726 (2.46) |
| 2019-20 | 20,297 | 9,146 | 1,873 | 9,278 (45.71) |
| 2020-21 | 10,666 | 218 | 1,938 | 8,510 (79.79) |
| 2021-22 | 7,520 | 0 | 0 | 7,520 (100.00) |
| మొత్తం | **86,090** | **54,280** | **5,728** | **26,082** |

***మూలం:*** *శాఖ నుండి అందిన సమాధానం*

అందుకున్న 86,090 క్లెయిమ్‌లలో 26,082 క్లెయిమ్‌లు శాఖ వద్ద పరిష్కరించవలసి ఉన్నాయని గమనించడమైనది. శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ల శాతం 2017-18 నుండి 2021-22 మధ్య కాలంలో 0.26 శాతం నుండి 100 శాతానికి పెరిగింది. ఎగువ పట్టిక వివరాలు పథకాల వారీగా ***అనుబంధం 2.2*** లో చూపబడ్డాయి.

నవరత్నాలు[32] క్రింద ప్రయోజనాల పునరావృతాన్ని నివారించడానికి ప్రభుత్వ పథకాలన్నీ క్రమబద్ధీకరించబడే వరకు బోర్డు సంక్షేమ పథకాలను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, అందువల్ల వివిధ పథకాల కింద వచ్చిన క్లెయిమ్‌లు ప్రక్రియ చేయబడలేదని బోర్డు పేర్కొంది (2024 ఫిబ్రవరి). ఇంకా, మిగిలిన సంక్షేమ పథకాల పునరుద్ధరణ మరియు అమలు కోసం అనుమతిని జారీ చేయాలనే అభ్యర్థనతో బోర్డు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించి, ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వేచి ఉంది.

వైఎస్ఆర్ కళ్యాణమస్తు కింద వివాహ కానుక, వైఎస్ఆర్ బీమా కింద ఉన్న ప్రాణాంతక ప్రమాద పరిహారం, శాశ్వత అంగవైకల్య పరిహారం, సహజ మరణాలు తప్ప నవరత్నాలు కింద కవర్ చేయబడిన పథకాలకు బోర్డు సంక్షేమ పథకాలు సమానం కానందున బోర్డు యొక్క సమాధానం ఆమోదయోగ్యం కాదు. ఇంకా, ఏలూరులోని డీసీఎల్‌లో పెండింగ్‌లో ఉన్న 50 మంది క్లెయిమ్ దరఖాస్తుదారుల ఉమ్మడి టెలిఫోనిక్ సర్వేలో[33], కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా లేదా నవరత్నాలు కింద లబ్ధిదారులకు కార్మిక సంక్షేమ పథకాల ప్రయోజనాలను విస్తరించలేదని ఏకీకృత ప్రతిస్పందన వెల్లడించింది.

ముగింపు సమావేశంలో, లేబర్ కమీషనర్ సమాధానమిస్తూ, పథకాల అమలు కోసం ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామని తెలియచేశారు.

ఆ విధంగా, ప్రభుత్వ ప్రయోజనాల నకలును నివారించాలనే నిర్ణయం నిరుపేద కార్మికులకు సంక్షేమాన్ని నిరాకరించడానికి దారితీసింది.

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల క్లెయిమ్‌లు పూర్తిగా పరిష్కరించబడలేదు మరియు 2017-22లో శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ల శాతం 0.26 నుండి 100కి పెరిగింది, దీని ఫలితంగా అవసరమైన కార్మికులకు బోర్డు సంక్షేమ పథకాల కింద ప్రయోజనం నిరాకరించబడింది

ప్రభుత్వం నిర్దిష్ట సమాధానాన్ని ఇవ్వలేదు.

[32] రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తొమ్మిది సంక్షేమ పథకాలు

[33] శాఖకు చెందిన సిబ్బందితో

### 2.11.2 ప్రభుత్వానికి తిరిగి చెల్లించే ప్రాతిపాదికన ఋణం/అడ్వాన్స్‌గా మంజూరు చేయబడిన సెస్సు మొత్తాలు

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులు మరియు వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రత్యేకంగా పాఠశాలలు, ఆసుపత్రులు, శిక్షణా కేంద్రాలు, కార్మిక షెడ్లు మరియు రాత్రి వసతి గృహాలు, విశ్రాంతి గది, హాస్టళ్లు మొదలైనటువంటి లేదా ఏదైనా ఇతర ప్రయోజనాలను అందించే భవనాల నిర్మాణం కోసం సెస్సు నిధులను ఖర్చు చేయవద్దని గౌరవ సుప్రీంకోర్టు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది (2015 సెప్టెంబర్) [34].

చట్టంలోని సెక్షన్ 22 ప్రకారం, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఏదైనా పథకానికి సహాయంగా బోర్డు స్థానిక అధికార సంస్థకు లేదా యజమానికి ఋణం లేదా సబ్సిడీని మంజూరు చేయవచ్చు. ఇంకా, గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల (2015) దృష్ట్యా, భారత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం[35], వసూలు చేసిన సెస్సు లబ్ధిదారుల సంక్షేమం కోసం మాత్రమే ఉపయోగించాలి.

బోర్డు 2017 ఏప్రిల్ నుండి 2021 జూన్ వరకు ఉనికిలో లేదని ఆడిట్ గుర్తించింది. ఈ కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కాకుండా ఇతర ప్రయోజనాలకు ₹2,332.98 కోట్ల బోర్డు నిధులను వినియోగించింది. ప్రభుత్వం ద్వారా బోర్డుకు తిరిగి చెల్లించే ప్రాతిపాదికన ₹1,256.65 కోట్ల విలువైన కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటాగా, ₹7.01 కోట్ల ప్రచార ఛార్జీల చెల్లింపులుగా, ₹1,069.30 కోట్ల బీమా పాలసీకి ప్రీమియం చెల్లింపు వంటి వివిధ చెల్లింపుల కోసం నిధులు వినియోగించబడ్డాయి. కింద తెలిపిన ఇతర ప్రయోజనాల కోసం కూడా బోర్డు నిధుల వినియోగించబడ్డాయి.

- 2018 నుండి 2021 మధ్య కాలంలో, తిరిగి చెల్లించే ప్రాతిపదికన, మరణించిన అసంఘటిత కార్మికులపై ఆధారపడిన కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎమ్‌జేజేబీవై) కేంద్రీకరణ పథకం కింద విస్తరించబడిన గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) రాష్ట్ర వాటాగా, వైఎస్ఆర్ బీమా కార్డుల ముద్రణ, సహజ, ప్రమాదవశాత్తు మరణించిన కేసుల క్లెయిమ్‌ల చెల్లింపులకు ప్రభుత్వానికి ₹382.72 కోట్లను చెల్లించింది.

  ₹382.72 కోట్లలో, 2021 జూలై నుండి 2022 ఆగస్టు మధ్య ₹95.77 కోట్లు సెర్ప్‌చే బోర్డుకు చెల్లించబడగా, మిగిలిన ₹286.95 కోట్లు ఇంకా తిరిగి చెల్లించవలసి ఉంది.

- చంద్రన్న బీమా పథకం కింద ప్రచార ఖర్చుల నిమిత్తం బీమా కంపెనీలకు (ఎల్ఐసీ/ఓఐసీ) ప్రభుత్వం తరపున ముందస్తు చెల్లింపుగా ₹7.01 కోట్లు ప్రభుత్వానికి జమ చేయబడింది(2016 సెప్టెంబర్).

  ఆరేళ్లు గడిచినా ఆ నిధులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బోర్డుకు జమ చేయలేదు.

- 2022 ఏప్రిల్ నుండి 2022 డిసెంబర్ వరకు, కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు మరియు భీమా వైద్య సేవల (ఎల్ఎఫ్‌బీ & ఐఎమ్ఎస్) శాఖల పరిధిలోకి రాని లబ్ధిదారులకు, వైఎస్ఆర్ బీమా పథకం కింద సహజ మరణ క్లెయిమ్‌లు, సహజ మరణ పరిహార చెల్లింపు కోసం. గ్రామ వార్డు/వార్డు వాలంటీర్లు, గ్రామ/వార్డు కార్యదర్శుల సంచాలకులకు ఇవ్వడం కోసం, తిరిగి చెల్లించే ప్రాతిపాదికన ప్రభుత్వానికి మొత్తం ₹333.91 కోట్లు జమ చేయబడ్డాయి.

  అయితే రెండేళ్లు గడిచినా ఆ ముందస్తు మొత్తాన్ని బోర్డుకు తిరిగి ఇవ్వలేదు.

- నమోదు చేసుకోవడానికి అర్హులైన 18–70 సంవత్సరాల వయస్సు గల అసంఘటిత కార్మికులందరికీ సంబంధించి జీవిత బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లింపు కోసం తిరిగి చెల్లించే ప్రాతిపాదికన ప్రభుత్వానికి ₹903.08 కోట్లు

---

[34] రిట్ పిటిషన్ సంఖ్య 318/2006 లోని గౌరవ సుప్రీంకోర్టు సూచనలు, 21/8/2015 & 4/9/2015 తేదీల్లోని ఆదేశాలు.

[35] కార్మిక & ఉపాధి మంత్రిత్వ శాఖ సంఖ్య .జెడ్ /20011/08/2014-బీఎల్, తేదీ 2016 జూన్ 07

చెల్లించబడ్డాయి (2016-22). చంద్రన్న బీమా పథకం క్రింద ప్రజా సాధికార సర్వే ద్వారా నమోదు చేసుకున్న అసంఘటిత కార్మికులకు, పీఎమ్‌జేజేబీవై – వైఎస్ఆర్ బీమా పథకం క్రింద పాలసీ ప్రీమియం పొడిగింపుకు, కేంద్రీకృత పథకం క్రింద తప్పనిసరిగా అసంఘటిత రంగంలో ఉన్న నిర్మాణ కార్మికులందరినీ నమోదు చేసుకోవడానికి ప్రీమియం (3వ సంవత్సరం పీఎమ్‌జేజేబీవై – చంద్రన్న బీమా పథకం), కొత్తగా నమోదు చేసుకున్న వారికి ప్రీమియం మరియు మిగిలిపోయిన అర్హులైన అసంఘటిత కార్మికుల నమోదుకు వినియోగించబడ్డాయి.

ఏడేళ్లు గడిచినా ఆ నిధులు బోర్డుకు తిరిగి రాలేదు.

- 2020 సంవత్సరానికి వైఎస్ఆర్ బీమా పథకం క్రింద గ్రూప్ జనతా వ్యక్తిగత ప్రమాద పాలసీ ద్వారా 18-70 సంవత్సరాల వయస్సు గల 1.41 కోట్ల మంది లబ్ధిదారులకు ₹ఐదు లక్షలు/ ₹మూడు లక్షల చెల్లించేందుకు విజయవాడలోని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కు చెల్లించడం కోసం తిరిగి చెల్లించే ప్రాతిపదికన ₹22.40 కోట్లు ప్రభుత్వానికి జమ చేయబడింది.

  నాలుగేళ్ళు గడిచినా ఆ నిధులు బోర్డుకు తిరిగి రాలేదు.

- ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కు బీమా పథకం కింద ప్రీమియం చెల్లింపు కోసం[36] ఋణ/ముందస్తు ప్రాతిపదికన ప్రభుత్వానికి (2016 సెప్టెంబర్ నుండి 2022 జూలై వరకు) ₹231.49 కోట్లు చెల్లించబడ్డాయి.

  అయితే, 2023 మార్చి నాటికి ఈ మొత్తం బోర్డుకు తిరిగి చెల్లించబడలేదు.

- 2018 సంవత్సరానికి 60 నుండి 70 సంవత్సరాల పాలసీదారులకై పీఎమ్ఎస్‌బీవై కింద ప్రమాదవశాత్తు సంభవించే మరణానికి సంబంధించిన ప్రీమియం కోసం యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యూఐసీఎల్)కి చెల్లించడానికి ప్రభుత్వానికి ₹3.07 కోట్లు చెల్లించబడ్డాయి. ఆరేళ్లు గడిచినా ఆ నిధులు బోర్డుకు తిరిగి చెల్లించబడలేదు.

- 2018 ఆగస్టులో వైఎస్ఆర్ బీమా పథకం కింద 1.32 కోట్ల దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాల ప్రాథమిక సంపాదనపరులకు సామూహిక ప్రమాద బీమా పాలసీ ప్రీమియం కోసం మెస్సర్స్ యునైటెడ్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కి చెల్లించేందుకు ప్రభుత్వానికి ₹113.30 కోట్లు తిరిగి చెల్లించే ప్రాతిపాదికన చెల్లించబడ్డాయి. నాలుగేళ్లు గడుస్తున్నా బోర్డుకు నిధులు తిరిగి రాలేదు.

- 2020 అక్టోబర్ నుండి 2022 జూన్ వరకు పీఎమ్‌జేజేబీవై, పీఎమ్ఎస్‌బీవై పథకాలు, అంత్యక్రియల ఖర్చుల కోసం వైఎస్ఆర్ బీమా నిధి/సెర్ప్ ఖాతా కోసం ప్రభుత్వానికి ₹336 కోట్లు తిరిగి చెల్లించే ప్రాతిపాదికన చెల్లించబడ్డాయి. మూడేళ్లు గడుస్తున్నా బోర్డుకు నిధులు రాలేదు.

2023 మార్చి నాటికి, తిరిగి చెల్లించే ప్రాతిపదికన ఇవ్వబడిన ₹2,237.23 కోట్ల విలువైన నిధులు బోర్డు తిరిగి పొందలేదు, మరియు ప్రభుత్వం తిరిగి చెల్లించలేదు.

ముందస్తు మొత్తాల తిరిగి చెల్లింపుల సమస్యను ఆర్థిక శాఖ దృష్టికి తీసుకువెళ్లినట్లు, ముగింపు సమావేశం సందర్భంగా, లేబర్ కమీషనర్ పేర్కొన్నారు (2024 జనవరి).

వ్యయానికి సంబంధించి, రుణాల/ అడ్వాన్స్‌లకు వడ్డీ రేటు, వాయిదాల సంఖ్య మొదలైన ఎటువంటి నిబంధనలు మరియు షరతులు లేకుండా సెర్ప్, గ్రామ వార్డు/వార్డు వాలంటీర్ల సంచాలకులకు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి బదిలీ చేయబడినట్లు ఆడిట్ గమనించింది. రాష్ట్ర ప్రభుత్వం యొక్క వివిధ పథకాల కింద ఖర్చు చేయడానికి నేరుగా బోర్డు

[36] చంద్రన్న బీమా పథకం క్రింద నమోదు చేసుకోవడానికి అర్హులైన 18-70 సంవత్సరాల వయస్సు గల రెండు కోట్ల మంది అసంఘటిత కార్మికులలో ప్రజా సాధికార సర్వే ద్వారా నమోదు చేసుకున్న అదనపు సభ్యులకు అదనపు ప్రీమియం కోసం, వైఎస్ఆర్ బీమా క్రింద ప్రమాదవశాత్తు మరణం/పూర్తి వైకల్యం కోసం 1.21 కోట్ల దారిద్ర్య రేఖ దిగువన ఉన్న కుటుంబాల ప్రాథమిక సంపాదనాపరులకు సామూహిక బీమా పాలసీ ప్రీమియం

ఆదాయం నుండి నిధులను బదిలీ చేయడం, ద్రవ్య వినిమయ బిల్లు దృష్టికి మరియు శాసనసభా పరిశీలనల నుండి తప్పించుకోవడానికి దారితీయవచ్చు.

చట్ట నిబంధనలు, గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా, బోర్డు నిధులు భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కాకుండా ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించబడ్డాయి. ప్రభుత్వానికి తిరిగి చెల్లించే ప్రాతిపదికన ఋణ మరియు అడ్వాన్స్‌లుగా మంజూరు చేయబడిన సెస్సు మొత్తాలు బోర్డు ఖాతాకు తిరిగి చెల్లించబడలేదు.

నిర్దిష్ట ప్రయోజనాల కోసం మాత్రమే తిరిగి చెల్లించే ప్రాతిపదికన నిధులను ప్రభుత్వానికి బదిలీ చేశామని బోర్డు ఇచ్చిన సమాధానాన్ని ప్రభుత్వం నిర్ధారించింది (2024 మే 15).

***సిఫార్సు 2.6: దారి మళ్లించిన నిధులను వెంటనే తిరిగి పొందేలా, సెస్సును ప్రత్యేకంగా లబ్ధిదారుల సంక్షేమానికి వినియోగించేలా బోర్డు చూడాలి.***

### 2.11.3 ఇతర ప్రయోజనాల కోసం బోర్డు నిధుల వినియోగం

చట్టంలోని సెక్షన్ 22 ప్రకారం, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమంతో ముడిపడి ఉన్న ప్రయోజనం కోసం, రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఏదైనా పథకానికి సహాయంగా బోర్డు స్థానిక అధికార సంస్థకు లేదా యజమానికి ఋణం లేదా సబ్సిడీని మంజూరు చేయవచ్చు. ఇంకా, గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల (2015) దృష్ట్యా, భారత ప్రభుత్వ ఆదేశాల[37] ప్రకారం, సేకరించిన సెస్సు లబ్ధిదారుల సంక్షేమం కోసం మాత్రమే ఉపయోగించాలి.

ఆడిట్ క్రింది విషయాలను గమనించింది:

(i) చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా, సంక్షేమ పథకాల ప్రచారానికి/ప్రచార ఖర్చులకు ₹ 72.16 కోట్లు, జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సంస్థ యొక్క 106 వ అంతర్జాతీయ కార్మిక సంఘ సదస్సులో పాల్గొన్న ప్రతినిధుల ప్రయాణ ఖర్చులకు ₹0.11 కోట్లు వినియోగించబడ్డాయి.

(ii) సెస్సు వసూళ్లలో, చిత్తూరు జిల్లా కుప్పంలో ₹13.83 కోట్ల వ్యయంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసి) వసతి గృహ సౌకర్యంతో కూడిన శిక్షణా కేంద్ర నిర్మాణానికి (2017 ఫిబ్రవరి), ₹0.49 కోట్ల వ్యయంతో అనంతపురం జిల్లాలో రామగిరి వద్ద కార్మిక సంక్షేమ భవన్ నిర్మాణం (2017 అక్టోబర్) కోసం, మొత్తంగా ₹14.32 కోట్లు బోర్డు ఉపయోగించింది. ఆ విధంగా, భవనాల నిర్మాణానికి సెస్సు నిధుల వినియోగం భారత ప్రభుత్వ ఆదేశాలకు మరియు గౌరవ సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉంది.

నిర్దిష్ట ప్రయోజనాల కోసం మాత్రమే తిరిగి చెల్లించే ప్రాతిపదికన నిధులను ప్రభుత్వానికి బదిలీ చేశామన్న బోర్డు సమాధానాన్ని ప్రభుత్వం ఆమోదించింది (2024 మే 15).

తిరిగి చెల్లించడం కోసం ఎటువంటి కాలవ్యవధి లేనప్పుడు, నిధులను త్వరగా చెల్లించాలని బోర్డు ప్రభుత్వానికి తెలియజేయాలి.

### 2.11.4 పనిముట్ల కిట్ల పంపిణీ

బోర్డు తన 15వ సమావేశంలో, తాపీపని, ఎలక్ట్రికల్ మరియు ప్లంబింగ్ పనుల్లో నైపుణ్యాన్ని పెంచే శిక్షణ పొందిన నిర్మాణ కార్మికులకు లక్ష పనిముట్ల కిట్లను కొనుగోలు చేయాలనే తీర్మానాన్ని ఆమోదించింది. ప్రారంభంలో జిల్లా స్థాయిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసి) కేంద్రాల ద్వారా ఈ పనుల్లో శిక్షణ పొందిన 88,469 మంది కార్మికులను బోర్డు గుర్తించింది (2017 ఆగస్టు). తాపీపని, ఎలక్ట్రికల్ మరియు ప్లంబింగ్ పనుల్లో శిక్షణ పొందిన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల కోసం, తదనంతరం మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, ఆ శిక్షణ పూర్తయిన వెంటనే

---

[37] కార్మిక & ఉపాధి శాఖ సంఖ్య జెడ్/20011/08/2014-బీఎల్ తేదీ 2016 జూన్ 07

కార్మికులకు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో బోర్డు మొత్తం ₹28 కోట్లతో[38] 99,996 పనిముట్ల కిట్లను కొనుగోలు చేసింది (2018 అక్టోబర్). ఇంకా, ఐదేళ్ల నమోదు సీనియారిటీ ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తూ, బోర్డు ద్వారా శిక్షణ పొందిన లేదా ప్రస్తుతం నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు చేస్తున్న కార్మికులకు మిగిలిన పనిముట్ల కిట్లను పంపిణీ చేయాలని లేబర్ కమీషనర్ (సీఓఎల్) కి ప్రభుత్వం సూచించింది.

సుమారు ₹1.06 కోట్ల[39] విలువైన 4,133 పనిముట్ల కిట్లు పంపిణీ చేయకుండా, ఉప లేబర్ కమిషనర్ల వద్ద నిరుపయోగంగా పడి ఉన్నాయని ఆడిట్ గుర్తించింది. అదే విధంగా, పనిముట్ల కిట్ల సేకరణకు ముందు శిక్షణ పొంది అర్హత కలిగిన కార్మికులు మరియు శిక్షణ పొందవలసిన కార్మికుల సంఖ్యను లెక్కించలేదు.

రాష్ట్రంలో ఉప లేబర్ కమిషనర్లకు మొత్తం 98,333 పనిముట్ల కిట్లు మాత్రమే అందాయని, అందులో 94,017 పనిముట్ల కిట్లను అర్హులైన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు పంపిణీ చేశామని, మిగిలిన 4,316 పనిముట్ల కిట్లను భవిష్యత్తు శిక్షణల్లో అర్హులైన కార్మికులకు పంపిణీ చేయాల్సి ఉందని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది.

ఆ విధంగా, కిట్లను వారి అవసరానికి మించి కొనుగోలు చేయడమంటే అన్ని రకాల ఆర్థిక యాజమాన్య నిబంధనలనూ ఉల్లంఘించడమే.

### 2.11.5 వైకల్య పరిహార మంజూరీ

నిర్మాణ స్థలంలో ప్రమాదానికి గురైన భవన మరియు ఇతర నిర్మాణ (బీఓసీ) కార్మికులకు సంపూర్ణ శాశ్వత వైకల్యం / పాక్షిక శాశ్వత వైకల్యం పరిహారం కోసం క్లెయిమ్‌లను పరిష్కరించడానికి బోర్డు మార్గదర్శకాలను జారీ చేసింది[40] (2010 డిసెంబర్). లబ్ధిదారుడు సమర్పించిన వైద్య ధ్రువీకరణ పత్రం ఆధారంగా సంపూర్ణ శాశ్వత అంగవైకల్యం/ పాక్షిక శాశ్వత అంగవైకల్యానికి పరిహారం' పథకం కింద ఇవ్వాల్సిన పరిహారాన్ని వైకల్యం యొక్క శాతం మరియు ప్రయోజనం యొక్క అర్హతను, ఉప లేబర్ కమీషనర్ నిర్ణయిస్తారు. పరిహార రేట్లు క్రింది విధంగా ఉన్నాయి:

| | | | |
|---|---|---|---|
| i) | సంపూర్ణ శాశ్వత వైకల్యం | – | ₹ ఐదు లక్షలు |
| ii) | 50 శాతం, అంతకు మించిన పాక్షిక శాశ్వత వైకల్యం | – | ₹ ఒక లక్ష |
| iii) | 26 నుండి 49 శాతం పాక్షిక శాశ్వత వైకల్యం | – | ₹50,000 |
| iv) | 25 శాతం వరకు పాక్షిక శాశ్వత వైకల్యం | – | ₹25,000 |

విశాఖపట్నం ఉప లేబర్ కమీషనర్, 13 క్లెయిమ్‌లలో నిర్దేశించిన రేట్ల కంటే ఎక్కువ పరిహారం మంజూరు చేశారని మరియు **పట్టిక 2.8** లో చూపిన విధంగా సూచించిన స్కేల్‌కు బదులుగా వైకల్యం శాతానికి అనులోమానుపాతంలో ₹20.58 లక్షల మొత్తాన్ని చెల్లించినట్లు గమనించడమైనది.

**పట్టిక 2.8: అధిక మొత్తంలో మంజూరు చేసిన వైకల్య పరిహారాన్ని చూపే ప్రకటన**

| క్రమ సంఖ్య | లబ్ధిదారుని పేరు (శ్రీ/శ్రీమతి) | వైకల్య శాతం | వైకల్యం యొక్క శాతం ప్రకారం మంజూరు చేయవలసిన పరిహారం (₹) | మంజూరు చేసిన మొత్తం (₹) | అధికంగా మంజూరు చేసిన మొత్తం (₹) |
|---|---|---|---|---|---|
| 1 | మంతిన లక్ష్మణ రావు | 53 | 1,00,000 | 1,06,000 | 6,000 |
| 2 | డి అప్పలరాజు | 40 | 50,000 | 3,64,847 | 3,14,847 |
| 3 | దబ్బాడ వెంకట రమణ | 50 | 1,00,000 | 2,50,000 | 1,50,000 |
| 4 | పసిల సుబ్బారావు | 60 | 1,00,000 | 3,00,000 | 2,00,000 |
| 5 | నక్కా రాము | 60 | 1,00,000 | 3,00,000 | 2,00,000 |

[38] తాపీ పని కిట్లు ₹2,550, కరెంటు కిట్లు ₹2,523, పైపుల కిట్లు ₹2,687

[39] 156 తాపీ పని కిట్లు ₹2,550 + 3,010 కరెంటు కిట్లు ₹2,523 + 967 పైపుల కిట్లు ₹2,687

[40] బోర్డు మెమో సంఖ్య సి1/4402/09 తేదీ 2010 డిసెంబర్ 22

| క్రమ సంఖ్య | లబ్ధిదారుని పేరు (శ్రీ/శ్రీమతి) | వైకల్య శాతం | వైకల్యం యొక్క శాతం ప్రకారం మంజూరు చేయవలసిన పరిహారం (₹) | మంజూరు చేసిన మొత్తం (₹) | అధికంగా మంజూరు చేసిన మొత్తం (₹) |
|---|---|---|---|---|---|
| 6 | ఐసరపు ముసలయ్య | 45 | 50,000 | 90,000 | 40,000 |
| 7 | పాతాళం ఈశ్వరరావు | 60 | 1,00,000 | 3,00,000 | 2,00,000 |
| 8 | సింగంపల్లి అచ్చెంనాయుడు | 60 | 1,00,000 | 1,20,000 | 20,000 |
| 9 | గంజి కోదండ | 70 | 1,00,000 | 1,40,000 | 40,000 |
| 10 | నక్కా ఎర్రయ్య | 75 | 1,00,000 | 3,62,500 | 2,62,500 |
| 11 | ఐసరపు పైడిబాబు | 50 | 1,00,000 | 2,50,000 | 1,50,000 |
| 12 | చుక్కా సూర్యనారాయణ | 70 | 1,00,000 | 3,50,000 | 2,50,000 |
| 13 | పిల్లా గోపి | 65 | 1,00,000 | 3,25,000 | 2,25,000 |
| అధికంగా చెల్లించిన మొత్తం సొమ్ము | | | **12,00,000** | **32,58,347** | **20,58,347** |

***మూలం:*** *శాఖాపరమైన దస్త్రాలు*

వైకల్య పరిహార రిలీఫ్ క్లెయిమ్‌ల మంజూరును పరిశీలించడం/సమీక్షించడంతోపాటు లబ్ధిదారుల నుంచి అదనపు మొత్తాన్ని వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్న విశాఖపట్నం ఉప లేబర్ కమిషనర్ల సమాధానానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

### 2.11.6 ప్రసూతి లబ్ధి క్లెయిమ్‌ల ప్రక్రియ

నమోదు కాబడిన మహిళా కార్మికులకు ప్రసూతి లబ్ధి పథకం [41] ప్రభుత్వంచే ప్రవేశపెట్టబడింది. (2010 జూలై, 2013 అక్టోబర్). పురుష భవన కార్మికుని భార్య, నమోదు కాబడిన పురుష లేదా మహిళా కార్మికుల ఇద్దరు ఆడ పిల్లలకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. హక్కుదారు ప్రసవం జరిగిన తేదీ నుండి ఒక నెలలోపు అధికార పరిధిలోని సహాయక కార్మికాధికారి (ఏఎల్ఓ)/సహాయ లేబర్ కమీషనర్ (ఏసీఎల్)/ఉప లేబర్ కమీషనర్ (డీసీఎల్)కి క్లెయిమ్‌ను సమర్పించాలి. ఏఎల్ఓ/ఏసీఎల్ విచారణ జరిపి తన నివేదికను ఏడు రోజుల్లోగా డీసీఎల్‌కి సమర్పించాలి. ఒకవేళ దరఖాస్తులో లోపం ఉన్నా, ఏవైనా పత్రాలు లేకపోయినా, డీసీఎల్ ఆ క్లెయిమ్‌ను ఒక వారంలోపు లోపాలను సరిచేసి, సమర్పించేందుకు, క్లెయిమ్‌దారుకు ఏడు రోజుల్లో తిరిగి పంపుతారు. అప్పుడు, డీసీఎల్, లబ్ధిని ఒక వారంలో ఆమోదించి, విడుదల కొరకు క్లెయిమ్‌ను బోర్డుకు పంపుతారు. ఏడు రోజుల్లోగా, డీసీఎల్ ద్వారా లబ్ధిని, లబ్ధిదారుని బ్యాంక్ ఖాతాకు బోర్డు విడుదల చేస్తుంది. ఈ విధంగా, క్లెయిమ్ అందిన తేదీ నుండి దాదాపు ఒక నెలలోపు మొత్తం ప్రక్రియ పూర్తవ్వాలి. కాకినాడ డీసీఎల్ కార్యాలయంలో, 26 ప్రసూతి లబ్ధి క్లెయిమ్‌ల విషయంలో, వాటిని ప్రక్రియ చేసేటప్పుడు, అసాధారణ ఆలస్యం జరిగినట్లు గమనించడమైనది. 26 కేసులలో ఎనిమిదింటిలో, ఏఎల్ఓ స్థాయిలో 11 నుండి 194 రోజుల వరకు ఆలస్యం ఉండగా, 12 సందర్భాలలో డీసీఎల్ స్థాయిలో 28 నుండి 451 రోజుల వరకు ఆలస్యం ఉంది. నాలుగు కేసుల్లో ఆలస్యం చేయకుండా డీసీఎల్‌కు క్లెయిమ్‌లు సమర్పించినా, 200 రోజుల తర్వాత మంజూరు చేశారు.

ఇంకా, **పట్టిక 2.9** లో చూపిన విధంగా, కాకినాడ, ఏలూరు, విశాఖపట్నం డీసీఎల్ కార్యాలయాల్లో క్లెయిమ్‌లను పరిష్కరించడంలో ఆలస్యం జరిగినట్లు గమనించడమైనది.

**పట్టిక 2.9: ప్రసూతి లబ్ధి క్లెయిమ్‌లను ప్రక్రియ చేయడంలో జరిగిన ఆలస్యాన్ని చూపే పట్టిక**

| కార్యాలయం పేరు | క్లెయిమ్‌ల సంఖ్య | ఏఎల్ఓ/ ఏసీఎల్ స్థాయిలో ఆలస్యం | డీసీఎల్ స్థాయిలో ఆలస్యం | లబ్ధిని బదిలీ చేయడంలో ఆలస్యం |
|---|---|---|---|---|
| డీసీఎల్ ఏలూరు | 26 | ఒకటి నుండి 16 రోజులు | 8 నుండి 322 రోజులు | 15 నుండి 110 రోజులు |
| డీసీఎల్ విశాఖపట్నం | 18 | 5 నుండి 146 రోజులు | 8 నుండి 49 రోజులు | 14 నుండి 145 రోజులు |
| డీసీఎల్ కాకినాడ | 26 | 11 నుండి 194 రోజులు (ఎనిమిది కేసులు) | 28 నుండి 451 రోజులు (12 కేసులు) | 200 రోజులకు మించి (నాలుగు కేసులు) |

***మూలం:*** *శాఖాపరమైన దస్త్రాలు*

[41] ఎల్ఈటీ & ఎఫ్ (ల్యాబ్– IV) శాఖ జీఓఎమ్ఎస్ సంఖ్య 62, 50 తేదీలు వరుసగా 2010 జూలై 27, 2013 అక్టోబర్ 29

పెద్ద సంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేయడం, పరిశీలనకు పట్టిన సమయం, చాలా వరకు క్లెయిమ్‌లు అవసరమైన పత్రాలను సమర్పించకపోవడం వల్ల వాటిని తిప్పి పంపడం, పునఃసమర్పణకు హక్కుదారులు చేసిన ఆలస్యాలను, బోర్డ్‌కు క్లెయిమ్‌ల సమర్పణలో జాప్యానికి కారణాలుగా కాకినాడ ఉప లేబర్ కమీషనర్ (డీసీఎల్) అపాదించారు. ఇలాంటి కారణాలనే ఇతర ఉప లేబర్ కమీషనర్లు కూడా పేర్కొన్నారు. నిర్దేశించిన సమయంలోగా క్లెయిమ్‌ల ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రసూతి ప్రయోజనాలకు సంబంధించిన క్లెయిమ్‌ల ప్రక్రియలో జాప్యం కేవలం లబ్ధిదారులు సమర్పించిన పత్రాల పరిశీలన, రికార్డుల ధ్రువీకరణ కారణంగానే జరిగిందని, ఉద్దేశ్యపూర్వకంగా కాదని బోర్డు ఇచ్చిన సమాధానానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఆలస్యమైన ప్రయోజనం లబ్ధిదారులకు కష్టాలను కలిగిస్తుంది. క్లెయిమ్‌ల ప్రక్రియలో విపరీతమైన జాప్యం జరిగిన సందర్భాలు ఉన్నందున ఆపత్కాలంలో సహాయం నిరాకరించబడుతుందనేది వాస్తవం.

### 2.11.7 తగినన్ని పరిశీలనలు నిర్వహించకపోవడం– లబ్ధిదారులకు రెండు సార్లు చెల్లింపు

➢ ప్రసూతి లబ్ధిని ఒకే లబ్ధిదారునికి రెండుసార్లు అందచేసినట్లు విశాఖపట్నంలోని ఉప లేబర్ కమీషనర్ (డీసీఎల్) కార్యాలయంలో గమనించడమైనది. 2018 జూన్ 18న జన్మనిచ్చిన ఒక నమోదిత లబ్ధిదారు ప్రసవ ప్రమాణపత్ర కాపీతో మొదటి క్లెయిమ్‌ను 2018 ఆగస్టు 06 న సమర్పించారు. క్లెయిమ్‌ను సహాయక లేబర్ కమీషనర్ (ఏసీఎల్) 2018 సెప్టెంబర్ 11 న ఫార్వార్డ్ చేసారు, 2018 అక్టోబర్ 08 న ఆమె ఖాతాలో ₹20,000 లబ్ధి జమ చేయబడింది. అదే లబ్ధిదారుడు, అవే పత్రాలను జతచేసి 2018 డిసెంబర్ 06 న డూప్లికేట్ కాపీలో రెండవ ప్రసవంగా నకిలీ దరఖాస్తును సమర్పించారు. 2019 జనవరి 25న సహాయక లేబర్ కమీషనర్ ద్వారా క్లెయిమ్ ఫార్వార్డ్ చేయబడింది, 2019 మార్చి 20 న ఆమె ఖాతాలో లబ్ధి జమ చేయబడింది

  క్లెయిమ్‌ను పరిశీలించి లేదా సమీక్షించి, లబ్ధిదారుడి నుండి అదనపు క్లెయిమ్‌ను వసూలు చేయడానికి చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం ఉప లేబర్ కమీషనర్ పేర్కొన్నారు.

➢ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం[42] మరణించిన భవన & ఇతర నిర్మాణ కార్మికుని నామినీకి ₹20,000 అంత్యక్రియల ఖర్చులు చెల్లించవచ్చు. 2019 మే 27 న మరణించిన నమోదిత కార్మికుని కుటుంబ సభ్యుడు అంత్యక్రియల ఖర్చుల క్లెయిమ్‌ను 2019 జూలై 04న సమర్పించినట్లు విశాఖపట్నం ఉప లేబర్ కమీషనర్ కార్యాలయంలో గమనించడమైనది. అంత్యక్రియల ఖర్చుల లబ్ధి ₹20,000 నామినీకి 2019 అక్టోబర్ 19 న జమ చేయబడింది. అయితే, 2019 అక్టోబర్ 25 న లబ్ధిదారుడి నుండి ఎలాంటి క్లెయిమ్ లేకుండానే అదే ఖాతాకి అంత్యక్రియల ఖర్చుల లబ్ధి ₹20,000 మళ్లీ జమ చేయబడింది.

  క్లెయిమ్‌ను పరిశీలించి లేదా సమీక్షించి, లబ్ధిదారుడి నుండి అదనపు క్లెయిమ్‌ను వసూలు చేయడానికి చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం ఉప లేబర్ కమీషనర్ పేర్కొన్నారు.

  రెండు సార్లు చెల్లింపులు జరిపిన ప్రసూతి లబ్ధి క్లెయిమ్‌ల మంజూరును పరిశీలించడం/సమీక్షించడంతోపాటు లబ్ధిదారుల నుంచి అదనపు మొత్తాన్ని వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్న విశాఖపట్నం ఉప లేబర్ కమీషనర్ల సమాధానానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

42 ఎల్ ఈటీ & ఎఫ్ (ల్యాబ్ – IV) శాఖ జీఓఎమ్ఎస్ సంఖ్య 5, తేదీ 2016 ఫిబ్రవరి 04

# నియమపాలన తనిఖీ

# 3వ అధ్యాయం

# ‘మన బడి నాడు-నేడు మొదటి దశ’ పథకంపై

# నియమపాలన తనిఖీ

# పాఠశాల విద్యా శాఖ

# 'మన బడి నాడు-నేడు మొదటి దశ' పథకంపై నియమపాలన తనిఖీ


**సారాంశం**

మనబడి-నాడునేడు మొదటి దశకి సంబంధించి 2019-20 నుండి 2021-22 వరకు గల రికార్డులను పాఠశాల విద్యా శాఖలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్యా కమీషనర్ (సిఎస్ఈ), సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుల కార్యాలయాల్లో పరిశీలించాము. రాష్ట్ర స్థాయిలో సమగ్ర శిక్ష సొసైటీ (ఎస్‌పీడీ, ఎస్ఎస్ఎస్), ఆంధ్రప్రదేశ్ విద్యా మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) మరియు ఆరు జిల్లాల్లోని అదనపు పథక సమన్వయకర్తలు, సమగ్ర శిక్ష (ఏపీసీ, ఎస్ఎస్) తో పాటు ఆరు జిల్లాల్లో ఎంపిక చేసిన 108 పాఠశాలల్లోని రికార్డులను 2019-20 నుండి 2021-22 వరకు పరిశీలించాము. రికార్డుల పరిశీలనలో, ఆడిట్ క్రింది విషయాలను గమనించడమైంది:

- *పాఠశాల పరివర్తన పర్యవేక్షణ వ్యవస్థ సేకరణలో భాగంగా సమాచార సాంకేతిక ఏజెన్సీ ఎంపిక ప్రక్రియ పోటీ మరియు పారదర్శక ప్రక్రియకు బదులుగా నామినేషన్ ప్రాతిపదికన చేయబడింది.*
- *ప్రభుత్వ పాఠశాలల్లో రంగులు వేసే పనులకు గుత్తేదారుకు ఒక శాతం చొప్పున కార్మిక సెస్సు విధించి, వసూలు చేయకుండా, మొత్తం పనులకుగాను ₹292.43 కోట్లు చెల్లించారు. అలా, చెల్లించిన బిల్లులపై ₹2.92 కోట్ల మేరకు కార్మిక సెస్సు విధించలేదు.*
- *సంయుక్త భౌతిక పరిశీలన సమయంలో, మచ్చుకు తనిఖీ చేయబడిన 108 పాఠశాలలకు గాను 33 పాఠశాలల్లో ₹76.80 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన గ్రీన్ చాక్ బోర్డ్‌లు పని చేయకపోవడాన్ని, తాగునీటి వ్యవస్థ పని చేయకపోవడాన్ని ఆడిట్ గమనించింది. ఇంకా, విద్యార్థులు మరియు సిబ్బందికి కాంపోనెంట్ ఫర్నిచర్ అందించినప్పటికీ, డ్యూయల్ డెస్క్‌ల సేకరణకు ₹383.51 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, మచ్చుకు తనిఖీ చేసిన 108 పాఠశాలలకు గాను 32 పాఠశాలల్లో 1,973 మంది విద్యార్థులు నేలపై కూర్చున్నారు. ఈ విధంగా, ఈ పథకంపై ₹3,818.52 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, సురక్షితమైన తాగునీరు, బెంచీలు వంటి ప్రాథమిక సౌకర్యాలను కూడా ప్రభుత్వం అందించలేకపోయింది.*


## 3.1 పరిచయం

విద్య అనేది ప్రాథమిక సామాజిక అభివృద్ధికి ప్రమాణం. స్థోమత, అందుబాటు మరియు సమానత్వాన్ని అందించడం ద్వారా ఈ ముఖ్యమైన కొలమానానికి దోహదపడేందుకు ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ బలమైన స్తంభంగా పని చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పాఠశాల వ్యవస్థను ప్రభావవంతంగా చేయడానికి కీలకమైన ఇన్‌పుట్‌లలో ఒకటి. ఇది పాఠశాలల్లో మెరుగైన అభ్యాస వాతావరణానికి ప్రత్యక్షంగా మరియు మెరుగైన అభ్యాస ఫలితాలకు పరోక్షంగా దోహదపడుతుంది.

మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం మరియు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (జీఓఏపీ), మన బడి నాడు నేడు[43] (అంటే మన పాఠశాల-అప్పుడు మరియు ఇప్పుడు) అనే పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం మౌలిక సదుపాయాలను బలోపేతం

[43] జీఓఎంఎస్ సంఖ్య 87 తేదీ 30/11/2019, 24/02/2020 నాటి జీఓఎంఎస్ సంఖ్య 7 తో కలిపి చదువవలెను

చేయడానికి, మూడు సంవత్సరాల వ్యవధిలో నిర్దిష్టమైన లక్ష్యాన్ని సమర్థవంతంగా మరియు దశలవారీగా పాఠశాలల్లోని మౌలిక సదుపాయాలను మార్చడానికి ప్రతిపాదిస్తుంది. ఈ పథకం 2019-20లో రూపొందించబడింది.

మన బడి నాడు నేడు కార్యక్రమం కింద ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నీటి సదుపాయం కల మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ వంటి తొమ్మిది విభాగాలలో ప్రభుత్వ పాఠశాలల భవనాల అభివృద్ధిలో భాగంగా పాఠశాల విద్యా కమీషనర్‌కు పంఖాలు, ట్యూబ్ లైట్లు, తాగునీటి సరఫరా, విద్యార్థులు మరియు సిబ్బందికి ఫర్నిచర్, పాఠశాల భవనానికి రంగులు, పెద్ద మరియు చిన్న మరమ్మతులు, గ్రీన్ చాక్ బోర్డులు, ఇంగ్లీష్ ప్రయోగశాలలు, ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టడమనే మౌలిక సదుపాయాల కల్పనా పనులకు పరిపాలనా ఆమోదం ఇచ్చింది (2019 నవంబర్).

సామాజిక సంప్రదింపుల ద్వారా తల్లిదండ్రుల కమిటీలు (పీసీ) పనులను అమలు చేయాలి. ప్రతి పాఠశాల యొక్క తల్లిదండ్రుల కమిటీలు పాఠశాల లోని సౌకర్యాల యొక్క వాస్తవ అవసరాల ఆధారంగా ప్రతి పని కోసం కార్యనిర్వహణ సంస్థ ద్వారా రూపొందించబడిన వివరణాత్మక అంచనాను పొందవలసి ఉంటుంది. క్షేత్ర స్థాయి ఇంజనీర్[44] అంచనాలను సిద్ధం చేస్తున్నప్పుడు తల్లిదండ్రుల కమిటీ సభ్యులను సంప్రదించి, అంచనాలలో ఉంచవలసిన నిబంధనలను ఖరారు చేయడంలో వారి సలహాలను పొందవలసి ఉంటుంది. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు తల్లిదండ్రుల కమిటీతో ఒక తీర్మానాన్ని చేసుకొని దాని అంచనాలను సిద్ధం చేస్తున్నప్పుడే స్కూల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్ (ఎస్‌టీఎంఎస్) లో క్షేత్ర స్థాయి ఇంజనీర్ అప్‌లోడ్ చేయాలి.

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్యా విభాగానికి నాయకత్వం వహిస్తారు మరియు మన బడి నాడు నేడు రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ అధ్యక్షునిగా ఉంటారు. ఈ కమిటీలో మొత్తం 13 మంది సభ్యులు ఉంటారు మరియు పాఠశాల విద్యా కమీషనర్ మెంబర్-కన్వీనర్‌గా పాఠశాలల్లో కార్యక్రమాల అమలులో పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించి పర్యవేక్షించే బాధ్యతను కలిగి ఉంటారు. ప్రభుత్వ సలహాదారు (మౌలిక సదుపాయాలు), పాఠశాల విద్య సంబంధిత అధికారులందరితో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమ అమలులో అన్ని అంశాలలోను ఏజెన్సీలకు సలహా ఇస్తారు.

జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీకి అధ్యక్షుడు. కమిటీలో 11 మంది సభ్యులు ఉంటారు. జిల్లా విద్యాశాఖ అధికారి మెంబర్-కన్వీనర్‌గా జిల్లా స్థాయిలో కార్యక్రమాన్ని పర్యవేక్షించే బాధ్యతను కలిగి ఉంటారు.

[44] పాఠశాల ఆధారంగా సంబంధిత శాఖ యొక్క అమలుపరచే ఏజెన్సీ అనగా, ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష (ఏపీఎస్ఎస్) ఇంజనీరింగ్ విభాగం, ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ), గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం, పంచాయత్ రాజ్ (పీఆర్) ఇంజనీరింగ్ విభాగం, పురపాలక మరియు ప్రజారోగ్య (పీహెచ్) ఇంజనీరింగ్‌చే అధికారం పొందిన క్షేత్ర స్థాయి ఇంజనీర్‌పై ఆధారపడి ఉంటుంది

**పటం 3.1: సంస్థాగత నిర్మాణ పటం**




*మూలం: ప్రభుత్వ ఆదేశాలు* [45]

### 3.1.1 తనిఖీ పరిధి మరియు పద్ధతి

పాఠశాల విద్యా శాఖ 2019-21లో మన బడి నాడు నేడు మొదటి దశను అమలు చేసింది. రాష్ట్ర పథక సంచాలకులు, సమగ్ర శిక్షా, ఆర్థిక విషయాధికారి, ఇతర శాఖాధికారులతో 2022 ఆగస్టు 03న ఆడిట్ ప్రారంభ సమావేశాన్ని నిర్వహించింది. తనిఖీ సమయంలో, (2022 అక్టోబర్ - 2023 ఫిబ్రవరి), మన బడి నాడు నేడు మొదటి దశకు సంబంధించిన రికార్డులు పాఠశాల విద్యా శాఖలోని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కార్యాలయాలలో పరిశీలించబడ్డాయి. పాఠశాల విద్యా కమీషనర్ (సీఎస్ఈ), రాష్ట్ర స్థాయిలో పథక రాష్ట్ర సంచాలకులు, సమగ్ర శిక్షా సొసైటీ (ఎస్‌పీడీ, ఎస్ఎస్ఎస్), ఆంధ్రప్రదేశ్ విద్యా మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ), ఆరు జిల్లాల్లో ఎంపిక చేసిన 108 పాఠశాలలకు అదనంగా ఆరు జిల్లాల్లోని అదనపు పథక సమన్వయకర్తలు, సమగ్ర శిక్షా (ఏపీసీ, ఎస్ఎస్) కు సంబంధించిన రికార్డులు కూడా పరిశీలించబడ్డాయి. మచ్చుకు తనిఖీ చేయబడిన పాఠశాలల ఉమ్మడి భౌతిక పరిశీలనను ఆడిట్ నిర్వహించింది. ముగింపు సమావేశం 2024 జనవరి 05న పాఠశాల విద్య శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శితో నిర్వహించబడింది, ఇందులో తనిఖీ ఫలితాలను చర్చించారు. ముగింపు సమావేశంలో ఇచ్చిన శాఖ ప్రతిస్పందనలు నివేదికలో పొందుపరచబడ్డాయి.

[45] జీఓఎంఎస్ సంఖ్య 87 తేదీ 30/11/2019 ని జీఓఎంఎస్ సంఖ్య 7, తేదీ 24/02/2020 తో కలిపి చదువగా

### ఆడిట్ నమూనా

మన బడి నాడు నేడు మొదటి దశ, పునర్వ్యవస్థీకరించబడిన 26 జిల్లాల్లోని[46] 15,126[47] పాఠశాలల్లో అమలు చేయబడింది. వెయిటెడ్ ఇండెక్స్‌పై (పాఠశాలల సంఖ్యపై 50 శాతం మరియు ఖర్చు చేసిన వ్యయంపై 50 శాతం) ప్రాబబిలిటీ ప్రొపోర్షన్ టు సైజ్ విత్‌అవుట్ రీప్లేస్‌మెంట్ (పిపిఎస్‌డబ్ల్యుఆర్) అంటే భర్తీ లేకుండా పరిమాణానికి సంభావ్యత నిష్పత్తిపై ఆరు జిల్లాలను ఎంపిక చేశారు.

ప్రతి జిల్లాలో, పథకం అమలు చేయబడిన పాఠశాలల సంఖ్య ఆధారంగా సాధారణ యాదృచ్ఛిక నమూనా పద్ధతిని ఉపయోగించి మూడు మండలాలు ఎంపిక చేయబడ్డాయి. ప్రతి మండలంలో, క్రింది పద్ధతిలో వర్గీకృత (స్ట్రాటిఫైడ్) యాదృచ్ఛిక నమూనా పద్ధతిని ఉపయోగించి ఆరు పాఠశాలలు ఎంపిక చేయబడ్డాయి (పాఠశాలల జాబితా ***అనుబంధం 3.1*** లో ఉంది):

(i) ఈ పథకం కింద అన్ని పాఠశాలలు, మూడు వర్గాలుగా విభజించబడ్డాయి. అవి, ప్రాథమిక (5వ తరగతి వరకు), ప్రాథమికోన్నత (8వ తరగతి వరకు), మాధ్యమికోన్నత పాఠశాల (12వ తరగతి వరకు).

(ii) ప్రతి వర్గం నుండి రెండు పాఠశాలలు పునః స్థాపన చేయని యాదృచ్ఛిక నమూనా పద్ధతి ఆధారంగా ఎంపిక చేయబడ్డాయి.

### 3.1.2 ఆడిట్ లక్ష్యాలు

నియమపాలన తనిఖీ పథకం యొక్క ఈ క్రింది లక్ష్యాలను నిర్ధారించడానికి చేయబడింది:

- సేకరణ, అమలు మరియు చెల్లింపులు ప్రస్తుత నియమాలు, నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా, మరియు
- పథక మార్గదర్శకాల ప్రకారం పర్యవేక్షణ యంత్రాంగాలు అమలులో ఉన్నాయా అనే కోణంలో చేయబడింది.

## 3.2 ఆడిట్ పరిశీలనలు

### 3.2.1 పథకానికి పెట్టుబడి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బడ్జెట్ మద్దతు ద్వారా పెట్టుబడి అందించడం జరిగింది. 2019-20 నుండి 2021-22 వరకు ఈ పథకం యొక్క బడ్జెట్ కేటాయింపు, ఖర్చు వివరాలు క్రింది **పట్టిక 3.1** లో వివరించబడ్డాయి.

**పట్టిక 3.1: మన బడి నాడు-నేడు పథక మొదటి దశకు బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల వివరాలు**

*(₹ కోట్లలో)*

| సంవత్సరం | బడ్జెట్ కేటాయింపు | ఖర్చు |
|---|---|---|
| 2019-20 | 100 | 100.00 |
| 2020-21 | 2,000 | 1,968.52 |
| 2021-22 | 1,750 | 1,750.00 |
| మొత్తం | **3,850** | **3,818.52** |

***మూలం:*** *ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వార్షిక పద్దుల ప్రకారం.*

రెవెన్యూ వ్యయం అనగా సాధారణంగా పునరావృతమయ్యే వ్యయం, ఇది రెవెన్యూ ఆదాయం నుండి ఖర్చు చేసేట్లుగా ఉద్దేశించబడింది. మూలధన వ్యయం అనేది శాశ్వత, మరియు దీర్ఘకాలపు ఆస్తులను సృష్టించడానికి లేదా దీర్ఘకాలపు అప్పులను తగ్గించడానికి చేసే వ్యయంగా నిర్వచించబడింది. మన బడి నాడు నేడు మొదటి దశ ఖర్చు మొత్తం మూలధన వ్యయంగా చూపబడింది.

---

46 జీఓఆర్‌టీ సంఖ్య 173 నుండి 198 వరకు, రెవెన్యూ (భూములు-IV), 02/04/2022

47 మొదటి దశలో భాగంగా 15,713 పాఠశాలలను చేపట్టాలని ప్రతిపాదించినప్పటికీ, ఎస్‌టీఎంఎస్ దరఖాస్తు ప్రకారం 15,126 పాఠశాలలు మాత్రమే చేపట్టబడ్డాయి.

ప్రభుత్వ ఉత్తర్వుల[48] ప్రకారం శిథిలావస్థలో ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ మొదటి దశలోని పాఠశాలల్లో 1/3వ వంతు పాఠశాలలు అధిక విద్యార్థులు కలిగిన అన్ని మండలాలు, నియోజకవర్గాలను పరిగణలోకి తీసుకొని నిర్ధారించబడ్డాయి. శిథిలావస్థలో ఉన్న భవనాలను పరిగణనలోకి తీసుకోలేదు, ఎందుకంటే తరగతి గదుల నిర్మాణం నాడు నేడు మొదటి దశలో ఆమోదించబడలేదు.

ఈ విధంగా, శిథిలావస్థలో ఉన్న పాఠశాలల పునర్నిర్మాణం జరగలేదని మరియు ఖర్చులు (మరమ్మత్తులు, రంగులు వేయడం, బల్లల సేకరణ మొదలైనవి) పునరావృత స్వభావమైనవని ఉన్నాయని పైన పేర్కొన్నదాని నుండి స్పష్టంగా తెలుస్తుంది. అయితే, ప్రభుత్వ అకౌంటింగ్ నియమాలకు విరుద్ధంగా మొత్తం ఖర్చు మూలధనఖర్చుగా నమోదు చేయబడింది.

### 3.2.2 సేకరణ, అమలు, చెల్లింపు ప్రక్రియ

ఈ కార్యక్రమ ప్రయోజనం కోసం ఆంధ్రప్రదేశ్ విద్యా మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) ద్వారా మొత్తంగా కొనుగోలుచేసిన పాఠశాల పరివర్తన పర్యవేక్షణ వ్యవస్థ (ఎస్‌టీఎంఎస్) సాఫ్ట్‌వేర్ మరియు స్మార్ట్ టీవీలు, డ్యూయల్ డెస్క్‌లు, త్రాగు నీటి వ్యవస్థ, పాఠశాల రంగులు, సీలింగ్ ఫ్యాన్‌లు, పారిశుద్ధ్య వస్తువులు, గ్రీన్ చాక్ బోర్డులు వంటి ఏడు వస్తువుల కొనుగోళ్ల మీద ఈ క్రింది పరిశీలనలు చేయడం జరిగింది:

#### 3.2.2.1 స్కూల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మానిటరింగ్ సిస్టమ్ (ఎస్‌టీఎంఎస్) కొనుగోళ్ళు – నామినేషన్ ప్రాతిపదికన ఐటీ ఏజెన్సీ ఎంపిక

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం (2015 జూలై)[49], నిపుణుల సేవలను వ్యక్తులనుండి గాని లేదా ఒక సంస్థ నుండి గాని పారదర్శకంగాను, భారత మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సేకరణ నియమాలు మరియు మార్గదర్శకాల ద్వారా జరిగే పోటీ ప్రక్రియ ద్వారానే జరగాలి.

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) లిమిటెడ్‌ను ఎస్‌టీఎంఎస్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కోసం, పోటీ ప్రక్రియను అనుసరించకుండా నామినేషన్ ప్రాతిపదికన ఎంపిక చేసినట్లు మేము గమనించాము. మనబడి నాడు నేడు పనులను సులభతరం చేయడానికి మరియు పర్యవేక్షించడానికి ఎస్‌టీఎంఎస్ పోర్టల్ అభివృద్ధి మరియు నిర్వహణ కోసం శాఖ మరియు మెస్సర్స్ టీసీఎస్ మధ్య 2020 డిసెంబర్లో ₹1.55 కోట్ల మొత్తానికి ఒప్పందం కుదిరింది. కానీ, ఒప్పందం యొక్క ప్రభావవంతమైన కాలం, 2020 మార్చిలో మాత్రమే ప్రారంభమైందని గమనించడమైంది. అంటే, ఒప్పందాన్ని ముగించడానికి తొమ్మిది నెలల ముందే ప్రారంభమైంది.

వస్తువుల కేంద్రీకృత సేకరణ కొరకు, కార్మికులకు నగదు చెల్లింపులను పర్యవేక్షించడానికి మరియు మద్దతివ్వడానికి సారూప్య లక్షణాలను కలిగి ఉన్న ఇలాంటి అప్లికేషన్‌ను అభివృద్ధి చేయడంలో పరిజ్ఞానం మరియు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని నామినేషన్ ప్రాతిపదికన ఎంపిక చేసినట్లు ముఖ్య కార్యదర్శి ముగింపు సమావేశంలో తెలిపారు. ఇంకా, కేబినెట్ ఆమోదం తర్వాతనే మెస్సర్స్ టీసీఎస్ ఎంపిక చేయబడిందని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2024 మార్చి).

ఒప్పందం విలువ చాలా చిన్నది అయినప్పటికీ లేదా ఆ కన్సల్టింగ్ సంస్థకు మాత్రమే ఇచ్చిన పనిని నిర్వహించడానికి అవసరమైన అర్హతలు లేదా అనుభవం కలిగి ఉన్నప్పుడు ఒకే సంస్థని ఎంపిక చేయడం సముచితమైనదని చెప్తూ ఇచ్చిన ప్రత్యుత్తరం ఆమోదయోగ్యం కాదు. ఆ విధంగా, ఒకే సంస్థ నుండి కొనుగోళ్ళు చేయడం కోసం పోటీ మరియు పారదర్శక ప్రక్రియను అనుసరించలేదు.

| |
|---|
| *సిఫార్సు 3.1: కాంట్రాక్టర్లు/ఏజెన్సీల ఎంపికలో ప్రభుత్వం నామినేషన్ ప్రాతిపదికన కాకుండా పోటీ మరియు పారదర్శక ప్రక్రియను అనుసరించాలి.* |

[48] జీఓఎంఎస్ సంఖ్య 87 తేదీ 30/11/2019 ని జీఓఎంఎస్ సంఖ్య 7, పాఠశాల విద్య (ప్రోగ్ II) శాఖ 24/02/2020తో చదవవలెను.

[49] జీఓఎంఎస్ సంఖ్య 89 తేదీ 16/07/2015 ఆర్థిక (హెచ్ఆర్-I) శాఖ జారీ చేసింది

### 3.2.2.2 తాగునీటి వ్యవస్థ

శుభ్రపరచిన త్రాగు నీటి వ్యవస్థ (డీడబ్ల్యూఎస్)-టైపు-3[50] ద్వారా పాఠశాలలకు తాగునీటిని అందించడం కోసం 'లిక్ప్యూర్ ప్రైవేట్ లిమిటెడ్'కి ₹59,53,37,750 ఒప్పందపు ధరకు ఇవ్వబడింది (2020 అక్టోబర్ 17).

ఒప్పందంలోని 7.4వ నియమం (కార్యక్రమ కీలకదశల) ప్రకారం, సంస్థ డీడబ్ల్యూఎస్ యూనిట్‌లలో అంగీకరించిన పరిమాణంలో ఒక నెలలోపు 25 శాతం, రెండు నెలల్లోపు యాభై శాతం, మొత్తం పరిమాణాన్ని ఒప్పందం సంతకం చేసిన తేదీ నుండి 90 రోజులలోపు సరఫరా చేయాలి (2020 అక్టోబర్ 17). ఇంకా, ఒప్పందంలోని 8.బి నియమం ప్రకారం, అంగీకరించిన నిబంధనలు లేదా షెడ్యూల్‌కు విరుద్ధంగా పనిని పూర్తి చేయడంలో ఏదైనా ఆలస్యం జరిగితే, సంస్థ ప్రతి వారానికి ఒప్పందం విలువలో 0.1 శాతం చొప్పున ప్రభుత్వానికి నిర్ణయించబడిన నష్టాన్ని గరిష్టంగా ఒప్పందం విలువలో 2.5 శాతాన్ని చెల్లించాలి. ఒప్పందంలోని 4.7వ నియమం ప్రకారం నిషేధిత జాబితాలో చేర్చడంతో పాటు ఈఎండీ కూడా జప్తు చేయబడుతుంది.

సంస్థ, 2020 డిసెంబర్ 16 నాటికి 1,750 డీడబ్ల్యూఎస్[51] యూనిట్‌లను సరఫరా చేసి ఉండాలి. అయితే, ఒప్పందం జరిగిన తేదీ నుండి 2021 జనవరి 05 వరకు (అంటే రెండు నెలల కంటే ఎక్కువ) సంస్థ డీడబ్ల్యూఎస్ యూనిట్‌లను సరఫరా చేయలేదు. రెండు నెలల్లోపు డీడబ్ల్యూఎస్ యూనిట్‌లను సరఫరా చేయనందుకు ఎటువంటి నిర్ణయించబడిన నష్టపరిహారం (ఎల్‌డీలు) విధించలేదని గమనించడమైనది.

డీడబ్ల్యూఎస్ యూనిట్లు 2021 జనవరి 05 తర్వాత సరఫరా చేయబడ్డాయి. ఇంకా మొత్తం పరిమాణాన్ని సంస్థ నిర్ణయించిన సమయంలో సరఫరా చేసింది. అందువల్ల, కోవిడ్ కారణంగా ఉత్పన్నమైన అడ్డంకులను పరిగణనలోకి తీసుకుని ఎటువంటి నిర్ణయించబడిన నష్టపరిహారం విధించలేదని శాఖ పేర్కొంది.

ఇంకా, అంగీకరించిన నిబంధనల ప్రకారం అంటే 90 రోజుల్లోపే మొత్తం సరఫరా జరిగిందని ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక సంచాలకులు ముగింపు సమావేశంలో పేర్కొన్నారు.

ఒప్పందం ప్రారంభానికి ముందే, అంటే 2020 అక్టోబర్ 17కు ముందే కోవిడ్ 5.0 అన్‌లాక్, 2020 సెప్టెంబర్ 30 నుండి అమలులోకి వచ్చినందున ప్రభుత్వం యొక్క ప్రత్యుత్తరం ఆమోదయోగ్యంగా లేదు. ఇంకా, సరఫరాదారు రెండు నెలల్లో చెయ్యవలసిన 50 శాతాన్ని సరఫరా చేయలేదు. అంతేకాకుండా మధ్యంతర లక్ష్యాలను కూడా సాధించలేదు. అందువల్ల, ఒప్పంద లక్ష్యాల ప్రకారం రెండు నెలలలోపు డీడబ్ల్యూఎస్‌ని సరఫరా చేయనందుకు నిర్ణయించబడిన ₹41,67,364 నష్టపరిహారాన్ని వసూలు చేయాలి.

### 3.2.2.3 పాఠశాల భవనాలకు రంగులు

ఏపీఈడబ్ల్యూఐడీసీ ఆంధ్రప్రదేశ్‌లోని నిర్దేశించిన ప్రభుత్వ పాఠశాల భవనాలకు రంగులు వేయడం కోసం రవాణా ఖర్చు, జీఎస్‌టీ, ఇతర పన్నులన్నింటినీ కలిపి ₹346 కోట్ల అంచనా ఒప్పంద విలువతో పాఠశాలలకు, సరఫరా తేదీ నుండి ఏడు సంవత్సరాల వారంటీతో పూర్తిచేయాలని జాతీయ పోటీ వేలాన్ని (2020, ఫిబ్రవరిలో తిరిగి టెండరింగ్ 2020 ఏప్రిల్లో) నిర్వహించింది.

ఏపీఈడబ్ల్యూఐడీసీ, అత్యల్ప బిడ్డర్ మెస్సర్స్ బెర్గర్ పెయింట్స్ ఇండియా లిమిటెడ్‌కు లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్ఓఏ) జారీ చేసి (2020 మే), ₹269.60 కోట్ల కాంట్రాక్ట్ విలువకు ఒప్పందం కుదుర్చుకుంది (2020 జూన్ 09). ఒప్పందంలోని 3(ఎ) నియమం ప్రకారం, ఏడేళ్ల వారంటీతో ఒప్పంద తేదీ నుంచి 120 రోజుల్లో రంగులు వేయడం పూర్తి చేయాల్సి ఉంది.

---

[50] టీడీఎస్ 400-3000 పీపీఎం ఉన్న నీటి వనరుల నుండి 150-400 పీపీఎం వరకు టీడీఎస్ తగ్గింపుతో

[51] ఒప్పందం ప్రకారం, మొత్తం ఇండెంట్ 3,500

దీనికి సంబంధించి, ఈ క్రింది పరిశీలనలు చేయబడ్డాయి:

### ఎ) ఆలస్యమైన అమలుకు జరిమానా విధించకపోవడం

ఒప్పందం యొక్క కార్యక్రమ మైలురాయి (నిబంధన 7.4) ప్రకారం, దిగువ **పట్టిక 3.2** లో ఇవ్వబడిన కాలావధి, నిర్దేశిత పరిమాణాల ప్రకారం పని పూర్తి చేయాలి:-

**పట్టిక 3.2: ఒప్పందం ప్రకారం కార్యక్రమ మైలురాళ్ళు**

| మైలురాయి | కాలావధి | పూర్తి కావాల్సిన పని |
|---|---|---|
| I | ఒక నెల | మొత్తం పరిమాణంలో 25% |
| II | రెండు నెలలు | 50% |
| III | మూడు నెలలు | 75% |
| IV | నాలుగు నెలలు | 100 % |

***మూలం:*** *ఒప్పందం యొక్క పేరా 7.4 ప్రకారం*

కాంట్రాక్టు ఒప్పందం, నియమం 8(బి) ప్రకారం ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో మినహా సంస్థ సకాలంలో పనిని పూర్తి చేయడంలో విఫలమైతే, ఆలస్యమయ్యే ప్రతి వారానికి ఒప్పంద విలువలో 0.10 శాతం రేటు గరిష్ఠంగా ఒప్పంద విలువలో 2.5 శాతం నిర్ణయించబడిన నష్టాన్ని చెల్లించాలి.

ఏదైనా సమయంలో, సంస్థ పనిని ప్రారంభించడంలో లేదా ఉత్పత్తిని సరఫరా చేయడంలో ఆలస్యం చేస్తోందని లేదా ఏదైనా ఉల్లంఘిస్తోందని ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక సంచాలకులు అభిప్రాయపడినా, ఒప్పందం లేదా సంస్థ యొక్క నిబంధనల పని పురోగతిని నిర్లక్ష్యం చేయడం లేదా ఆలస్యం చేయడం జరిగితే, ఒప్పందంలోని పేరా 9 ప్రకారం, ఈఎండీ/సెక్యూరిటీ డిపాజిట్ జప్తు చేయబడుతుంది.

ఉద్దేశించిన (2020 డిసెంబర్) పనిని వేగవంతం చేయడానికి, గడువు తేదీ అయిన 2021 జనవరి 31 లేదా అంతకు ముందు పనిని పూర్తి చేయాలని మెస్సర్స్ బెర్గర్ పెయింట్స్ ఇండియా లిమిటెడ్‌కు ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక సంచాలకులు లేఖ రాశారు. అయితే, సంస్థ 14,784 పాఠశాలలకు[52] గాను 612 పాఠశాలలను మాత్రమే పూర్తి చేసిందని, ఇది కేవలం 4.14 శాతం పురోగతి మాత్రమేనని టెండరు కమిటీ తీర్మానాల ద్వారా తెలియవచ్చింది. అయితే, ఎల్ 2 బిడ్డర్‌గా ఉన్న ఏషియన్ పెయింట్స్ సంస్థకు ఇండెంట్ పరిమాణానికి గానూ పనిలో కొంత భాగాన్ని కేటాయించాలని రాష్ట్ర ఉన్నత స్థాయి టెండర్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇంకా అదే నిబంధనలు మరియు షరతులపై మరో రెండు ప్రసిద్ధ కంపెనీలను 2021 జనవరి 31 నాటికి రంగులు వేసే పనిని పూర్తి చేయడానికి, బెర్గర్ పెయింట్స్ ఇండియా లిమిటెడ్ కోట్ చేసిన ధరపై నియమించాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక సంచాలకులను కమిటీ ఆదేశించింది. అయితే, ఈ పనిని ఏషియన్ పెయింట్స్, బెర్గర్ పెయింట్స్ అనే రెండు సంస్థలకు కేటాయించారు.

ముగింపు సమావేశం (2024 జనవరి) సందర్భంగా కమీషనర్ బదులిస్తూ, పాఠశాలలు సిద్ధంగా లేకపోవడంతో మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు గుత్తేదారు ఎదురుచూడాల్సి వచ్చిందన్నారు.

పని కోసం నిర్ణీత సమయాన్ని పొడిగించటానికి శాఖ ఒప్పంద సమయం పొడిగింపుకు సంబంధించిన విధి విధానాలను అనుసరించనందున కమీషనర్ యొక్క సమాధానం తనిఖీలో ధ్రువీకరించబడదు.

### బి) కార్మిక సెస్సును విధించకపోవడం/వసూలు చేయక పోవడం

ప్రభుత్వ ఏజెన్సీలు[53] నిర్మాణ వ్యయంపై అంటే పనుల ఒప్పందం విలువపై ఒక శాతం చొప్పున కార్మిక సెస్సు (ఎల్‌సీ) వసూలు చేయాలి

[52] రాష్ట్ర ఉన్నతాధికార టెండర్ కమిటీ (ఎస్‌హెచ్‌పీటీసీ) 2020 డిసెంబర్ 15 నాటి సమావేశ సంఖ్య 16లో తీర్మానం

[53] ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ & కర్మాగారాలు (ల్యాబ్ II) శాఖ జీఓఎంఎస్ సంఖ్య 112 తేదీ 2009 డిసెంబర్ 15

పని పూర్తయిన తర్వాత రంగులు వేసే పని కోసం గుత్తేదారుకు ₹292.43 కోట్లు చెల్లించారు (2022 అక్టోబర్). అయితే, ఒక శాతం చొప్పున కార్మిక సెస్సు అంటే, చెల్లించిన బిల్లులపై ₹2.92 కోట్లు విధించలేదు

ప్రభుత్వం ఆడిట్ పరిశీలనను ఆమోదించింది (2024 ఫిబ్రవరి), గుత్తేదారుకు చెల్లించవలసిన మొత్తం నుండి కార్మిక సెస్సుని వసూలు చేస్తామని భరోసా ఇచ్చింది.

### 3.2.2.4 పై కప్పు పంఖాల నాణ్యత

ఆరు[54] విశ్వవిద్యాలయాలు/కళాశాలల్లో నిర్వహించిన బహుళ తనిఖీ/నాణ్యతా నియంత్రణ పరీక్షల నివేదికల సమీక్షలో క్రింది విషయాలు వెల్లడయ్యాయి.

- అంగీకరించిన ప్రమాణాల ప్రకారం, సీఎంఎం[55] 210 ఉండాలి. అయితే, 2022 నవంబర్ నుండి 2023 ఫిబ్రవరి మధ్య కాలానికి సంబంధించిన పీఎంయూ ద్వారా రూపొందించబడిన ఏకీకృత నివేదిక ప్రకారం, పరీక్షించబడిన 157 పంఖాలకు గాను 71 పంఖాలు (45.22 శాతం) సీఎంఎం 210 స్పెసిఫికేషన్ కంటే తక్కువగా ఉన్నాయి.
- ఆర్‌పీఎం [56]380 ఉండాలి. అయితే, 2022 నవంబర్ నుండి 2023 ఫిబ్రవరి మధ్య కాలానికి సంబంధించి పీఎంయూ ద్వారా సమర్పించబడిన ఏకీకృత నివేదిక ప్రకారం, పరీక్షించిన 220 పంఖాలలో 67(30.45 శాతం) పంఖాల ఆర్‌పీఎం 380 కంటే తక్కువగా ఉంది.

ఈ విధంగా, పంఖాల ప్రమాణాలలో తేడాలు ఉన్నందున పంఖాల నాణ్యత రాజీ పడింది. ఇంకా, ముగింపు సమావేశంలో, చెప్పిన లోటుపాట్లకు అపరాధ రుసుము విధించినట్లు కమీషనర్ బదులిచ్చారు.

పై కప్పు పంఖాల సరఫరాలో నాణ్యతా పరామితులను పాటించనందుకు మెస్సర్స్ క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ సంస్థకు చెల్లించాల్సిన బ్యాలెన్స్ మొత్తం నుండి జరిమానాను వసూలు చేయాలని ఎండీ, ఏపీఈడబ్ల్యూఐడీసీ మరియు కమీషనర్ (పాఠశాల మౌలికవసతులు) ను అభ్యర్థించామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది(2024 మార్చి 05).

### 3.2.2.5 సిమెంట్ సేకరణ

కమీషనర్, పాఠశాల విద్యా శాఖ ఆదేశాల ప్రకారం[57], ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు సిమెంట్ కంపెనీల ద్వారా సిమెంట్ సరఫరా చేయబడుతుంది. విక్రేతలు / హార్డ్‌వేర్ దుకాణాల నుండి సిమెంట్ కోసం ఇన్‌వాయిస్‌లు తీసుకోవలసిన అవసరం లేదు. ఇండెంటింగ్ అధికారి (ఫీల్డు ఇంజనీర్) పాఠశాల వారీగా సైద్ధాంతిక అవసరాన్ని లెక్కించి, ఒక ఇండెంట్‌ను సమర్పించాలి (ఒక ఇండెంట్‌లో 400 సంచుల కంటే తక్కువ లేకుండా). ప్రతి ఇండెంట్ ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పాఠశాలలు మరియు రెండు డెలివరీ స్థానాలను కవర్ చేయవచ్చు. ఏపీసీ, ఎస్ఎస్ ఏకీకృత సిమెంట్ ఇండెంట్‌ను సిమెంట్ కంపెనీల అసోసియేషన్ సమన్వయకర్తకు (పరిశ్రమల శాఖ ఆమోదించిన తర్వాత ) వివిధ కంపెనీలకు కేటాయించాల్సి ఉంటుంది. డెలివరీ వివరాల గురించి సిమెంట్ కంపెనీల ద్వారా ప్రధానోపాధ్యాయులు/సీఆర్‌పీలు/క్షేత్ర స్థాయి ఇంజనీర్‌లకు తేదీ మరియు సమయంతో పాటు సంక్షిప్త సందేశం పంపబడుతుంది మరియు ప్రధానోపాధ్యాయులు సిమెంట్‌ను దించుకోవడానికి ఏర్పాట్లు చేస్తారు. ఏపీసీ, ఎస్ఎస్ వివిధ కంపెనీలకు కేటాయించే సిమెంటును కంపెనీల అసోసియేషన్ (పరిశ్రమల శాఖ ఆమోదించిన ) సమన్వయకర్త నుండి వైఎస్ఆర్ నిర్మాణ్ పోర్టల్ ద్వారా ఏకీకృత సిమెంట్ ఇండెంట్‌ను కోరుతుంది.

[54] ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్నం; ఎన్ఐటీ, తాడేపల్లిగూడెం; ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు; శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి; ఆర్‌జీయూకేటీ, కడప; జేఎన్‌టీయూ, అనంతపురము

[55] నిమిషానికి ఘనపు మీటర్లు (సీఎంఎం) అనేది పై కప్పు పంఖా ఒక నిమిషంలో అందించే గాలి పరిమాణం

[56] ఒక నిమిషానికి పరిభ్రమణాలు (ఆర్‌పీఎం) అనగా ఒక నిమిషానికి పై కప్పు పంఖా వేగము

[57] సర్క్యులర్ మెమో సంఖ్య 07/19-20/నాడు నేడు తేదీ: 01/04/2020

అయినప్పటికీ, వైఎస్ఆర్ నిర్మాణ్ పోర్టల్ (పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ ద్వారా నిర్వహించబడుతున్న వైఎస్ఆర్ పోర్టల్‌లో సిమెంట్ ధర ఒక్కో బస్తాకి ₹235) ద్వారా కాకుండా అదనపు మొత్తాన్ని చెల్లించి స్థానికంగా సిమెంట్ బస్తాలను కొనుగోలు చేసినట్లు గమనించడమైనది.

జిల్లా వారీగా 108 మచ్చుకు తనిఖీ చేయబడిన పాఠశాలల్లో 85 పాఠశాలల్లోని సిమెంట్ బస్తాల కొనుగోలు వివరాలు క్రింది **పట్టిక 3.3** లో ఇవ్వబడ్డాయి:

**పట్టిక 3.3: జిల్లా వారీగా మచ్చుకు తనిఖీ పాఠశాలల్లో సిమెంట్ బస్తా కొనుగోలు వివరాలు**

| జిల్లా పేరు | పాఠశాలల సంఖ్య | స్థానికంగా కొనుగోలు చేసిన సిమెంటు బస్తాల సంఖ్య | చెల్లించవలసిన మొత్తం @ ₹235/- ఒక బస్తాకు | చెల్లించిన మొత్తం (₹ లలో) | చెల్లించిన అదనపు మొత్తం (₹ లలో) |
|---|---|---|---|---|---|
| చిత్తూరు | 14 | 1,590 | 3,73,650 | 6,38,982 | 2,65,332 |
| కర్నూలు | 13 | 1,919 | 4,50,965 | 6,87,433 | 2,36,468 |
| కోనసీమ | 15 | 1,148 | 2,69,780 | 4,48,159 | 1,78,379 |
| తూర్పు గోదావరి | 15 | 2,046 | 4,81,280 | 7,04,485 | 2,23,205 |
| కృష్ణా | 15 | 2,734 | 6,42,490 | 10,07,997 | 3,65,507 |
| గుంటూరు | 13 | 2,743 | 6,44,605 | 9,82,184 | 3,37,579 |
| మొత్తం | **85** | **12,180** | **28,62,300** | **44,69,240** | **16,06,470** |

ఈ విధంగా, మచ్చుకు తనిఖీ చేసిన 85 పాఠశాలల్లో రివాల్వింగ్ ఫండ్ (ఆర్ఎఫ్) నుండి 12,180 సిమెంట్ బస్తాలు స్థానిక మార్కెట్‌లో ₹44,69,240కి కొనుగోలు చేసారు. దీని వల్ల ₹16,06,470 అదనపు ఖర్చు అయింది.

కోవిడ్ కారణంగా సిమెంట్ సరఫరా లేకపోవడంతో కొన్ని పనుల మీద ప్రతికూలంగా ప్రభావం చూపడం వల్ల సిమెంటును పరిమిత పరిమాణంలో స్థానికంగా కొనుగోలు చేసేందుకు సూచనలు జారీ చేయబడ్డాయని శాఖ సమాధానం ఇచ్చింది (2023 జూన్).

ఇంకా, ముగింపు సమావేశం సందర్భంగా, ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ, ఈ పని కోవిడ్ మహమ్మారి సమయంలో నిర్వహించబడిందనీ, దీని కారణంగా పనిలేకుండా ఉండే కార్మికులను తగ్గించడం కోసం పాఠశాలలు ఎక్కువ ధరకు సిమెంట్‌ను కొనుగోలు చేశాయని చెప్పారు.

పని అవసరాన్ని బట్టి కూలీలను నియమించడం, పరిమిత పరిమాణంలో మాత్రమే సిమెంట్ కొనుగోలు చేయాల్సి ఉన్నందున సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 3.2.2.6 పంపిణీదారులకు చెల్లింపులు చేస్తున్నప్పుడు జీఎస్‌టీపై విధించబడని టీడీఎస్

సిజీఎస్‌టీ చట్టం, 2017 సెక్షన్ 51 మరియు ఏపీ ఎస్‌జీఎస్‌టీ చట్టం, 2017 సెక్షన్ 51 ప్రకారం, టీడీఎస్ పన్ను పరిధిలోకి వచ్చే వస్తువులు లేదా సేవలకి సంబంధించి సరఫరాదారుకు చేసిన చెల్లింపులపై మొత్తం విలువ రెండు లక్షల యాభై వేల రూపాయల కంటే ఎక్కువ ఉన్నప్పుడు పన్ను విధించాలి.

సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సీఎఫ్ఎంఎస్) సమాచారం ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా, 2021 జనవరి నుండి 2023 మార్చి వరకు 18 మంది సరఫరాదారులకు ₹1,140.97 కోట్ల మొత్తాన్ని చెల్లించారు. ఈ మొత్తంపై రెండు శాతం చొప్పున టీడీఎస్ విధించలేదని గమనించడమైనది. ఈ విధంగా, జీఎస్‌టీ నిబంధనల ప్రకారం రెండు శాతం చొప్పున టీడీఎస్‌కి ₹22.82 కోట్ల మొత్తాన్ని విధించి ప్రభుత్వ ఖాతాలోకి జమ చేయాలి.

రాష్ట్రంలో సరఫరాదారులకు చేసిన చెల్లింపుల వివరాలు మరియు టీడీఎస్ విధించవలసిన వివరాలు క్రింది **పట్టిక 3.4** లో చూపబడ్డాయి:

**పట్టిక 3.4: కేంద్రీకృత సేకరణలో జీఎస్‌టీపై విధించాల్సిన టీడీఎస్‌ను చూపే ప్రకటన**

| క్రమ సంఖ్య | లబ్ధిదారు | పంపిణీ చేసిన వస్తువు/పని ఒప్పందం | లబ్ధిదారు కోడ్ | మొత్తం చెల్లింపు విలువ ₹ లలో | విధించవలసిన జీఎస్‌టీ టీడీఎస్ | |
|---|---|---|---|---|---|---|
| | | | | | % | విలువ ₹ లలో |
| 1 | అహ్లాద ఇంజనీర్స్ లిమిటెడ్ | గ్రీన్ చాక్ బోర్డు & త్రాగునీటి వ్యవస్థలు | 1008657805 | 67,69,48,786 | 2 | 1,35,38,976 |
| 2 | ఆక్వా యార్డ్ | త్రాగునీటి వ్యవస్థలు | 1008701405 | 2,26,54,270 | 2 | 4,53,085 |
| 3 | ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ | రంగులు | 1008675822 | 45,77,33,540 | 2 | 91,54,671 |
| 4 | బెంగళూరు లిమిటెడ్ యునైటెడ్ టెలి లింక్స్ | స్మార్ట్ టీవీ | 1002794254 | 20,90,63,920 | 2 | 41,81,278 |
| 5 | బెర్గర్ పెయింట్స్ ఇండియా లిమిటెడ్ | రంగులు | 1000297675 | 2,92,55,56,254 | 2 | 5,85,11,125 |
| 6 | సెరా శానిటరీవేర్ లిమిటెడ్ | పారిశుద్ధ్య వస్తువులు | 1008220597 | 42,04,22,942 | 2 | 84,08,459 |
| 7 | క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ | పై కప్పు పంఖా | 1008220054 | 35,20,93,507 | 2 | 70,41,870 |
| 8 | ఇన్నోవేటివ్ ఆక్వా సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ | త్రాగునీటి వ్యవస్థలు | 1008675755 | 40,11,76,354 | 2 | 80,23,527 |
| 9 | ఇన్నోవేటివ్ ఇండస్ట్రీస్ | ఫర్నిచర్ | 1008701431 | 52,95,79,096 | 2 | 1,05,91,582 |
| 10 | లివ్‌ప్యూర్ ప్రైవేట్ లిమిటెడ్ | త్రాగునీటి వ్యవస్థలు | 1008718552 | 59,98,06,893 | 2 | 1,19,96,138 |
| 11 | మెథోడెక్స్ సిస్టమ్స్ లిమిటెడ్ | ఫర్నిచర్ | 1000476682 | 1,72,40,53,578 | 2 | 3,44,81,072 |
| 12 | మిర్క్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ | స్మార్ట్ టీవీ | 1008217493 | 15,57,80,739 | 2 | 31,15,615 |
| 13 | ప్రిన్స్ బోర్డ్ ఇండియా | గ్రీన్ చాక్ బోర్డు | 1008220223 | 51,85,39,932 | 2 | 1,03,70,799 |
| 14 | స్వదేశీ ఖాదీ గ్రామోద్యోగ్ | ఫర్నిచర్ | 1008720110 | 32,70,90,603 | 2 | 65,41,812 |
| 15 | సినర్జీ పంచింగ్ ప్రైవేట్ లిమిటెడ్ | ఫర్నిచర్ | 1008718776 | 31,67,27,967 | 2 | 63,34,559 |
| 16 | వీ3 ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ | ఫర్నిచర్ | 1008705364 | 52,65,30,960 | 2 | 1,05,30,619 |
| 17 | వైట్‌మార్క్ లిమిటెడ్ | గ్రీన్ చాక్ బోర్డు | 1008657861 | 14,11,73,981 | 2 | 28,23,480 |
| 18 | జెనిత్ మెటాప్లాస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ | ఫర్నిచర్ | 1008220200 | 1,10,47,43,634 | 2 | 2,20,94,873 |
| మొత్తం | | | | **11,40,96,76,956** | | **22,81,93,540** |

మచ్చుకు తనిఖీ చేసిన ఆరు జిల్లాల్లో, 18 మంది సరఫరాదారులకు ₹526.75 కోట్లు చెల్లించారు. సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లోని బిల్లుల పరిశీలనలో సరఫరాదారులకు చేసిన చెల్లింపులపై టీడీఎస్ మినహాయించబడలేదని తేలింది.

ముగింపు సమావేశంలో కమీషనర్ సమాధానమిస్తూ, ఐటీకి సంబంధించి రెండు శాతం టీడీఎస్ చెల్లించబడిందని చెప్పారు. కమీషనర్ తన సమాధానంలో ఐటీ చట్టం ప్రకారం ఐటీ యొక్క రికవరీ అవసరం లేదని మరియు అదనపు పథక సమన్వయకర్త (ఏపీసీ) స్థాయిలో సరఫరాదారుల నుండి ఇప్పటికే చేసిన రెండు శాతం తగ్గింపు జీఎస్‌టీకి సర్దుబాటు చేయబడుతుందని బదులిచ్చారు (2024 మే 30). ఆ విధంగా, ఈ విషయంలో ఆ శాఖ దీనికి కట్టుబడిఉంటుందని హామీ ఇచ్చింది.

### 3.2.2.7 మచ్చుకు తనిఖీ చేయబడిన పాఠశాలల్లో ఉమ్మడి భౌతిక ధ్రువీకరణతో సహా పరిశీలనలు

మచ్చుకు తనిఖీ చేసిన ఆరు జిల్లాల్లోని 108 పాఠశాలల్లో 2022, నవంబర్ నుండి 2023, ఫిబ్రవరి వరకు నిర్వహించిన భౌతిక ధ్రువీకరణలో ఈ క్రింది పరిశీలనలు చేయబడ్డాయి.

#### (i) గ్రీన్ చాక్ బోర్డులు

సాంకేతిక కరదీపిక ప్రకారం, ప్రతి తరగతి గదిలో ఒక గ్రీన్ చాక్ బోర్డు (జీసీబీ) అమర్చాలి.

అయినప్పటికీ, మచ్చుకు తనిఖీ చేయబడిన పాఠశాలల్లో అవసరమైన దానికంటే ఎక్కువ సంఖ్యలో జీసీబీలు సరఫరా చేయబడినట్లు ఆడిట్ గమనించింది. మచ్చుకు తనిఖీ చేయబడిన 108 పాఠశాలలకు గాను 25 పాఠశాలల్లో (**పట్టిక 3.5** లో అందించిన విధంగా) 87 జీసీబీలు ఉపయోగించకుండా ఉన్నాయి:

**పట్టిక 3.5: పాఠశాల వారీగా ఉపయోగంలో లేని గ్రీన్ చాక్ బోర్డుల సంఖ్యను చూపే ప్రకటన**

| జిల్లా పేరు | పాఠశాలల సంఖ్య | అవసరమైన జీసీబీల సంఖ్య | అందచేసిన జీసీబీల సంఖ్య | ఉపయోగించని జీసీబీల సంఖ్య |
|---|---|---|---|---|
| చిత్తూరు | 10 | 79 | 86 | 29 |
| కర్నూలు | 09 | 84 | 94 | 38 |
| కోనసీమ | 03 | 15 | 23 | 08 |
| తూర్పు గోదావరి | 01 | 07 | 08 | 01 |
| కృష్ణా | 02 | 23 | 34 | 11 |
| మొత్తం | **25** | **208** | **245** | **87** |




***ఛాయా చిత్రం 3.1:*** *చిత్తూరు జిల్లాలోని బీఎన్ఆర్ పేట జెడ్పీ హెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుని గదిలో నిరుపయోగంగా ఉన్న జీసీబీ*



***ఛాయా చిత్రం 3.2:*** *చిత్తూరు జిల్లా నగరిలోని మూలనాథం ఎంపీపీఎస్‌లో నిరుపయోగంగా ఉంచిన జీసీబీ*



***ఛాయా చిత్రం 3.3:*** *తూర్పు గోదావరి జిల్లా కడియం మండలంలోని ఎంఆర్ పాలెం ఎంపీయూపీ పాఠశాలలో నిరుపయోగంగా ఉంచిన జీసీబీ*



***ఛాయా చిత్రం 3.4:*** *కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని కొత్తపాలెం జెడ్పీ హెచ్ పాఠశాలలో నిరుపయోగంగా ఉంచిన జీసీబీ*

మొదటి దశ పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ లు (ఐఎఫ్‌పీలు) మరియు స్మార్ట్ టీవీలు అందించినందున, మచ్చుకు తనిఖీ చేయబడిన పాఠశాలల్లో ఇన్‌స్టాల్ చేయబడిన మరియు అదనపు జీసీబీలు మూడవ దశలోని పాఠశాలలకు మార్చబడ్డాయని శాఖ సమాధానం ఇచ్చింది (2023 జూన్).

ఉమ్మడి భౌతిక ధ్రువీకరణ సమయంలో 2020 మరియు 2021 సంవత్సరాల్లో సరఫరా చేయబడిన గ్రీన్ చాక్ బోర్డులు (108 పాఠశాలల్లో 87) నిష్క్రియంగా మిగిలి ఉన్నాయనే వాస్తవం నిర్ధారించబడినందున ప్రభుత్వ ప్రత్యుత్తరం ఆమోదయోగ్యం కాదు.

### (ii) తాగునీటి వ్యవస్థ

**పేరా 3.2.1**లో వివరించిన విధంగా తాగునీటి వ్యవస్థలు (డీడబ్ల్యూఎస్) ఉమ్మడిగా సేకరించి పాఠశాలలకు సరఫరా చేయబడ్డాయి. పాఠశాలల క్షేత్ర సందర్శనల సమయంలో, మచ్చుకు తనిఖీ చేసిన 108 పాఠశాలలకు గాను 33 పాఠశాలల్లో డీడబ్ల్యూఎస్ పని చేయడం లేదని గమనించడమైనది. ***అనుబంధం 3.2*** లో వివరించిన విధంగా డీడబ్ల్యూఎస్ సేకరించేందుకు ₹76.80 లక్షల వ్యయం జరిగింది. జిల్లా వారీగా సమాచారం **పట్టిక 3.6**లో ఇవ్వబడింది:

**పట్టిక 3.6: జిల్లా వారీగా మచ్చుకు తనిఖీ చేసిన పాఠశాలల్లో పని చేయకుండా ఉన్న తాగునీటి వ్యవస్థల సమాచారం**

| జిల్లా పేరు | తాగునీటి వ్యవస్థలు పనిచేయకుండా ఉన్న పాఠశాలల సంఖ్య |
|---|---|
| చిత్తూరు | 11 |
| కర్నూలు | 6 |
| కోనసీమ | 3 |
| తూర్పు గోదావరి | 2 |
| కృష్ణా | 6 |
| గుంటూరు | 5 |
| మొత్తం | 33 |

డీడబ్ల్యూఎస్ సమస్యలను సరఫరాదారులతో వెబ్ఎక్స్ సమావేశాల ద్వారా నిశితంగా పరిశీలించామని మరియు లోపాలను సరిదిద్దిన తర్వాత మాత్రమే నిలిపివేయబడిన చెల్లింపులు విడుదల చేయబడతాయని శాఖ పేర్కొంది. ఇంకా, మెస్సర్స్. లివ్ ప్యూర్ కంపెనీ (సరఫరాదారుల్లో ఒకరు) సమస్యలను పరిష్కరించనందున నిషేధిత జాబితాలో చేర్చబడింది. మిగిలిన చెల్లింపులు కూడా నిలిపివేయబడ్డాయి.

అయితే డీడబ్ల్యూఎస్ పనిచేయకపోవడంతో పాఠశాల విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించాలన్న లక్ష్యం నెరవేరలేదు.

### (iii) రంగులు వేసే పని

### (ఎ) గోడలపై సరిగా లేని రంగులు

గోడలపై చిత్రాలతో కూడిన అంతర్గత మరియు బాహ్యంగా కనపడే రంగులు మన బడి నాడు-నేడు పథకంలో కీలకమైన భాగాలలో ఒకటి. ఇది నాడు-నేడు కార్యక్రమాల్లో కనిపించే ముఖ్యమైన భాగం. చిత్తూరు జిల్లాలో పరీక్షించిన 18 పాఠశాలలకు గాను ఏడు పాఠశాలల్లో, కర్నూలు జిల్లాలో 16 పాఠశాలలకు గాను పది పాఠశాలల్లో, గుంటూరు జిల్లాలో 16 పాఠశాలలకు గాను రెండు పాఠశాలల్లో పాత రంగును తొలగించకుండా, తుడిచివేయకుండా గోడలకు కొత్త రంగులు వేయబడ్డాయని గమనించడమైనది .



***ఛాయా చిత్రం 3.5:*** *నగరిలోని పూడపేట జెడ్పీహెచ్ పాఠశాలలో పాత రంగు తొలగించకుండా రంగులు వేయబడ్డాయి*

## (బి) ఎం బుక్ పరిమాణాలలో వ్యత్యాసం కారణంగా అధిక చెల్లింపులు

రంగులు వేసే పనికి అంగీకరించిన చెల్లింపు విధానం: (i) పని పూర్తయిన తర్వాత అందించిన ఇన్‌వాయిస్ ఆధారంగా, చేసిన పని విలువలో 70 శాతం మరియు పని చేసిన ప్రమాణపత్రాన్ని అప్‌లోడ్ చేసిన తర్వాత ప్రధానోపాధ్యాయుని ద్వారా మెస్సర్స్ బెర్గర్‌కు చెల్లించబడుతుంది, (ii) మండల ఇంజనీర్ ద్వారా కొలవబడిన మరియు ఎం-బుక్ అప్‌లోడ్ అయిన తర్వాత, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు (డీఈఈ) చే సరిచూడబడిన తర్వాత 20 శాతం చెల్లించబడుతుంది, (iii) అంగీకరించిన అన్ని షరతుల నెరవేర్పుపై మిగిలిన 10 శాతం చెల్లించబడుతుంది.

రంగులు వేసే పనికి సంబంధించిన ఎం-బుక్ నమోదులను వ్యయ ప్రకటనలతో పోల్చినప్పుడు, **పట్టిక 3.7** లో ఇచ్చినట్లుగా మచ్చుకు తనిఖీ చేసిన 108 పాఠశాలలకు గాను (***అనుబంధం 3.3***) 35 పాఠశాలల్లో మెస్సర్స్ బెర్గర్ పెయింట్స్ లిమిటెడ్ మరియు మెస్సర్స్ ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్‌కి ₹25,90,478 అదనపు చెల్లింపులు జరిగినట్లు గమనించడమైనది.

**పట్టిక 3.7: మనబడి నాడు-నేడు మొదటి దశ కింద కొలతల పుస్తకం కంటే అధికంగా చేయబడిన చెల్లింపులను చూపే ప్రకటన**

*(విలువ ₹ లలో )*

| జిల్లా | సంస్థ పేరు | పాఠశాలల సంఖ్య | ఎం పుస్తకం ప్రకారం చెల్లించవలసిన మొత్తం | చెల్లించినది | అదనంగా చెల్లించబడినది |
|---|---|---|---|---|---|
| కోనసీమ | మెస్సర్స్ బెర్గర్ పెయింట్స్ లిమిటెడ్ | 12 | 34,20,925 | 37,18,799 | 2,97,874 |
| తూర్పు గోదావరి | మెస్సర్స్ బెర్గర్ పెయింట్స్ లిమిటెడ్ | 10 | 34,76,272 | 47,64,007 | 12,87,735 |
| కృష్ణా | మెస్సర్స్ ఏషియన్ పెయింట్స్ | 7 | 18,46,300 | 24,77,982 | 6,31,682 |
| గుంటూరు | మెస్సర్స్ బెర్గర్ పెయింట్స్ లిమిటెడ్. & మెస్సర్స్ ఏషియన్ పెయింట్స్ | 6 | 4,54,363 | 8,27,550 | 3,73,187 |
| మొత్తం | | **35** | **91,97,860** | **1,17,88,338** | **25,90,478** |

కొలతలలో వ్యత్యాసాల కారణంగా రంగులు వేసే పనికి అదనపు చెల్లింపులను చేశామని, వారికి చివరి చెల్లింపులు[58] చేసేటప్పుడు అది మినహాయించబడుతుందని శాఖ పేర్కొంది.

## (iv) డ్యూయల్ డెస్కులు

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం[59], మొదటి దశ మనబడి నాడు నేడులో ఎంపిక చేయబడిన ప్రతి పాఠశాలకు కావలసిన ప్రమాణాలను చేరుకోవడానికి, పాఠశాల వాస్తవ అవసరాల ఆధారంగా సౌకర్యాలను అందించాలి. పాఠశాలల్లో విద్యార్థులకు డ్యూయల్ డెస్క్‌లను అందించడం అనేది సౌకర్యాలలో ఒకటి. అయితే, ***అనుబంధం 3.4*** లో ఇచ్చిన విధంగా మచ్చుకు తనిఖీ చేసిన 108 పాఠశాలలకు గాను 32 పాఠశాలల్లో 1,973 మంది విద్యార్థులు నేలపై కూర్చున్నట్లు గమనించడమైంది.

---

58 ఒప్పందంలోని పేరా 3(కె) ప్రకారం, నాణ్యతను పరిశీలించిన తర్వాత (7.5 శాతం) మరియు రెండు సంవత్సరాలు ముగిసిన తర్వాత (2.5 శాతం) రెండు చెల్లింపులూ విడుదల చేయబడతాయి

59 జీఓఎంఎస్ సంఖ్య 87 తేదీ 30/11/2019



**ఛాయా చిత్రం 3.6:** *తూర్పు గోదావరి జిల్లా, కడియం మండలం లోని వీరవరం ఎంపీపీఎస్*



**ఛాయా చిత్రం 3.7:** *తూర్పు గోదావరి జిల్లా, కడియం మండలం లోని వీరవరం జెడ్పీ హెచ్ఎస్*



**ఛాయా చిత్రం 3.8:** *గుంటూరు జిల్లా గుంటూరు మండలం లోని ఓబులనాయుడుపాలెం ఎంపీయూపీఎస్*

తల్లిదండ్రుల కమిటీలు (పీసీలు) ఇండెంట్‌లను అందించాయని మరియు పాఠశాలల అవసరాల ఆధారంగా పనులు జరుగుతాయని కొన్ని కేంద్రీకృత సేకరణ వస్తువుల (సీపీఎం) అంశాలను తగ్గించాల్సి ఉందని శాఖ పేర్కొంది. అంతేకాకుండా, మొదటి దశ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ ఫర్నిచర్ అందించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు శాఖ పేర్కొంది.

అయితే వాస్తవం ఏమిటంటే ఈ పథకంపై ₹3,818.52 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, బెంచీలు వంటి ప్రాథమిక సౌకర్యాలను కూడా ప్రభుత్వం అందించలేకపోయింది.

***సిఫార్సు 3.2: ఇండెంట్ పెట్టడానికి ముందు వస్తువుల వాస్తవ అవసరాలను నిర్ధారించే వ్యవస్థను రూపొందించడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలి. అంతేకాక, అవసరానికి మించి వస్తువులను ఇండెంటు చేసిన అధికారులని బాధ్యుల్ని చేయాలి.***

### (v) ఆంగ్ల ప్రయోగశాల

ఆంగ్ల ప్రయోగశాల అనేది స్మార్ట్ టీవీలు, స్మార్ట్ స్క్రీన్‌లు మొదలైన దృశ్య శ్రవణ పరికరాల ద్వారా నిర్మాణాత్మక పద్ధతిలో ఆంగ్ల ప్రాథమికాలను నేర్చుకోవడానికి మరియు అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు ఒక విద్యా భాగం.

ఎ) నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం, స్మార్ట్ టీవీలు కనిష్టంగా 32 జీబీ సామర్థ్యాన్ని కలిగి ఉండాలి, వీటిలో కనీసం 8 జీబీ అంతర్నిర్మితంగా ఉండాలి. మిగిలినవి సమీకృత నిల్వగా ఉండాలి. అయితే, మచ్చుకు తనిఖీ చేసిన ఆరు జిల్లాల్లోని 108 పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు (టీసీఎల్-55పి615) 16 జీబీ అంతర్గత నిల్వను కలిగి ఉన్నాయని మరియు మిగిలిన 16 జీబీ బాహ్య నిల్వ లేదని గమనించబడింది.

బి) నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం, కాంతి ప్రకాశం (బ్రైట్‌నెస్) 300 నిట్‌లు లేదా అంత కంటే ఎక్కువగా ఉండాలి. అయితే సరఫరా చేయబడిన టీవీల (55పి615) ప్రమాణాల ప్రకారం, కాంతి ప్రకాశం 270 నిట్‌లుగా ఉంది.

సి) ప్రమాణాల ప్రకారం, టీవీలకు రెండు యూఎస్‌బీ పోర్టులు ఉండాలి, ఒక అంతర్నిర్మిత యూఎస్‌బీ పోర్టు, రెండోది ఆర్ఎస్-232 పోర్టు. అయితే, పాఠశాల సందర్శన సమయంలో నిర్ధారించిన ప్రమాణాల ప్రకారం, టీవీలలో కేవలం ఒక యూఎస్‌బీ పోర్టు మాత్రమే ఉందని మరియు ఆర్ఎస్-232 పోర్టు లేదని గమనించబడింది.

డి) ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రతి టీవీతో 20 వాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యం కల వేరు చేయగలిగిన సౌండ్ బార్‌లను సరఫరా చేయాలి. అయితే, ఆరు జిల్లాల్లోని 72 మచ్చుకు తనిఖీ చేయబడిన ప్రాథమిక,

ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏడింటిలో[60] మాత్రమే సౌండ్‌బార్ సరఫరా చేయబడిందని మరియు ఒక ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్, ఆత్మకూరు) టీవీ కోసం ఇండెంట్ వేయలేదని గమనించడమైంది.

పైన పేర్కొన్న ప్రదేశాలలో కనపడకుండా పోయిన భాగాలను మరల సరఫరా చేయడానికి ఏపీఈడబ్ల్యూఐడీసీ ద్వారా వివరాలు విక్రేతకు పంపబడతాయని శాఖ పేర్కొంది.

స్మార్ట్ టీవీలు 11,000 పాఠశాలలకు సరఫరా చేయబడినందున (2020-21) వేరు చేయగలిగిన సౌండ్‌బార్‌ల సరఫరాను సరఫరా సమయంలో మాత్రమే పర్యవేక్షించడం/నిశ్చయపరచడం జరిగింది కాబట్టి ప్రత్యుత్తరం ఆమోదయోగ్యం కాదు. స్మార్ట్ టీవీలు సరఫరా చేయబడిన అన్ని పాఠశాలల్లో కొరతను అంచనా వేసి, ఒప్పందంలో పేర్కొన్న విధంగా ప్రమాణాల ప్రకారం సరఫరా చేయని టీవీలను భర్తీ చేయవచ్చు.

స్మార్ట్ టీవీల సరఫరా సమయంలోనూ (కేంద్రీకృతంగా సేకరించిన వస్తువు) ప్రమాణాల ప్రకారం టీవీల సరఫరా చేయడంలోనూ, తర్వాత కనపడకుండాపోయిన ఉపకరణాలు సరఫరా చేయడంలోనూ పర్యవేక్షణ లోపం కనబడింది.

### (vi) మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల అమలు

కమీషనర్ సర్క్యులర్[61] ప్రకారం ఆవరణలోని లోతట్టు కుంటలను, పాఠశాల భవనాలు, చుట్టుపక్కల లోతట్టు ప్రాంతాన్ని పూడుస్తూ ఎత్తు పెంచాలి. పూడ్చే పని పరిమాణం 30 క్యూబిక్ మీటర్లకు మించి ఉంటే, అటువంటి పనిని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మాత్రమే చేపట్టాలి.

మచ్చుకు తనిఖీ చేసిన 108 పాఠశాలలకు గాను 26 పాఠశాలల్లో (***అనుబంధం 3.5***), దిగువ **పట్టిక 3.8** లో చూపిన విధంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా మనబడి-నాడు నేడు యొక్క కాంపోనెంట్ పెద్ద తరహా & చిన్న తరహా మరమ్మత్తుల క్రింద 30 ఘనపు మీటర్ల కంటే ఎక్కువ లోతట్టు ప్రాంతాలను పూడ్చిన పనిని గమనించడమైంది.

**పట్టిక 3.8: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా మనబడి-నాడునేడు యొక్క ప్రధాన & స్వల్ప మరమత్తుల కింద చేపట్టబడిన 30 ఘనపు మీటర్ల కంటే ఎక్కువ లోతట్టు ప్రాంతాలను నింపే పనులు**

| జిల్లా పేరు | పాఠశాలల సంఖ్య | చేయబడిన పని పరిమాణం (ఘనపు మీటర్లలో) |
|---|---|---|
| చిత్తూరు | 4 | 303.60 |
| కర్నూలు | 6 | 505.21 |
| కోనసీమ | 3 | 397.00 |
| తూర్పు గోదావరి | 6 | 1,136.82 |
| కృష్ణా | 7 | 891.30 |
| మొత్తం | **26** | **3,233.93** |

తగు చర్యలు తీసుకుంటామని శాఖ హామీ ఇచ్చింది.

60 పెదవడ్లపూడి (మెయిన్) ఎంపీపీఎస్, మంగళగిరి 7వ వార్డు పురపాలక పాఠశాల, 22వ వార్డు పురపాలక ప్రాథమికోన్నత పాఠశాల బీహెచ్ఎల్, పెనుమాక ఎంపీపీఎస్ (హిందూ ప్రాథమిక), ఆర్ఆర్ నగర్ ఎంపీపీఎస్, నులకపేట ఎంపీయూపీఎస్ (పట్టణ), కుంచినపల్లి ఎంపీయూపీఎస్

61 సర్క్యులర్ ఆర్‌సీ సంఖ్య 1138010/డీపీ/ఎంబీఎన్ఎన్/2020 తేదీ 03/05/2020 లోని పేరా 3.హెచ్ iv

### (vii) తల్లిదండ్రుల కమిటీల బ్యాంక్ ఖాతాలలో నిష్క్రియంగా ఉంచబడిన నిధులు

మిగులు పాఠశాలల నుండి నిధులను జిల్లాలో అవసరం ఉన్న పాఠశాలలకు బదిలీ చేయడానికి[62], సంయుక్త కలెక్టర్ (అభివృద్ధి) ఆమోదంతో నిధుల కోసం బదిలీ నమోదు ఉత్తర్వు (టీఈఓ) విధానాన్ని అమలు చేయడానికి ఏర్పాటు చేయబడింది. అదనపు పథక సమన్వయకర్త (ఏపీసీ) మరియు సంయుక్త కలెక్టర్ (అభివృద్ధి) సూచించిన విధానంలో మండల విద్యాధికారుల (ఎంఈఓలు) నుండి అందుబాటులో ఉన్న పాఠశాలల జాబితా మరియు మిగులు మొత్తాన్ని పొందాలి. జిల్లా విద్యాధికారి (డీఈఓ) వాస్తవ అవసరాల ఆధారంగా ఒక పాఠశాల నుండి మరొక పాఠశాలకు బదిలీ నమోదును ప్రతిపాదించాలి. సంయుక్త కలెక్టర్ (అభివృద్ధి) నుండి ఆమోదం తీసుకోవాలి. ఆర్థిక మరియు పద్దుల అధికారి (ఎఫ్ఏఓ) ద్వారా ఎస్టీఎంఎస్‌లో నమోదు చేయాలి.

2022 నవంబర్ నుండి 2023 ఫిబ్రవరి వరకు తల్లిదండ్రుల కమిటీ బ్యాంక్ ఖాతాలలో కోనసీమ, తూర్పు గోదావరి మరియు కృష్ణా జిల్లాల్లోని మచ్చుకు తనిఖీ చేసిన 54 పాఠశాలలకు గాను (***అనుబంధం 3.6***) 51 పాఠశాలల్లో 2021 జూలై నుండి ₹27,50,673 నిరుపయోగంగా ఉన్నట్లు గమనించడమైనది.

ఐఎఫ్‌పీల ఫిక్సింగ్ కోసం తల్లిదండ్రుల కమిటీల వద్ద అందుబాటులో ఉన్న మొత్తాలను వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు శాఖ పేర్కొంది. అయితే, అటువంటి సూచనలకు మద్దతుగా ఎలాంటి పత్రాన్ని శాఖ అందించలేదు. మొదటి దశ ఎంబీఎన్ఎన్ పూర్తయిన అంటే 2021 ఆగస్ట్ తర్వాత నిధులు నిష్క్రియంగా ఉన్నాయి.

### (viii) నాణ్యత నియంత్రణ పరీక్షలను నిర్వహించకపోవడం

మార్గదర్శకాల యొక్క పేరా-XV[63] ప్రకారం, అమలు చేసే ఏజెన్సీల యొక్క అన్ని నాణ్యత నియంత్రణ (క్యూసీ) విభాగాలు[64] ₹15 లక్షలకు మించిన పనులను ముగించే ముందు కనీసం ఒక్కసారైనా తనిఖీ చేయాలి. నాణ్యత హామీ సేవల కోసం వారు అంచనా వ్యయంలో 0.5 శాతం కూడా పొందుతారు.

మచ్చుకు తనిఖీ చేసిన పాఠశాలల్లో నాణ్యత నియంత్రణ పరీక్షలకు సంబంధించి ఎలాంటి రికార్డులు నిర్వహించనందున అమలు చేసే ఏజెన్సీలు నాణ్యత నియంత్రణ పరీక్షలను నిర్వహించాయో లేదో ఆడిట్ నిర్ధారించలేకపోయింది. ఆ విధంగా, ఏపీఈడబ్ల్యూఐడీసీకి చేసిన ₹6.38 కోట్ల చెల్లింపు (సేవా రుసుములపై చెల్లింపులో 0.5 శాతం) ఆడిట్ ద్వారా హామీ ఇవ్వబడలేదు.

జీఓఎం సంఖ్య 27 ప్రకారం నాణ్యత నియంత్రణ తనిఖీలను అమలు చేసే ఏజెన్సీలు నిర్వహించాయని, నాణ్యత నియంత్రణ తనిఖీల చెల్లింపులు ఏపీఈడబ్ల్యూఐడీసీకి మాత్రమే అనుమతించబడ్డాయని శాఖ పేర్కొంది.

### (ix) సంస్థాపన తర్వాత త్రాగునీటి పరీక్ష

మనబడి-నాడునేడు యొక్క సాంకేతిక శిక్షణా కరదీపిక ప్రతి ఆరు నెలలకు అధీకృత శాఖ ద్వారా త్రాగునీటి నాణ్యతను పరీక్షించాలని నిర్దేశించింది. మొత్తం కరిగిన ఘనపదార్థాలు (టీడీఎస్) 400 పీపీఎం కంటే తక్కువగా ఉండాలి మరియు ఫ్లోరైడ్ కంటెంట్ లీటరుకు 1.5 మిల్లీ గ్రాము కంటే తక్కువగా ఉండాలి. మచ్చుకు తనిఖీ చేసిన 108 పాఠశాలలన్నింటిలో, డీడబ్ల్యూఎస్ వ్యవస్థాపనకు ముందు నీటి పరీక్ష నిర్వహించబడింది, కానీ ఆ తర్వాత కాలానుగుణంగా నీటి పరీక్ష జరగలేదని ఆడిట్ గుర్తించింది.

---

62 సర్క్యులర్ సంఖ్య: 1322231/ఎంబీఎన్ఎన్/2021 తేదీ 05/02/2021

63 జీఓఎంఎస్ సంఖ్య 87 పాఠశాల విద్య (ప్రోగ్ II) శాఖ, తేదీ 30/11/2019

64 మార్గదర్శకాల పేరా-XV

2023 ఏప్రిల్ నుండి జూన్ వరకు ప్రతి వర్షాకాలంలో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం పాఠశాలలు, అంగన్‌వాడీలలో తాగునీటి నాణ్యతను పరీక్షిస్తుందని తన సమాధానంలో శాఖ పేర్కొంది. దీనికి మద్దతుగా, జల్ జీవన్ మిషన్ కార్యక్రమం క్రింద, పాఠశాలలు, అంగన్‌వాడీలలో కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు.

మచ్చుకు తనిఖీ చేసిన పాఠశాలల్లో నీటిని శుభ్రపరచే యంత్రాలను అమర్చిన తర్వాత నీటి పరీక్ష ఎప్పుడూ జరగనందున శాఖ యొక్క సమాధానం ఆమోదయోగ్యం కాదని ఆడిట్ పేర్కొంది. ఇంకా, మూడు[65] జిల్లాల్లో మచ్చుకు తనిఖీ చేసిన పాఠశాలల్లో మొత్తం కరిగిన ఘనపదార్థాల (టీడీఎస్) మీటరును ఉపయోగించి, నీటి నాణ్యతా పరీక్షను ఆడిట్ నిర్వహించింది. ఆ పరీక్షలో తాగునీటిలో మొత్తం కరిగిన ఘనపదార్థాలు 400 మిల్లీ గ్రాము/లీటరు నుండి 1408 మిల్లీ గ్రాము/లీటరు వరకు ఉన్నాయని, కానీ నిబంధనల ప్రకారం[66] అనుమతించదగిన పరిమితి 400 మాత్రమేనని ఆడిట్ గుర్తించింది.

## 3.3 పర్యవేక్షణ

### 3.3.1 క్లస్టర్ స్థాయి పర్యవేక్షణ

కమీషనర్ యొక్క సర్క్యులర్ మెమో[67] ప్రకారం సమన్వయకర్తలు, క్లస్టర్ పర్యవేక్షణ అధికారులను ఎంపిక చేయాలని, క్లస్టర్ పర్యవేక్షణ అధికారులు ప్రతిరోజూ ఐదు పాఠశాలలను సందర్శించి పనుల వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

మార్గదర్శకాల ప్రకారం[68], రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయిలో రెండు కమిటీలు పాఠశాలల అమలు ప్రక్రియ మరియు పురోగతిని సమీక్షించి పర్యవేక్షించవలసి ఉంటుంది. అవసరమైన సంఖ్యతో సభ్యుల కమిటీల ఏర్పాటు, వాటి పనితీరుపై ఆడిట్‌కు అందించిన రికార్డులను నుండి ఒక నిర్ధారణకు రాలేదు. క్షేత్ర స్థాయిలో, ప్రతి వారం, అధికారులు సందర్శించడం, పురోగతిని తనిఖీ చేయడం మరియు పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని శాఖ ప్రత్యుత్తరం ఇచ్చింది (2023 అక్టోబర్). ఇంకా, ముగింపు సమావేశం సందర్భంగా, ప్రతి పనిని ప్రతి వారం పర్యవేక్షిస్తామని మరియు సమాచారం ఛాయాచిత్రాల రూపంలో నిర్వహించబడుతుందని కమీషనర్ బదులిచ్చారు.

అయితే, క్లస్టర్ పర్యవేక్షణ అధికారి రోజువారీ సందర్శనల వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది కాబట్టి, పథకం యొక్క సరైన పర్యవేక్షణకు ఛాయాచిత్రాల రూపంలో పర్యవేక్షణ సరిపోదు. ఇంకా, ప్రత్యుత్తరాన్ని సమర్థించే ఎటువంటి రికార్డు అందించలేదు.

65 చిత్తూరు, గుంటూరు, కర్నూలు

66 ఎంబీఎన్ఎన్ యొక్క సాంకేతిక కరదీపిక

67 మెమో సంఖ్య 13021/69/ఎంబీఎన్ఎన్/2020 తేదీ 20/05/2020 యొక్క పేరా 3(హెచ్) ప్రకారం

68 జీఓ.ఎంఎస్ సంఖ్య 87 తేదీ 30/11/2019 పేరా 3 V (బి)

# 4వ అధ్యాయం

# ‘సంపూర్ణ పోషణ’ పథకంపై

# నియమపాలన తనిఖీ

## స్త్రీ, శిశు, వికలాంగ మరియు వయో వృద్ధుల శాఖ

## 'సంపూర్ణ పోషణ' పథకంపై నియమపాలన తనిఖీ


**సారాంశం**

మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ డైరెక్టరేట్ (డబ్ల్యూడీ & సీడబ్ల్యూ), నాలుగు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమం మరియు సాధికారత కార్యాలయాలు (డబ్ల్యూడీ & సీడబ్ల్యూ & ఈఓలు), 16 శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ కార్యాలయాలు (సీడీపీఓలు) మరియు 32 అంగన్‌వాడీ కేంద్రాలలో (ఏడబ్ల్యూసీలు) 2019-20 నుండి 2022-23 వరకు గల కాలానికి 2022 జూన్ నుండి 2023 జనవరి వరకు తనిఖీ నిర్వహించబడింది. సంపూర్ణ పోషణ పథకం అమలుపై తనిఖీ పరిశీలనలు:

- *సరఫరా వ్యవస్థ నిర్వహణ (ఎస్‌సీఎం) పోర్టల్ పనితీరులో లోపాలు, అందుబాటులో ఉన్న నిల్వలను పరిగణనలోకి తీసుకోకుండా ఆహార పదార్థాల కోసం ఇచ్చిన ఇండెంట్‌లు, లబ్ధిదారులకు అందించిన పోషకాహార కిట్‌లకు సంబంధించిన సమాచారం అందుబాటులో లేకపోవడం మరియు అంగన్‌వాడీ కేంద్రాల (ఏడబ్ల్యూసీలు) రికార్డులతో సరిపోలని పోర్టల్ డేటా, సంబంధిత శాఖల ద్వారా అందచేసిన బాలామృతం, పాలు, బియ్యం, పప్పు, నూనె ఇండెంట్లు, ఎస్‌సీఎం పోర్టల్‌లో ఉంచిన ఇండెంట్‌లతో సరిపోలలేదు.*
- *అంగన్‌వాడీ కేంద్రాల వద్ద వాస్తవ వస్తువుల లభ్యత మరియు అవసరాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే గుడ్లు మరియు పోషకాహార కిట్‌ల ఇండెంట్‌లను శాఖ తయారు చేసింది.*
- *సరఫరాలో జాప్యం మరియు ఆహార పదార్థాల కొరత కారణంగా, మచ్చుకు తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాలలో లబ్ధిదారులకు పంపిణీలో అంతరాయం కలిగింది.*
- *మచ్చుకు తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రాథమిక సదుపాయాలైన సరైన భవనాలు, మరుగుదొడ్లు మరియు తాగునీటి సౌకర్యాలు వంటి మౌలిక సౌకర్యాలు లేకపోవడం వల్ల లబ్ధిదారులు అపరిశుభ్రమైన పరిస్థితులకు గురవుతున్నారు.*
- *పర్యవేక్షణ మరియు సమీక్ష కమిటీ ఏర్పాటు చేయకపోవడం వల్ల పథకం అమలులో పర్యవేక్షణా లోపం ఏర్పడింది. ఫిర్యాదుల పరిష్కార కమిటీ ఏర్పాటు లేకపోవడం వల్ల లబ్ధిదారుల ఫిర్యాదులు పరిష్కరించబడలేదు.*


## 4.1 పరిచయం

మహిళా శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిశు అభివృద్ధి సేవలు (ఐసీడీఎస్), సమగ్ర శిశు సంరక్షణా పథకం (ఐసీపీఎస్), పని చేసే తల్లుల పిల్లల కోసం రాజీవ్ గాంధీ జాతీయ క్రెచ్ పథకం, వన్ స్టాప్ కేంద్రాలు మొదలగు వివిధ పథకాలు మరియు కార్యకలాపాలను అమలు చేస్తుంది. ఐసీడీఎస్ పథకం అనేది 1975 అక్టోబర్లో రాష్ట్రంలో ప్రారంభించబడిన కేంద్ర ప్రాయోజిత పథకం (సీఎస్ఎస్). అదనపు పోషకాహారం అనేది ఐసీడీఎస్ క్రింద ప్యాకేజీలలో ఒకటి. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, ఆరు నుండి 72 నెలల వయస్సు గల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల (ఏడబ్ల్యూసీ) ద్వారా అనుబంధ పోషకాహారాన్ని పొందడం మరియు పిల్లలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపం మరియు రక్తహీనత

స్థాయిలను తగ్గించడం ఈ ప్యాకేజీ లక్ష్యం. గోరుముద్దలు (2014 సెప్టెంబర్)[69], అమృత హస్తం[70] (2017 మే), బాలసంజీవిని[71] పథకాలు (2018 అక్టోబర్) 2019-20 వరకు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయబడ్డాయి. ఈ పథకాలన్నీ 2020 మార్చి నుండి షెడ్యూల్డ్, గిరిజన ఉప ప్రణాళిక మండలాల్లో; 2020 జూన్ నుండి రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు సంపూర్ణ పోషణ పథకంలో విలీనం చేయబడ్డాయి.

### 4.1.1 సంస్థాగత నిర్మాణం

**పటం 4.1** లో చూపిన విధంగా ఐసీడీఎస్ పథకం క్రింద సంపూర్ణ పోషణ పథకం అమలు కోసం మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఈ క్రింది అధికారులను వినియోగించుకుంటుంది:

**పటం 4.1:సంస్థాగత నిర్మాణం**




69 తీవ్రమైన తక్కువ బరువుగా ఉండటం (ఎస్‌యూడబ్ల్యూ)/తీవ్రమైన పోషకాహార లోపం (ఎస్ఏఎం)/మితమైన పోషకాహార లోపం (ఎంఏఎం) క్రింద వర్గీకరించబడిన ఐదు సంవత్సరాల వరకు పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ మరియు ఆహారాన్ని అందించడంలో పర్యవేక్షణ

70 రాష్ట్రంలోని మహిళలు మరియు పిల్లల, ఆరోగ్యం మరియు పోషకాహార స్థితిని మెరుగుపరచడానికి గర్భిణీ మరియు పాలిచ్చే మహిళలకు 'ఒకసారి పూర్తి భోజనం' అందించే లక్ష్యంతో

71 ఎస్సీ ఉప ప్రణాళిక క్రింద షెడ్యూల్డ్ కులం (ఎస్సీ), ఎస్టీ ఉప ప్రణాళిక క్రింద షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) మరియు ఇతర వర్గాల గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు పోషకాహార స్థితిని మెరుగుపరచడానికి ప్రత్యేక పోషకాహార కార్యక్రమం.

### 4.1.2 అమలు ప్రక్రియ

**లబ్ధిదారుల గుర్తింపు, నమోదు**

అంగన్‌వాడీ కేంద్రాల (ఏడబ్ల్యూసీలు) సేవా ప్రాంతంలోని అర్హులైన పిల్లలు మరియు మహిళలందరూ అంగన్‌వాడీ కార్యకర్తల (ఏడబ్ల్యూడబ్ల్యూలు) సర్వే ద్వారా నమోదు చేయబడతారు. ఈ ప్రయోజనం కోసం అభివృద్ధి చేయబడిన కామన్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ (సీఏఎస్) ద్వారా లబ్ధిదారులు నమోదు చేయబడతారు.

### 4.1.3 కావలసిన వస్తువులను సేకరించే ప్రక్రియ

పాలు, గుడ్లు, బాలామృతం, బియ్యం, పప్పు, నూనె అనే ఆరు ఆహార పదార్థాలను ఇండెంట్ చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఈ-సాధన పోర్టల్‌ను నిర్వహిస్తుంది. లబ్ధిదారుడి నమోదును, అంగన్‌వాడీ కార్యకర్తలు (ఏడబ్ల్యూడబ్ల్యూలు) వారి చరవాణులలో ముందే పొందుపరచిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా నెలవారీగా చేస్తారు. నమోదు కాబడిన సమాచారం ప్రకారం, ఒక నెలకు అవసరమైన బియ్యం, పప్పు, నూనె, పాలు మరియు బాలామృతాన్ని మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంచాలకులు (హెచ్ఓడీ) ఇండెంట్ చేస్తారు, గుడ్లు మరియు పోషకాహార కిట్‌లకు సంబంధించి, జిల్లా స్థాయిలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమం మరియు సాధికారత అధికారి ఇండెంట్ చేస్తారు.

### 4.1.4 ఆహార పదార్థాల సేకరణ, సరఫరా, పంపిణీ

ఆహార పదార్థాల సేకరణ ప్రక్రియ క్రింద వివరించబడింది:

ఎ) బియ్యం, పప్పు, నూనెను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌సీఎస్‌సీ లిమిటెడ్) నుండి సేకరించి, ఈ-పీఓఎస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) అప్లికేషన్ ఉపయోగించి సరసమైన ధరల దుకాణాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తారు.

బి) పాలను ఆంధ్రప్రదేశ్ డైరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ (ఏపీడీడీసీఎఫ్) లిమిటెడ్ నుండి సేకరించి, అంగన్‌వాడీ కేంద్రాల (ఏడబ్ల్యూసీ) వద్దకే సరఫరా చేస్తారు.

సి) బాలామృతం తెలంగాణ రాష్ట్ర పోషకాహార మండలి (టీఎస్ఎన్‌సీ) నుండి సేకరించి, శిశు అభివృద్ధి పథక అధికారి (సీడీపీఓ) యొక్క ఐసీడీఎస్ పథక గిడ్డంగులకు సరఫరా చేస్తారు, అక్కడి నుండి స్థానిక రవాణా ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తారు.

డి) గుడ్లు మరియు పోషకాహార కిట్‌లను సంబంధిత జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమం మరియు సాధికారత అధికారి, జిల్లా స్థాయిలో సంయుక్త కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ) ద్వారా కొనుగోలు చేస్తారు మరియు నిల్వలను అంగన్‌వాడీ కేంద్రం వద్దకే సరఫరా చేస్తారు.

ఇ) కూరగాయలు, మసాలా దినుసులు, వంట చెరకు (ఇంధనం)/వంట గ్యాస్‌ను అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక విక్రేతలు/గ్యాస్ ఏజెన్సీ నుండి కొనుగోలు చేస్తారు.

### 4.1.5 పథకం యొక్క పరిధి, ఆర్థిక వనరులు

రాష్ట్రంలోని 257 ఐసీడీఎస్ పథకాల కింద 55,607 అంగన్‌వాడీ కేంద్రాలలో (ఏడబ్ల్యూసీలు) (2022 మార్చి నాటికి) 28.86 లక్షల మంది లబ్ధిదారులు (గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు మరియు పిల్లలు) సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం 'సంపూర్ణ పోషణ' పరిధిలో ఉన్నారు. ఈ పథకం క్రింద లబ్ధిదారుల మొత్తం పోషణ కోసం ఈ క్రింది నమూనాలో ఆహారాన్ని అందించేందుకు ప్రణాళిక రచించారు:

- ఏడబ్ల్యూసీలో ప్రతి గర్భిణీ స్త్రీ, పాలిచ్చే తల్లులకు రోజుకు వేడిగా వండబడిన ఒక భోజనం, నెలకు పోషకాహార కిట్ [72] అందించబడుతుంది,
- ఏడబ్ల్యూసీలలో 36 నుండి 72 నెలల వయస్సు గల ప్రతి బిడ్డకు రోజుకు వేడిగా వండబడిన ఒక భోజనం అందించబడుతుంది మరియు
- ఆరు నుండి 36 నెలల వయస్సు గల పిల్లలకు అర్హతల ప్రకారం బాలామృతం [73], గుడ్లు మరియు పాలు గృహ పంపిణీ (టీహెచ్ఆర్) గా అందించబడతాయి.

ఐసీడీఎస్ మార్గదర్శకాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో అనుబంధ పోషకాహార పథకం [74](ఎస్ఎన్‌పి) కోసం భారత ప్రభుత్వం (జీఓఐ) తో 50:50 నిష్పత్తిలో ఖర్చును పంచుకునే విధానంలో, దీనిని సంపూర్ణ పోషణగా అమలు చేస్తున్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ మరియు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం యొక్క ఆహార నమూనాలు, అంచనా వ్యయం ***అనుబంధం 4.1***, ***అనుబంధం 4.2*** లలో వివరించబడ్డాయి.

2019-20 నుండి 2021-22 వరకు సంపూర్ణ పోషణ పథకం అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చిన నిధుల వివరాలు **పట్టిక 4.1, పట్టిక 4.2** లలో ఇవ్వబడ్డాయి.

**పట్టిక 4.1: కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధుల వివరాలు**

*(₹ కోట్లలో)*

| సంవత్సరం | సీఎస్ఎస్ నిధి కేటాయింపులు | భారత ప్రభుత్వ విడుదలలు (సీఎస్ఎస్) | ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే సీఎస్ఎస్ కొరకు విడుదల చేయబడిన నిధులు★ | ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఎంఎస్ఎస్ కొరకు విడుదల చేయబడిన నిధులు ★ | మొత్తం విడుదల చేయబడిన నిధులు (సీఎస్ఎస్ + ఎంఎస్ఎస్) | ఖర్చు చేయబడిన నిధులు |
|---|---|---|---|---|---|---|
| 2019-20 | 369.89 | 327.26 | 306.99 | 332.96 | 639.95 | 579.77 |
| 2020-21 | 459.35 | 371.36 | 429.87 | 436.55 | 866.42 | 905.37 |
| 2021-22 | 492.37 | 382.68 | 463.02 | 358.69 | 821.71 | 867.06 |

***మూలం:*** *సంబంధిత సంవత్సర గ్రాంట్ ఆడిట్ రిజిస్టర్, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అందించిన సమాచారం – భారత ప్రభుత్వ విడుదలల వివరాలు* ***అనుబంధం*** *4.3 లో చూపబడ్డాయి*

*★సీఎస్ఎస్: కేంద్ర ప్రాయోజిత పథకం; ఎంఎస్ఎస్: సరిపోలే రాష్ట్ర వాటా*

2019-20లో వ్యక్తిగత డిపాజిట్ (పీడీ) ఖాతా నిర్వహించబడలేదని, గ్రీన్ ఛానల్ పీడీ ఖాతా[75] 2020 మార్చి నుండి నిర్వహించబడిందని, ట్రెజరీ నుండి జీసీపీడీ ఖాతాకు నిధులు బదిలీ చేయబడ్డాయని, సింగిల్ నోడల్ ఖాతా (ఎస్ఎన్ఏ) కు 2021 అక్టోబర్ నుండి ప్రారంభమయిందని మరియు జీసీపీడీ ఖాతాలోని మిగిలిన నిధులను ఎస్ఎన్ఏకి బదిలీ చేశామని ప్రభుత్వం పేర్కొంది (2024 ఫిబ్రవరి).

ఇంకా, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సమగ్ర బడ్జెట్ విడుదల ఉత్తర్వుల (సీబీఆర్ఓ) ఆధారంగా రాష్ట్ర అభివృద్ధి పథకం (ఎస్డీఎస్) నిధులను వినియోగించుకున్నామని మరియు శాఖ సమర్పించిన బిల్లుల ప్రకారం, సీఎఫ్ఎంఎస్ (సమగ్ర ఆర్థిక

72 న్యూట్రిషన్ కిట్ (77 టీఎస్‌పి మండలాల్లో సంపూర్ణ పోషణ ప్లస్: మల్టీగ్రెయిన్ ఆటా, వేరుశెనగ చిక్కి, రాగి/సజ్జల/జొన్న పిండి, బెల్లం, ఎండు ఖర్జూరాలు; మిగిలిన మండలాల్లో సంపూర్ణ పోషణ: రాగి పిండి, బెల్లం, వేరుశెనగ చిక్కి, ఎండు ఖర్జూరాలు, సజ్జల/జొన్న పిండి, అటుకులు)

73 చక్కెర-500 గ్రాములు, నూనె-250 గ్రాములు, పాలపొడి-250 గ్రాములు, వేయించిన గోధుమలు-1,375 గ్రాములు మరియు శనగపప్పు-125 గ్రాములు కల బాలామృతం (2.5 కిలోల ప్యాకెట్)

74 2009-10 ఆర్థిక సంవత్సరం నుండి

75 ఆర్థిక (నగదు మరియు రుణ నిర్వహణ) శాఖ యొక్క జీఓఎంఎస్ సంఖ్య 20, తేదీ 19/03/2020 – ప్రతీ కేంద్ర సహాయ రాష్ట్ర ప్రణాళిక (సీఎస్‌పి) పథకానికి గ్రీన్ ఛానల్ పీడీ ఖాతా

నిర్వహణ వ్యవస్థ) ద్వారా విక్రేతలకు నేరుగా చెల్లించామని ప్రభుత్వం పేర్కొంది. అందువలన, ఈ విడుదలలకు సంబంధించి ప్రారంభ, ముగింపు నిల్వలు ఏవీ లేవు.

అంటే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో సంబంధం లేకుండా సీఎఫ్ఎంఎస్‌లో బడ్జెట్ కేటాయింపుల ఆధారంగా బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి గ్రాంట్ల విడుదలకు, ఆ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విడుదలలకు పొంతన కుదరలేదని స్పష్టమవుతోంది.

### 4.1.5.1 రాష్ట్ర అభివృద్ధి పథకం నిధుల వినియోగం

రాష్ట్ర అభివృద్ధి పథకం నిధులను సంపూర్ణ పోషణ పథకానికి వినియోగించారు. సీబీఆర్ఓల ద్వారా చేసిన విడుదలలు, ట్రెజరీ (సీఎఫ్ఎంఎస్) ద్వారా చేసిన ఖర్చులు **పట్టిక 4.2** లో సూచించబడ్డాయి.

**పట్టిక 4.2: రాష్ట్ర అభివృద్ధి పథక నిధుల వివరాలు**

*(₹ కోట్లలో)*

| సంవత్సరం | ప్రారంభ నిల్వ | నిధుల కేటాయింపు | సీబీఆర్ఓ విడుదలలు | వ్యయం చేయబడినది | ముగింపు నిల్వ |
|---|---|---|---|---|---|
| 2019-2020 | శూన్యం | 227.91 | 377.92 | 377.92 | శూన్యం |
| 2020-2021 | శూన్యం | 698.00 | 654.50 | 308.78 | శూన్యం |
| 2021-2022 | శూన్యం | 1,103.38 | 750.38 | 752.68 | శూన్యం |

***మూలం:*** *సంబంధిత సంవత్సర గ్రాంట్ ఆడిట్ రిజిస్టర్, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అందించిన సమాచారం*

పైన పేర్కొన్న వాటిని బట్టి 2020-21లో చేసిన ఖర్చు ₹308.78 కోట్లు కాగా, 2021-22లో చేసిన ఖర్చు ₹752.38 కోట్లు అని తెలుస్తోంది, ఇది గత సంవత్సరం చేసిన ఖర్చు కంటే 143 శాతం ఎక్కువ. 77 షెడ్యూల్డ్ మరియు గిరిజన ఉప-ప్రణాళిక మండలాల్లో ఆహార నమూనాలను, సంపూర్ణ పోషణ ప్లస్ పథకం మరియు మిగిలిన మండలాల్లో సంపూర్ణ పోషణ పథకం భర్తీ చేశాయని శాఖ సమాధానం ఇచ్చింది.

### 4.1.6 తనిఖీ పరిధి మరియు విధానం

2019-20 సంవత్సరంలో అమృత హస్తం, గోరుముద్దలు, బాలసంజీవిని (అనుబంధ పోషకాహార పథకం-ఎస్ఎన్‌పి) మరియు 2020-21 నుండి 2021-22 సంవత్సరాలలో సంపూర్ణ పోషణ పథకం అమలును పరిశీలించడానికి నియమపాలన తనిఖీ నిర్వహించబడింది.

తనిఖీ పద్ధతిలో పథకం అమలును పరిశీలించడానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళలు, పిల్లలు, వికలాంగులు మరియు వయో వృద్ధుల శాఖ ప్రధాన కార్యదర్శి కార్యాలయం, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ సంచాలకుల కార్యాలయం (డబ్ల్యూడీ & సీడబ్ల్యూ), ఎంపిక చేసిన జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమం మరియు సాధికారత కార్యాలయాలు (డీడబ్ల్యూ & సీడబ్ల్యూ & ఈఓలు), శిశు అభివృద్ధి ప్రాజెక్టు కార్యాలయాలు (సీడీపీఓలు) మరియు అంగన్‌వాడీ కేంద్రాలు (ఏడబ్ల్యూసీలు) వద్ద రికార్డుల పరిశీలన జరిగింది. అందుబాటులో ఉన్న చోట శాఖ ఉపయోగించే వెబ్ పోర్టల్/ఈ-సాధన నుండి సమాచారాన్ని విశ్లేషించడం జరిగింది.

తనిఖీ లక్ష్యాలు, పరిధి & తనిఖీ యొక్క పద్ధతి 2022 జూన్ 13న జరిగిన ప్రారంభ సమావేశం లో వివరించబడింది. తనిఖీ పరిశీలనలపై అభిప్రాయాలను కోరుతూ ముసాయిదా తనిఖీ నివేదిక, మహిళలు, పిల్లలు, వికలాంగులు మరియు వయో వృద్ధుల శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపబడింది (2023 జూలై 18). 2024 ఫిబ్రవరి 26న ఆ శాఖతో ముగింపు సమావేశం జరిగింది. ప్రభుత్వం నుండి సమాధానాలు వచ్చాయి (2024 ఫిబ్రవరి 27), అవి నివేదికలో సముచితంగా చేర్చబడ్డాయి.

### 4.1.7 తనిఖీ లక్ష్యాలు

- భాగస్వామ్యులు అందరూ ఆహారం మరియు పోషకాహార కిట్‌ల సమయపాలన మరియు నాణ్యతను నిర్ధారించడానికి ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాలను పాటించారా మరియు
- అర్హత కలిగిన లబ్ధిదారులందరూ ఈ పథకంలో చేర్చబడి, అర్హతల ప్రకారం అనుబంధ పోషకాహారాన్ని పొందుతున్నారా, అనే విషయాలను పరిశీలించటానికి తనిఖీ నిర్వహించబడింది.

### 4.1.8 తనిఖీ నమూనా

1. జిల్లాల ఎంపిక: వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కోసం వృద్ధి పర్యవేక్షణ నివేదిక[76] ఆధారంగా నష్టకారక అంశాల విశ్లేషణ ద్వారా మునుపటి/ఉమ్మడి పదమూడు జిల్లాలలో నాలుగు[77] ఎంపిక చేయబడ్డాయి.
   - ఎ) గిరిజన పథకాలు ఉన్న ఐదు జిల్లాల నుండి రెండు జిల్లాలు: (i) విశాఖపట్నం (ii) విజయనగరం
   - బి) సాధారణ పథకాలు మాత్రమే ఉన్న మిగిలిన ఎనిమిది జిల్లాల నుండి రెండు జిల్లాలు: (i) కడప (ii) ప్రకాశం
2. ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఎంపిక: మొత్తం 16 ఐసీడీఎస్ ప్రాజెక్టులను ఈ క్రింది విధంగా ఎంపిక చేశారు:
   - ఎ) గిరిజన సమితి కింద రెండు జిల్లాల్లో ఆరు ప్రాజెక్టులు (విశాఖపట్నం–5 మరియు విజయనగరం–1) ఎంపిక చేయబడ్డాయి
   - బి) సాధారణ సమితి కింద నాలుగు జిల్లాల్లో పది ప్రాజెక్టులు (కడప-4; ప్రకాశం–4; విశాఖపట్నం-1; మరియు విజయనగరం-1) ఎంపిక చేయబడ్డాయి
3. అంగన్‌వాడీ కేంద్రాల ఎంపిక: 32 అంగన్ వాడీ కేంద్రాలు, అంటే, ప్రతి ప్రాజెక్ట్ నుండి రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపిక చేయబడ్డాయి. (నమూనా యూనిట్ల వివరాలు ***అనుబంధం 4.4*** లో చూపబడ్డాయి).

ఆహార పదార్థాల ఇండెంటింగ్, సరఫరా మరియు పంపిణీ యొక్క వివరణాత్మక ధ్రువీకరణ కోసం, లబ్ధిదారులకు ఆహార పదార్థాల సరైన ఇండెంటింగ్, సరఫరా మరియు వినియోగం/పంపిణీ నిర్వహించబడ్డాయో లేదో నిర్ధారించడానికి ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలలో మూడు సంవత్సరాలలో (ప్రతి సంవత్సరం రెండు నెలలు) ఆరు నమూనా నెలలు, అనగా 2019 ఏప్రిల్, 2019 డిసెంబర్, 2020 జూన్, 2021 ఫిబ్రవరి, 2021 ఆగస్టు, 2021 నవంబర్ నెలల రికార్డులు పరిశీలించారు.

దీనికి తోడు, పథకం గురించి, వారి హక్కులు మరియు పథకం యొక్క ఆహారం మరియు పోషకాహార కిట్ల నాణ్యతా ప్రమాణాల గురించి లబ్ధిదారులకు ప్రత్యక్ష సమాచారం తెలుసో లేదో తెలుసుకోవడానికి 32 అంగన్‌వాడీ కేంద్రాలలో 384 మంది లబ్ధిదారులు అంటే గర్భిణీ స్త్రీలు/పాలిచ్చే తల్లులు/పిల్లల తల్లిదండ్రుల సర్వే నిర్వహించారు. అయితే, ఆడిట్ సందర్శన సమయంలో వారి లభ్యత ఆధారంగా సర్వే కోసం లబ్ధిదారులు ఎంపిక చేయబడ్డారు.

## 4.2 తనిఖీ పరిశీలనలు

### 4.2.1 సరఫరా వ్యవస్థ నిర్వహణ

గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు మరియు ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లలు (6నెలలు–3 సంవత్సరాలు), మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల వయస్సు గల పిల్లలు (3-6 సంవత్సరాలు), బియ్యం,

[76] ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి బిడ్డ పెరుగుదల పర్యవేక్షణ (ఎత్తు, బరువు పర్యవేక్షణ) చేయాలి

[77] గిరిజన పథకాలు కల జిల్లాలు: విజయనగరం, విశాఖపట్నం; సాధారణ పథకాలు కల జిల్లాలు: ప్రకాశం, కడప

పప్పు, నూనె, గుడ్లు, పాలు మరియు బాలామృతం వంటి ఆహార పదార్థాల ఇండెంట్లు, రసీదులు వంటి వివరాలను నిర్వహించడానికి మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖకు ఈ-సాధన పోర్టల్ అనే సరఫరా వ్యవస్థ నిర్వహణ (ఎస్‌సీఎం) పోర్టల్ ఉంది. అంగన్‌వాడీ పర్యవేక్షకులు (ఏడబ్ల్యూఎస్) నెలాఖరులో నిర్వహించే విభాగాలవారీ సమావేశాలలో అంగన్‌వాడీ కార్యకర్తల నుండి ఆహార పదార్థాల అవసరాన్ని సేకరిస్తారు, తదనుగుణంగా లబ్ధిదారుల సంఖ్య మరియు వారి ఆహార పదార్థాల అవసరాల ఆధారంగా పోర్టల్ ద్వారా ఇండెంట్లు పెడతారు. ఈ పోర్టల్ ప్రాజెక్ట్ స్థాయిలో, జిల్లా స్థాయిలో మరియు రాష్ట్ర స్థాయిలో నిర్వహించబడుతోంది.

తనిఖీ సమయంలో క్రింది విషయాలు గమనించబడ్డాయి:

1) పోర్టల్‌లో ఇండెంట్‌లను ఉంచే సమయంలో గత నెలల ముగింపు నిల్వలను లెక్కించలేదు. పోర్టల్‌లో లబ్ధిదారుల సంఖ్యను నమోదు చేయడం వలన ఇండెంట్‌ల నుండి ముగింపు నిల్వలను తగ్గించకుండా స్వయంచాలకంగా ఇండెంట్‌లు ఉత్పత్తి అవుతాయి. ఫలితంగా, ఆహార పదార్థాల అవసరానికి మించి ఇండెంట్‌లు చేయబడ్డాయి. మునుపటి నెలల ముగింపు నిల్వలను తదుపరి నెల ప్రారంభ నిల్వలుగా పరిగణించలేదు.

2) ప్రస్తుత నెలలో చేరిన లబ్ధిదారుల విషయంలో, అదనపు ఇండెంటింగ్‌కు ఎటువంటి సదుపాయమూ లేదు. ఫలితంగా, ప్రస్తుత నెలలో చేరిన లబ్ధిదారులకు ఆహార పదార్థాలు అందించబడతాయనే హామీ లేదు.

3) పాలు, గుడ్లు, బాలామృతం, బియ్యం, పప్పు మరియు నూనె వంటి ఆహార పదార్థాలకు సంబంధించిన సమాచారం పోర్టల్‌లో అందుబాటులో ఉంది. లబ్ధిదారులకు అందించే పోషకాహార కిట్‌లకు సంబంధించిన సమాచారం పోర్టల్‌లో లేదు.

4) బాలామృతం గుడ్లు పూర్తి ప్యాకెట్లలో, ఏక మొత్తంగా సరఫరా చేయబడ్డాయి. ఈ వస్తువుల సమాచారం పోర్టల్‌లో పూర్ణాంకాలుగా అందుబాటులో ఉండాలి లేదా నమోదు చేయబడాలి. అయితే, అందుకున్న మరియు ఉపయోగించిన పరిమాణం యొక్క సమాచారం పోర్టల్‌లో దశాంశాలలో చూపబడింది, ఇది నమ్మదగినది కాదు.

5) మచ్చుకు తనిఖీ చేసిన ఏడబ్ల్యూసీలలో, పోర్టల్ సమాచారం ఏడబ్ల్యూసీలలో నిర్వహించబడుతున్న ప్రాథమిక రికార్డులతో సరిపోలడం లేదు. అందువల్ల, ప్రాథమిక రికార్డులతో పరిమాణం యొక్క ఖచ్చితత్వాన్ని నిర్ధారించడానికి ఎస్‌సీఎంలో నమోదు చేయబడిన సమాచారం యొక్క ధ్రువీకరణ నిర్వహించబడలేదు.

6) ఏడబ్ల్యూసీలలో ఆహార పదార్థాల నిల్వలు అందుబాటులో లేనప్పుడు/రానప్పుడు, ఏడబ్ల్యూడబ్ల్యూలు సమీపంలోని ఏడబ్ల్యూసీల నుండి స్టాక్‌లను అరువుగా తీసుకున్నారు, అదేవిధంగా అదనపు నిల్వలు అందుబాటులో ఉన్న చోట, వాటిని సమీపంలోని ఏడబ్ల్యూసీలలో ఉపయోగించారు. అయితే, నిరంతర సరఫరా/పంపిణీని చూపించడానికి ఆహార పదార్థాలను అరువుగా తీసుకోవడం లేదా ఋణం ఇవ్వడం గురించి పోర్టల్‌లో ఎటువంటి నిబంధన లేదు, ఇది 'సరఫరా వ్యవస్థ' నిర్వహణ ఉద్దేశ్యాన్ని దెబ్బతీస్తుంది.

7) సరసమైన ధరల దుకాణాలలో బియ్యం, పప్పు మరియు నూనెకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల సంస్థకు చెల్లింపులు ఈ-పోస్ ద్వారా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ పాల అభివృద్ధి సహకార సంస్థ లిమిటెడ్ (ఏపీడీడీసీఎఫ్) నిర్వహించే వైఎస్ఆర్ సంపూర్ణ పాల యాప్ ద్వారా రూపొందించబడిన ప్రమాణపత్రాల ప్రకారం పాల సరఫరాకు చెల్లింపులు జరిగాయి. టీఎస్ఎన్‌సీ సమర్పించిన ఇన్‌వాయిస్‌ల ప్రకారం బాలామృతం సరఫరాకు చెల్లింపులు జరిగాయి. 55,607 ఏడబ్ల్యూసీల ఆహార పదార్థాల సమాచారాన్ని సరఫరా వ్యవస్థ నిర్వహణ పోర్టల్‌లో నమోదు చేయడానికి అంగన్‌వాడీ పర్యవేక్షకులు ప్రతి నెలా భారీ కసరత్తు చేశారు, దీనిని చెల్లింపులు చేయడానికి శాఖ ఉపయోగించలేదు. అందువలన, పోర్టల్ వినియోగం పాక్షికంగా ఉంది.

పై వాటికి ప్రభుత్వం ఈ విధంగా పేర్కొంది (2024 ఫిబ్రవరి 27):

i. ఏడబ్ల్యూసీ వద్ద వాస్తవ వస్తువుల లభ్యతను సేకరించడానికి మరియు ప్రతి వస్తువు యొక్క అంచనా వేసిన ముగింపు నిల్వను సేకరించడానికి ఒక యంత్రాంగాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుత పోర్టల్‌లో ఇండెంట్‌ను ఉంచేటప్పుడు మునుపటి నెల ముగింపు నిల్వను పరిగణనలోకి తీసుకున్నారు.

ii. ఇండెంట్ల గణన కోసం నమోదు గణనలను పరిగణనలోకి తీసుకోవడానికి ప్రతి నెల 15వ తేదీని చివరి తేదీగా నిర్ణయించారు, పోర్టల్‌లో అదనపు ఇండెంటింగ్ కోసం సదుపాయాన్ని కలిగించటానికి చర్య ప్రారంభించబడింది.

iii. పోషకాహార కిట్‌ల ఇండెంట్, సరఫరా మరియు పంపిణీని సంగ్రహించడాన్ని పోర్టల్‌లో చేర్చారు, అన్ని స్థాయిలలో 100 శాతం నమోదును నిర్ధారించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

iv. అందుకున్న మరియు ఉపయోగించిన పరిమాణం యొక్క సమాచారాన్ని ధ్రువీకరించడానికి వ్యవస్థను ఏర్పాటు చేసినందువల్ల ప్రస్తుత వ్యవస్థలో దశాంశ నమోదు సమస్య తలెత్తదు.

v. భౌతిక రికార్డులతో ఆన్‌లైన్ డేటాను ధ్రువీకరించడానికి వ్యవస్థను ఏర్పాటు చేశారు, ఆఫ్‌లైన్ నమోదులు చేసిన చోట సమాచార నమోదును ధ్రువీకరించే పనిని పర్యవేక్షకులకు అప్పగించారు. ఈ వివరాలను పోర్టల్‌లో సేకరించారు.

vi. దుర్వినియోగాన్ని నివారించడానికి ప్రస్తుతం అరువుకు సంబంధించిన సదుపాయాన్ని అనుమతించలేదు. అయితే, కొత్త లబ్ధిదారులను గుర్తించి, ధ్రువీకరించి, తదుపరి నెలలో చేర్చుతారు.

vii. ప్రతి జిల్లాలో వేర్వేరు సమయాల్లో వేర్వేరు సరఫరాదారుల నుండి స్వీకరించబడిన వస్తువులు , వాటి రసీదు ప్రామాణీకరణ విధానం భిన్నంగా ఉంది, అందువల్ల పోర్టల్ ద్వారా చెల్లింపు వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి విభాగం చర్యలు తీసుకుంటోంది.

అయితే, సమాధానాన్ని ధ్రువీకరించే సహాయక పత్రాలు సమర్పించబడలేదు.

### 4.2.2 ఇండెంటింగ్

ఇండెంట్ చేసేటప్పుడు, వస్తువుల స్థితి, లబ్ధిదారుల సంఖ్య, గత వినియోగ విధానం మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోవడం ఇండెంటర్ బాధ్యత.

ప్రతిపాదిత ఆహార పదార్థాల కోసం ఇండెంట్ చేయడానికి శాఖ సరఫరా వ్యవస్థ నిర్వహణ మాడ్యూల్‌ను ఉపయోగిస్తోంది. అంగన్‌వాడీ పర్యవేక్షకులు నెలాఖరులో అంగన్‌వాడీ వర్కర్ల (ఏడబ్ల్యూడబ్ల్యూలు) నుండి నమోదు చేసుకున్న లబ్ధిదారులు, వస్తువుల రసీదులు, ఆహార పదార్థాల వినియోగం గురించి నెలవారీ సమాచారాన్ని సేకరిస్తారు. లబ్ధిదారుల సంఖ్యను నమోదు చేసిన తర్వాత, ఇండెంట్‌లు స్వయంచాలకంగా ఎస్‌సీఎం మాడ్యూల్‌లో తయారవుతాయి. అయితే, డైరెక్టరేట్ ఇచ్చిన ఇండెంట్‌లు మరియు శిశు అభివృద్ధి పథక అధికార్లు (సీడీపీఓలు) కోరిన ఇండెంట్‌లలో క్రింద వివరించిన విధంగా ఆడిట్ వైవిధ్యాలను గమనించింది:

#### ఎ) డైరెక్టరేట్ స్థాయిలో ఇండెంటింగ్

**బాలామృతం:**

తెలంగాణ రాష్ట్ర పోషకాహార మండలి (టీఎస్ఎన్‌సీ, గతంలో ఏపీ రాష్ట్ర పోషకాహార మండలి) రాష్ట్రంలోని 257 ఐసీడీఎస్ ప్రాజెక్టులకు ఇండెంట్ చేసిన బాలామృతం మొత్తాన్ని నిర్దిష్ట నెలలో 15వ తేదీకి ముందు సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో, ఒక ఒప్పందం కుదుర్చుకుంది.

టీఎస్ఎస్‌సీకి శాఖ పంపిన నెలవారీ ఇండెంట్‌లు, సీడీపీఓల నుండి ఎస్‌సీఎం అందుకున్న నెలవారీ ఇండెంట్‌ల మధ్య పోలికలో, ***అనుబంధం 4.5*** లో వివరించిన విధంగా, 2022 మార్చి మినహా, 2019-20 నుండి 2021-22 కాలంలో ఏ రెండు ఇండెంట్‌లు సరిపోలలేదని తేలింది.

**పాలు:**

ప్రతి నెలా 5వ తేదీ లేదా అంతకు ముందు, సరఫరాదారు (ఏపీడీడీసీఎఫ్) కు తదుపరి నెల పాలు సరఫరా చేయడానికి ఇండెంట్ జారీ చేయబడుతుంది. ఎస్‌సీఎంలో ఉంచిన ఇండెంట్‌తో శాఖ సరఫరాదారుకు జారీ చేసిన ఇండెంట్‌లకు సంబంధించిన రికార్డులను పరిశీలించినప్పుడు, ***అనుబంధం 4.6*** లో వివరించిన విధంగా, 2020 ఏప్రిల్ నుండి 2022 మార్చి మధ్య కల 24 నెలల కాలానికి, రెండు నెలలు (2021 డిసెంబర్, 2022 మార్చి) మాత్రమే సరిపోలినట్లు గమనించబడింది.

**బియ్యం, పప్పు & నూనె:**

తరువాత నెల 5వ తేదీ లేదా అంతకు ముందు బియ్యం, పప్పు మరియు నూనె సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు ఇండెంట్ జారీ చేయబడుతుంది.

ఎస్‌సీఎంలో ఉంచిన ఇండెంట్‌తో పౌర సరఫరాల విభాగానికి జారీ చేసిన ఇండెంట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించినప్పుడు, 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు అన్ని నెలలకు ఇండెంట్‌లు సరిపోలడం లేదని గమనించబడింది. ***అనుబంధం 4.7*** లో వివరించిన విధంగా ఎస్‌సీఎం ఇండెంట్‌తో పోలిస్తే కార్పొరేషన్‌కు జారీ చేసిన ఇండెంట్ ఎక్కువ లేదా తక్కువగా ఉంది.

ఆడిట్ ద్వారా గుర్తించబడిన లోపాలను సరిదిద్దడానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది (2024 ఫిబ్రవరి 27).

ఫలితంగా, ***పేరా 4.2.3*** లో వివరించిన విధంగా తనిఖీ అవధిలో ఆహార పదార్థాల సరఫరా లేకపోవడం/సరిపోని సరఫరా జరిగిన సందర్భాలు ఉన్నాయి.

### బి) జిల్లా స్థాయిలో ఇండెంటింగ్

గుడ్లు మరియు పోషకాహార కిట్‌లకు సంబంధించి, జిల్లా స్థాయిలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమం మరియు సాధికారత అధికారి ఇండెంట్ చేస్తారు.

**గుడ్లు:**

మచ్చుకు తనిఖీ చేసిన 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిశీలన సమయంలో, దిగువ **పట్టిక 4.3** లో చూపిన విధంగా గుడ్ల కోసం ఇండెంట్లు అవసరాల కంటే ఎక్కువగా లేదా తక్కువగా ఉన్నాయని ఆడిట్ గమనించింది:

**పట్టిక 4.3: 2019-20 నుండి 2021-22 వరకు లబ్ధిదారుల ప్రకారం సరఫరా వ్యవస్థ నిర్వహణ పోర్టల్ మరియు అవసరాల మధ్య గుడ్ల ఇండెంటింగ్‌లో వ్యత్యాసాలు**

| క్రమ సంఖ్య | ప్రాజెక్ట్ పేరు | వ్యత్యాసాలతో నెలల సంఖ్య | మొత్తం లబ్ధిదారులు | లబ్ధిదారుల సంఖ్యను బట్టి అవసరమైన గుడ్లు | ప్రారంభ నిల్వ | ఇవ్వవలసిన మొత్తం ఇండెంట్ | వాస్తవంగా శాఖచే ఇవ్వబడిన ఇండెంట్. | అధికంగా ఇచ్చిన ఇండెంట్ |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | మద్దిపాడు | 06 | 64,509 | 12,23,626 | 0 | 12,23,626 | 13,25,955 | 1,02,329 |
| 2. | సంతమాగులూరు | 36 | 4,88,352 | 93,35,335 | 0 | 93,35,335 | 97,53,026 | 4,17,691 |
| 3. | బెస్తవారిపేట | 36 | 3,44,181 | 65,52,017 | 0 | 65,52,017 | 68,08,554 | 2,56,537 |
| 4. | హుకుంపేట | 24 | 1,83,566 | 49,88,145 | 16,51,132 | 33,37,013 | 51,84,176 | 18,47,163 |
| 5. | వి మాడుగుల | 20 | 1,45,141 | 39,60,780 | 5,86,792 | 33,73,988 | 41,76,606 | 8,02618 |
| 6. | భీమునిపట్నం | 34 | 4,76,083 | 93,31,644 | 13,46,667 | 79,84,977 | 95,93,197 | 16,08,220 |
| 7. | బద్వేల్ | 18 | 1,57,055 | 39,26,375 | 4,73,902 | 34,52,473 | 39,22,013 | 4,69,540 |
| 8. | జమ్మలమడుగు | 18 | 1,59,351 | 39,83,775 | 5,06,520 | 34,77,255 | 39,68,829 | 4,91,574 |
| 9. | పులివెందుల | 18 | 2,94,186 | 73,54,650 | 6,11,610 | 67,43,040 | 73,32,607 | 5,89,567 |
| 10. | రాజంపేట | 18 | 2,55,754 | 63,93,850 | 10,07,538 | 53,86,312 | 63,46,960 | 9,60,648 |
| 11. | బొబ్బిలి పట్టణ | 18 | 70,655 | 17,66,375 | 2,17,566 | 15,48,809 | 17,84,400 | 2,35,591 |
| 12. | కురుపాం | 18 | 1,69,994 | 46,22,820 | 16,00,301 | 30,22,519 | 47,98,670 | 17,76,151 |

***మూలం**: ఈ-సాధన పోర్టల్, శిశు అభివృద్ధి పథక అధికారులు అందించిన సమాచారం*

## పోషకాహార కిట్లు:

మచ్చుకు తనిఖీ చేసిన ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిశీలన సమయంలో, దిగువ **పట్టిక 4.4** లో చూపిన విధంగా నమోదు చేసుకున్న లబ్ధిదారుల కంటే ఎక్కువ/తక్కువ కిట్ల ఇండెంట్లను సమర్పించినట్లు ఆడిట్ గమనించింది:

**పట్టిక 4.4: 2019-20 నుండి 2021-22 వరకు లబ్ధిదారుల ప్రకారం సరఫరా వ్యవస్థ నిర్వహణ పోర్టల్ మరియు అవసరాల మధ్య పోషకాహార కిట్ల ఇండెంటింగ్‌లో వ్యత్యాసాలు**

| క్రమ సంఖ్య | ప్రాజెక్ట్ పేరు | నెలల సంఖ్య | మొత్తం లబ్ధిదారులు (గర్భిణీ స్త్రీలు + పాలిచ్చే తల్లులు) | వాస్తవంగా ఇండెంటింగ్ చేయవలసిన కిట్ల సంఖ్య | శాఖ సమర్పించిన ఇండెంట్ | ఇండెంటిగ్‌లో వ్యత్యాసాలు |
|---|---|---|---|---|---|---|
| 1. | సంతమాగులూరు | 36 | 98,273 | 98,273 | 91,587 | -6,686 |
| 2. | అరకు | 12 | 17,065 | 17,065 | 17,019 | -46 |
| 3. | డుంబ్రీగూడ | 15 | 24,001 | 24,001 | 23,908 | -93 |
| 4. | పాడేరు | 23 | 33,778 | 33,778 | 33,859 | 81 |
| 5. | వి మాడుగుల | 18 | 27,426 | 27,426 | 26,822 | -604 |
| 6. | భీమునిపట్నం | 24 | 74,237 | 74,237 | 73,714 | -523 |

***మూలం**: ఈ-సాధన పోర్టల్, శిశు అభివృద్ధి పథక అధికారులచే అందచేయబడిన సమాచారం*

వస్తువుల స్థితి, లబ్దిదారుల సంఖ్యను పరిగణనలోకి తీసుకోకుండా డైరెక్టరేట్ స్థాయి అధికారులు మరియు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారులు ఇండెంట్లు సమర్పించారని ఇది సూచిస్తుంది.

i. ఇండెంట్ల గణన కోసం రిజిస్ట్రేషన్ల సంఖ్యను పరిగణలోకి తీసుకోవడానికి ప్రతి నెల 15వ తేదీని చివరి తేదీగా నిర్ణయించామని,

ii. అంగన్‌వాడీ కేంద్రాలలో వాస్తవ వస్తు లభ్యతను సేకరించడానికి, ప్రతి వస్తువు యొక్క ముగింపు నిల్వ అంచనాను సేకరించడానికి ఒక యంత్రాంగాన్ని ప్రవేశపెట్టామని,

గుడ్ల సరఫరా నాలుగు దశల్లో ఉన్నందున, వృధాను నివారించడానికి, నాణ్యతను నిర్ధారించడానికి, మునుపటి వారం వినియోగాన్ని బట్టి గుడ్డు ఇండెంట్ అవసరాన్ని సవరించడానికి ప్రాజెక్ట్ అధికారులకు ప్రత్యేక సదుపాయాన్ని అందచేశామని ప్రభుత్వం తెలియచేసింది (2024 ఫిబ్రవరి 27).

అయితే, సమాధానాన్ని ధృవీకరించడానికి సహాయక పత్రాలు సమర్పించబడలేదు.

ఈ విధంగా, శాఖ ఉపయోగించిన లోపభూయిష్టమైన ఇండెంట్ విధానం అధిక లేదా తక్కువ ఇండెంట్లను సమర్పించడానికి దారితీసింది.

## 4.2.3 సరఫరా

### 4.2.3.1 పాల సరఫరాలో కొరత

లబ్ధిదారులు తమ పోషకాహార అవసరాలను తీర్చుకోవడానికి క్రమం తప్పకుండా పాల సరఫరా పొందడానికి అర్హులు, ఆ వివరాలు **పట్టిక** 4.5 లో చూపబడ్డాయి:

**పట్టిక 4.5: గిరిజన, గిరిజనేతర ప్రాంతాల్లో చేయవలసిన పాల సరఫరా**

| గిరిజనేతరులు | లబ్ధిదారుల సమూహము | 2020 సెప్టెంబర్‌కు ముందు [78] | 2020 సెప్టెంబర్ నుండి [79] |
|---|---|---|---|
| | గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు | 200 మి లీ x 25 రోజులు: నెలకు 5 లీటర్లు | 200 మి లీ x 25 రోజులు: నెలకు 5 లీటర్లు |
| | పాఠశాలకు వెళ్లబోయే పిల్లలు (3-6 సంవత్సరాలు) | - శూన్యం - | 100 మి లీ x 25 రోజులు: నెలకు 2.5 లీటర్లు |
| | పిల్లలు (6 నెలలు-3 సంవత్సరాలు) | - శూన్యం - | నెలకు 2.5 లీటర్లు (టీహెచ్ఆర్) |
| **గిరిజనులు** | **లబ్ధిదారుల సమూహము** | **2020 ఏప్రిల్‌కు ముందు [80]** | **2020 ఏప్రిల్ నుండి 2020 [81]** |
| | గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు | 200 మి లీ x 25 రోజులు: నెలకు 5 లీటర్లు | 200 మి లీ x 25 రోజులు: నెలకు 5 లీటర్లు |
| | పాఠశాలకు వెళ్లబోయే పిల్లలు (3-6 సంవత్సరాలు) | 100 మి లీ x 25 రోజులు: నెలకు 2.5 లీటర్లు | 200 మి లీ x 25 రోజులు: నెలకు 5 లీటర్లు |
| | పిల్లలు (6 నెలలు-3 సంవత్సరాలు) | నెలకు 2.5 లీటర్లు (టీహెచ్ఆర్) | నెలకు 6 లీటర్లు (టీహెచ్ఆర్) |

***మూలం:*** *ప్రభుత్వ ఆదేశాలు*

### i) రాష్ట్ర స్థాయి

**పాల సరఫరాలో కొరత – 3.99 కోట్ల లీటర్లు**

2020 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు 257 ప్రాజెక్టులలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాలకు ఏపీడీడీసీఎఫ్ లిమిటెడ్ ద్వారా పాలు సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. శాఖ ఇండెంట్ చేసిన 21.7 కోట్ల లీటర్ల పాలలో, ఏజెన్సీ 17.71 కోట్ల లీటర్ల పాలను మాత్రమే సరఫరా చేయడం వలన, అర్హత కలిగిన లబ్ధిదారులకు పోషకాల ప్రయోజనం అందకుండా పోయిందని గమనించడమైంది. 3.99 కోట్ల లీటర్ల పాలు (18.4 శాతం) తక్కువగా సరఫరా చేయబడ్డాయని ***అనుబంధం 4.8(ఎ)*** లో వివరించబడింది.

2018 ఫిబ్రవరి 12న జరిగిన సమీక్షా సమావేశంలో డబ్ల్యూడీ & సీడబ్ల్యూ ముఖ్య కార్యదర్శి పాల సరఫరాలో ఆలస్యంపై జరిమానా విధించాలని ఆదేశాలు జారీ చేసినట్లు గమనించబడింది. అంతేకాకుండా, గుంటూరులోని మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కమీషనర్, పాలు ఆలస్యంగా సరఫరా చేస్తే వారానికి ఒక శాతం మరియు పాలు

---

78 జీఓఎంఎస్ సంఖ్య 14, తేదీ 28/02/2014, జీఓఎంఎస్ సంఖ్య 4, తేదీ 03/05/2017

79 జీఓఎంఎస్ సంఖ్య 9, తేదీ 27/06/2020, పోషణ, పోషణ ప్లస్

80 జీఓఎంఎస్ సంఖ్య 14, తేదీ 28/02/2014, జీఓఎంఎస్ సంఖ్య 36, తేదీ 13/11/2015

81 జీఓఎంఎస్ సంఖ్య 16, తేదీ 26/11/2019, పోషణ ప్లస్, మెమో సంఖ్య డబ్ల్యూడీసీ02-24028/3/2020-ఎస్ఎన్‌పి, తేదీ 03/04/2020

సరఫరా చేయకపోతే ఒక శాతం చొప్పున జరిమానా నిబంధనతో కూడిన ముసాయిదా ఒప్పందాన్ని అందించమని ఏపీడీడీసీఎఫ్ లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులను అభ్యర్థించారు[82]. ఒప్పందం కుదుర్చుకునేందుకు ఏపీడీడీసీఎఫ్‌కి గుర్తు చేసినప్పటికీ (2018 జూలై 16) సరఫరాదారు దానిని పూర్తి చేయలేదు. అయితే, ఈ రోజు వరకు సరఫరాదారుతో శాఖ అలా ఒప్పందం చేసుకోలేదు, 2019 ఏప్రిల్ నుండి 2021 జూలై వరకు కార్యనిర్వాహక ఆదేశాలు లేదా అటువంటి ఆదేశాలకు అనుగుణంగా ఒప్పందం లేకుండా సరఫరాలో ఆలస్యం కోసం నెలకు ఒక శాతం చొప్పున ₹74.23 లక్షల జరిమానా విధించబడి, వసూలు చేయబడింది (2022 మార్చి నాటికి).

ఉత్పత్తి సామర్థ్యాలను పెంచడం ద్వారా, టెట్రా ప్యాకెట్లలో పాలను అందించడం ద్వారా కొరత సమస్యను పరిష్కరిస్తామని ప్రభుత్వం పేర్కొంది (2024 ఫిబ్రవరి 27).

అయితే, సమాధానాన్ని నిర్ధారించుకోవడానికి సహాయక పత్రాలు సమర్పించబడలేదు.

### ii) జిల్లా స్థాయి

2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు మచ్చుకు తనిఖీ చేసిన నాలుగు డీడబ్ల్యూ & సీడబ్ల్యూ & ఈఓలలో ఏపీడీడీసీఎఫ్ లిమిటెడ్ సరఫరా చేసిన పాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించగా, ఇండెంట్ చేసిన 7.77 కోట్ల లీటర్ల పాలలో, ఏజెన్సీ 6.11 కోట్ల లీటర్ల పాలను మాత్రమే సరఫరా చేసిందని, దీని ఫలితంగా (***అనుబంధం 4.8(బి)*** లో వివరించిన విధంగా) 1.66 కోట్ల లీటర్ల పాలు (21.36 శాతం) సరఫరా తగ్గి, లబ్ధిదారులకు ప్రయోజనాలు అందడం లేదని తేలింది.

ఈ విధంగా, మచ్చుకు తనిఖీ చేసిన డీడబ్ల్యూ & సీడబ్ల్యూ & ఈఓలలో జరిగిన నాలుగు పరిశీలనలు రాష్ట్ర స్థాయి పరిస్థితిని నిర్ధారిస్తాయి.

### iii) ప్రాజెక్టు (సీడీపీఓ) స్థాయి

2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు నాలుగు జిల్లాల్లోని మచ్చుకు తనిఖీ చేసిన 16 ప్రాజెక్టులకు ఏపీడీడీసీఎఫ్ లిమిటెడ్ సరఫరా చేసిన పాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించినప్పుడు, శాఖ ఇండెంట్ చేసిన 111.43 లక్షల లీటర్ల పాలలో, ఏజెన్సీ 71.30 లక్షల లీటర్ల పాలను మాత్రమే సరఫరా చేసిందని, దీని ఫలితంగా ***అనుబంధం 4.9*** లో వివరించిన విధంగా 40.12 లక్షల లీటర్ల (36 శాతం) పాల సరఫరా తగ్గిపోయిందని గమనించబడింది.

అవసరం/ఇండెంట్ ప్రకారం పాలు తగినంతగా అందలేదని సీడీపీఓలు ధ్రువీకరిస్తూ సమాధానం ఇచ్చారు. పాలు అందుకోని లబ్ధిదారుల సంఖ్య వివరాలు **పేరా 4.2.4** లో పేర్కొనబడ్డాయి.

### 4.2.3.2 బాలామృతం సరఫరా

2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు 257 ప్రాజెక్టులలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాలకు టీఎస్ఎన్‌సీచే మెస్సర్స్ టీఎస్ ఫుడ్స్ ద్వారా బాలామృతం సరఫరా చేయబడింది. ఇండెంట్ చేయబడిన 1,11,983.9 మెట్రిక్ టన్నుల బాలామృతంలో, ఏజెన్సీ 83,874.4 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసింది, దీని ఫలితంగా, ***అనుబంధం 4.10*** లో చూపిన విధంగా 28,110 మెట్రిక్ టన్నుల (1,12,43,816 ప్యాకెట్లు) (25 శాతం) బాలామృతం తక్కువగా సరఫరా అయింది.

సీడీపీఓల ఐసీడీఎస్ గిడ్డంగులకు నెలవారీగా బాలామృతం ఒక సంవత్సర కాలం సరఫరా చేయడానికి మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ టీఎస్ఎన్‌సీతో 2017 జూలై 20న ఒక ఒప్పందం (ఎంఓఏ) పై సంతకం చేసింది, ఆ తర్వాత ఒప్పందాన్ని 2022 జనవరి 31 వరకు పొడిగించింది. జనవరి 2023 నాటికి పార్టీల మధ్య ఎటువంటి ఒప్పందం జరగలేదు.

82 లేఖ సంఖ్య 114/జె2/2017, తేదీ 20/02/2018

ఇండెంట్ చేసినప్పటికీ టీఎస్ఎన్‌సీ అవసరమైన పరిమాణాన్ని సరఫరా చేయలేదని గమనించబడింది. ఇంకా, 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు మచ్చుకు తనిఖీ చేసిన నాలుగు జిల్లాల్లో, ఇండెంట్ చేసిన 101.68 లక్షల బాలామృతం ప్యాకెట్లలో, ఏజెన్సీ 69.01 లక్షల ప్యాకెట్లను మాత్రమే సరఫరా చేసింది. దీని ఫలితంగా 32.66 లక్షల ప్యాకెట్ల (32.12 శాతం) సరఫరా తగ్గి, లబ్ధిదారులకు మెరుగైన పోషణ అందకుండా పోయింది.

**పట్టిక 4.6: జిల్లాల వారీగా 2019-20 నుండి 2021-22 వరకు బాలామృతం సరఫరాలో కొరత**

| జిల్లా పేరు | ప్రాజెక్టుల సంఖ్య | అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య | సరఫరాలో కొరత గమనించిన నెలల సంఖ్య | ఇండెంట్ పరిమాణం | సరఫరా చేయబడిన పరిమాణం | సరఫరాలో కొరత |
|---|---|---|---|---|---|---|
| కడప | 15 | 3,621 | 22 | 23,14,246 | 14,20,206 | 8,94,040 |
| ప్రకాశం | 21 | 4,244 | 21 | 22,52,952 | 15,13,382 | 7,39,570 |
| విశాఖపట్నం | 25 | 4,952 | 32 | 41,85,558 | 30,90,503 | 10,95,055 |
| విజయనగరం | 17 | 3,729 | 20 | 14,15,644 | 8,77,887 | 5,37,757 |
| **మొత్తం** | **78** | **16,546** | **95** | **1,01,68,400** | **69,01,978** | **32,66,422** |

***మూలం:*** *డీడబ్ల్యూ & సీడబ్ల్యూ & ఈఓల అందచేసిన సమాచారం*

ఆ విధంగా, మచ్చుకు తనిఖీ చేయబడిన నాలుగు డీడబ్ల్యూ & సీడబ్ల్యూ & ఈఓల పరిశీలన రాష్ట్ర స్థాయి పరిస్థితిని నిర్ధారించింది. 2023 సెప్టెంబర్, అక్టోబర్ మరియు నవంబర్ నెలలకు ఇచ్చిన ఇండెంట్ల ప్రకారం టీఎస్ ఫుడ్స్ సరఫరా చేసిందని ప్రభుత్వం పేర్కొంది (2024 ఫిబ్రవరి 27).

అయితే, సమాధానాన్ని నిర్ధారించడానికి సహాయక పత్రాలు అందించలేదు.

### 4.2.3.3 గుడ్ల సరఫరా

లబ్ధిదారులు **పట్టిక 4.7** లో చూపిన విధంగా తమ పోషక అవసరాలను తీర్చుకోవడానికి క్రమం తప్పకుండా గుడ్లు సరఫరా పొందడానికి అర్హులు:

**పట్టిక 4.7: గిరిజన, గిరిజనేతర ప్రాంతాల్లో గుడ్ల సరఫరా**

| | లబ్ధిదారుల సమూహము | 2020 ఏప్రిల్‌కు ముందు [83] | 2020 ఏప్రిల్ తరువాత [84] |
|---|---|---|---|
| గిరిజన ప్రాంతాలు | గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, పాఠశాలకు వెళ్లబోయే పిల్లలు (3-6 సంవత్సరాలు) | రోజుకు ఒక గుడ్డు/ నెలకు 25 గుడ్లు | రోజుకు ఒక గుడ్డు/ నెలకు 25 గుడ్లు |
| | పిల్లలు (6 నెలలు-3 సంవత్సరాలు) | నెలకు 25 గుడ్లు | నెలకు 30 గుడ్లు (టీహెచ్ఆర్) |
| గిరిజనేతర ప్రాంతాలు | లబ్ధిదారుల సమూహము | 2020 సెప్టెంబర్‌కు ముందు [85] | 2020 సెప్టెంబర్ నుండి [86] |
| | గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు | రోజుకు ఒక గుడ్డు/ నెలకు 25 గుడ్లు | రోజుకు ఒక గుడ్డు/ నెలకు 25 గుడ్లు |
| | పాఠశాలకు వెళ్లబోయే పిల్లలు (3-6 సంవత్సరాలు) | వారానికి నాలుగు గుడ్లు | రోజుకు ఒక గుడ్డు/ నెలకు 25 గుడ్లు |
| | పిల్లలు (6 నెలలు-3 సంవత్సరాలు) | వారానికి రెండు గుడ్లు | నెలకు 25 గుడ్లు (టీహెచ్ఆర్) |

***మూలం:*** *ప్రభుత్వ ఆదేశాలు*

2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు మచ్చుకు తనిఖీ చేసిన నాలుగు జిల్లాల్లో, ఇండెంట్ చేసిన 49.99 కోట్ల గుడ్లలో, ఏజెన్సీ 46.44 కోట్లు మాత్రమే సరఫరా చేసిందని (***అనుబంధం 4.11*** లో వివరించిన విధంగా) గమనించబడింది. దీని ఫలితంగా 3.56 కోట్ల గుడ్ల (7.1 శాతం) కొరత ఏర్పడి, ఆమేరకు లబ్ధిదారులకు ఆశించిన ప్రయోజనాలు అందలేదు.

---

83 జీఓఎంఎస్ సంఖ్య 14, తేదీ 28/02/2014, జీఓఎంఎస్ సంఖ్య 36, తేదీ 13/11/2015

84 జీఓఎంఎస్ సంఖ్య 16, తేదీ 26/11/2019, పోషణ ప్లస్, మెమో సంఖ్య డబ్ల్యూడీసీ02-24028/3/2020-ఎస్ఎన్‌పి, తేదీ 03/04/2020

85 జీఓఎంఎస్ సంఖ్య 14, తేదీ 28/02/2014, జీఓఎంఎస్ సంఖ్య 4, తేదీ 03/05/2017

86 జీఓఎంఎస్ సంఖ్య 9, తేదీ 27/06/2020, పోషణ, పోషణ ప్లస్

అదేవిధంగా, నాలుగు జిల్లాల్లో మచ్చుకు తనిఖీ చేసిన 14 ప్రాజెక్టులలో, 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు, ఇండెంట్ చేసిన 8.06 కోట్ల గుడ్లలో (***అనుబంధం 4.11*** లో వివరించిన విధంగా) ఏజెన్సీ 7.38 కోట్లు సరఫరా చేసింది, ఫలితంగా 67.9 లక్షల గుడ్లు (8.4 శాతం) కొరత ఏర్పడింది.

గతంలో చాలా తక్కువ మంది స్థానిక సరఫరాదారులతో జిల్లా స్థాయిలో సరఫరా జరిగిందని, రాష్ట్ర స్థాయిలో టెండర్లు పిలవడం ద్వారా మంచి సరఫరా సామర్థ్యం కలిగిన సరఫరాదారులను ఎంచుకుంటూ ఈ సమస్యను పరిష్కరించామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఫిబ్రవరి 27).

### 4.2.3.4 పౌష్టికాహార కిట్ల సరఫరా

గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులకు అదనపు సప్లిమెంట్లను అందించడం ద్వారా పౌష్టికాహార లోపం మరియు రక్తహీనతను తగ్గించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక పౌష్టికాహార కార్యక్రమాన్ని[87] ప్రవేశపెట్టింది. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం అమలుకు ముందు, జిల్లా కొనుగోలు కమిటీ స్థానిక నిర్దిష్ట సామాజిక-సాంస్కృతిక ఆహార పద్ధతుల ఆధారంగా వస్తువులను సేకరించింది. 2020 మార్చి[88], నుండి, గిరిజన ప్రాంతాల నివాసితులకు పౌష్టికాహార కిట్లను అందించడానికి ఈ పథకం అమలు చేయబడింది. ఇంకా, 2020 సెప్టెంబర్ [89] నుండి, ఈ పథకాన్ని రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలలోని లబ్ధిదారులకు విస్తరింపచేశారు.

**పట్టిక 4.8: గిరిజన, గిరిజనేతర ప్రాంతాల్లో సరఫరా చేయబడిన పౌష్టికాహార కిట్లు [90]**

| గిరిజన ప్రాంతాలు | | గిరిజనేతర ప్రాంతాలు | |
|---|---|---|---|
| వస్తువు | నెలకు పరిమాణం | వస్తువు | నెలకు పరిమాణం |
| బహు ధాన్యాల పిండి | 2 కిలోలు | రాగి పిండి | 1 కిలో |
| పల్లీల చిక్కీ | 500 గ్రాములు | బెల్లం | 250 గ్రాములు |
| రాగులు/సజ్జలు/జొన్నల పిండి | 500 గ్రాములు | పల్లీల చిక్కీ | 250 గ్రాములు |
| బెల్లం | 500 గ్రాములు | ఎండు ఖర్జూరాలు | 250 గ్రాములు |
| ఎండు ఖర్జూరాలు | 500 గ్రాములు | రాగులు/సజ్జలు/జొన్నల పిండి | 1 కిలో |
| | | అటుకులు | 1 కిలో |

***మూలం***: *ప్రభుత్వ ఆదేశాలు*

పైన పేర్కొన్న వస్తువులను కలిగి ఉన్న ఒక్కో కిట్‌ను ప్రతి నెలా ప్రతి లబ్ధిదారునికి పంపిణీ చేయాలి. అందువల్ల, ప్రతి నెలా ఖచ్చితమైన లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా ఇండెంట్‌ను ఉంచాలి, తద్వారా నెలవారీ పౌష్టికాహారం తీసుకోవడం ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలోని గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులకు ఉపయోగకరంగా ఉంటుంది.

మూడు [91] జిల్లాల్లోని మచ్చుకు తనిఖీ చేసిన ఎనిమిది ప్రాజెక్టుల ద్వారా 2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు ఇండెంట్ చేయబడిన 2,17,988 కిట్లలో, గుత్తేదారు 1,88,833 కిట్‌లను మాత్రమే సరఫరా చేశాడు. దీని ఫలితంగా 29,155 కిట్‌ల (13.37 శాతం) కొరత ఏర్పడింది, తద్వారా **పట్టిక 4.9** లో చూపిన విధంగా కొంతమంది లబ్ధిదారులకు ప్రయోజనాలు నిరాకరించబడ్డాయి:

87 జీఓఎంఎస్ సంఖ్య 7, తేదీ 13/04/2018

88 జీఓఎంఎస్ సంఖ్య 16, తేదీ 26/11/2019

89 జీఓఎంఎస్ సంఖ్య 9, తేదీ 27/06/2020

90 జీఓఎంఎస్ సంఖ్య 9, తేదీ 27/06/2020

91 కడప, ప్రకాశం మరియు విశాఖపట్నం. విజయనగరం జిల్లాలో పౌష్టికాహార కిట్లు సరిపడా సరఫరా అయ్యాయి

**పట్టిక 4.9: ప్రాజెక్టు వారీగా 2019-20 నుండి 2021-22 వరకు పౌష్టికాహార కిట్ల సరఫరాలో కొరత**

| క్రమ సంఖ్య | ఐసీడీఎస్ ప్రాజెక్టు పేరు | అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య | నెలల సంఖ్య | ఇండెంట్ పరిమాణం | సరఫరా చేయబడిన పరిమాణం | సరఫరాలో కొరత |
|---|---|---|---|---|---|---|
| | **కడప జిల్లా** | | | | | |
| 1 | బద్వేల్ | 153 | 15 | 29,440 | 28,538 | 902 |
| 2 | జమ్మలమడుగు | 140 | 13 | 27,395 | 26,798 | 597 |
| 3 | పులివెందుల | 293 | 17 | 62,891 | 60,776 | 2,115 |
| 4 | రాజంపేట | 242 | 7 | 20,073 | 19,396 | 677 |
| | **ప్రకాశం జిల్లా** | | | | | |
| 5 | సంతమాగులూరు | 264 | 7 | 16,828 | 0 | 16,828 |
| | **విశాఖపట్నం జిల్లా** | | | | | |
| 6 | అరకు లోయ | 164 | 5 | 6,541 | 0 | 6,541 |
| 7 | పాడేరు | 184 | 8 | 11,687 | 11,508 | 179 |
| 8 | భీమునిపట్నం | 232 | 14 | 43,133 | 41,817 | 1,316 |
| | **మొత్తం** | **1,672** | **86** | **2,17,988** | **1,88,833** | **29,155** |

***మూలం:*** *సీడీపీఓలు అందచేసిన సమాచారం*

జిల్లా కొనుగోలు కమిటీ సరఫరాదారులకు నోటీసులు జారీ చేసిందని మరియు చర్యలు ప్రారంభించబడుతున్నాయని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఫిబ్రవరి 27).

ఈ విధంగా, రాష్ట్రం అంతటా పాలు మరియు బాలామృతం సరఫరా సరిపోలేదు. ఇంకా, మచ్చుకు తనిఖీ చేయబడిన నాలుగు జిల్లాల్లో గుడ్లు, ఎనిమిది ప్రాజెక్టులలో పౌష్టికాహార కిట్ల కొరత ఉంది.

## 4.2.4 లబ్ధిదారులకు పంపిణీ

గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు ఏడబ్ల్యూసీ వద్ద స్పాట్ ఫీడింగ్‌గా గుడ్డు మరియు పాలతో పాటు ఒక పూర్తి భోజనం పొందేందుకు అర్హులు. మూడు నుండి ఆరు సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఏడబ్ల్యూసీ వద్ద వారి హక్కుల ప్రకారం వరుసగా ఉదయం 9:30, ఉదయం 10:30 మరియు మధ్యాహ్నం 12:00 గంటలకు గుడ్లు, పాలు మరియు పూర్తి భోజనం పొందేందుకు అర్హులు. ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు వారి అర్హత ప్రకారం టేక్-హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) అందించబడుతుంది, అయితే గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు టీహెచ్ఆర్‌గా నెలవారీ పౌష్టికాహార కిట్‌ను అందుకుంటారు. దశల వారీగా స్పాట్ ఫీడింగ్ మరియు రాష్ట్రంలో పంపిణీ చేయబడిన టీహెచ్ఆర్ **పటం 4.2** లో చూపబడింది:

**పటం 4.2: 2019-20 నుండి 2021-22 మధ్య గల కాలంలో స్పాట్ ఫీడింగ్, టీహెచ్ఆర్ పంపిణీ వివరాలు**




ఏడబ్ల్యూసీలలో లబ్ధిదారులకు ఆహార పదార్థాల పంపిణీలో క్రింది వ్యత్యాసాలు గమనించడమైంది:

### 4.2.4.1 పాల పంపిణీ

- మచ్చుకు తనిఖీ చేసిన 21 ఏడబ్ల్యూసీలలో, ఆరు నెలల్లో మొత్తం 4,761.9 లీటర్ల పాలు తక్కువగా సరఫరా చేయబడ్డాయి, దీని ఫలితంగా మొత్తం 3,788 మంది లబ్ధిదారులలో 1,697 మంది (44.8 శాతం) వారి అర్హత ప్రకారం పాలు పొందలేకపోయారు.

  ఉదాహరణకు, ఆగస్టు 2021లో, యూనాది కాలనీ ఏడబ్ల్యూసీకి నెల మొత్తం 335 లీటర్ల[92] పాలు సరఫరా చేయబడలేదు. దీని కారణంగా, 116 మంది లబ్ధిదారులకు వారి అర్హత ప్రకారం పాలు పంపిణీ చేయబడలేదు.

- తగినంత పాలు అందుబాటులో ఉన్న ఎనిమిది [93] ఏడబ్ల్యూసీలలో 590.5 లీటర్ల పాలు తక్కువగా పంపిణీ చేయబడ్డాయి.

  ఉదాహరణకు, 2020 జూన్లో పి. జాకరవలస ఏడబ్ల్యూసీ రికార్డుల ప్రకారం, అర్హత ప్రకారం లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన మొత్తం పాలు 204 లీటర్లు [94] అని గమనించబడింది, అయితే టీహెచ్ఆర్‌గా 136.5 లీటర్ల పాలు మాత్రమే పంపిణీ చేయబడ్డాయి, దీని ఫలితంగా ఏడబ్ల్యూసీ వద్ద తగినంత పాలు (ప్రారంభ నిల్వ+స్వీకరణ= 287 లీటర్లు) అందుబాటులో ఉన్నప్పటికీ 18 మంది లబ్ధిదారులకు 67.5 లీటర్ల పంపిణీ తక్కువగా జరిగింది.

### 4.2.4.2 గుడ్ల పంపిణీ

- ఆరు నెలల్లో 13 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 3,213 మంది లబ్ధిదారులలో 655 మందికి (20.39 శాతం) 4,082 గుడ్లు తక్కువగా పంపిణీ చేయడాన్ని ఆడిట్ గుర్తించింది.

  ఉదాహరణకు, ఎన్‌వీ పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో, 2021 ఫిబ్రవరి నెలకు 6 నెలల నుండి 3 సంవత్సరాల వయస్సు (6ఎం-3వై) గల 20 మంది పిల్లలకు అవసరమైన మొత్తం గుడ్లు 500. అయితే, 340 గుడ్లు తక్కువగా సరఫరా కావడంతో 160 గుడ్లు మాత్రమే పంపిణీ చేయబడ్డాయి.

- తగినంత గుడ్లు అందుబాటులో ఉన్న తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాల్లో, 311 మంది లబ్ధిదారులకు 2,865 గుడ్లు తక్కువగా పంపిణీ చేయబడ్డాయని కూడా గమనించడమైంది.

  ఉదాహరణకు, లంపెలి అంగన్‌వాడీ కేంద్రంలో, 2019 డిసెంబర్ నెలకు, 32 మంది లబ్ధిదారులకు [95] అందించాల్సిన గుడ్ల సంఖ్య 800. అయితే, ఏడబ్ల్యూసీ వద్ద తగినంత స్టాక్ అందుబాటులో ఉన్నప్పటికీ, 400 గుడ్లు సరఫరా చేయడంతో 400 గుడ్లు తక్కువగా సరఫరా చేయబడ్డాయి.

### 4.2.4.3 బాలామృతం పంపిణీ

- ఆరు నెలల్లో 10 అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదు చేసుకున్న 799 మంది లబ్ధిదారులలో, 799 బాలామృతం ప్యాకెట్లకు గాను 558 (69.84 శాతం) మాత్రమే సరఫరా చేయబడినట్లు ఆడిట్‌లో గమనించడమైంది.

  ఉదాహరణకు, ప్రధానిపుట్టు అంగన్‌వాడీ కేంద్రంలో, 2021 ఆగస్టు నెలలో, 6 నెలల నుండి 3 సంవత్సరాల వయస్సు గల 17 మంది పిల్లలకు 17 బాలామృతం ప్యాకెట్లు అవసరమని గమనించబడింది. అయితే, అంగన్‌వాడీ కేంద్రానికి బాలామృతం అందకపోవడంతో ఆ నెలకు బాలామృతం పంపిణీ చేయబడలేదు.

---

[92] పి & ఎల్: 18x5 లీ; 6 నెలలు -3 సంవత్సరాలు: 68x2.5 లీ; 3-6 సంవత్సరాలు: 30x2.5 లీ

[93] ప్రధానిపుట్టు (మం), భీమునివలస, పోడుజోల, పి.జాకరవలస, జోడిమామిడి, మొండెంకల్లు-II, ఆకులరెల్లివీధి మరియు వెలమవారివీధి ఏడబ్ల్యూసీలు

[94] పి & ఎల్: 3x5 లీ + 6 నెలలు -3 సంవత్సరాలు: 19x6 లీ; 3-6 సంవత్సరాలు: 15x5 లీ

[95] పి & ఎల్: 5x25 గుడ్లు + 6 నెలలు-3 సంవత్సరాలు: 15x25 గుడ్లు + 3-6 సంవత్సరాలు: 12x25 గుడ్లు

#### 4.2.4.4 బియ్యం పంపిణీ

- నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలలో మొత్తం 57.18 కిలోల బియ్యం సరఫరా కాలేదు, దీని కారణంగా 2019 ఏప్రిల్, 2019 డిసెంబర్ నెలల్లో కొన్ని రోజుల్లో భోజనం అందించలేదు.

  ఉదాహరణకు, నారాయణరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో 2019 డిసెంబర్ నెలలో, 09 న బియ్యం ఆలస్యంగా సరఫరా చేయబడ్డాయని గమనించబడింది, దీని కారణంగా, 14 మంది లబ్ధిదారులకు 2019 డిసెంబర్ 01 నుండి, 2019 డిసెంబర్ 08 వరకు ఆరు రోజుల పాటు భోజనం అందించలేదు.

- మచ్చుకు తనిఖీ చేసిన రెండు అంగన్‌వాడీ కేంద్రాలలో 32 కిలోల బియ్యం తక్కువగా పంపిణీ చేయబడింది, అక్కడ తగినంత బియ్యం అందుబాటులో ఉన్నప్పటికీ, వారి అర్హత ప్రకారం లబ్ధిదారులకు సరఫరా చేయలేదు.

#### 4.2.4.5 కందిపప్పు పంపిణీ

- ఏడు ఏడబ్ల్యూసీలలో 38.6 కిలోల పప్పు సరఫరా చేయలేదని/అందించలేదని ఆడిట్ గమనించింది.

  ఉదాహరణకు, నారాయణరాజుపేట ఏడబ్ల్యూసీలో 2019 డిసెంబర్ నెలలో, 09 న పప్పు ఆలస్యంగా సరఫరా చేయబడిందని గమనించబడింది, దీని కారణంగా 15 మంది లబ్ధిదారులకు 2019 డిసెంబర్ 01 నుండి 2019 డిసెంబర్ 08 వరకు ఆరు రోజుల పాటు పూర్తి భోజనం అందించలేదు.

- ఐదు ఏడబ్ల్యూసీలలో, 27.18 కిలోల పప్పు తక్కువగా పంపిణీ చేయబడింది, అక్కడ తగినంత పప్పు అందుబాటులో ఉన్నప్పటికీ, లబ్ధిదారులకు వారి అర్హత ప్రకారం పంపిణీ చేయలేదు.

#### 4.2.4.6 పౌష్టికాహార కిట్ల పంపిణీ

- 16 అంగన్‌వాడీ కేంద్రాలలోని 691 మంది లబ్ధిదారులలో 149 మంది లబ్ధిదారులకు (21.56 శాతం) పౌష్టికాహార కిట్లు సరఫరా కాలేదని గమనించడమైంది.

సరఫరాలో లోపాలు మరియు పంపిణీలో జాప్యం ఉన్నందున సరఫరా వ్యవస్థ నిర్వహణ బాగా నిర్వహించలేదని గమనించబడింది. అందువల్ల, అందరు గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు మరియు 06 నుండి 72 నెలల వయస్సు గల పిల్లలకు అనుబంధ పోషకాహారాన్ని అందించే పథక లక్ష్యం నెరవేరలేదు.

గర్భిణీ మరియు పాలిచ్చే తల్లులకు చరవాణి అప్లికేషన్ ద్వారా లబ్ధిదారుల ముఖచిత్రాన్ని సంగ్రహించడం ద్వారా అర్హత కల వస్తువుల స్వీకరణ (టీహెచ్ఆర్) ను ధ్రువీకరించడానికి 2023 అక్టోబర్ నుండి ముఖ గుర్తింపు వ్యవస్థను ప్రవేశపెట్టారని ప్రభుత్వం పేర్కొంది (2024 ఫిబ్రవరి 27).

ఆ విధంగా, ఆహార పదార్థాల సరఫరాలో జాప్యం కారణంగా ఏడబ్ల్యూసీలలో సేవలను సకాలంలో అందజేయడం లేదు. దీని వలన ఆడిట్ ద్వారా తనిఖీ చేయబడిన అన్ని ఏడబ్ల్యూసీలలో లబ్ధిదారులకు తగినంత పంపిణీ జరగలేదు.

### 4.2.5 మచ్చుకు తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాలలో భౌతిక ధ్రువీకరణ మరియు లబ్ధిదారుల సర్వే

మచ్చుకు తనిఖీ చేసిన 32 అంగన్‌వాడీ కేంద్రాలలో భౌతిక ధ్రువీకరణ జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాలలోని లోటుపాట్లు **పట్టిక 4.10** లో చూపించబడ్డాయి: (భౌతిక ధ్రువీకరణ వివరాలు ***అనుబంధం 4.12 (ఎ)*** లో ఇవ్వబడ్డాయి)

**పట్టిక 4.10: మచ్చుకు తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో భౌతిక ధ్రువీకరణ సమయంలో గుర్తించిన లోటుపాట్లు**

| వివరాలు | తనిఖీ పరిశీలనలు |
|---|---|
| అంగన్‌వాడీ కేంద్రాల వద్ద టీహెచ్ఆర్ కిట్/ఆహార పదార్థాల వివరాలు ప్రదర్శించబడ్డాయి (జీఓఎంఎస్ సంఖ్య 14 తేదీ 2014 ఫిబ్రవరి 28 ప్రకారం ఇది అవసరం) | 15 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రదర్శించబడలేదు (47 శాతం) |

| వివరాలు | తనిఖీ పరిశీలనలు |
|---|---|
| అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎస్ఏఎం/ఎంఏఎం/ఎస్‌యూడబ్ల్యూ లబ్ధిదారులు గుర్తించబడ్డారు | 15 అంగన్‌వాడీ కేంద్రాల్లో గుర్తించబడ్డారు (47 శాతం) |
| వృద్ధి సూచీల పటాలు | 11 అంగన్‌వాడీ కేంద్రాల్లో పటాలు ప్రదర్శించబడలేదు (34 శాతం) |

అంగన్‌వాడీ కేంద్రాలలో టీహెచ్ఆర్ కిట్/ఆహార వస్తువుల వివరాల ప్రదర్శన, వృద్ధి సూచీలు, ఎస్ఏఎం/ఎంఏఎం/ఎస్‌యూడబ్ల్యూ లబ్ధిదారుల గుర్తింపు కోసం చర్యలు తీసుకున్నామని, తల్లులకు సలహాలు చెప్పబడ్డాయని ప్రభుత్వం పేర్కొంది (2024 ఫిబ్రవరి 27). అయితే, సమాధానాన్ని నిర్ధారించడానికి సహాయక పత్రాలను అందించలేదు.

ఇంకా, లబ్ధిదారుల సర్వే కూడా నిర్వహించబడింది, ఆ సర్వే ఫలితాలు **పట్టిక 4.11** లో చూపిన విధంగా సౌకర్యాలలో ఈ క్రింది లోపాలను చూపిస్తున్నాయి: (లబ్ధిదారుల సర్వే వివరాలు ***అనుబంధం 4.12 (బి)*** లో ఇవ్వబడ్డాయి):

**పట్టిక 4.11: మచ్చుకు తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల సర్వేలో గుర్తించిన సదుపాయాలలోని లోటుపాట్లు**

| వివరాలు | లబ్ధిదారుల సంఖ్య | అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య |
|---|---|---|
| స్వంత భవనం/మరమ్మతులు అవసరం | 78 | 9 |
| పారిశుద్ధ్య సదుపాయాలు అవసరం | 61 | 9 |
| క్రీడా పరికరాలు అవసరం | 26 | 5 |
| ప్రహరీ గోడ అవసరం | 58 | 8 |
| విద్యుచ్ఛక్తి అవసరం | 30 | 3 |
| త్రాగు నీరు అవసరం | 28 | 3 |
| టీహెచ్ఆర్ అవసరం | 16 | 5 |
| టీహెచ్ఆర్/పాలు/గుడ్లు కుటుంబ సభ్యులు తిన్నారు/వినియోగించారు | టీహెచ్ఆర్ వస్తువులను లబ్ధిదారులతో పాటు కుటుంబ సభ్యులు కూడా వినియోగిస్తారని ఆరు అంగన్‌వాడీ కేంద్రాల్లోని 29 మంది లబ్ధిదారులు పేర్కొన్నారు. | |
| ఆహారం తీసుకోలేదు | ఇంటి పనులు, ప్రభుత్వేతర ఉద్యోగం మొదలైన వాటి కారణంగా అంగన్‌వాడీ కేంద్రంలో వండిన భోజనం తినలేదని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లోని 10 మంది లబ్ధిదారులు తెలిపారు. | |

లబ్ధిదారుల సర్వేలో, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో మచ్చుకు తనిఖీ చేసిన 32 అంగన్‌వాడీ కేంద్రాలలో 12 కేంద్రాలు విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సౌకర్యాలు వంటి ముఖ్యమైన సౌకర్యాలను అందించడంలో లోపాలు కలిగి ఉన్నాయని తెలిసింది.

నాడు-నేడు రెండవ దశ కార్యక్రమం క్రింద 1,776 అంగన్‌వాడీ కేంద్రాల్లో పాక్షిక మరమ్మతులు చేపట్టామని, ఫర్నిచర్ మరియు ఆట సామగ్రి కొరకు ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి ₹5 లక్షలు అందజేశామని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2024 ఫిబ్రవరి 27). 1,776 అంగన్‌వాడీ కేంద్రాలలో 1,210 పనులు పూర్తయ్యాయి, 566 పనులు పురోగతిలో ఉన్నాయి. ఇంకా, ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు మూడు ప్రాథమిక సౌకర్యాలు అంటే సురక్షితమైన తాగునీరు, విద్యుత్ మరియు ఉపయోగించగల మరుగుదొడ్లను అందించడానికి ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొంది. స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) క్రింద ₹28.28 కోట్లు, జల్ జీవన్ మిషన్ (జెజెఎం) క్రింద ₹85.95 కోట్లు మరియు ₹99.997 కోట్ల రాష్ట్ర గ్రాంట్‌తో కలిపి ₹214.227 కోట్లకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి[96] జారీ చేసింది. ఈ నిధులలో మన అంగన్‌వాడీ-నాడు-నేడు కార్యక్రమం కింద 20,534 అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం పాఠశాల విద్యా శాఖ సమన్వయంతో ఈ పనులను చేపట్టారు.

96 డబ్ల్యూ సీడీ ఏ & ఎస్‌సీల శాఖ యొక్క జీఓఆర్‌టీ సంఖ్య 116, తేదీ 18/10/2023

### 4.2.6 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలికవసతులు

#### అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాల లభ్యత తక్కువగా ఉండటం/లేకపోవడం

ఐసీడీఎస్‌తో కలిపి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి మార్గదర్శకాలలోని 4వ పేరా ప్రకారం, అంగన్‌వాడీ కేంద్ర భవనం అన్ని సంబంధిత మౌలిక సదుపాయాలతో పిల్లలకు అనుకూలంగా ఉండాలి, పిల్లలు/మహిళలకు ప్రత్యేకంగా కూర్చొనే గది, ప్రత్యేక వంటగది, ఆహార పదార్థాలను నిల్వ చేయడానికి స్టోర్ మరియు పిల్లలకు అనుకూలమైన మరుగుదొడ్లు, పిల్లలు ఆడుకోవడానికి స్థలం మరియు సురక్షితమైన తాగునీటిని కలిగి ఉండాలి.

అంగన్‌వాడీ కార్యకర్త (ఏడబ్ల్యూడబ్ల్యూ) క్రమానుగతంగా పిల్లలు (6 నెలలు-6 సంవత్సరాలు), గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లుల కొలతలు తీసుకోవాలి; అధిక ప్రమాదం ఉన్న పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలను గుర్తించడానికి పెరుగుదల పటాలలో బరువులను ఖచ్చితంగా నమోదు చేయాలి. ఇందు కోసం, అంగన్‌వాడీ కేంద్రాలకు సాల్టర్ స్కేల్స్ (శిశువు బరువును కొలిచే స్కేల్స్), పెద్దల బరువు తూచే స్కేళ్ళు అందించాలి; పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లుల ఎత్తును కొలవడానికి, ఇన్ఫాంటో [97] మీటర్, స్టేడియో[98] మీటర్ కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు అందించాలి.

#### ఎ) రాష్ట్ర స్థాయి

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో (ఏడబ్ల్యూసీలు) ఉన్న మౌలిక సదుపాయాలపై శాఖ అందించిన సమాచారం (**పటం 4.3**) ప్రకారం, రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాలలో 23,747 (43 శాతం) అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయి.

- 10,658 (19 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె లేని భవనాల్లో ఉంచబడ్డాయి[99]
- 14,302 (26 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలు పారిశుద్ధ్య సదుపాయాలు (మరుగుదొడ్లు) కలిగి లేవు
- 24,425 (44 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలు నీటి కుళాయిలు కలిగి లేవు
- 8,469 (15 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలు విద్యుచ్ఛక్తి సదుపాయాన్ని కలిగి లేవు.

**పటం 4.3: 55607 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల లభ్యత స్థితి**




***మూలం:*** *సంచాలకుల కార్యాలయంచే అందించబడిన సమాచారం*

- పిల్లలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లుల బరువు మరియు ఎత్తును కొలవడానికి, 14,655 (26 శాతం) సాల్టర్ స్కేళ్లు,

---

97 ఆరు నెలల నుండి 24 నెలల పిల్లల ఎత్తును కొలిచే ఇన్ఫాంటో మీటర్

98 రెండు సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పెద్దలు మరియు పిల్లల ఎత్తును కొలిచే స్టేడియో మీటర్

99 ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాలు మరియు కమ్యూనిటీ భవనాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యా శాఖ అద్దె లేకుండా వసతి కల్పించింది

32,254 (58 శాతం) పెద్దల బరువు తూచే స్కేళ్ళు, 26,593 (48 శాతం) ఇన్ఫాంటో మీటర్లు మరియు 45,311 (81 శాతం) స్టేడియో మీటర్లు **పటం 4.4** లో చూపిన విధంగా పని చేసే స్థితిలో లేవు/అందుబాటులో లేవు.

**పటం 4.4: 55607 అంగన్ వాడీ కేంద్రాల్లో బరువు మరియు ఎత్తు కొలిచే సాధనాల పనిచేసే పరిస్థితి**




***మూలం:** సంచాలకుల కార్యాలయంచే అందించబడిన సమాచారం*

పైన పేర్కొన్న ప్రాథమిక మౌలిక సదుపాయాలు అంగన్‌వాడీ కేంద్రాలలో లేకపోవడం వలన లక్షిత లబ్ధిదారులకు సేవల పంపిణీపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

ప్రస్తుతం 23,287 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయనీ, 2023-24 లో పోషణ్ అభియాన్ పథకం క్రింద 55,607 అంగన్‌వాడీ కేంద్రాలకు స్టేడియో మీటర్లు, ఇన్ఫాంటో మీటర్లు, శిశువుల బరువు స్కేళ్లు, తల్లి & పిల్లల అనలాగ్ స్కేళ్లు సరఫరా చేయబడ్డాయనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఫిబ్రవరి 27).

### బి) జిల్లా స్థాయి

నాలుగు జిల్లాల్లో మచ్చుకు తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాలలో (ఏడబ్ల్యూసీలు) ఉన్న మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమాచారం ప్రకారం, 16,546 అంగన్‌వాడీ కేంద్రాలలో, 7,695 అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయని, 2,800 అద్దె రహిత భవనాల్లో ఉన్నాయని, 5,901 అంగన్‌వాడీ కేంద్రాలకు పారిశుధ్య (మరుగుదొడ్లు) సౌకర్యాలు లేవని, 10,065 అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి కుళాయి కనెక్షన్లు లేవని మరియు 3,201 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేదని తేలింది. పిల్లలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లుల బరువు మరియు ఎత్తును కొలవడానికి, 4,208 సాల్టర్ స్కేళ్లు, 11,171 పెద్దల బరువు తూచే స్కేళ్లు, 8,019 ఇన్‌ఫాంటో మీటర్లు మరియు 13,087 స్టేడియో మీటర్లు పని చేసే స్థితిలో లేవు/అందుబాటులో లేవు. వివరాలు ***అనుబంధం 4.13*** లో చూపబడ్డాయి. నాలుగు జిల్లాల్లో మచ్చుకు తనిఖీ చేసిన 16,546 అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాల స్థితులు **పటం 4.5, పటం 4.6, పటం 4.7** లలో చిత్రీకరించబడ్డాయి.

**పటం 4.5: 16,546 అంగన్ వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల స్థితి**




**పటం 4.6: 16,546 అంగన్ వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల స్థితి**




*మూలం: సంచాలకుల కార్యాలయం, డీడబ్ల్యూ & సీడబ్ల్యూ & ఈఓలచే అందించబడిన సమాచారం*

**పటం 4.7: 16,546 అంగన్ వాడీ కేంద్రాల్లో బరువు మరియు ఎత్తు కొలిచే సాధనాల పనిచేసే పరిస్థితి**




*మూలం: సంచాలకుల కార్యాలయం, డీడబ్ల్యూ & సీడబ్ల్యూ & ఈఓలచే అందించబడిన సమాచారం*

అంగన్‌వాడీ కేంద్రాలలో పైన పేర్కొన్న ప్రాథమిక మౌలిక సదుపాయాలు లేకపోవడం వలన లక్షిత లబ్ధిదారులకు సేవలను అందించడంపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

### సి) ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయి:

నాలుగు జిల్లాల్లోని మచ్చుకు తనిఖీ చేసిన 16 ఐసీడీఎస్ ప్రాజెక్టులలోని 3,160 అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమాచారం ప్రకారం:

- 1,149 (36 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయి, 656 (21 శాతం) అద్దె రహిత భవనాల్లో ఉన్నాయి మరియు 1,355 (43 శాతం) సొంత భవనాల్లో ఉన్నాయి,
- 1,390 (44 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు పారిశుధ్య (మరుగుదొడ్లు) సౌకర్యాలు లేవు మరియు 1,770 (56 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు పారిశుధ్య (మరుగుదొడ్లు) సౌకర్యాలు ఉన్నాయి,
- 1,796 (57 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి కుళాయి కనెక్షన్లు లేవు మరియు 1,364 (43 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి,
- 470 (15 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేదు మరియు 2,690 (85 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం ఉంది,
- 1,344 (43 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహార పదార్థాల నిల్వ సౌకర్యం లేదు మరియు 1,816 (57 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహార పదార్థాల నిల్వ సౌకర్యం ఉంది,
- 979 (31 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక వంటగది లేదు మరియు 2,181 (69 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక వంటగది ఉంది,
- 1,910 (60 శాతం) అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ఆట స్థలం సౌకర్యం లేదు మరియు 1,250 (40 శాతం) అంగన్‌వాడీ కేంద్రాల పిల్లల కోసం ఆట స్థలం సౌకర్యం ఉంది, మరియు
- 1,862 (59 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ గోడలు లేవు మరియు 1,298 (41 శాతం) అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ గోడలు ఉన్నాయి.

పిల్లలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లుల బరువు మరియు ఎత్తును కొలవడానికి,

- 462 (15 శాతం) సాల్టర్ స్కేళ్లు పని చేసే స్థితిలో లేవు/అందుబాటులో లేవు మరియు 2,698 (85 శాతం) పనిచేస్తున్నాయి/అందుబాటులో ఉన్నాయి,
- 2,049 (65 శాతం) పెద్దల బరువు తూచే స్కేళ్లు పని చేసే స్థితిలో లేవు/అందుబాటులో లేవు మరియు 1,111 (35 శాతం) పనిచేస్తున్నాయి/అందుబాటులో ఉన్నాయి,
- 1,067 (34 శాతం) ఇన్ఫాంటో మీటర్లు పని చేసే స్థితిలో లేవు/అందుబాటులో లేవు మరియు 2,093 (66 శాతం) పనిచేస్తున్నాయి/అందుబాటులో ఉన్నాయి,
- 1,901 (60 శాతం) స్టేడియో మీటర్లు పని చేసే స్థితిలో లేవు/అందుబాటులో లేవు మరియు 1,259 (40 శాతం) పనిచేస్తున్నాయి/అందుబాటులో ఉన్నాయి.

### డి) మచ్చుకు తనిఖీ చేయబడిన అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు

అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రాథమిక మౌలిక సదుపాయాల కొరత పిల్లలు మరియు మహిళలకు సంపూర్ణ పోషణ మరియు ఇతర విద్యాభ్యాసానికి ముందు చేసే కార్యక్రమాల అమలును ప్రభావితం చేస్తుంది. పోషకాహారాన్ని అందించడం ద్వారా మరియు పాఠశాలకు వెళ్ళే ముందు విద్య మరియు ఆటలను అందించడం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలు బాల్యం నుండే పిల్లల మొత్తం పెరుగుదలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

మచ్చుకు తనిఖీ చేయబడిన 16 ఐసీడీఎస్ ప్రాజెక్టులలోని 32 అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న మౌలిక సదుపాయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించినప్పుడు, ఈ క్రింది విషయాలు గమనించబడ్డాయి:

| వివరాలు | తనిఖీ పరిశీలనలు |
|---|---|
| 32 అంగన్‌వాడి కేంద్రాలలో 14 కేంద్రాలు అద్దె భవనాల్లో మరియు ఏడు అద్దె రహిత భవనాల్లో పనిచేస్తున్నాయి. | అద్దె భవనాల్లో ఉన్న 14 అంగన్‌వాడి కేంద్రాలలో, ఒకటి బహిరంగ వరండాలో పనిచేస్తుండగా, ఒకటి అధ్వాన్నమైన స్థితిలో ఉంది మరియు ఒకటి ఇంటి పైభాగంలో లోహపు పై కప్పు కల షెడ్డులో పనిచేస్తోంది |



*ఛాయా చిత్రం 4.1[100]:: కడప జిల్లా రాజంపేట ఐసీడీఎస్‌లోని చెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రం, ఇక్కడ కేంద్రం మొదటి అంతస్తులోని గది నుండి పనిచేస్తోంది. ఇంకా, ఇరుకైన మరియు సురక్షితం కాని మెట్లు పిల్లలు మరియు పాలిచ్చే తల్లులకు సమస్యలను కలిగిస్తాయి*

మచ్చుకు తనిఖీ చేయబడిన 32 అంగన్‌వాడీ కేంద్రాలలోని సౌకర్యాల స్థితి **పట్టిక 4.12** లో చూపబడింది:

**పట్టిక 4.12: మచ్చుకు తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల కొరత**

| వసతుల పేరు/కొలిచే స్కేళ్ళు | మచ్చుకు తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల స్థితి |
|---|---|
| తాగునీటి కుళాయి కనెక్షన్ | 23 అంగన్‌వాడీ కేంద్రాల్లో(72 శాతం) కుళాయి కనెక్షన్లు అందించలేదు |
| విద్యుత్ సౌకర్యం | నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో (13 శాతం) అందించలేదు |
| ప్రహరీ గోడ సౌకర్యం | 11 అంగన్‌వాడీ కేంద్రాల్లో (34 శాతం) అందించలేదు |
| పారిశుద్ధ్య సదుపాయాలు | 16 అంగన్‌వాడీ కేంద్రాల్లో (50 శాతం) అందించలేదు |
| ఆహార పదార్థాల నిల్వకు ప్రదేశం | 14 అంగన్‌వాడీ కేంద్రాల్లో (44 శాతం) అందించలేదు |
| తగినంత వంటచేయు ప్రదేశం | 13 అంగన్‌వాడీ కేంద్రాల్లో (41 శాతం) అందించలేదు |
| పిల్లలు ఆడుకోవడానికి బహిరంగ స్థలం | 21 అంగన్‌వాడీ కేంద్రాల్లో (66 శాతం) అందించలేదు |
| పెద్దల బరువు తూచే (డిజిటల్) స్కేలు | 22 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేయడం లేదు, రెండింటిలో అందుబాటులో లేవు (69 శాతం) |
| పిల్లల కోసం సాల్టర్ స్కేలు | ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో (16 శాతం) పనిచేయడం లేదు |
| పిల్లల ఎత్తు కొలవడానికి ఇన్ఫాంటో మీటరు | నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో (13 శాతం) పనిచేయడం లేదు |
| పెద్దల ఎత్తు కొలిచే స్టేడియో మీటరు | 13 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేయడం లేదు, రెండింటిలో అందుబాటులో లేవు (41 శాతం) |

మచ్చుకు తనిఖీ చేయబడిన అంగన్‌వాడీ కేంద్రాల భౌతిక పరిశీలన సమయంలో, క్రింది లోపాలు గమనించబడ్డాయి:

➢ పాడేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు (గిరిజన) లోని జోడిమామిడి అంగన్‌వాడీ కేంద్రంలో, కేంద్రం అద్దె రహిత భవనంలో పనిచేస్తుందని మరియు పారిశుధ్య సౌకర్యాలు లేవని గమనించబడింది. ఫలితంగా, లబ్ధిదారులు అపరిశుభ్ర పరిస్థితులను కలిగి ఉన్న బహిరంగ ప్రదేశాలను ఉపయోగించాల్సి వస్తోంది.

100 17/11/2022 నాటికి

➢ అదేవిధంగా, సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులోని కూకట్లపల్లి ఎస్సీ-2 అంగన్‌వాడీ కేంద్ర భౌతిక పరిశీలన సమయంలో, కేంద్రం ఎంపీపీ పాఠశాల యొక్క చిన్న వరండాలో అద్దె రహిత వసతిలో పనిచేస్తోందని గమనించబడింది, కేంద్రానికి ప్రత్యేక గది కేటాయించబడలేదు. సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల లబ్ధిదారులకు అసౌకర్యంగా ఉందని తెలియచేస్తూ లబ్ధిదారుల సర్వే సమయంలో లబ్ధిదారులు ప్రత్యేక అంగన్‌వాడీ కేంద్రం కావాలని అభ్యర్థించారు.

➢ అరకు ఐసీడీఎస్ ప్రాజెక్టులోని ప్రధానిపుట్టు అంగన్‌వాడీ కేంద్రం (గిరిజన) లో, తాగునీటి సౌకర్యాలు లేవని గమనించబడింది. అంగన్‌వాడీ కార్యకర్త సమీపంలోని బావి నుండి నీటిని అందించింది, ఇది లబ్ధిదారులకు ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది.

స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) క్రింద ₹28.28 కోట్లు, జల్ జీవన్ మిషన్ (జేజేఎం) క్రింద ₹85.95 కోట్లు మరియు ₹99.997 కోట్ల రాష్ట్ర గ్రాంట్‌తో కలిపి ₹214.23 కోట్లకు పరిపాలనా అనుమతి మంజూరు చేయబడిందని, మన అంగన్‌వాడీ-నాడు-నేడు కింద 20,534 అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి పాఠశాల విద్యా శాఖతో సమన్వయంతో ఈ పనులు చేపట్టామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2024 ఫిబ్రవరి 27).

నాడు-నేడు రెండవ దశ కింద అభివృద్ధి మరియు మరమ్మతుల కోసం పనులు చేపట్టామని, అవి వివిధ దశల్లో పూర్తవుతున్నాయని ప్రభుత్వం సమాధానమిచ్చింది. 2023-24 సంవత్సరంలో బరువు/ఎత్తు కొలిచే స్కేళ్లను కొనుగోలు చేసి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేశామని కూడా ప్రభుత్వం తెలిపింది.

ఈ విధంగా, మచ్చుకు తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలైన సరైన భవనాలు, మరుగుదొడ్లు మరియు తాగునీటి సౌకర్యాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం వల్ల లబ్ధిదారులు అపరిశుభ్ర పరిస్థితులకు గురయ్యారు.

### 4.2.7 నాణ్యత నియంత్రణ

అదనపు పోషకాహార (ఐసీడీఎస్ పథకం కింద) నియమాలు, 2017 ప్రకారం, ఆహార భద్రత నిబంధనలకు అనుగుణంగా, ఆహార కూర్పుకు అనుగుణంగా అనుబంధ పోషకాహార నాణ్యతను నిర్ధారించడం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ (డీపీఓ) అంటే, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమం మరియు సాధికారత అధికారి (డీడబ్ల్యూ & సీడబ్ల్యూ & ఈఓ) మరియు అంగన్‌వాడీ సేవల (ఐసీడీఎస్) కింద శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీఓ) బాధ్యత. ఆహార మరియు పోషకాహార బోర్డు, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి, కాలానుగుణంగా తనిఖీలు నిర్వహించి, భోజనం పరీక్షించాలి లేదా గుర్తింపు పొందిన ప్రభుత్వ ఆహార పరిశోధన ప్రయోగశాల ద్వారా భోజనం పోషక ప్రమాణాలకు అనుగుణంగా ఉందని నిర్ధారించుకోవాలి. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం అధికారం ఇచ్చిన అధికారులు కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, భోజనాన్ని పరీక్షించి, భోజనం నాణ్యత మరియు పోషక విలువను నిర్ధారించడానికి పైన పేర్కొన్న ప్రయోగశాలల ద్వారా పరీక్షించాలి.

వైఎస్ఆర్ పౌష్టికాహార కిట్లు/బాలామృతం సరఫరా కోసం టెండర్ నిబంధనల ప్రకారం, సరఫరా చేసే ఏజెన్సీ ప్రాంతీయ ప్రయోగశాల నుండి బ్యాచ్ వారీగా నాణ్యత పరీక్ష/ఆహార విశ్లేషణ నివేదికలను సమర్పించాలి.

మచ్చుకు తనిఖీ చేయబడిన నాలుగు [101] జిల్లాలు, 16 [102] ఐసీడీఎస్ ప్రాజెక్టులలో, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమం మరియు సాధికారత అధికారి (డీడబ్ల్యూ & సీడబ్ల్యూ & ఈఓ)/శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి (సీడీపీఓ) 2019-20 నుండి 2021-22 వరకు ఎటువంటి ఆహార నమూనాలను సేకరించి నాణ్యతా తనిఖీల కోసం

[101] కడప, ప్రకాశం, విశాఖపట్నం మరియు విజయనగరం జిల్లాలు

[102] ఐసీడీఎస్ ప్రాజెక్టులు (సీడీపీఓలు): 1) బద్వేల్, 2) జమ్మలమడుగు, 3) పులివెందుల, మరియు 4) ఒకప్పటి కడప జిల్లాలోని రాజంపేట; 5) ఒంగోలు పట్టణ, 6) మద్దిపాడు, 7) సంతమాగులూరు, మరియు 8) ఒకప్పటి ప్రకాశం జిల్లాలోని బేస్తవారిపేట, 9) అరకు 10) డుంబ్రిగూడ, 11) పాడేరు, 12) హుకుంపేట, 13) వి.మాడుగుల మరియు 14) ఒకప్పటి విశాఖపట్నం జిల్లాలోని భీమునిపట్నం, 15) బొబ్బిలి, మరియు 16) ఒకప్పటి విజయనగరం జిల్లాలోని కురుపాం

ప్రయోగశాలలకు పంపలేదు.

అంగన్‌వాడీ కేంద్రాల భౌతిక పరిశీలన సమయంలో, సరఫరా చేయబడుతున్న ఆహార పదార్థాల నాణ్యత హామీలో అనేక వ్యత్యాసాలు గమనించబడ్డాయి. వివరాలు **పట్టిక 4.13** లో చూపబడ్డాయి:

**పట్టిక 4.13: మచ్చుకు తనిఖీ చేసిన అంగన్‌వాడీ కేంద్రాలలో గుడ్లు మరియు పౌష్టికాహార కిట్‌లకు సంబంధించి నాణ్యత నియంత్రణ లేకపోవడం**

| క్రమ సంఖ్య | అంగన్‌వాడీ కేంద్రం పేరు | వ్యాఖ్యలు |
|---|---|---|
| 1 | ఎన్ వీ పాలెం | ఖర్జూరాలు మరియు చిక్కీలు తయారీ తేదీ మరియు గడువు తేదీ లేకుండా జారీ చేయబడ్డాయి |
| 2 | కామేపల్లివారిపాలెం | ఖర్జూరాలు మరియు చిక్కీలు తయారీ తేదీ మరియు గడువు తేదీ లేకుండా జారీ చేయబడ్డాయి |
| 3 | లాంపెలి | చిక్కీలు తక్కువ బరువుతో ఉన్నాయి |
| 4 | ఎల్ కొత్తపల్లి | ఏడింటిలో ఐదు చిక్కీలు, ఏడింటిలో రెండు బెల్లం తక్కువ బరువు కలిగి ఉన్నాయి |
| 5 | చెర్లోపల్లి ఎస్టీ కాలనీ | 20 లో 12 గుడ్లు తక్కువ బరువు కలిగి ఉన్నాయి |
| 6 | కొండంపల్లి | 10 లో 5 గుడ్లు తక్కువ బరువు కలిగి ఉన్నాయి |
| 7 | కూకట్లపల్లి | గుడ్లపై రంగు వేయలేదు |
| 8 | నల్లపురెడ్డిపల్లి-I | గుడ్లపై రంగు వేయలేదు |
| 9 | ఉలిమెల్ల-I | గుడ్లపై రంగు వేయలేదు |

డబ్ల్యూడీ & సీడబ్ల్యూడీ సంచాలకుల సూచనల[103] మేరకు, అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లను మూడు దశల్లో సరఫరా చేయాలి. మొదటి దశ ప్రతి నెల 1 నుండి 10 వ తేదీ వరకు పసుపు రంగు ముద్రతో, 2వ దశ ప్రతి నెల 11 నుండి 20వ తేదీ వరకు ఆకుపచ్చ రంగు ముద్రతో మరియు 3వ దశ ప్రతి నెల 21 నుండి 30/31వ తేదీల మధ్య నీలం రంగు ముద్రతో సరఫరా చేయాలి, గుడ్ల బరువు 50 గ్రాములు ఉండాలి లేదా గుడ్డు ట్రే బరువు ట్రే బరువును మినహాయించి 1500 గ్రాముల కంటే తక్కువ ఉండకూడదు. రాజంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టులో, భౌతిక ధ్రువీకరణ సమయంలో, చెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో 50 గ్రాముల కంటే తక్కువ బరువున్న గుడ్లు సరఫరా చేయబడ్డాయని మరియు మార్గదర్శకాలకు విరుద్ధంగా మూడు అంగన్‌వాడీ కేంద్రాలలో పాక్షిక ముద్ర ఉన్న గుడ్లు కూడా సరఫరా చేయబడ్డాయని గమనించబడింది.




*ఛాయా చిత్రం 4.2[104] : కడప జిల్లా రాజంపేట ఐసీడీఎస్‌లోని చెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రం*



*ఛాయా చిత్రం 4.3[105]: ప్రకాశం జిల్లా సంతమాగులూరు ఐసీడీఎస్‌లోని కూకట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం*

ఐదు అంగన్‌వాడీ కేంద్రాలలో తక్కువ బరువు (<50గ్రా), రంగు చిహ్నం పాక్షికంగా ముద్రించినట్లు గమనించబడింది

ఇంకా, వి. మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లోని ఎల్ కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో, **ఛాయా చిత్రం 4.4** లో చూపిన

103 మెమో సంఖ్య 7656/జె1/2016- ఎస్ఎన్‌పి, తేదీ 07/10/2021

104 17/11/2022 నాటికి

105 17/08/2022 నాటికి

విధంగా, నిర్దేశించిన 500 గ్రాముల బరువు కంటే తక్కువ బరువు ఉన్న చిక్కీలు మరియు బెల్లం సరఫరా చేయబడ్డాయని గమనించబడింది. అదేవిధంగా, మద్దిపాడు ఐసిడీఎస్ ప్రాజెక్ట్‌లోని ఎన్ వీ పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో, **ఛాయా చిత్రం 4.5** లో చూపిన విధంగా, గడువు తేదీలు లేని చిక్కీలు మరియు ఖర్జూరాలు సరఫరా చేయబడ్డాయి.




***ఛాయా చిత్రం 4.4[106] : విశాఖపట్నం జిల్లా వి మాడుగుల ఐసీడీఎస్‌లోని ఎల్ కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రం***

రెండు అంగన్‌వాడీ కేంద్రాలలో చిక్కీలు, బెల్లంలో తక్కువ బరువు (<500 గ్రా) గమనించబడింది



***ఛాయా చిత్రం 4.5[107]: ప్రకాశం జిల్లా, ఐసీడీఎస్ మద్దిపాడు పరిధిలోని ఎన్ వీ పాలెం, కామేపల్లివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాలు***

రెండు అంగన్‌వాడీ కేంద్రాలలో ఖర్జూరాలు మరియు చిక్కీలకు సంబంధించి తయారీ తేదీ మరియు గడువు తేదీ అందుబాటులో లేదని గమనించబడింది.

అన్ని వస్తువుల పరీక్ష మరియు నాణ్యతా హామీ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది (2024 ఫిబ్రవరి 27).

### 4.2.8 పర్యవేక్షణ యంత్రాంగం

వివిధ స్థాయిలలో అంటే రాష్ట్ర, జిల్లా మరియు బ్లాక్ స్థాయిలలో పర్యవేక్షణ కమిటీలకు నియమాలు[108] అందించబడ్డాయి.

రాష్ట్ర స్థాయిలో, అలాగే మచ్చుకు తనిఖీ చేయబడిన 16 ఐసిడీఎస్ ప్రాజెక్టులలో కూడా పర్యవేక్షణ మరియు సమీక్ష కమిటీని ఏర్పాటు చేయలేదు.

మచ్చుకు తనిఖీ చేయబడిన 32 అంగన్‌వాడీ కేంద్రాలలో, అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ కమిటీలు, 29 అంగన్‌వాడీ కేంద్రాలలో ఏర్పాటు చేయబడలేదని కూడా గమనించబడింది.

106 07/12/2022 నాటికి

107 03/08/2022 నాటికి

108 స్త్రీ, శిశు (ఐసిడీఎస్) వికలాంగ, వయోవృద్ధుల శాఖ యొక్క జీఓఎంఎస్ సంఖ్య38, తేదీ 21/12/2012

రాష్ట్ర/ప్రాజెక్ట్/ అంగన్‌వాడీ కేంద్రాల స్థాయిలో పర్యవేక్షణ మరియు సమీక్ష కమిటీలను ఏర్పాటు చేయకపోవడం వల్ల ఆయా స్థాయిల్లో పథక అమలుపై పర్యవేక్షణ లోపించింది.

రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ, బ్లాక్ స్థాయి పర్యవేక్షణ కమిటీ (బీఎల్ఎంసీ) మరియు అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ మరియు మద్దతు కమిటీ (ఏఎల్ఎంఎస్సీ) ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది (2024 ఫిబ్రవరి 27).

### 4.2.9 ఫిర్యాదుల యంత్రాంగం

ప్రభుత్వం రాష్ట్ర/జిల్లా స్థాయిలో ఫిర్యాదుల పరిష్కార అధికారులను నియమించింది, పౌరుల భాగస్వామ్య మరియు ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని అమలు చేయడానికి రాష్ట్ర (ఎస్‌జీఆర్‌సీ)/జిల్లా స్థాయిలో (డీజీఆర్‌సీ) ఫిర్యాదుల పరిష్కార కమిటీలను ఏర్పాటు చేయడానికి[109] అంగీకరించింది.

ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త సూచనల ఆధారంగా, డబ్ల్యూడీ & సీడబ్ల్యూ సంచాలకులు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్ట్ సంచాలకులకు గుడ్ల సరఫరా మరియు పంపిణీకి సంబంధించి ఫిర్యాదుల/సమస్యల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని మెమోరాండం [110] జారీ చేశారు, తద్వారా లబ్ధిదారులు తమ ఫిర్యాదులకు సంబంధించి అధికారులకు సులభంగా ఫిర్యాదు చేయవచ్చు, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించవచ్చు.

ఇంకా, డీజీఆర్‌సీ ప్రతి నెలా సమావేశమై పురోగతిని చర్చించాలి, ఏవైనా సవాళ్లు ఉంటే వాటిని పరిష్కరించాలి. సమావేశం యొక్క వివరాలను ప్రతి నెలా రాష్ట్ర ఫిర్యాదుల పరిష్కార అధికారికి చూపించాలి.

మచ్చుకు తనిఖీ చేయబడిన యూనిట్లను [111] పరిశీలించగా, రాష్ట్ర/జిల్లా స్థాయిలో ఫిర్యాదుల పరిష్కార కమిటీని ఏర్పాటు చేయలేదని గమనించబడింది. విజయనగరం జిల్లాలో, డీజీఆర్‌సీ ఏర్పాటు చేయబడినట్లు పేర్కొనబడింది, అయితే, సమాధానాన్ని ధ్రువీకరించడానికి ఆడిట్‌కు ఎటువంటి మద్దతు పత్రాలు అందించలేదు..

జిల్లా కలెక్టర్ అన్ని విభాగాలను కలుపుకొని ఉమ్మడి పరిష్కార కార్యక్రమం 'స్పందన' ద్వారా లబ్ధిదారుల ఫిర్యాదులను పరిష్కరిస్తున్నారని ప్రభుత్వం పేర్కొంది (2024 ఫిబ్రవరి 27).

లోకాయుక్త సూచనల ఆధారంగా జారీ చేయబడిన ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం ప్రత్యేక ఫిర్యాదు/సమస్యల పరిష్కార యంత్రాంగం ఏర్పడవలసి ఉన్నందున సమాధానం ఆమోదయోగ్యం కాదు.

## 4.3 ముగింపు

***సంపూర్ణ పోషణ పథకం గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, ఆరు నెలల నుండి ఆరు సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లల పోషక, పెరుగుదల అవసరాలను తీర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. పథకం సార్వత్రికంగా వర్తించినప్పటికీ, ఇండెంటింగ్ నుండి పంపిణీ వరకు మొత్తం వ్యవస్థలోని లోపాల కారణంగా అమలు ప్రక్రియ దెబ్బతింది.***

## 4.4 సిఫార్సు

***ఇండెంట్ చేయాల్సిన వస్తువులపై అంగన్ వాడీ కేంద్రాల నుంచి వాస్తవ సమాచారాన్ని సేకరించడం, సకాలంలో పంపిణీ జరిగేలా చూడటం కోసం అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగా కొనుగోళ్లు చేయడం వంటి సరఫరా వ్యవస్థ నిర్వహణ పోర్టల్ పనితీరులో లోపాలను ప్రభుత్వం పరిష్కరించాలి.***

---

109 స్త్రీ, శిశు (ఐసీడీఎస్) వికలాంగ, వయోవృద్ధుల (ప్రోగ్ I) శాఖ యొక్క జీఓఆర్‌టీ సంఖ్య149, తేదీ 27/09/2020

110 మెమో సంఖ్య 7656/జె1/2016-ఎస్ఎన్‌పీ, తేదీ 07/10/2021, మహిళాభివృద్ధి & శిశు సంక్షేమ సంచాలకులు

111 మహిళాభివృద్ధి & శిశు సంక్షేమ సంచాలకుల కార్యాలయం, గుంటూరు; నాలుగు డీడబ్ల్యూ & సీడబ్ల్యూ & ఈఓ (కడప, ప్రకాశం, గుంటూరు, విశాఖపట్నం)

# 5వ అధ్యాయం
# ‘ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ పనితీరు’ పై నియమపాలన తనిఖీ

## పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ

# 'ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ పనితీరు' పై నియమపాలన తనిఖీ


**సారాంశం**

2017-18 నుండి 2021-22 మధ్య కాలంలో **"ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) పనితీరు"** కి సంబంధించిన దస్త్రాలను ఆడిట్ పరిశీలించింది. 15 జోన్లలో ఐదు జోన్లు సమగ్ర పరిశీలనకు ఎంపిక చేయబడ్డాయి. ఉపాధ్యక్షుడు మరియు నిర్వహణ సంచాలకులు (వీసీ & ఎమ్‌డీ) ముఖ్య కార్య నిర్వహణాధికారిగా పని చేస్తారు, వీరికి వివిధ పని విభాగాలైన ఆస్తుల నిర్వహణ, విద్యుత్, ఆర్థిక మొదలగు అంశాలలో కార్యనిర్వాహకులు వీరికి సహాయం చేస్తారు. దస్త్రాల పరిశీలన సమయంలో, ఆడిట్ ఈ క్రింది వాటిని గమనించింది:

- *ప్రభుత్వేతర భూమిని సేకరించే సాధ్యాసాధ్యాలను అంచనా వేయకుండా ఏపీఐఐసీ ప్రచురణ ఛార్జీల కోసం వృధా ఖర్చు చేసింది. ఏపీఐఐసీ పర్యావరణ అనుమతులు లేకుండానే, పదకొండు ఎరుపు వర్గీకరణ కల పరిశ్రమల రూపు రేఖలు ఆమోదం పొందకుండానే 88 ప్లాట్లను కేటాయించింది.*
- *అమ్మకపు అంగీకార పత్రాలను అమలు చేయకపోవడం, కేటాయించబడిన వారు పథకాలు ప్రారంభించకపోవడం వల్ల కేటాయింపుల రద్దుపై తగిన చర్యలు తీసుకోవడంలో విపరీతమైన జాప్యం కారణంగా 955.86 ఎకరాల భూమి నిరుపయోగంగా మారింది.*
- *పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థల్లో (ఐఏఎల్ఏ) సేవా సొసైటీలు ఏర్పడకపోవటం, ఏపీఐఐసీ ద్వారా పర్యవేక్షణా వ్యవస్థ లేకపోవడం వలన పారిశ్రామిక ప్రాంతాల స్థానిక ప్రాధికార సంస్థలు అసమర్థంగా పనిచేస్తూ కేటాయింపుదారుల నుండి ఆస్తి పన్నులు వసూలు కాకపోవడం, సంబంధిత స్థానిక సంస్థలకు ఆస్తిపన్ను స్వల్ప చెల్లింపులు, అనధికార నిర్మాణాల గుర్తింపులో జాప్యం, ఆమోదయోగ్యమైన పరిమితుల కంటే ఎక్కువ పరిపాలనా వ్యయానికి దారితీశాయి.*
- *ఏపీఐఐసీ ₹2,000 కోట్ల ఋణ మొత్తాన్ని సక్రమంగా వినియోగించకపోవడం, ఏపీఏడీసీఎల్‌కు ₹220 కోట్ల అసురక్షిత స్వల్పకాలిక రుణాన్ని అందించడం, రెవెన్యూ అధికారుల నుండి ఉపయోగించని భూమి ధరను వసూలు చేయక పోవడం, మంజూరు చేసిన కొందరికి ఋణాల లభ్యత కోసం నిబంధనలకు విరుద్ధంగా నిరభ్యంతర ప్రమాణ పత్రాలు జారీ చేయడం అసమర్థ మరియు అప్రభావవంతమైన ఆర్థిక నిర్వహణకు దారి తీసింది.*


## 5.1 పరిచయం

పరిశ్రమలు మరియు వాణిజ్య (ఐ & సి) శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (జీఓఏపీ) పరిశ్రమల అభివృద్ధిని నియంత్రిస్తుంది. పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటులో వ్యవస్థాపకులకు సహాయం, మార్గనిర్దేశం చేస్తుంది. పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి ద్వారా పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్తి యాజమాన్య సంస్థగా (1973 సెప్టెంబర్) చేయబడింది. అంతేకాకుండా, ఏపీఐఐసీ రాష్ట్రంలోని అపెరల్ పార్క్/ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు/లెదర్ పార్కులు వంటి వివిధ విభాగాలపై దృష్టి పెట్టే పార్కులను కూడా అభివృద్ధి చేస్తుంది. బృహత్ పథకాలలో ప్రధాన దోహదాకారిగా, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు కేంద్ర సంస్థగా ఏపీఐఐసీ ఉంటుంది.

### 5.1.1 ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ విధులు

#### (ఏ) ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ విధులు/విధానాలు

- పారిశ్రామిక పార్కుల కోసం ప్రభుత్వ/ప్రభుత్వేతర భూములను సేకరించడం/పరాధీనం చేయడం, పారిశ్రామిక ప్రాంతాల కోసం స్థలాల గుర్తింపు మరియు లేఅవుట్ల అభివృద్ధి.
- అభివృద్ధి చెందిన, ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాల ఏర్పాటు, అభివృద్ధి చెందిన ప్లాట్ల కేటాయింపు.
- పథకాల అభివృద్ధి కార్యక్రమం కింద పథకాల ప్రణాళిక మరియు అభివృద్ధి.
- ప్రభుత్వ, ప్రభుత్వేతర భాగస్వామ్య పద్ధతిలో మౌలిక సదుపాయాల పథకాలను ప్రోత్సహించడం.
- రాష్ట్రంలోని ఐటీ పార్కులు, బయోటెక్ పార్కులు, అపెరల్ పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళతో సహా అన్ని పారిశ్రామిక మౌలిక సదుపాయాల పథకాలకు కేంద్ర సంస్థ.

#### (బి) పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థ (ఐఏఎల్ఏ) విధులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థానిక సంస్థల చట్టాలను (ఆంధ్రప్రదేశ్ పురపాలక సంస్థల చట్టం 1965) సవరిస్తూ, ఏపీఐఐసీ ద్వారా స్థాపించబడిన పారిశ్రామిక పార్కులు/ప్రత్యేక ఆర్థిక మండళ్లకు సంబంధించి ఏపీఐఐసీకి స్థానిక సంస్థల్లో కొన్ని అధికారాలు మరియు విధులను బదిలీ చేసింది (1994 సెప్టెంబర్). ఏపీఐఐసీ స్థానిక సంస్థల విధులను నిర్వహించడం కోసం పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థలను (ఐఏఎల్ఏలు) ఏర్పాటు చేసింది. కమీషనర్/కార్యనిర్వహణాధికారి ఐఏఎల్ఏ ప్రాంతంలోని అన్ని పౌర సేవల నిర్వహణ, ఆస్తి పన్నుల వసూళ్లు, భవన నిర్మాణ ప్రణాళికల ఆమోదం మొదలైన, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా అప్పగించబడిన అధికారాల ప్రకారం, పరిపాలనా అధికారాలను వినియోగించుకుంటూ విధులు నిర్వహిస్తారు.

### 5.1.2 సంస్థాగత నిర్మాణం

ఏపీఐఐసీ యొక్క పరిపాలన సోపానక్రమంలో ఒక అధ్యక్షుని నేతృత్వంలోని సంచాలకుల బోర్డు (బీఓడీలు), ఉపాధ్యక్షుడు మరియు నిర్వహణా సంచాలకులు (వీసీ & ఎండీ), ముఖ్య కార్యనిర్వహణాధిపతితో సహా సంచాలకులు ఉంటారు. ఆస్తుల నిర్వహణ, విద్యుత్, ఆర్థిక, న్యాయ, పరిపాలన, ఇంజనీరింగ్ వంటి వివిధ పని విభాగాలలో కార్యనిర్వాహక సంచాలకులు (ఈడీలు) వీసీ & ఎండీ కి సహకారం అందిస్తారు. ఏపీఐఐసీ యొక్క సంస్థాగత నిర్మాణం దిగువ **పటం** 5.1లో చూపబడింది:

**పటం 5.1: ఏపీఐఐసీ యొక్క సంస్థాగత నిర్మాణం**




*మూలం: ఏపీఐఐసీ వెబ్ సైట్*

ఏపీఐఐసీ యొక్క కార్యక్రమాలు, విధానాలను అమలు చేయడానికి బాధ్యత వహించే ఒక జోనల్ మేనేజర్ నేతృత్వంలో క్షేత్ర స్థాయిలో 15 జోనల్ కార్యాలయాల రూపంలో క్రియాత్మక సోపానక్రమం నిర్వహించబడుతుంది. ఐఏఎల్ఏలు, ఏపీఐఐసీ యొక్క వీసీ & ఎండీ నియంత్రణలో, కమీషనర్లు/కార్యనిర్వహణాధికారుల నేతృత్వంలో పనిచేస్తాయి.

### 5.1.3 ల్యాండ్ బ్యాంక్ స్థితి

పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి భూమి ప్రాథమిక వనరు అయినందున, ఏపీఐఐసీ రాష్ట్ర రెవెన్యూ అధికారుల ద్వారా ప్రభుత్వ/ప్రభుత్వేతర వ్యక్తుల నుండి పట్టా/ప్రభుత్వ భూమిని సేకరించడం/బదిలీ చేయడం ద్వారా భూమిని జోడించి తద్వారా ల్యాండ్ బ్యాంక్ కోసం తన కార్యకలాపాలను ప్రారంభించింది. భూములను ఏపీఐఐసీ వెలతో లేదా ఉచితంగా సేకరిస్తుంది.

కేటాయింపు నిబంధనలు, 2015 లోని 5.1 నుండి 5.4 & 6.2 ప్రకారం, ఏపీఐఐసీ ఏర్పాటు చేసిన విలువ స్థిరీకరణ & మౌలిక సదుపాయాల కమిటీ (పీఎఫ్ & ఐసీ) భూమి విలువను అంచనా వేస్తుంది, పారిశ్రామిక పార్కులో అభివృద్ధి చేయవలసిన మౌలిక సదుపాయాల స్థాయిని నిర్ణయిస్తుంది. మొత్తం భూమి విలువలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా భూసేకరణ అవార్డులో నిర్ణయించిన భూమి విలువతో పాటు ఎక్స్ గ్రేషియా కూడా ఉంటుంది. అదనంగా, పునరుద్ధరణ, పునరావాస ఖర్చు, భూసేకరణ యూనిట్ స్థాపన ఛార్జీలు మొదలైనవి, భూసేకరణ/పరాధీనం చేసే సమయంలో అయ్యే ఏవైనా ఇతర ఛార్జీలు కూడా చేర్చబడ్డాయి.

పీఎఫ్ & ఐసీ, ఏదైనా పారిశ్రామిక పార్కులో, మార్కెట్ పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు భూమి విలువను, చెల్లించిన/వచ్చిన మెరుగుపరచబడిన భూ పరిహారం దావాలు, అదనపు మౌలిక సదుపాయాల ఖర్చులు మొదలైనవాటిని సమీక్షించవచ్చు. ఏపీఐఐసీ యొక్క వీసీ & ఎండీ, కారణాలను తప్పనిసరిగా నమోదు చేయడం ద్వారా భూమి విలువను ఆమోదించవచ్చు లేదా సవరించవచ్చు, సమాచారం కోసం బోర్డు ముందు ఉంచవచ్చు. ఏపీఐఐసీ & పరిశ్రమల కమీషనర్ వెబ్‌సైట్‌లలో భూమి ధర ఎప్పటికప్పుడు నవీకరించబడుతుంది.

2017–22 కాలంలో ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న భూమి విస్తీర్ణం మరియు భూమి జాబితా విలువ వివరాల స్థితి సంవత్సరాల వారీగా **పట్టిక 5.1** లో చూపబడింది.

**పట్టిక 5.1: ఏపీఐఐసీ వద్ద ఉన్న భూమిజాబితా విలువ వివరాలు**

*(₹ కోట్లలో)*

| క్రమ సంఖ్య | సంవత్సరం | భూమి విస్తీర్ణం (ఎకరాలలో) | పీఎఫ్ & ఐసీ చే స్థిరీకరించబడిన భూమి విలువ | భూమి అభివృద్ధి విలువ | నిర్మాణ వస్తువుల విలువ | భూమి యొక్క మొత్తం విలువ |
|---|---|---|---|---|---|---|
| 1 | 2017-18 | 64,962.34 | 2,820.21 | 142.74 | 0.44 | 2,963.39 |
| 2 | 2018-19 | 70,003.73 | 3,224.27 | 146.85 | 0.44 | 3,371.56 |
| 3 | 2019-20 | 63,175.80 | 2,988.94 | 220.62 | 0.46 | 3,210.02 |
| 4 | 2020-21 | 58,019.56 | 2,708.47 | 175.59 | 0.46 | 2,884.52 |
| 5 | 2021-22 | 65,071.48 | 3,116.17 | 135.51 | 0.46 | 3,252.14 |

***మూలం:*** *ఏపీఐఐసీ అందించిన సమాచారం*

### 5.1.4 తనిఖీ కార్యాచరణ

#### 5.1.4.1 తనిఖీ లక్ష్యాలు

'ఏపీఐఐసీ పనితీరు' పై నియమపాలన తనిఖీ క్రింది విషయాలను అంచనా వేయడానికి చేపట్టబడింది:

➢ ఏపీఐఐసీని ఏర్పాటు చేసే సమయంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా జారీ చేయబడిన ఉత్తర్వులలో ఆశించిన విధంగా, పరిశ్రమల స్థాపనలో ఏపీఐఐసీ లక్ష్యాలైన మౌలిక సదుపాయాలను ప్రోత్సహించడం, సహాయం చేయడం, సహకరించడం, అందచేయడం మరియు అభివృద్ధి చేయడం మొదలైన వాటిని చూసుకుంటూ, పారిశ్రామిక పార్కు

నిబంధనల ప్రకారం భూమి అభివృద్ధి జరిగిందా, కేటాయింపు నిబంధనల ప్రకారం భూమి ధర హేతుబద్ధంగా నిర్ణయించబడిందా,

- ➢ భూ కేటాయింపు, కేటాయింపుల రద్దులో కేటాయింపు నిబంధనలలోని నియమాలు అనుసరించబడ్డాయా,
- ➢ పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థలు (ఐఏఎల్ఏలు) స్థాపించబడి, ఈ విషయంలో రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా, స్థానిక సంస్థలుగా పనిచేస్తున్నాయా,
- ➢ ఏపీఐఐసీకి మేలు చేసే విధంగా నిధుల నిర్వహణ జరుగుతుందా.

### 5.1.4.2 తనిఖీ ప్రమాణాలు

క్రింది పత్రాల నుండి సేకరించిన ప్రమాణాలకు అనుగుణంగా ఆడిట్ పరిశీలనలు ప్రమాణీకరించబడ్డాయి:

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ (జీఓఏపీ) భూ కేటాయింపు విధానం, 2012, ఏపీఐఐసీకి కేటాయింపు నిబంధనలు 2012, 2015 మరియు 2020.
- పరాధీనం/సేకరణ, కేటాయింపు, భూమి ధర స్థిరీకరణ, ఐఏఎల్ఏల పనితీరు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ఏపీఐఐసీ జారీ చేసిన నియమాలు, ఆదేశాలు, మార్గదర్శకాలు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అభివృద్ధిదారుల ఒప్పందం/అంగీకార పత్రాల నిబంధనలు మరియు షరతులు.
- ఏపీఐఐసీ బోర్డు మరియు విలువ స్థిరీకరణ & మౌలిక సదుపాయాల కమిటీ సమావేశాల మినిట్స్, మొదలైనవి.
- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నియమాలు మరియు ఆదాయపు పన్ను నిబంధనలు.

### 5.1.4.3 ఆడిట్ పరిధి మరియు ప్రక్రియ

2017-18 నుండి 2021-22 వరకు ఐదు సంవత్సరాల వ్యవధికి సంబంధించి, 2022 జూన్-సెప్టెంబర్లో నియమపాలన తనిఖీ నిర్వహించబడింది. పారిశ్రామిక ప్రాంతంలో భూమి విలువ సేకరణ, సరైన అంచనా, ఆస్తి పన్ను నిర్ధారణ, సేకరణ మరియు చెల్లింపులతో పాటు పారిశ్రామిక అవసరాల కోసం భూమిని సేకరించడం, అభివృద్ధి చేయడం మరియు కేటాయించడం వంటి వాటిపై ఆడిట్ దృష్టి సారించింది. 15 జోన్లలో, ఐదు[112] జోన్లు, కేటాయింపుల సంఖ్య మరియు కేటాయించిన భూమి విస్తీర్ణం ఆధారంగా ఎంపిక చేయబడ్డాయి. 2022 జూన్‌లో ప్రారంభ సమావేశం మరియు 2023 డిసెంబర్‌లో ముగింపు సమావేశం ప్రభుత్వంతో జరిగింది.

గతంలో, ఏపీఐఐసీ ద్వారా భూ కేటాయింపులపై థీమాటిక్ ఆడిట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై నిర్వహించబడింది, ఇది కాగ్ నివేదిక (2013లో 2వ నివేదిక)లో పొందుపరచబడింది. ప్రభుత్వరంగ సంస్థలపై కమిటీ ఈ నివేదికను ఇంకా చర్చించలేదు.

ఏపీఐఐసీ మరియు జోనల్ కార్యాలయాల దస్త్రాల పరిశీలనలో వివిధ లోటుపాట్లు తదుపరి పేరాల్లో చర్చించబడ్డాయి.

## 5.2 భూమి యొక్క అభివృద్ధి

ప్రభుత్వేతర భూములను సేకరించడం లేదా ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారుల ద్వారా బదిలీ చేయడం, భూమిని చిన్న/పెద్ద ప్లాట్లుగా మార్చడం మరియు మౌలిక సదుపాయాలను[113] కల్పించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించడం వంటివి భూమి అభివృద్ధిలో ఉంటాయి. పారిశ్రామిక పార్కులు (ఐపీలు)/సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి

[112] అనంతపురము, హిందూపూర్, నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం

[113] రహదారులు, నీటి సరఫరా, మురుగు నీరు, విద్యుచ్ఛక్తి

సంస్థలు (ఎమ్ఎస్ఎమ్ఈలు) మొదలైన వాటి అభివృద్ధి కోసం ఏపీఐఐసీ తన స్వతహాగా లేదా ప్రభుత్వ ఆదేశాల మేరకు లేదా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుండి నిర్దిష్ట అభ్యర్థనలు వంటి వాటిపై భూ సేకరణ ప్రతిపాదనలను ప్రారంభిస్తుంది.

## 5.2.1 భూ సేకరణ మరియు వాటి అభివృద్ధిలో అవకతవకలు

### 5.2.1.1 ప్రభుత్వేతర భూమిని సేకరించే సమయంలో ప్రచురణ ఛార్జీల కోసం వృధా ఖర్చు

ఏపీఐఐసీ యొక్క భూ విభాగం ద్వారా ఎప్పటికప్పుడు జారీ చేయబడిన భూముల సేకరణ/బదిలీకి సంబంధించిన విధానపరమైన అంశాల ప్రకారం, సంబంధిత ప్రాంతాల జోనల్ మేనేజర్లు (జెడ్ఎమ్) డిమాండ్ విశ్లేషణతో పాటు భూమి మరియు దాని సాధ్యత మరియు అనుకూలతను గుర్తించి, రెవెన్యూ రికార్డులు (రెవెన్యూ సర్వే నివేదికలు, అడంగల్ (ఒక రకమైన భూమి రికార్డు), క్షేత్ర కొలతల పుస్తకాలు మొదలైనవి), మ్యాప్‌లు, పరిశీలన నివేదికను ధ్రువీకరించి, సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించి నివేదికను సమర్పించాలి. సంబంధిత జోన్ కార్య నిర్వాహకులు భూమి యొక్క స్థితి & సేకరణ సాధ్యాసాధ్యాల గురించి ప్రధాన కార్యాలయానికి నివేదికను సమర్పించాలి. దీని ప్రకారం, ఏపీఐఐసీ వీసీ & ఎండీ ఆమోదం తర్వాత భూ విభాగం (ప్రధాన కార్యాలయం) ప్రక్రియ మరియు సేకరణకు అనుమతిస్తుంది.

మచిలీపట్నం లోతైన ఓడ రేవు (ఎండీడబ్ల్యూపీ) కి ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం 12,144.86 ఎకరాల[114] పట్టా భూమిని సేకరించేందుకు విజయవాడ జోన్ కార్య నిర్వాహకులు, కృష్ణా జిల్లా కలెక్టర్‌కు ఒక అభ్యర్థన దాఖలు చేశారు (2015 ఆగస్టు). జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం, ఎండీడబ్ల్యూపీ మినహాయించిన ప్రాజెక్టుల[115] జాబితాలో ఉన్నందున, సామాజిక ప్రభావ అంచనా (ఎస్ఐఏ) నిర్వహణను మినహాయిస్తూ స్థానిక వార్తాపత్రికలతో పాటు ముఖ్య ప్రదేశాలలో ప్రాథమిక అధిసూచనను ప్రచురించడానికి రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు గమనించబడింది (2015 ఆగస్టు).

ఏపీఐఐసీ బోర్డు సమావేశం (2016 ఆగస్టు) యొక్క మినిట్స్ పరిశీలనలో, గెజిట్ ప్రచురణ, ఇతర ఛార్జీల కోసం ముందుగా ₹12 కోట్ల మొత్తాన్ని జమ చేయాలని రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి తెలియజేసినట్లు వెల్లడైంది. తదనంతరం, ఏపీఐఐసీ రెవెన్యూ అధికారుల ద్వారా వార్తాపత్రిక ఏజెన్సీలకు ప్రాథమిక అధిసూచన, ప్రచురణ మరియు ఇతర ఛార్జీల కొరకు ₹9.18 కోట్ల మొత్తాన్ని చెల్లించింది (2017 ఏప్రిల్ నుండి 2018 జూన్ వరకు).

తదనంతరం, పారిశ్రామిక నడవా మరియు సంబంధిత మౌలిక సదుపాయాల కోసం 21,542.23 ఎకరాల ప్రత్యామ్నాయ భూమి అందుబాటులో ఉన్నందున ప్రస్తుతం 12,144.86 ఎకరాల పట్టా భూమిని సేకరించేందుకు అధిసూచన అవసరం లేదని మచిలీపట్నం పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (ముడా) తెలియజేసింది (2018 జూన్). ఇంకా, రైతుల నుండి ప్రతిఘటన కారణంగా భూమి (12,144.86 ఎకరాలు) సేకరణకు సంబంధించిన ప్రాథమిక అధిసూచనను రద్దు చేసేందుకు ప్రభుత్వం పరిశీలిస్తుంది. ఏపీఐఐసీ ద్వారా స్వాధీనం చేసుకున్న 21,542.23 ఎకరాల భూమి యొక్క స్థితి దస్త్రాల్లో లేదు.

భూ సేకరణ/రెవెన్యూ అధికారుల నుండి అందిన సమాచారం మేరకు, పట్టా భూముల సేకరణకు ఏపీఐఐసీ దరఖాస్తు దాఖలు చేసినట్లు ప్రభుత్వం ప్రత్యుత్తరమిచ్చింది (2023 డిసెంబర్). తదనంతరం, ఏపీఐఐసీకి ఖాళీ ప్రభుత్వ భూమిని ఉచితంగానే కేటాయించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది (2017 మార్చి). ఇంకా, పారిశ్రామిక నడవా వినియోగానికి ప్రత్యామ్నాయ ప్రభుత్వ & అసైన్డ్ భూమి అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ (2019 నవంబర్) మచిలీపట్నం పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థకి తెలియజేశారు మరియు ఏపీఐఐసీ ద్వారా సేకరించిన భూములను

114 కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, పెడన మండలాల్లోని 22 గ్రామాలు

115 పారిశ్రామిక నడవా అయిన కారణంగా, 2013, భూసేకరణ & పునరుద్ధరణ మరియు పునరావాస చట్టంలోని సెక్షన్ 10(ఎ) ప్రకారం న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు

అధిసూచన నుండి ఉపసంహరించుకోవాలని పలువురు రైతులు వినతులు అందచేశారు. పై అంశాల దృష్ట్యా, భూముల సేకరణపై బడ్జెట్‌ను తగ్గించడానికి పట్టా భూమిని సేకరించేందుకు ఏపీఐఐసీ తదుపరి చర్యలను ప్రారంభించలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీఐఐసీ వ్యవహరించింది.

రెవెన్యూ రికార్డులు, మ్యాప్‌లు, పరిశీలన నివేదికలు మరియు సాధ్యాసాధ్యాలను నిర్ధారించడానికి భూమిని సేకరించే ముందు భూ సేకరణ మరియు అనుకూలత కోసం రెవెన్యూ అధికారులతో సంయుక్త భౌతిక పరిశీలన ద్వారా ధృవీకరించే విధివిధానాన్ని (ఏపీఐఐసీ భూ విభాగం సూచించిన విధంగా) ఏపీఐఐసీ అనుసరించలేదని సమాధానం ద్వారా స్పష్టమైంది. ఇంకా, ప్రత్యుత్తరం ఇచ్చినట్లుగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సూచనలకు (2017 మార్చిలో జారీ చేయబడినవి) మద్దతుగా ఎటువంటి ఆధార పత్రాలు రికార్డులో లేవు.

ఏపీఐఐసీ పట్టా భూమిని స్వాధీనం చేసుకునేందుకు ముందుగా నిర్దేశించిన విధానాన్ని అనుసరించి ఉంటే, పరిహారం ఖర్చుతో కలిపి, పట్టా భూమిని స్వాధీనం చేసుకోవడానికి చేసిన ప్రచురణ ఛార్జీల కోసం అయిన మొత్తం ఖర్చు ₹9.18 కోట్లు వృధా కాకుండా ఉండేది.

ఆ విధంగా, ప్రభుత్వేతర భూముల సేకరణ సాధ్యాసాధ్యాలను అంచనా వేయకుండా ప్రచురణ ఛార్జీల కోసం ఏపీఐఐసీ ₹9.18 కోట్లు వృథా ఖర్చు చేసింది.

***సిఫార్సు 5.1: ప్రభుత్వేతర భూముల సేకరణకు ముందు సరైన సర్వే చేసి భూసేకరణ సాధ్యాసాధ్యాలు, అనువైన భూమిని నిర్ధారించాలని ప్రభుత్వం ఏపీఐఐసీకి సూచించవచ్చు.***

### 5.2.1.2 లేఅవుట్ ఆమోదం పొందకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నిరర్థక వ్యయం

2012 & 2015 కేటాయింపు నిబంధనల నియమం 2.1 ప్రకారం, భూముల కేటాయింపు ప్రయోజనం కోసం, ఏపీఐఐసీ వర్తించే నిబంధనల ప్రకారం లేఅవుట్‌ను సిద్ధం చేసి, దానిని అర్హత కల అధికారి ద్వారా ఆమోదింపచేసుకోవాలి.

ఏపీఐఐసీ విశాఖపట్నం జిల్లా కాపులుప్పాడ గ్రామంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) లేఅవుట్‌ను అభివృద్ధి చేయడానికి/ఆధునీకరించడానికి ప్రణాళిక వేసింది (2015 జూలై). విశాఖపట్నం జోనల్ మేనేజర్ కాపులుప్పాడ గ్రామంలో ఐటీ లేఅవుట్‌ను అభివృద్ధి చేయడానికి 1,350 ఎకరాల భూ వినియోగాన్ని కొండ/అటవీ ప్రాంతం నుండి మిశ్రమ భూ ప్రాంతం వినియోగానికి మార్చడానికి సరైన అధికారం కల విశాఖపట్నం పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (ఉడా) ని అభ్యర్థించారు (2015 జూలై). ఏపీఐఐసీ భూ వినియోగాన్ని మార్చడానికి విశాఖపట్నం పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థకి ₹16.68 కోట్ల మొత్తాన్ని చెల్లించింది(2017 ఏప్రిల్). దీని ప్రకారం, విశాఖపట్నం పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ నిబంధనల ప్రకారం లేఅవుట్ ఆమోదానికి లోబడి మిశ్రమ భూ వినియోగంగా మార్చడానికి ప్రభుత్వం ఆమోదించింది (2017 మే).

తదనంతరం, విశాఖపట్నం పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ 250.43 ఎకరాల మేర లేఅవుట్ (మొదటి దశ) ఆమోదం కోసం ప్రక్రియ, అభివృద్ధి, అధిసూచన ఛార్జీల కోసం ₹2.94 కోట్లు డిమాండ్ చేసినట్లు జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయానికి తెలియచేస్తూ (2017 నవంబర్), ఆ మొత్తాన్ని విశాఖపట్నం పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థకి చెల్లింపు కోసం మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఇది ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా, 2022 జూలై నాటికి, జోనల్ కార్యాలయం లేఅవుట్ ఆమోదం పొందకుండానే, పేర్కొన్న భూమిలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి ₹48.13 కోట్లు ఖర్చు చేసింది.

ప్రభుత్వ ఉత్తర్వులో నిర్దేశించిన విధంగా చట్టబద్ధమైన నిబంధనలను పాటించాలంటే, అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేయడం తప్పనిసరి అని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2023 డిసెంబర్).₹24.60 కోట్ల బడ్జెట్‌తో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ (ఐటీఈ & సీ) నుండి అవసరమైన సమ్మతి పొందిన తరువాత, ఏపీఐఐసీ మౌలిక

సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన అన్ని నిబంధనలను పాటించింది. అయితే, భూమి కేటాయింపునకు ఐటీఈ&సీ విభాగం నుంచి ఎలాంటి సమ్మతి లేదు. ఏపీఐఐసీ నోడల్ ఏజెన్సీ కాబట్టి, ఇది ఐటీఈ & సీ శాఖ ఆదేశాలను అమలు చేస్తుంది.

ఈ విధంగా, మౌలిక సదుపాయాల కోసం ₹48.13 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, ఉడా నుండి ఆమోదం పొందనందున ఐదేళ్లకు పైగా గడిచిన తర్వాత కూడా భూమి నిరుపయోగంగా ఉంది.

### 5.2.1.3 పారిశ్రామిక పార్కుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలను తయారు చేయకపోవడం

ప్రభుత్వ భూ కేటాయింపు విధానం 2012 ప్రకారం, పారిశ్రామిక భూమి అవసరాలను తీర్చడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని పారిశ్రామిక సమూహాల కోసం ఏపీఐఐసీ సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్‌లు) సిద్ధం చేస్తుంది. అవసరమైన భూమి, ప్రతిపాదిత పెట్టుబడి, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల అవసరాలు మరియు పర్యావరణంపై ప్రభావాన్ని వివరించే డీపీఆర్‌ల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఐఐసీకి భూమిని కేటాయిస్తుంది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఆధారంగా సంబంధిత జిల్లా కలెక్టర్లకు భూ పరాధీనానికి ప్రతిపాదనలు అందజేస్తారు.

పారిశ్రామిక సమూహాల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీని ధ్రువీకరించడానికి, ఐదు[116] పారిశ్రామిక పార్కులకు (ఐపీలు) సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలను అందించాలని ఆడిట్ ఏపీఐఐసీని అభ్యర్థించింది.

కోరిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను ఏపీఐఐసీ అందించలేదు. తదుపరి అనకాపల్లి జోన్ నిర్వహణాధికారి తనిఖీకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను అందించకుండానే, రాష్ట్రంలో పారిశ్రామిక పార్కులు/సమూహాల ఏర్పాటుకు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ నిధులను వినియోగించడానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేసి సంబంధిత శాఖలకు సమర్పించామని బదులిచ్చారు. అయితే, పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడానికి ముందు సమగ్ర ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేసే విధానం ఇక నుండి అనుసరించబడుతుంది. ఇక నుంచి పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి ముందుగా సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేస్తామని విజయవాడ జోన్ నిర్వహణాధికారి తెలిపారు.

నిర్దిష్ట ప్రయోజనాల కోసం ఏపీఐఐసీ భూమిని సేకరించదని ముగింపు సమావేశంలో ప్రభుత్వం పేర్కొంది (2023 డిసెంబర్). ఏపీఐఐసీ డిమాండ్ సర్వే ఆధారంగా భూమిని సేకరించి, పారిశ్రామికవేత్తలకు కేటాయించడం కోసం భూమిని అభివృద్ధి చేస్తుంది. సాధారణంగా, వ్యవసాయానికి ఉపయోగపడని బంజరు భూములను గుర్తించి, సేకరణ కోసం రెవెన్యూ అధికారులకు విన్నవించబడుతుంది. పరిశ్రమ అభివృద్ధి కోసం కాబోయే పారిశ్రామికవేత్తలు సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పించారు. భూసేకరణ కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక కావాలని ఏపీఐఐసీని ప్రభుత్వం పట్టుబట్టలేదు. ఏదైనా భారత ప్రభుత్వం సహాయమందించే పథకాల కోసం సేకరించిన భూములకు సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేసి భారత ప్రభుత్వానికి సమర్పించబడతాయి.

అందువల్ల, పారిశ్రామిక పార్కుల అభివృద్ధి కోసం భూ సేకరణ విధాన మార్గదర్శకాలలో నిర్దేశించినట్లుగా, భూమి అవసరాలు, మౌలిక సదుపాయాల అవసరాలు మరియు పర్యావరణంపై ప్రభావం వంటి అంశాలను అంచనా వేయడానికి ఏపీఐఐసీ, సమగ్ర ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేయలేదని పైన పేర్కొన్నదాని నుండి స్పష్టంగా తెలుస్తుంది. పారిశ్రామిక పార్కుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేయకపోవడం వల్ల, భూమిని సేకరించడం, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులను ఆకర్షించడం మరియు ఉపాధిని కల్పించడం వంటి లక్ష్యాలు నెరవేరాయా మరియు పర్యావరణంపై ఏదైనా ప్రతికూల ప్రభావం ఉందా లేదా అనేది ఆడిట్ నిర్ధారించలేకపోయింది.

[116] వీరపనేనిగూడెం, పెద్దవరం, పరవాడ (3వ దశ) పారిశ్రామిక పార్కులు, పూడి పారిశ్రామిక సమూహం, వైఎస్ఆర్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్

### 5.2.1.4 పరవాడ పారిశ్రామిక పార్కు అభివృద్ధిలో అవకతవకలు(3వ దశ)

#### (ఎ) లేఅవుట్ ఆమోదం పొందకుండానే పారిశ్రామికవేత్తలకు ప్లాట్ల కేటాయింపు

కేటాయింపు నిబంధనలు 2012 & 2015 లోని 2.1, 3.2 నియమాల ప్రకారం, ప్రాంగణాల కేటాయింపు కోసం, వర్తించే నిబంధనల ప్రకారం లేఅవుట్‌ను ఏపీఐఐసీ సిద్ధం చేసి, అది అర్హత కల అధికారిచే ఆమోదింప చేసుకోవాలి. ఆ అధికారి అనుమతి లేకుండా ప్లాట్ల విభజన అనుమతించబడదు.

విశాఖపట్నం జిల్లా పరవాడలో జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (జేఎన్‌పీసీ) 2,443.20 ఎకరాల్లో అభివృద్ధి చేయబడింది. 2,443.20 ఎకరాల్లో, వేసవి నిల్వ ట్యాంక్ (ఎస్ఎస్‌టీ) కోసం 249.05 ఎకరాలు, రోడ్డు విస్తరణ కోసం 50.92 ఎకరాలు అట్టిపెడుతూ 2,143.23 ఎకరాల మేరకు అప్పటి విశాఖపట్నం పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ ద్వారా లేఅవుట్ ఆమోదించబడింది (2007). కేటాయించబడిన 249.05 ఎకరాలలో, మొదటి దశ కింద ఏపీఐఐసీ 125.00 ఎకరాల విస్తీర్ణంలో వేసవి నిల్వ ట్యాంక్ ని నిర్మించింది మరియు మిగిలిన 124.05 ఎకరాలు వేసవి నిల్వ ట్యాంక్ యొక్క రెండవ దశ అభివృద్ధికి వదిలివేయబడింది.

జోనల్ మేనేజర్ (జెడ్ఎమ్), వేసవి నిల్వ ట్యాంక్ కోసం ఉంచబడిన ప్రాంతంలో పారిశ్రామిక పార్కు 3వ దశ అభివృద్ధి కోసం వీసీ & ఎండీని సంప్రదిస్తూ (2019 ఆగస్టు), 123.27 ఎకరాల విస్తీర్ణంలో సవరించిన లేఅవుట్ ప్రణాళికను సమర్పించారు.

తదనంతరం, ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయ చీఫ్ ఇంజనీర్, ఉపాధ్యక్షుడు & నిర్వహణ సంచాలకులు (వీసీ & ఎండీ) సవరించిన లేఅవుట్ ప్రణాళికను సిద్ధం చేయడానికి ఆమోదం తెలిపారని తెలియచేస్తూ (2022 మార్చి) సవరించిన లేఅవుట్ ప్రణాళిక అనగా విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం, కెమికల్ & పెట్రో-కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (వీకేపీసీపీఐఆర్) ను అర్హత కల అధికారికి సమర్పించాలని అభ్యర్థించారు. తదనంతరం, పరవాడ పారిశ్రామిక పార్కు 3వ దశ యొక్క సవరించిన లేఅవుట్ ప్రణాళికను ఆమోదం కోసం సమర్పించడానికి, విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం, కెమికల్ & పెట్రో-కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ని, వీకేపీసీపీఐఆర్ మాస్టర్ ప్లాన్‌లో నీటి నిల్వ రిజర్వాయర్ నుండి పారిశ్రామిక ప్రాంతంగా మార్చడానికి ఏర్పాట్లు చేయాలని వీకేపీసీపీఐఆర్ యొక్క జోనల్ మేనేజర్ అభ్యర్థించారు (2022 మార్చి).

ప్రతిస్పందనగా, భూ వినియోగాన్ని మార్చడానికి ముందు రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా ప్రాధికార సంస్థ (ఎస్ఈఐఏఏ) లేదా భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ (ఎమ్ఓఈఎఫ్) నుండి అనుమతి పొందాలని వీకేపీసీపీఐఆర్, జోనల్ మేనేజర్‌కి సూచించింది (2022 డిసెంబర్). పర్యావరణ అనుమతుల వివరాలు ఆడిట్‌కు సమర్పించిన దస్త్రాల్లో అందుబాటులో లేవు. లేఅవుట్ ఇంకా (2023 సెప్టెంబర్ నాటికి) అర్హత కల అధికారిచే ఆమోదించబడలేదు.

దస్త్రాల పరిశీలనలో, 121.76 ఎకరాల్లో రోడ్లు, సౌకర్యాలు మొదలైన వాటి కోసం ఉంచగా మిగిలిన 88.06 ఎకరాలను 88 ప్లాట్లతో ఏపీఐఐసీ అభివృద్ధి చేసినట్లు తెలియవచ్చింది. 88 ప్లాట్లలో 85 ప్లాట్లు పారిశ్రామికవేత్తలకు కేటాయించబడ్డాయి (2019 సెప్టెంబర్ మరియు 2022 డిసెంబర్ మధ్య).

కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా, అర్హత కల అధికారి నుండి భూ వినియోగం మరియు లేఅవుట్ ప్లాన్‌ను మార్చడానికి అనుమతులు పొందకుండానే, ఏపీఐఐసీ ప్లాట్‌లను విభజించి, సెప్టెంబర్ 2019 నుండి పారిశ్రామికవేత్తలకు ప్లాట్ల కేటాయింపును ప్రారంభించినట్లు ఆడిట్ గుర్తించింది.

పారిశ్రామిక అభివృద్ధికి ఉద్దేశించిన మొత్తం భూమిని ఒకేసారి అభివృద్ధి చేయలేము. ఈ పారిశ్రామిక పార్కు దశలవారీగా అభివృద్ధి చేయబడింది, దీనిలో కొంత మేరకు పరిశ్రమలకు నీటి సరఫరా కోసం వేసవి నిల్వ ట్యాంక్ (ఎస్ఎస్‌టీ) కోసం ఉద్దేశించబడింది. వాస్తవానికి భూమి నీటి వనరు అయితే, దాని వినియోగాన్ని నీటియేతర వనరుగా మార్చడానికి, ఏపీఐఐసీ పట్టణ ప్రాధికార సంస్థని సంప్రదించి, నిర్దేశించిన నిబంధనలను అనుసరించాలి. ఏపీఐఐసీ మొదటగా భూమిని వేసవి నిల్వ

ట్యాంక్ గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించి (వాస్తవానికి నీటి వనరు కాదు) ఆపై పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయడానికి ప్రణాళికను మార్చినట్లయితే, అప్పుడు భూ వినియోగ ప్రణాళికను మార్చాల్సిన అవసరం లేదని ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వం తెలియచేసింది (2023 డిసెంబర్).

అయితే, వాస్తవం ఏమిటంటే, వీకేపీసీపీఐఆర్ సూచనల మేరకు ఏపీఐఐసీ పర్యావరణ అనుమతిని పొందలేదు, ఫలితంగా, లేఅవుట్‌కు అర్హత కల అధికారి ఆమోదం లభించలేదు. కాబట్టి, అర్హత కల అధికారి ఆమోదం లేకుండా ప్లాట్ల అభివృద్ధి మరియు కేటాయింపు, కేటాయింపు నిబంధనలకు విరుద్ధం.

## (బి) పర్యావరణ అనుమతులు పొందకుండానే రెడ్ కేటగిరీ పరిశ్రమలకు ప్లాట్ల కేటాయింపు

కేటాయింపు నిబంధనలు, 2015లోని 2.3 నియమం ప్రకారం, అన్ని లేఅవుట్‌లు వ్యర్థాలు పారవేయడం/వ్యర్థ పదార్థాల నిర్వహణ కోసం స్థలాన్ని అందించడం తప్పనిసరి. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా శుద్ధి చేయబడిన వ్యర్థాలను సురక్షితంగా పారవేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం/ఏర్పాట్లను చేయడం పారిశ్రామిక యూనిట్ల బాధ్యత. ఇంకా, వ్యర్థ జలాల శుద్ధి కోసం పారిశ్రామిక పార్కుల్లో ఉమ్మడి నిర్గత ప్రవాహాల శుద్ధి కర్మాగారాలను (సీఈటీపీ) ఏర్పాటు చేయడానికి ఏపీఐఐసీ సౌకర్యం కల్పిస్తుంది.

పరవాడ పారిశ్రామిక పార్కు 3వ దశ యొక్క ప్రతిపాదిత ప్రాంత అభివృద్ధి కోసం, ఒకవేళ ఆ ప్రాంతంలోని ప్లాట్‌లను రెడ్ కేటగిరీకి చెందిన ఫార్మా & కెమికల్ ఇండస్ట్రీస్ వంటి పరిశ్రమలకు కేటాయించడానికి ప్రతిపాదిస్తే, పర్యావరణ అనుమతులు (ఈసీ) పొందవలసి ఉంటుందని, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ వీసీ & ఎండీ కు తెలియజేశారు, పర్యావరణ అనుమతులు పొందేందుకు అవసరమైన సూచనలను జారీ చేయాలని అభ్యర్థించారు.

ఇంతలో, సాధారణ మౌలిక సదుపాయాలు మరియు శుద్ధి సౌకర్యాలు లేకుండా ఫార్మా సిటీకి ఆనుకుని ప్లాట్లు కేటాయించడాన్ని ఏపీపీసీబీ గమనించింది. పరవాడ పారిశ్రామిక పార్కు 3వ దశలో ప్రతిపాదిత పరిశ్రమల వల్ల పర్యావరణ ప్రభావాన్ని అంచనా వేయాలని మరియు పర్యావరణం, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశ్రామిక పార్కునుండి విడుదలయ్యే మురుగునీటిని నిరోధించడానికి మరియు పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ) తయారీకి ప్రతిపాదనలు సమర్పించడానికి చర్యలను ప్రారంభించాలని ఏపీఐఐసీ, జోనల్ కార్యనిర్వాహకులని ఏపీపీసీబీ ఆదేశించింది (2021 జూలై).

ఫార్మా/బయోటెక్ కార్యకలాపాలు సాగించే పరిశ్రమలకు 11 కేటాయింపులు[117] (2019 సెప్టెంబర్ నుండి 2022 మార్చి మధ్య) జరిగినట్లు దస్త్రాల పరిశీలనలో వెల్లడైంది. అయితే, ఆడిట్‌కు సమర్పించిన దస్త్రాల నుండి ఏపీపీసీబీకి సమర్పించిన పర్యావరణ నిర్వహణ ప్రణాళిక కానీ, పర్యావరణ అనుమతుల ప్రతిపాదనలు కానీ తెలియరాలేదు.

మురుగునీటి శుద్ధి కోసం లేఅవుట్‌లో ఉమ్మడి నిర్గత ప్రవాహాల శుద్ధి కర్మాగార నిర్మాణం ప్రతిపాదించనప్పటికీ, ఫార్మా మరియు బయోటెక్ వంటి రెడ్ కేటగిరీకి చెందిన పరిశ్రమలకు కేటాయింపులు జరిగినట్లు ఆడిట్ గుర్తించింది. ఇంకా, లేఅవుట్‌లో ప్లాట్ కేటాయించబడిన ఒక సంస్థ వ్యర్థ పదార్థాల సేకరణ మరియు శుద్ధి కోసం ఏపీఐఐసీని అభ్యర్థించింది, ఆ సేవలకు వినియోగదారు ఛార్జీల గురించి జోనల్ కార్యనిర్వాహకుల నుండి వివరణ కోరింది.

రెడ్ కేటగిరీకి చెందిన పరిశ్రమలకు మొదట భూమిని కేటాయించి, ఆపై పరిశ్రమలు సంబంధిత అధికారుల నుండి అన్ని పర్యావరణ అనుమతులను పొందుతాయనీ, ఇతర సందర్భాల్లో ఏపీఐఐసీ పర్యావరణ అనుమతులను పొంది తరువాత భూమిని కేటాయిస్తుందనీ, చట్టబద్ధమైన అనుమతులు వస్తే తప్ప ఏ కార్యకలాపాలూ జరగవని ప్రభుత్వం ముగింపు సమావేశంలో పేర్కొంది (2023 డిసెంబర్).

[117] కేటాయించిన 11 పరిశ్రమల్లో మూడు పని చేస్తున్నాయి, నాలిగింటి కేటాయింపుల లీజు రద్దు చేయబడింది, నాలుగు పరిశ్రమలు ఇంకా కార్యకలాపాలు ప్రారంభించలేదు

ఆ విధంగా, కేటాయింపు నిబంధనలలో ఆశించిన విధంగా, ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కులో ఉమ్మడి నిర్గత ప్రవాహాల శుద్ధి కర్మాగారాన్ని స్థాపించకుండా, సరైన శుద్ధి మరియు మురుగునీటిని సురక్షితంగా పారవేయకుండా, పర్యావరణం మరియు ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా రెడ్ కేటగిరీకి చెందిన పరిశ్రమలకు భూములను కేటాయించింది. పర్యావరణ అనుమతులు లేకుండా రెడ్ కేటగిరీ పరిశ్రమల నిర్వహణకు అనుమతించిన అధికారులను బాధ్యులు చేయాలి.

***సిఫార్సు 5.2: అవసరమైన కాలుష్య మరియు పర్యావరణ అనుమతులు పొందిన తరువాత మాత్రమే రెడ్ కేటగిరీ పరిశ్రమలు పనిచేసేలా ప్రభుత్వం చూడాలి.***

### (సి) కేటాయించిన వారికి విద్యుత్ మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం

కేటాయింపు నియంత్రణలు, 2015లోని 1.10 నియమం ప్రకారం, పారిశ్రామిక పార్కు అంటే ప్రాథమికంగా ఏదైనా ఉత్పత్తి తయారు చేయడానికి లేదా సేవను అందచేయడానికి పారిశ్రామిక యూనిట్ల స్థాపన కోసం కనీస మౌలిక సదుపాయాలైన అంతర్గత రోడ్లు, నీటి పంపిణీ సౌకర్యాలు, విద్యుత్ పంపిణీ, మురుగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాలు ఉన్న ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన ప్రదేశం.

పరవాడ 3వ దశ లేఅవుట్‌కు విద్యుత్ మౌలిక సదుపాయాలను అందించడానికి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)ని ఏపీఐఐసీ అభ్యర్థించింది (2020 జూలై). ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, కార్యనిర్వాహక ఇంజనీర్ స్పందిస్తూ, ప్రస్తుత ఉప-కేంద్రం నుండి విద్యుత్ సరఫరా చేయడం చాలా కష్టంగా ఉందని మరియు కొత్త 132/33 కేవీ ఉప-కేంద్ర నిర్మాణానికి ఐదు ఎకరాల ఖాళీ స్థలాన్ని కేటాయించాలని అభ్యర్థించారు (2020 సెప్టెంబర్).

ఇప్పటికే ఉన్న 220 కేవీ ఉప-కేంద్రం నుండి విద్యుత్ సరఫరాను కేటాయించాలని జోనల్ మేనేజర్ కూడా, ఆంధ్రప్రదేశ్ (ఏపీ) విద్యుత్ ప్రసార సంస్థను అభ్యర్థించారు (2021 ఆగస్టు). ఇంకా, ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ప్రసార సంస్థ రెండూ ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు విద్యుత్ సరఫరా అవసరాలను తీర్చడానికి 132 కేవీ ఉప-కేంద్రాన్ని నెలకొల్పడానికి మూడు నుండి ఐదు ఎకరాల భూమి అవసరమని పట్టుబడుతున్నాయని ఏపీఐఐసీ ప్రధాన ఇంజనీర్‌కు జోనల్ మేనేజర్ తెలియచేశారు (2021 ఆగస్టు). ఇంతలో, జాప్యాన్ని నివారించడానికి, లేఅవుట్‌కు ఉప-కేంద్రాన్ని అందించాలని ఏపీఐఐసీ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను ఆమోదించి, చెల్లించాల్సిన అంచనా ఛార్జీలను తెలియచేయాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థని ఏపీఐఐసీ అభ్యర్థించింది (2021 డిసెంబర్).

విద్యుత్ మౌలిక సదుపాయాలను ₹5.77 కోట్ల అంచనా వ్యయంతో కల్పించడం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ప్రసార సంస్థ, ఏపీఐఐసీ సంయుక్తంగా తనిఖీ నిర్వహించినట్లు దస్త్రాల పరిశీలనలో వెల్లడైంది (2023 జనవరి). అంచనా వేసిన ప్రతిపాదనను చీఫ్ ఇంజనీర్ (ఎన్), ఏపీఐఐసీ (ప్రధాన కార్యాలయం) కి ప్రాంతీయ కార్య నిర్వాహకులు సమర్పించి, పరిపాలనా మరియు సాంకేతిక అనుమతిని పొందవలసిందిగా అభ్యర్థించారు (2023 మార్చి). 2023 సెప్టెంబరు నాటికి, ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయం ఆడిట్‌కు అందుబాటులో ఉంచిన రికార్డుల నుండి పరిపాలనా మరియు సాంకేతిక అనుమతులు పొందినట్లు తెలియరాలేదు. ఈ విషయంపై తదుపరి పురోగతి లేదు.

విద్యుత్ మౌలిక సదుపాయాలు అందుబాటులో లేని కారణంగా, నిర్ణీత సమయంలో పరిశ్రమలు నెలకొల్పటానికి సంబంధించిన నిర్మాణ పనులు పూర్తి కాలేదని ఎనిమిది మంది పారిశ్రామికవేత్తలు ఇప్పటికే ఏపీఐఐసీకి (2022 ఆగస్టు నుండి డిసెంబర్ వరకు) విన్నవించారని ఆడిట్ గుర్తించింది. 2019 సెప్టెంబర్ నుండి 85 ప్లాట్లు కేటాయించబడినప్పటికీ, కేవలం రెండు పరిశ్రమలు మాత్రమే ఉత్పత్తిని ప్రారంభించాయి (2019 డిసెంబర్/2020 ఫిబ్రవరి), ఒక పరిశ్రమ ఉత్పత్తి పరీక్ష చేసింది మరొక పరిశ్రమ యంత్రాలను ఏర్పాటు చేసింది.

పరవాడ 3వ దశ లేఅవుట్‌లో నాలుగు సంవత్సరాలు గడిచినా (2019 సెప్టెంబర్ నుండి) కేటాయింపు దారులకు విద్యుత్ మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఏపీఐఐసీ వైఫల్యం చెందడం, పరిశ్రమలు స్థాపించక పోవడానికి దారితీసింది.

సాధారణంగా, పారిశ్రామిక పార్కులో ఉప-కేంద్రం అందించబడుతుంది, కనెక్షన్ పొందడానికి పరిశ్రమలు పంపిణీ సంస్థ (డిస్కంలు) (విద్యుత్ శాఖ)ని సంప్రదించవలసి ఉంటుంది. ఈ సందర్భంలో, వనరుల కొరత కారణంగా, విద్యుత్ మౌలిక సదుపాయాలను సకాలంలో అందచేయలేక, జాప్యం జరిగింది. ఇప్పుడు ఏపీఐఐసీ విద్యుత్ మౌలిక సదుపాయాలు కల్పించే పనిని చేపట్టిందని ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వం తెలియచేసింది (2023 డిసెంబర్).

ఈ విధంగా, పైన పేర్కొన్న ఏపీఐఐసీ యొక్క అలసత్వం కారణంగా, పరవాడ పారిశ్రామిక పార్కు (3వ దశ) ను అభివృద్ధి చేయాలనే లక్ష్యం నెరవేరలేదు.

## 5.3 భూ కేటాయింపులు & రద్దులు

కేటాయింపు నిబంధనల (2015 & 2020) ప్రకారం, ఏపీఐఐసీ అన్ని పారిశ్రామిక/థీమ్ పార్కులలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భూమిని కేటాయిస్తుంది, వారు ఏదైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కేటాయింపును రద్దు చేస్తుంది. అనుసరించిన కేటాయింపు ప్రక్రియ దిగువ **పటం 5.2** లో చూపబడింది.

**పటం 5.2: భూ కేటాయింపు ప్రక్రియ**




*మూలం: సమగ్ర ప్రాజెక్టు నివేదిక యొక్క ఏపీఐఐసీ కీలక పరిశీలన*

### 5.3.1 భూ కేటాయింపు

ఏపీఐఐసీ యొక్క కేటాయింపు నిబంధనలు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఎప్పటికప్పుడు జారీ చేయబడిన పారిశ్రామిక అభివృద్ధి విధానం యొక్క నిబంధనల ప్రకారం పారిశ్రామికవేత్తలకు భూమి కేటాయింపు జరుగుతుంది.

#### 5.3.1.1 భూమి రేటును తప్పుగా స్వీకరించడం వల్ల తక్కువగా సేకరించిన భూమి ధర

కేటాయింపు నిబంధనలు 2015లోని 5 & 6.2 నియమాలకు అనుగుణంగా, ఏపీఐఐసీ నిర్ణయించిన ప్రకారం, భూమి విలువలో భూమి ధరతో పాటు, పరిపాలనా రుసుములు, కాలానుగుణంగా వర్తించే రేటుతో ఖాళీ ప్రదేశ రుసుములు కూడి ఉంటాయి. భూమి విలువను పీఎఫ్ & ఐసీ సిఫార్సు చేస్తుంది, అయితే, సిఫార్సు చేసిన రేటును వీసీ & ఎండీ సవరించవచ్చు లేదా ఆమోదించవచ్చు.

ఒక సంస్థ[118] 77.11 ఎకరాల భూమి కేటాయింపు కోసం ఆన్‌లైన్ దరఖాస్తును దాఖలు చేసినట్లు రికార్డుల పరిశీలనలో వెల్లడైంది (2015 డిసెంబర్). పీఎఫ్ & ఐసీ భూమి ధరను చదరపు మీటరుకు ₹62 లేదా ₹65 లేదా ఎకరాకు ₹2.51 లక్షలుగా నిర్ణయించినట్లు ఏపీఐఐసీ చీఫ్ జనరల్ మేనేజర్, సంబంధిత జోనల్ మేనేజర్‌కి తెలియజేశారు (2015 డిసెంబర్). తదనంతరం, వీసీ & ఎండీ ద్వారా ఆమోదించబడిన ఒక చదరపు మీటరుకు ₹65 చొప్పున కేటాయింపు ఆదేశాలను విడుదల చేయాలని ప్రధాన కార్యాలయ ఆస్తుల నిర్వహణ విభాగం, జోనల్ కార్యనిర్వాహకులకి తెలియజేసింది

118 మెస్సర్స్ జువారీ సిమెంట్ లిమిటెడ్

(2017 మే). అయితే, ఎకరాకు ₹2.51 లక్షలుగా పరిగణించి ₹1.82 కోట్ల[119] మొత్తాన్ని స్వీకరించి, తాత్కాలిక కేటాయింపు లేఖను జోనల్ మేనేజర్ జారీ చేశారు (2017 మే).

వీసీ & ఎండీ ద్వారా ఆమోదించిన రేటు ప్రకారం, భూమి ధర చదరపు మీటరుకు ₹65 చొప్పున, ఎకరానికి ₹2.63 లక్షలు (చ.మీ.కి ₹65 x 4,047 చ.మీ) కాగా, తాత్కాలిక కేటాయింపు ఆదేశంలో పేర్కొన్నట్లు.₹2.51 లక్షలు కాదని ఆడిట్ గుర్తించింది. వసూలు చేయవలసిన వాస్తవ విలువ ₹2.56 కోట్లు[120] ఉండాలి. అయితే, ఏపీఐఐసీ ₹1.82 కోట్లను వసూలు చేయడం వల్ల భూమి విలువ ₹0.74 కోట్లు (₹2.56 కోట్లు–₹1.82 కోట్లు) తక్కువగా వసూలైంది.

ఏపీఐఐసీ, పీఎఫ్ & ఐసీ ద్వారా నిర్ణయించబడిన విస్తీర్ణం రేటు (ఒక ఎకరాకు) ను పరిగణనలోకి తీసుకుని, భూమి ధర ఎకరాకు ₹2.51 లక్షలు చొప్పున ₹1.93 కోట్లు వసూలు చేసింది. తాత్కాలిక కేటాయింపు లేఖను జారీ చేస్తున్నప్పుడు, జోనల్ మేనేజర్ విడిగా చెల్లించిన ₹11.56 లక్షల ప్రక్రియ రుసుమును మినహాయించి భూమి ధరను లెక్కించినట్లు ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2023 డిసెంబర్).

సమాధానం ఆమోదయోగ్యం కాదు. భూమి కేటాయింపు నిబంధనల ప్రకారం భూమి విలువ పీఎఫ్ & ఐసీ ద్వారా సిఫార్సు చేయబడుతుంది, అయితే, వీసీ & ఎండీ రేటును సవరించవచ్చు, మరియు ఆ రేటు అంతిమంగా ఉంటుంది. వీసీ & ఎండీ ఆమోదించిన రేటు చదరపు మీటరుకు ₹65 (ఎకరానికి ₹2.63 లక్షలు) కు బదులుగా పీఎఫ్ & ఐసీ ద్వారా ₹2.51 లక్షలుగా నిర్ణయించిన ఎకరం రేటును పరిగణనలోకి తీసుకోవడం వల్ల భూమి ధర ₹0.74 కోట్లు (₹2.56 కోట్లు – ₹1.82 కోట్లు) తక్కువగా వసూలు చేయడమైంది.

### 5.3.1.2 ప్రక్రియ రుసుములు మరియు అదనపు ప్రక్రియ రుసుములను విధించకపోవడం

కేటాయింపు నిబంధనలు 2015లోని 9.4 నియమం ప్రకారం, తిరిగి చెల్లించబడని ప్రక్రియ రుసుము, అభివృద్ధి చేయబడిన ప్లాట్‌ల విషయంలో ముందస్తు ధరలో 0.1 శాతంతో కనీసం ₹1,000 మరియు అభివృద్ధి చెందని భూమి (యూడీఎల్) కోసం దరఖాస్తు చేసినట్లయితే, ప్రక్రియ రుసుముతో పాటు 100 ఎకరాల వరకు ఎకరానికి ₹15,000 చొప్పున అదనపు ప్రక్రియ రుసుమును ఏపీఐఐసీ విధించి, వసూలు చేస్తుంది.

ఇంకా, ఏపీఐఐసీ పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఇతర కంపెనీల అభ్యర్థనపై (ఇతరులకు భూ సేకరణ కింద) భూమిని సేకరిస్తుంది. అటువంటి సందర్భాలలో, భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత భూమి కేటాయింపులో ఎకరానికి లేదా దానిలో కొంత భాగానికి ప్రస్తుత ధరల ప్రకారం తిరిగి చెల్లించబడని ప్రక్రియ రుసుము ఏపీఐఐసీ ద్వారా విధించబడుతుంది. దస్త్రాల పరిశీలనలో భూమి కేటాయింపులో ప్రక్రియ రుసుము విధించి వసూలు చేయయడంలో ఈ క్రింది అవకతవకలు బయటపడ్డాయి.

---

119 (77.11 ఎకరాలు x ఎకరానికి ₹2.51 లక్షలు + 10 శాతం ఖాళీ స్థల రుసుము) + 15 శాతం పరిపాలనా రుసుము

120 (77.11 ఎకరాలు x ఎకరానికి ₹2.63 లక్షలు + 10 శాతం ఖాళీ స్థల రుసుము) + 15 శాతం పరిపాలనా రుసుము

### (ఎ) ఇతరులకు భూసేకరణ కింద విధించబడని ప్రక్రియ రుసుము

కడప జోన్ కోడూరు గ్రామంలో 604.38 ఎకరాల భూమిని సేకరించాలని ఒక సంస్థ[121] అభ్యర్థించింది (2006 జూలై). "ఇతరుల కోసం భూ సేకరణ" కింద చేస్తున్నట్లుగా పరిగణించి ఎకరానికి ₹10,000 చొప్పున ప్రక్రియ ఫీజు చెల్లించాలని ఏపీఐఐసీ సంస్థను అభ్యర్థించింది (2006 నవంబర్). తదనంతరం, 2017 మేలో ఆ సంస్థ ప్రస్తుతం ఉన్న సిమెంట్ కర్మాగారాన్ని 77.11 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించేందుకు పైన పేర్కొన్న భూమిలో కొంత భాగాన్ని కేటాయించాలని అభ్యర్థించింది. దీని ప్రకారం, ఏపీఐఐసీ కేటాయింపు ఉత్తర్వులు జారీ చేసింది(2017 మే) మరియు భూమి కేటాయింపు కోసం ప్రక్రియ రుసుము విధించింది. అయితే, ఏపీఐఐసీ ఇతరులకు భూ సేకరణ కింద ప్రక్రియ రుసుము విధించక పోవడం వల్ల ₹7.71 లక్షల[122] నష్టాన్ని చవిచూసింది.

భూమి కేటాయింపు కోసం భూమి ధర (₹1,58,30,518) పై 0.1 శాతం ప్రక్రియ రుసుము ప్రకారం లెక్కించిన ₹15,831 వసూలు చేయబడిందని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2023 డిసెంబర్). అయితే, భూ సేకరణకు సంబంధించి ప్రక్రియ రుసుము వసూలు చేయకపోవడంపై ప్రభుత్వం మౌనంగా ఉంది.

### (బి) భూమి కేటాయింపు కింద ప్రక్రియ రుసుము విధించకపోవడం/వసూలు చేయకపోవడం

అభివృద్ధి చెందిన ప్లాట్ల విషయంలో, ముందస్తు ధరలో 0.1 శాతంతో తిరిగి చెల్లించబడని ప్రక్రియ రుసుమును కేటాయించిన వ్యక్తి నుండి కనీసం ₹1000కి లోబడి విధించబడి వసూలు చేయబడుతుంది.

**పట్టిక 5.2** లో వివరించిన నాలుగు కేసులలో ఏపీఐఐసీ ప్రక్రియ రుసుమును విధించలేదని/వసూలు చేయలేదని ఆడిట్ గుర్తించింది.

**పట్టిక 5.2: విధించని/వసూలు చేయని ప్రక్రియ రుసుము**

| యూనిట్ పేరు | తాత్కాలిక కేటాయింపు తేదీ | భూమి యొక్క మొత్తం విలువ (₹ కోట్లలో) | విధించవలసిన ప్రక్రియ రుసుము (భూమి విలువలో 0.1 శాతం) (₹ లలో ) | 18 శాతం జీఎస్టీ కలుపుకొని మొత్తం ప్రక్రియ రుసుము ( ₹ లలో ) |
|---|---|---|---|---|
| వీటీపీఎల్★ | 07.06.2022 | 130.00 | 13,00,000 | 15,34,000 |
| జోవెల్ సర్జికల్స్ | 03.10.2019 | 1.12 | 11,109 | 13,109 |
| ఇన్-ఫార్మా టెక్నాలజీస్ | 12.04.2018 | 0.45 | 4,450 | 5,251 |
| మెస్సర్స్ భారత్ ఫోర్జ్ | 05.01.2018 | 21.56 | 2,15,600 | 2,54,408 |
| మొత్తం | | | **15,31,159** | **18,06,768** |

*మూలం: ఏపీఐఐసీ అందచేసిన సమాచారం*

*★వీటీపీఎల్ కి సంబంధించి, ప్రక్రియ రుసుము, అదనపు ప్రక్రియ రుసుము విధించబడింది. అయితే, దాని వసూలు వివరాలు దస్త్రాల్లో లేవు.*

ఒక సంస్థకు (భారత్ ఫోర్జ్) డిమాండ్ నోటీసు జారీ చేయబడిందనీ, మరొక సంస్థ (వీటీపీఎల్) సంబంధించి, చెల్లింపు కోసం సంస్థకు లేఖ రాయగా, ఎటువంటి మొత్తం అందలేదని ఏపీఐఐసీ బదులిచ్చింది (2022 సెప్టెంబర్). మిగిలిన రెండు సంస్థలకు సంబంధించి ఎటువంటి సమాధానమూ ఇవ్వలేదు.

భూమి కేటాయింపు సమయంలో ప్రక్రియ రుసుము వసూలు చేయని విషయంలో ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదు. అందువల్ల, ఏపీఐఐసీ కేటాయింపు నిబంధనలను పాటించక పోవడం వలన ₹0.18 కోట్ల నష్టాన్ని చవిచూసింది.

---

121 మెస్సర్స్ జువారీ సిమెంట్ లిమిటెడ్

122 77.11 ఎకరాలు x ఎకరాకు ₹10,000

### (సి) భూమి కేటాయింపు క్రింద అదనపు ప్రక్రియ రుసుము విధించకపోవడం

అభివృద్ధి చెందని భూమి కోసం దరఖాస్తు చేసినట్లయితే, కేటాయింపు సమయంలో ప్రక్రియ రుసుముతో పాటు, అప్పుడున్న నిబంధనల ప్రకారం ఏపీఐఐసీ అదనపు ప్రక్రియ రుసుమును విధిస్తుంది. 2015 కేటాయింపు నిబంధనలు 9.4 ప్రకారం, 100 ఎకరాల భూమి వరకు, ఎకరానికి ₹15,000 చొప్పున అదనపు ప్రక్రియ రుసుము విధించబడుతుంది.

**పట్టిక 5.3** లో వివరించిన విధంగా, కేటాయించిన ఎనిమిది సంస్థల నుంచి ₹0.62 కోట్ల అదనపు ప్రక్రియ రుసుము విధించలేదు మరియు వసూలు చేయనట్లు దస్త్రాల పరిశీలనలో వెల్లడైంది.

**పట్టిక 5.3: అదనపు ప్రక్రియ రుసుము విధించలేదని చూపే పట్టిక**

*(విలువ ₹ లలో)*

| క్రమ సంఖ్య | యూనిట్ పేరు | తాత్కాలిక కేటాయింపు తేదీ | భూమి విస్తీర్ణం (ఎకరాలలో) | విధించవలసిన అదనపు ప్రక్రియ రుసుము* | 18 శాతం జీఎస్టీ కలుపుకొని మొత్తం అదనపు ప్రక్రియ రుసుము |
|---|---|---|---|---|---|
| 1. | మెస్సర్స్ వీటీపీఎల్, విశాఖపట్నం | 07.06.2022 | 130 | 19,50,000 | 23,01,000 |
| 2. | మెస్సర్స్ సెంచురీ ప్లై బోర్డ్స్ ఇండియా లిమిటెడ్ | 22.12.2021 | 100 | 15,00,000 | 17,70,000 |
| 3. | మెస్సర్స్ భారత్ ఫోర్జ్ లిమిటెడ్ | 05.01.2018 | 98 | 14,70,000 | 17,34,600 |
| 4. | మెస్సర్స్ నవ్కో ఇండస్ట్రీస్, నెల్లూరు | 30.12.2020 | 5.93 | 88,950 | 1,04,961 |
| 5. | ఆర్ ఎన్ పేపర్ మిల్స్ | 02.08.2019 | 5.70 | 85,500 | 1,00,890 |
| 6. | జోవెల్ సర్జికల్స్ | 03.10.2019 | 5.00 | 75,000 | 88,500 |
| 7. | ఇన్-ఫార్మా టెక్నాలజీస్ | 12.04.2018 | 4.80 | 72,000 | 84,960 |
| 8. | మెస్సర్స్ సాయి శ్రేష్ఠ ఇండస్ట్రీస్ | 24.08. 2017 | 1.54 | 23,100 | 27,258 |
| | మొత్తం | | | | **62,12,169** |

*మూలం: ఏపీఐఐసీ అందచేసిన సమాచారం*

ఐదు[123] సంస్థలకు సంబంధించి డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది

ఉత్తర్వులు జారీ చేసినట్లయితే, అటువంటి ఛార్జీలు మినహాయించబడిన చోట చెల్లించాల్సిన అవసరం లేదు. అటువంటి మినహాయింపు కోసం నిర్దిష్ట సూచన లేకుంటే పరిశ్రమలు ఛార్జీలు చెల్లించాలి. ఇవి మినహాయింపు పొందిన కేసులు కానందున, ఛార్జీల వసూలుకు చర్యలు తీసుకుంటామని ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వం పేర్కొంది (2023 డిసెంబర్). ప్రస్తుతం ఇలాంటి అవకతవకలను అరికట్టేందుకు అన్నీ కంప్యూటరీకరిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఆ విధంగా, కేటాయింపు నిబంధనల ప్రకారం ప్రక్రియ రుసుము మరియు అదనపు ప్రక్రియ రుసుములను విధించకపోవడం ఏపీఐఐసీకి మొత్తం ₹0.88 కోట్ల[124] నష్టం కలిగించింది.

### 5.3.1.3 ముందస్తు రుసుములు వసూలు చేయకపోవడం/తక్కువగా వసూలు చేయడం

కేటాయింపు నిబంధనలు, 2015లోని 6.8 నియమం ప్రకారం, జాతీయ రహదారులు/రాష్ట్ర రహదారులు/జిల్లా రహదారులకు ఎదురుగా/ప్రక్కన ఉన్న ప్రాంగణాలకు ముందస్తు రుసుములు కేటాయించిన రేటుపై వరుసగా 15/10 మరియు ఐదు శాతం విధించబడతాయి.

జాతీయ/రాష్ట్ర రహదారులు మరియు జిల్లా రహదారులకు ఆనుకుని ఉన్న ప్రాంగణాల కేటాయింపులు జరిగినప్పటికీ, ఎనిమిది మంది పారిశ్రామికవేత్తలకు జారీ చేసిన తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వులలో ఏపీఐఐసీ ముందస్తు రుసుములు

123 మెస్సర్స్ నవ్కో, ఆర్ ఎన్ పేపర్ మిల్స్, జోవెల్ సర్జికల్స్, ఇన్-ఫార్మా, సాయి శ్రేష్ఠ ఇండస్ట్రీస్

124 ₹0.08 కోట్లు + ₹0.18 కోట్లు + ₹0.62 కోట్లు

విధించలేదని మరియు ఒక సందర్భంలో తక్కువ ముందస్తు రుసుము విధించినట్లు ఆడిట్ గుర్తించింది. ఫలితంగా, ₹0.30 కోట్ల (***అనుబంధం 5.1*** లో వివరించిన విధంగా) ముందస్తు రుసుములు వసూలు చేయలేదు/తక్కువగా వసూలు చేసింది.

ఆరు [125]సంస్థలకు డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2023 డిసెంబర్).

ఈ విధంగా, ఏపీఐఐసీ తాత్కాలిక కేటాయింపు ఆదేశాలలో ముందస్తు రుసుములకు సంబంధించిన నియమాన్ని పొందుపరచలేదని స్పష్టంగా తెలుస్తుంది, దీని ఫలితంగా ముందస్తు రుసుములు వసూలు చేయలేదు/తక్కువగా వసూలు చేసింది.

### 5.3.1.4 నిర్వహణా రుసుములు తక్కువగా విధించడం/విధించకపోవడం

కేటాయింపు నిబంధనలు, 2020లోని 7.15 (ఎ) మరియు (ఇ) నియమాల ప్రకారం, ఏపీఐఐసీ సృష్టించిన ఆస్తుల నిర్వహణ కోసం ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన పారిశ్రామిక పార్కులలో ఉన్న అన్ని యూనిట్ల నుంచి నిర్వహణ రుసుములు వసూలు చేయబడతాయి. అభివృద్ధి చెందిన పారిశ్రామిక పార్కులలో ఉన్న అన్ని యూనిట్ల నుండి సంవత్సరానికి నిర్వహణ రుసుము ప్రతి చదరపు మీటరుకు ₹ఒకటి చొప్పున వసూలు చేయాలి.

దిగువ **పట్టిక** 5.4 లో వివరించిన విధంగా కడప మరియు విజయవాడ ప్రాంతాలకు సంబంధించి మాత్రమే నిర్వహణ రుసుముల విధింపు, వసూలుకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని ఏపీఐఐసీ రికార్డుల పరిశీలనలో వెల్లడైంది.

**పట్టిక 5.4: నిర్వహణ రుసుములు విధించని/తక్కువగా విధించిన వివరాలు**

*(విలువ ₹ లలో)*

| ప్రాంతం | ప్రస్తుతం ఉన్న యూనిట్ల మొత్తం విస్తీర్ణం (చ మీ లలో) | | విధించవలసిన నిర్వహణ రుసుము | | వాస్తవంగా విధించింది/వసూలు చేసింది | | తక్కువగా విధించినది/విధించనిది | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 2020-21 | 2021-22 | 2020-21 | 2021-22 | 2020-21 | 2021-22 | 2020-21 | 2021-22 |
| కడప | 1,32,67,234 | 1,43,19,581 | 1,32,67,234 | 1,43,19,581 | 7,668 | 1,27,125 | 1,32,59,566 | 1,41,92,456 |
| విజయవాడ | 57,67,945 | 57,76,575 | 57,67,945 | 57,76,575 | 0 | 0 | 57,67,945 | 57,76,575 |
| మొత్తం | **1,90,35,179** | **2,00,96,156** | **1,90,35,179** | **2,00,96,156** | **7,668** | **1,27,125** | **1,90,27,511** | **1,99,69,031** |

***మూలం:*** *ఏపీఐఐసీ అందించిన సమాచారం*

ఏపీఐఐసీ సృష్టించిన ఆస్తుల నిర్వహణ కోసం పారిశ్రామిక పార్కులలో ఉన్న అన్ని యూనిట్ల నుండి కేటాయింపు నిబంధనల ప్రకారం పేర్కొన్న విధంగా నిర్వహణ రుసుములు వసూలు చేయబడలేదని పై పట్టికలో చూడవచ్చు. ఏపీఐఐసీలోని రెండు జోన్లలో ₹3.90 కోట్లు (₹1.90 కోట్లు + ₹2.00 కోట్లు) తక్కువగా విధించబడింది/విధించబడలేదు. ఇతర ప్రాంతాలకు సంబంధించి సమాచారం అందించలేదు.

పరిశ్రమకు ఇచ్చిన భూమి మార్కెట్లో లభించే భూముల కంటే ఎక్కువ ధరలో ఉందని, ఇది ఖరీదైన వ్యవహారం అని పేర్కొంది. నిర్వహణ రుసుములు వసూలు చేయాలని ప్రేరేపిస్తే పరిశ్రమలు ముందుకు రాక పోవచ్చు. అందువల్ల, పరిశ్రమలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్న చోట, అందుబాటులో ఉన్న సౌకర్యాల ఆధారంగా, వసూలు చేసేటట్లు ఒక నిబంధన చేయబడింది. ప్రతి పరిశ్రమ నుండి ఈ రుసుములను వసూలు చేయడం తప్పనిసరి కాదని ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వం పేర్కొంది (2023 డిసెంబర్).

సమాధానం ఆమోదయోగ్యం కాదు. కేటాయింపు నిబంధనల ప్రకారం, ఏపీఐఐసీ సృష్టించిన ఆస్తుల నిర్వహణ కోసం ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన పారిశ్రామిక పార్కుల పరిధిలో ఉన్న అన్ని యూనిట్ల నుండి నిర్వహణ రుసుములు వసూలు చేయబడతాయి. ఈ రుసుములను వసూలు చేయకపోవడం వల్ల పారిశ్రామిక పార్కుల నిర్వహణలో ఏపీఐఐసీపై ఆర్థిక భారం పడుతుంది.

[125] మెస్సర్స్ పాలడుగు స్ట్రక్చరల్, పాలడుగు పైప్స్ అండ్ ట్యూబ్స్, హెరిటేజ్ ఫుడ్, ఆర్ ఆర్ కెమికల్స్, పాలడుగు స్టీల్స్, ఇండో ప్రెసిషన్

## 5.3.2 కేటాయింపుల రద్దు

### 5.3.2.1 కేటాయింపుల రద్దులో జాప్యం వల్ల నిరుపయోగంగా ఉన్న భూమి

కేటాయింపు నిబంధనలు, 2015లోని 19.3 & 19.15 నియమాల ప్రకారం, కేటాయించిన వ్యక్తి ఆశించిన విధంగా ప్రాజెక్టుని అమలు చేసి, ప్లాట్/భూమిని స్వాధీనం చేసుకున్న తర్వాత నిర్ణీత వ్యవధిలోపు వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాలి. పథకం అమలు చేయకపోతే, చేసిన కేటాయింపు రద్దు చేయబడి, ఆ ప్లాట్/భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు ఏపీఐఐసీకి ఉంటుంది. స్వాధీనం చేసుకున్న తేదీ నుండి నిర్ణీత గడువులోగా పథకాన్ని అమలు చేయడంలో కేటాయించిన వ్యక్తి విఫలమైతే, జోనల్ మేనేజర్ తుది కేటాయింపు ఉత్తర్వుల యొక్క నిబంధనలు & షరతులను ఉల్లంఘించినందుకు కేటాయింపుదారుకి నోటీసు జారీ చేస్తారు, ఖాళీగా ఉన్న స్థలాన్ని అప్పగించమని కేటాయించిన వ్యక్తికి సలహా ఇస్తారు. కొన్ని సందర్భాలలో కేటాయింపు పొందిన వ్యక్తి, ఆవరణ యొక్క ముందస్తు/కేటాయింపు ధరను చెల్లించిన తర్వాత, నిర్ణీత 30 రోజులలోపు 'విక్రయ ఒప్పందం/లీజు'ను అమలు చేయడంలో విఫలమైతే, కేటాయింపు రద్దు చేయబడే అవకాశం ఉంటుంది.

అనంతపురము జోనల్ కార్యాలయ దస్త్రాలను తనిఖీ చేయగా, పైన తెలిపిన కేటాయింపు నిబంధనలు పాటించనందుకు గానూ, రాప్తాడులోని 19 మంది కేటాయింపుదారులకు, మీ కేటాయింపులు ఎందుకు రద్దు చేయకూడదో తెలుపుతూ కారణం, ఆ వాదనను సమర్థించే పత్రాలు సమర్పించాలని, అనంతపురము జోనల్ మేనేజర్ సంజాయిషీ పత్రాలు అందచేసినట్లు గ్రహించబడింది. ఒక వేళ ప్రత్యుత్తరం ఇవ్వక పోయినా లేదా సాక్ష్యాన్ని సమర్థించే పత్రాలు సమర్పించకపోయినా మరో నోటీసు ఇవ్వకుండా కేటాయింపు రద్దు చేయడానికి చర్యలు మొదలుపెట్టబడతాయని కూడా కేటాయింపుదారులకు తెలియచేయబడింది.

30 రోజుల నిర్ణీత వ్యవధి ముగిసినప్పటికీ, ఐదు కేటాయింపులకు సంబంధించి విక్రయానికి సంబంధించిన అంగీకార పత్రాన్ని అమలు చేయలేదని ఆడిట్ గుర్తించింది. 655 నుండి 1,182 రోజుల మధ్య కాలం గడిచినా (2022 జూన్ నాటికి) ఈ విషయంలో ఎటువంటి చర్య తీసుకోలేదు. ఫలితంగా, కేటాయించిన వారి వద్ద ఉన్న 1,347 చ. మీల భూమి నిరుపయోగంగా ఉంది (***అనుబంధం 5.2(ఎ)*** లో వివరించినట్లు).

ఇంకా, 7,977.75 చ.మీ వైశాల్యం కల భూమి 14 మందికి కేటాయించి, అందచేసినప్పటికీ, ఒక సంవత్సర నిర్దిష్ట కాలావధిలో ప్రాజెక్టులను ప్రారంభించలేదు. 565 నుండి 604 రోజుల మధ్య వ్యవధి ముగిసినప్పటికీ (2022 జూన్ నాటికి) ఏపీఐఐసీ ఎటువంటి చర్య తీసుకోలేదు. దీని ఫలితంగా 7,977.75 చ.మీ.ల భూమిని ఎటువంటి ఉపయోగం లేకుండా కేటాయించిన వారి వద్ద ఉంచబడింది (***అనుబంధం 5.2(బి)*** లో వివరించిన విధంగా).

ఇదే సందర్భంలో, ఏపీఐఐసీ, శ్రీకాకుళం జోన్ కార్య నిర్వాహకులు ఒక సంస్థ[126]కు తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వును జారీ చేశారు (2017 మార్చి). విక్రయ ఒప్పందాన్ని అమలు చేయడానికి, తుది కేటాయింపు ఆదేశాల తేదీ నుండి 30 రోజులలోపు భూమిని స్వాధీనం చేసుకోవడానికి సంస్థ స్పందించనందున, కేటాయింపు రద్దు చేయబడింది (2019 అక్టోబర్). తదనంతరం, సంస్థ అభ్యర్థన ఆధారంగా కేటాయింపును పునఃపరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఐఐసీని ఆదేశించింది (2019 నవంబర్). తదనుగుణంగా, 2020 జూలైలో కేటాయింపును రద్దు చేసిన గడువు తేదీతో ₹24.76 లక్షల పునరుద్ధరణ రుసుము వసూలు చేసిన తర్వాత, సంస్థకు అనుకూలంగా 172.84 ఎకరాల విస్తీర్ణంలో భూమి పునరుద్ధరించబడింది (2020 జూన్). అయినప్పటికీ, 2022 జూన్ నాటికి ఏపీఐఐసీ విక్రయ ఒప్పందాన్ని అమలు చేయలేదు.

ఇంకా, రద్దు చేసిన సందర్భాలలో, ముందస్తు ఖర్చులో 50 శాతానికి సమానమైన మొత్తాన్ని (కేటాయింపు నిబంధనల్లోని 19.14 నియమం) జప్తు చేయాలి

126 మెస్సర్స్ పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్

సెప్టెంబర్ 2023లో జరిగిన పీఎంఐసీ కమిటీ సమావేశంలో కేటాయింపులను [127] రద్దు చేయాలని ప్రతిపాదించామని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2023 డిసెంబర్). ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వం ఆడిట్ పరిశీలనను ఆమోదించి (2023 డిసెంబర్), పరిశ్రమలు తమ కార్యకలాపాలను ప్రారంభించనందున ఏపీఐఐసీకి స్వాభావిక నష్టం ఉందని పేర్కొంది. అయితే, అనంతపురం ప్రాంతంలో మార్కెట్ ఒత్తిడి లేదు కాబట్టి, రద్దుకు బదులుగా సమయం పొడిగింపు (ఈఓటీ) ఇచ్చారు. ఇంకా, సమయం పొడిగింపుకు భారీ ఫీజులు ఉండటంవల్ల, ఇది ఏపీఐఐసీకి ఒక ఆదాయ వనరు. సమయం పొడిగింపు మంజూరు మరియు వసూలు చేసిన ఛార్జీలకు సంబంధించిన సమాచారం ఆడిట్‌కు అందించబడుతుంది.

ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం కారణంగా, సమయాన్ని పొడిగించాలనీ లేదా కేటాయింపును రద్దు చేయాలనే సూచనల విషయంలో ఏపీఐఐసీకి ఎలాంటి స్పష్టత రాలేదు. ఇది ఏ పారిశ్రామికవేత్తకూ భూమిని కేటాయించకుండా నిరుపయోగంగా ఉండటానికి దారితీసింది. పొడిగించిన కాలం మంజూరుకు సంబంధించి ఎటువంటి సహాయక పత్రాలు, దానిపై వసూలు చేసిన రుసుములు ఆడిట్‌కు అందించలేదు.

### 5.3.2.2 నిర్ణీత గడువులోపు వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించకపోవడం

కేటాయింపు నిబంధనలు, 2012లోని 18.5వ నియమం ప్రకారం, భారీ ప్రాజెక్ట్‌ల కోసం కేటాయింపుల విషయంలో, ప్రాజెక్టు నివేదికలో ఇచ్చిన గడువులు, కేటాయింపు కమిటీ ఆమోదించినట్లు తగిన సమయంలో అమలు చేయబడాలి. ఇంకా, కేటాయింపు నిబంధనలు, 2012లోని 18.7వ నియమం ప్రకారం, ప్రాంతీయ కార్య నిర్వాహకులు లేదా తన ద్వారా అధికారం పొందిన ఇతర అధికారి ప్రాంగణాన్ని తనిఖీ చేసి కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి, అమలులో పురోగతిని ధ్రువీకరించి, కనుగొన్న వాటిని నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలి.

ఒక సంస్థ (ఎన్‌టీపీసీ మరియు బీహెచ్‌ఈఎల్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్) ద్వారా విద్యుత్ కర్మాగార యంత్రాల తయారీ ప్రాజెక్టు ఏర్పాటు కోసం పారిశ్రామిక పార్కు అభివృద్ధికి ఏపీఐఐసీకి అనుకూలంగా 750 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బదలాయించింది (2009 జూన్). ప్రాజెక్టు కోసం భూమిని ఎకరానికి ₹100 చొప్పున కేటాయించారు (2009 సెప్టెంబర్).

విక్రయ దస్తావేజు అమలు చేసిన తర్వాత (2009 నవంబర్), ఆ భూమిని సంస్థకు అప్పగించారు(2009 నవంబర్). భూమిపై అటవీ శాఖతో వివాదాల కారణంగా, మరొక 753.85 ఎకరాల భూమిని ప్రభుత్వం ఏపీఐఐసీకి బదలాయించాలని ప్రతిపాదించింది (2010 మే). ఆ 753.85 ఎకరాలకు సంస్థతో విక్రయ దస్తావేజు అమలు చేయబడింది (2010 జూన్). విక్రయ దస్తావేజు షరతు 3(సి) ప్రకారం, కేటాయింపుదారుడు ఆశించిన విధంగా ప్రాజెక్ట్‌ను అమలు చేసి, భూమిని స్వాధీనం చేసుకున్న 10 సంవత్సరాలలోపు వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాలి (2020 జూన్ నాటికి), అలాంటి చర్యలు తీసుకోకపోతే, కేటాయింపు రద్దు అయ్యే అవకాశం ఉంది.

విక్రయ దస్తావేజు ప్రకారం 2020 జూన్ నాటికి వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించనందుకు తిరుపతి ప్రాంతీయ కార్య నిర్వాహకులు సంజాయిషీ పత్రాలు జారీ చేశారు (2022 మే). ఇంకా, ప్రతిపాదించినట్లుగా ₹6,000 కోట్ల పెట్టుబడి, 30,000 మందికి ఉపాధి కల్పనకు గానూ కేవలం ₹129 కోట్ల పెట్టుబడి, 63 మందికి మాత్రమే ఉపాధి లభించిందని సంస్థ స్వయంగా పేర్కొన్నందున రెండవ సంజాయిషీ పత్రం జారీ చేయబడింది (2022 జూన్).

ఇంకా, ఏపీఐఐసీ రోడ్లు వేయడానికి సంబంధించిన పనులు మరియు ఇతర కార్యక్రమ నిర్వహణ పనులకు సంబంధించి ₹91.97 లక్షల మొత్తాన్ని వెచ్చించింది (2010 సెప్టెంబర్). అయితే, ఆ సంస్థ ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించలేదు.

[127] మెస్సర్స్ ఎస్‌బీ ఇండస్ట్రీస్, శామీర్ ఇంజనీరింగ్ వర్క్స్, మారుతీ ఇండస్ట్రీస్, హాజీ ఇండస్ట్రీస్

విక్రయ దస్తావేజు ప్రకారం, కేటాయించిన వ్యక్తి 10 సంవత్సరాలలోపు వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాలని ఆడిట్ గమనించింది. అయితే, కేటాయించబడిన వ్యక్తి నిర్దిష్ట వ్యవధిలో ప్రాజెక్ట్‌ను ప్రారంభించలేదు, దాని వలన పెట్టుబడి లేదా ఉపాధి కల్పనలో ఉద్దేశించిన ప్రయోజనం సాధించబడలేదు.

ఇంకా, ఎటువంటి స్వప్రయోజనం లేకున్నా సరే, ఏపీఐఐసీ, ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమ నిర్వహణకు ₹0.92 కోట్లను చెల్లించింది. దీని వలన ఏపీఐఐసీకి నిధులు, భూముల నిర్వహణకు అడ్డంకి ఏర్పడింది.

ప్రభుత్వం ప్రత్యుత్తరం (2023 డిసెంబర్) ప్రకారం, సంస్థ రెండు దశల్లో పనులను చేపట్టింది. ప్రస్తుతం మొదటి దశపై దృష్టి కేంద్రీకరించబడింది, ఎన్‌బీపీపీఎల్ (ఎన్‌టీపీసీ, బీహెచ్ఈఎల్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్) నాలుగు నుండి ఐదు సంవత్సరాల తర్వాత రెండవ దశకి చేరుకోవాలి. అందువల్ల, సంస్థ విశ్వసనీయత, ఉనికి కారణంగా, గణనీయమైన జాప్యం జరిగినప్పటికీ ప్రాజెక్టు ఖచ్చితంగా అమలు చేయబడుతుందని ఏపీఐఐసీ విశ్వాసంతో ఎదురుచూసింది. దీనికి సంబంధించి భారత ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. నిధులు స్తంభించి పోవడం గురించి, మొత్తాన్ని తిరిగి చెల్లించమని సంస్థను అభ్యర్థించినట్లు సమాధానం ఇచ్చారు. అయినప్పటికీ, అది ఇంకా తిరిగి చెల్లించబడలేదు, సమస్య పరిష్కారం కోసం సంస్థతో చర్చిస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యుత్తరం ఆమోదయోగ్యం కాదు, ఎందుకంటే ప్రాజెక్టు అమలు సమయంలో, కేటాయించిన వ్యక్తి యొక్క విశ్వసనీయతతో సంబంధం లేకుండా లక్ష్యాల ప్రకారం పని పురోగతిని ఏపీఐఐసీ తనిఖీ చేసి ఉండాలి. కేటాయింపును రద్దు చేయకపోవడంతో, పారిశ్రామికవేత్తలకు ఎలాంటి కేటాయింపులు చేయకుండా చాలా కాలం పాటు భూమి నిరుపయోగంగా ఉంచబడింది. పెట్టుబడి, ఉపాధి కల్పన లక్ష్యం కూడా నెరవేరలేదు. ఇంకా, సంస్థ తరపున ఏపీఐఐసీ ఖర్చు చేసిన ₹0.92 కోట్ల మొత్తాన్ని వసూలు చేయలేకపోయింది.

### 5.3.2.3 దరఖాస్తు వాయిదా వేయకపోవడం వల్ల ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టం

కేటాయింపు నిబంధనలు, 2012లోని 9.2వ నియమం ప్రకారం, ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన అసంపూర్ణ దరఖాస్తులు తిరస్కరించబడతాయి మరియు తిరస్కరించడానికి గల కారణాల గురించి దరఖాస్తుదారులకు తెలియజేయాలి. వాయిదా వేసిన దరఖాస్తులన్నీ భూమి రేటు చెల్లుబాటు విషయానికి గానూ తిరస్కరించబడినట్లుగా పరిగణించబడతాయి.

కడప జిల్లా, పుట్లంపల్లె గ్రామంలో ఐటీ/ఐటీఈఎస్[128] రంగానికి ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్)గా 21.36 హెక్టార్ల భూమిని భారత ప్రభుత్వం నోటిఫై చేసింది (2008 ఫిబ్రవరి). తదనంతరం, ప్రత్యేక ఆర్థిక మండలిని డీ-నోటిఫై చేయడానికి ఏపీఐఐసీ చేసిన ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'నిరభ్యంతర ప్రమాణపత్రం' ఇచ్చింది (2020 అక్టోబర్). దీని ప్రకారం, భారత ప్రభుత్వం ప్రతిపాదిత ఐటీ సెజ్‌ను రద్దు చేసింది (2020 నవంబర్).

ఈలోగా, ఒక సంస్థ (మెస్సర్స్ షిర్డీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్) సీపీ బ్రౌన్ ఐటీ పార్కులో భూమి (కార్యకలాప రంగం: ట్రాన్స్‌ఫార్మర్లు) కేటాయింపు కోసం దరఖాస్తు చేసింది (2016 సెప్టెంబర్ అంటే, ఐటీ సెజ్ యొక్క డీ-నోటిఫికేషన్ ఆదేశాలను జారీ చేయడానికి ముందు) కడపలో 38.75 ఎకరాల (1,56,821.25 చ.మీ) భూమి కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ద్వారా మరియు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ), ప్రక్రియ రుసుము, సేవా పన్నులకు గాను ₹2.66 కోట్లు చెల్లించారు. దరఖాస్తును రాష్ట్ర స్థాయి కేటాయింపు కమిటీ (ఎస్ఎల్ఏసీ) ముందు ఉంచగా (2016 అక్టోబర్), కమిటీ 52.76 ఎకరాల భూమి కోసం సిఫార్సు చేస్తూ, 50 ఎకరాల కంటే ఎక్కువ ఉన్నందున ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపింది. అయితే ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

తదనంతరం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, చ మీకి ₹1,680 చొప్పున కేటాయింపు ధరను పరిగణనలోకి తీసుకుని, ఐటీ పార్కులో 49.80 ఎకరాలు కేటాయించాలని ఏపీఐఐసీకి స్పష్టం చేసింది (2021 జూలై). నాలుగు సంవత్సరాల కంటే

[128] సమాచార సాంకేతికత ఆధారంగా పనిచేసే సేవలు

ఎక్కువ గడిచినప్పటికీ, ఏపీఐఐసీ, అందుకున్న ఆన్‌లైన్ దరఖాస్తును తిరస్కరించనూలేదు లేదా ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించనూలేదు (2016 సెప్టెంబర్).

తదనుగుణంగా, సంస్థకు అనుకూలంగా కడప, సీపీ బ్రౌన్ ఐటీ పార్కులో, లీజు ప్రాతిపదికన 33 సంవత్సరాల కాలానికి 49.80 ఎకరాల (2,01,545.569 చ. మీ.) భూమికి ₹33.86 కోట్ల వ్యయంతో (2016 నాటి భూమి విలువ ప్రకారం చదరపు మీటరుకి ₹1,680 చొప్పున) తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వును ఏపీఐఐసీ జారీ చేసింది (2021 సెప్టెంబర్). తదనంతరం, ఏపీఐఐసీ కేటాయించిన వ్యక్తికి సవరణ ఉత్తర్వులు జారీ చేసి (2023 జనవరి), విక్రయ ఒప్పందం అమలు చేసింది (2023 మే).

ఆడిట్ క్రింది విషయాలను గమనించింది:

(i) సంస్థ ట్రాన్స్‌ఫార్మర్స్ (విద్యుత్ పరికరం) రంగంలో పని చేస్తుంది. ఇది ఐటీ/ఐటీఈఎస్ రంగంతో ఎటువంటి సంబంధమూ లేదు. అందువల్ల ఆ సంస్థ ఐటీ/ఐటీఈఎస్ సెజ్‌లో భూమి కేటాయింపుకు అర్హత పొందలేదు మరియు దరఖాస్తు ఆమోదం సరికాదు.

(ii) భారత ప్రభుత్వ డీనోటిఫికేషన్ ఆదేశాలకు కి ముందే ఐటీ సెజ్‌లో భూమి కేటాయింపు కోసం ఆన్‌లైన్ దరఖాస్తును ఏపీఐఐసీ ఆమోదించింది (2020 నవంబర్). అయితే, దరఖాస్తు తిరస్కరించబడనూలేదు లేదా కేటాయించిన వారికి నాలుగు సంవత్సరాలు గడచినా ఆ మొత్తం తిరిగి చెల్లించబడలేదు.

ఐటీ కంపెనీలకు డిమాండ్ లేనందున, ఎటువంటి అభివృద్ధి మరియు ఉద్యోగాల కల్పన లేకుండా భూమిని ఖాళీగా ఉంచకుండా ఉండటానికి ఐటీ సెజ్‌లో, ఐటీ యూనిట్లకు కాకుండా ఇతర వాటికి భూమిని కేటాయించడానికి అనుమతించామని ఏపీఐఐసీ బదులిచ్చింది (2023 సెప్టెంబర్).

(iii) దరఖాస్తు సెజ్ యొక్క డీనోటిఫికేషన్‌కు ముందు ఆమోదించబడి, నాలుగు సంవత్సరాలకు పైగా పెండింగ్‌లో ఉన్నందున, దరఖాస్తును వాయిదా వేసినట్లుగా పరిగణించాలి. 2021 సెప్టెంబర్‌లో చేసిన కేటాయింపును తాజాగా పరిగణించాలి. ఇంకా, అవసరం ఉన్నందున మొదట ఉన్న 38.75 ఎకరాల భూమి నుండి 49.80 ఎకరాలకు మార్చారు. అందువల్ల, 2021 సెప్టెంబర్ నాటికి ఉన్న ధరల ప్రకారం భూమిని కేటాయించి ఉండాలి.

దరఖాస్తు వాయిదా వేయకపోవడం వల్ల, కేటాయింపు తేదీలో ఉన్న రేటు అంటే 2021 సెప్టెంబర్‌లో చదరపు మీటరు (చ.మీ) కి ₹2,108 కి బదులుగా పాత రేటు చ.మీకి ₹1,680 (2016 సెప్టెంబర్ నాటికి ఉన్న ధర) చొప్పున భూమిని కేటాయించారు. దీనివల్ల, ఏపీఐఐసీ ₹8.63 కోట్ల[129] ఆదాయ నష్టాన్ని చవిచూసింది.

సంస్థ యొక్క దరఖాస్తును ఏపీఐఐసీ ఆమోదించిందని, అయితే సెజ్ యొక్క డీనోటిఫికేషన్ కోసం భారత ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి ఉన్నందున భూమిని కేటాయించలేదని, డీ-నోటిఫికేషన్ తర్వాత దరఖాస్తు కేటాయింపు కోసం పరిగణించబడిందని ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వం పేర్కొంది (2023 డిసెంబర్). ఇంకా, ఈ సమస్యను పరిశీలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ప్రత్యుత్తరం సమర్థించదగినది కాదు, కేటాయింపు నిబంధనల ప్రకారం, దరఖాస్తును వాయిదా వేయాలి మరియు తిరస్కరించబడినట్లు భావించాలి. దరఖాస్తు వాయిదా వేయకపోవడంతో ₹8.63 కోట్ల మేరకు ఆదాయాన్ని కోల్పోయింది.

129 పీఎఫ్ & ఐసీ ప్రకారం 21/09/2021 నాటికి భూమి విలువ: ₹ 2,108 – పీఎఫ్ & ఐసీ ప్రకారం 22/09/2016 నాటికి భూమి విలువ: ₹ 1680 x 2,01,545.569 చ మీ

పూర్తిగా, విక్రయ ఒప్పందాలు అమలు కాకపోవడం, కేటాయింపులు చేపట్టకపోవడం, ప్రాజెక్టులు ప్రారంభించకపోవడం వంటి కారణాలతో కేటాయింపుల రద్దులో తీవ్ర జాప్యం జరగడంతో 955.86 ఎకరాల [130] మేర భూములు నిరుపయోగంగా ఉండడం, వాయిదా పడిన దరఖాస్తులను రద్దు చేయకపోవడంతో ₹8.63 కోట్ల మేర ఆదాయ నష్టం వాటిల్లింది.

***సిఫార్సు 5.3: కేటాయింపుల తర్వాత భూములు నిరుపయోగంగా ఉండకుండా ప్రభుత్వం సరైన పర్యవేక్షణ యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలి మరియు ప్రాజెక్టుల ప్రారంభంలో జాప్యానికి కేటాయించిన వారిపై సత్వర చర్యలు తీసుకోవాలి***

### 5.3.3 పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థ

ఏపీఐఐసీ ద్వారా స్థాపించబడిన పారిశ్రామిక పార్కు/ప్రత్యేక ఆర్థిక మండలాల్లోని స్థానిక సంస్థ విధులను పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థ (ఐఏఎల్ఏలు) నిర్వహిస్తోంది. వసూలు చేసిన ఆస్తి పన్నుల్లో 35 లేదా 50 శాతం మాత్ర స్థానిక సంస్థకు చెల్లించాలనే షరతుతో పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థలు విధులు నిర్వహిస్తున్నాయి.

ఇంకా, ఏపీఐఐసీ పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థ, సేవా సొసైటీల పనిలో ఏపీఐఐసీ, ఇతర ఏపీఐఐసీ అధికారుల పాత్రను సక్రమంగా వివరిస్తూ మార్గదర్శకాలను జారీ చేసింది (2013 అక్టోబర్). పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థ, దాని అధికారులకు బదిలీ చేయబడిన ఆర్థిక మరియు పరిపాలనా అధికారాల వివరాలను కూడా సర్క్యులర్ అందించింది.

#### 5.3.3.1 సేవా సొసైటీలను ఏర్పాటు చేయకపోవడం

స్వయం-పరిపాలన అనుసరణని ప్రోత్సహించడానికి, సేవా సొసైటీలు ప్రవేశపెట్టబడ్డాయి. ఇది పారిశ్రామిక పార్కు/ఎస్ఈజెడ్/పారిశ్రామిక సంపత్తి పరిమితుల్లోని అన్ని పారిశ్రామిక యూనిట్లను కలిగి ఉంటుంది. సేవా సొసైటీలకు ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారిని నామినేట్ చేసే జోనల్ కార్య నిర్వాహకుల పర్యవేక్షణలో సేవా సొసైటీల ఏర్పాటును నిర్దేశిస్తూ మార్గదర్శకాలు జారీ చేయబడ్డాయి. సేవా సొసైటీ ఐదుగురు ఆఫీస్ బేరర్లతో కూడిన నిర్వహణ కమిటీని ఎన్నుకుంటుంది.

సేవా సొసైటీలు వారికి సంబంధించిన అన్ని నిర్ణయాలలో పాల్గొనాలి, ఐఏఎల్ఏ పనితీరును సమన్వయం చేయాలి, ఐఏఎల్ఏ ప్రాంతంలో వివిధ అభివృద్ధి కార్యకలాపాలలో అక్కడి పారిశ్రామిక యూనిట్లను భాగస్వామ్యం చేయాలి మరియు ఐఏఎల్ఏల పనితీరులో పారదర్శకతను తీసుకురావాలి. సేవా సొసైటీలు ఉప కమిటీలను ఏర్పాటు చేస్తాయి. నిర్వహణ కమిటీ నుండి అధికారి స్థానంలో ఉన్న ఒకరు ఉప కమిటీకి అధ్యక్షునిగా ఉంటారు. ఉప కమిటీలోని ఇతర సభ్యులను నిర్వహణ కమిటీ నామినేట్ చేయవచ్చు. ఐఏఎల్ఏ కమీషనర్ ప్రతి ఉప కమిటీకి సమావేశకర్తగా ఉంటారు.

మచ్చుకు తనిఖీ చేసిన మూడు జోన్లలో, మార్గదర్శకాలలో పేర్కొన్న విధంగా సేవా సొసైటీలు మరియు ఉప కమిటీలు ఏర్పాటు చేయలేదని ఏపీఐఐసీ దస్త్రాల పరిశీలనలో తెలిసింది.

- విజయవాడ జోన్‌లో 28 పారిశ్రామిక పార్కులు ఉండేవి. అయితే కొండపల్లిలో ఒక్క సేవా సొసైటీ మాత్రమే పనిచేస్తోంది.
- విశాఖపట్నం ప్రత్యేక జోన్‌లో మూడు ఐఏఎల్ఏలు ఉన్నాయి. ఒక ఐఏఎల్ఏ (ఏపీసెజ్-అచ్యుతాపురం) లో సేవా సొసైటీ 2022 జూన్లో నమోదు చేయబడింది, అయితే, సేవా సొసైటీగా పని చేయడం కొరకు ఏపీఐఐసీ ఆమోదం

[130] 1,347 చ.మీ (0.33 ఎకరాలు) +7,977.75 చ.మీ (1.97 ఎకరాలు) + 26.87 ఎకరాలు + 753.85 ఎకరాలు (NBPPL) + 172.84 ఎకరాలు (పతంజలి)

2023 సెప్టెంబర్ నాటికి ఇంకా అందలేదు. జేఎన్‌పీసీ-పరవాడకు సంబంధించిన సేవా సొసైటీని ఏపీఐఐసీ ఉపసంహరించింది (2021 మార్చి).

- వైఎస్ఆర్ కడప జోన్‌లో 13 ఐఏఎల్ఏలలో ఏడు సేవా సొసైటీలు పనిచేస్తుండగా, పారిశ్రామికవేత్తలు ఆసక్తి కనబరచకపోవడం, కమిటీ ఏర్పాటుకు ముందుకు రాకపోవడంతో ఆరు ఐఏఎల్ఏలలో సేవా సొసైటీలు పనిచేయడం లేదు.

ఈ విధంగా, సేవా సొసైటీలు పనిచేయకపోవడం/ఏర్పాటు చేయకపోవడం వల్ల స్వయం పరిపాలన అనుసరణను ప్రోత్సహించే లక్ష్యం వీగిపోయింది.

- మార్గదర్శకాల యొక్క పేరా-V ప్రకారం, కమీషనర్, ఐఏఎల్ఏ సేకరించిన వ్యర్థాలను ఎత్తివేసేందుకు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్‌ల భాగస్వామ్యం కోసం సంబంధిత స్థానిక సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోవాలి. మచ్చుకు తనిఖీ చేసిన ఐఏఎల్ఏలలో, ఎందులోనూ సంబంధిత స్థానిక సంస్థలతో ఏ విధమైన అవగాహన ఒప్పందాలూ జరగలేదని ఆడిట్ గుర్తించింది.

విజయవాడ జోన్ కార్యనిర్వహణాధికారి, సమాధానమిస్తూ సేవా సొసైటీలకు ఎన్నికలు నిర్వహించనందున కమిటీలను ఏర్పాటు చేయలేదన్నారు (2023 ఆగస్టు). ఏపీఐఐసీ మరియు ఐఏఎల్ఏ అధికారులు సేకరించిన వ్యర్థాల తొలగింపు సమస్యను చర్చించి పరిష్కరించడానికి సంబంధిత స్థానిక సంస్థలతో సమావేశాలకు హాజరవుతున్నారని మరియు స్థానిక సంస్థలతో నిర్దిష్ట అవగాహన ఒప్పందాలు ఏవీ కుదరలేదని కూడా సమాధానమిచ్చారు.

ప్రభుత్వం నుంచి సమాధానం రావలసి ఉంది.

#### 5.3.3.2 వసూలు చేయని ఆస్తిపన్ను

ఐఏఎల్ఏలకు పారిశ్రామిక ప్రాంతాల నివాసితుల నుండి ఆస్తి పన్నును మదింపు చేయడం, విధించడం మరియు వసూలు చేయడానికి అధికారాలు మంజూరు చేయబడ్డాయి (1994 సెప్టెంబర్). ఐఏఎల్ఏల ఆస్తి పన్ను డిమాండ్, వసూలు, బాకీ (డీసీబీ) స్టేట్‌మెంట్‌లు విశ్లేషించబడి, వాటి సారాంశం ***అనుబంధం 5.3*** లో వివరించబడింది.

డీసీబీ సమాచార పరిశీలనలో 2022 మార్చి నాటికి, మొత్తం డిమాండ్ ₹99.88 కోట్లలో, కేవలం ₹64.77 కోట్లు మాత్రమే ఐఏఎల్ఏలు వసూలు చేశాయని, అలాగే కేటాయించిన ప్లాట్ యాజమానుల నుండి ₹35.11 కోట్ల బాకీ మిగిలి ఉందని వెల్లడయింది. ఐఏఎల్ఏలు లేని సందర్భాల్లో, వసూలు చేయాల్సిన ఆస్తి పన్ను వివరాలను నిర్ధారించడం సాధ్యం కాదు.

ఐఏఎల్ఏలు తమ అధికార పరిధిలోని పారిశ్రామిక యూనిట్ల నుండి ఆస్తిపన్ను వసూలు చేయడంలో తమ ప్రధాన కార్యకలాపాన్ని సమర్థవంతంగా నిర్వహించలేదని ఇది సూచిస్తుంది.

కోవిడ్ కారణంగా 2020-21 & 2021-22 మధ్య ఆస్తి పన్ను వసూళ్లు తక్కువగా ఉన్నాయని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2023 డిసెంబర్). అయితే, 2022-23లో ఆస్తిపన్ను వసూలు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆస్తిపన్ను డిమాండ్, బకాయిల రూపంలో ₹42 కోట్లు వసూలు చేసింది. ఇంకా, 2022-23 వరకు ఆస్తిపన్నుపై వడ్డీ బకాయిలను మాఫీ చేయడానికి ఆదేశాలు జారీ చేయబడ్డాయి (2023 మార్చి), ఇది ఒక్క-పర్యాయ చర్యగా 2023 మార్చి లేదా అంతకు ముందు మొత్తం బకాయిలను ప్రస్తుత సంవత్సరపు పన్నుతో కలిపి చెల్లించేలా చేసింది. ప్రభుత్వ ఉత్తర్వును అమలు చేయడం ద్వారా ఈ ప్రక్రియలో ₹7.64 కోట్ల మొత్తం వసూలు చేయబడింది.

ఏపీఐఐసీ, మదింపుదారుల నుండి వసూలు చేసిన వివరాలను అందించనందున, సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 5.3.3.3 సంబంధిత స్థానిక సంస్థలకు ఆస్తిపన్ను వాటా స్వల్ప చెల్లింపు

జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం (2013 అక్టోబర్), ఐఏఎల్ఏలు తమ అధికార పరిధిలో సేకరించిన ఆస్తి పన్నులో 35 లేదా 50 శాతం (సందర్భాన్ని బట్టి) సంబంధిత గ్రామీణ/పట్టణ స్థానిక సంస్థకు చెల్లించాలి.

అన్ని ఐఏఎల్ఏల ద్వారా ఆస్తిపన్ను డిమాండ్ మరియు సేకరణ విశ్లేషించబడి, స్థానిక సంస్థలకు చెల్లించిన ఆస్తి పన్ను వసూలు, చెల్లింపులు ***అనుబంధం 5.4*** లో వివరించబడ్డాయి.

సంబంధిత స్థానిక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను మొత్తం 2022 మార్చి నాటికి ₹5.94 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు ఆడిట్ గుర్తించింది.

మాతృ స్థానిక సంస్థతో సరిచూచిన తర్వాత, చెల్లింపులో స్వల్ప తగ్గుదల ఏదైనా ఉంటే, ప్రస్తుత సంవత్సరం చెల్లింపులో సర్దుబాటు చేయబడుతుందని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2023 డిసెంబర్).

ఇలా, స్థానిక సంస్థలకు ఆస్తిపన్ను వాటాను చెల్లించేందుకు ఐఏఎల్ఏలు విధులు నిర్వర్తించడం లేదని స్పష్టమవుతోంది. చెల్లింపులు చేయకపోవడం వల్ల పారిశ్రామిక పార్కుల ప్రాంగణం వెలుపల పారిశుధ్యం, అనుసంధాన రోడ్లు, వీధి దీపాలు మొదలైన వాటిపైన ప్రభావం చూపవచ్చు. ప్రాథమిక సౌకర్యాల కొరత పరిశ్రమలను స్థాపించడాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సంస్థలను నిరుత్సాహపరుస్తుంది.

### 5.3.3.4 అనధికార నిర్మాణాల గుర్తింపులో జాప్యం

ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టం, 1965లోని సెక్షన్ 211 మరియు 228 ప్రకారం, పారిశ్రామిక పార్కులలో (ఐపీలు) పనిని నిర్వహించడానికి ఐఏఎల్ఏ కమీషనర్ అనుమతిని మంజూరు చేసే వరకు భవనాల నిర్మాణం లేదా పునర్నిర్మాణం ప్రారంభించబడదు. ఇంకా, చట్టవిరుద్ధమైన నిర్మాణాల విషయంలో, కూల్చివేత ఆదేశాలను ఎందుకు ధ్రువీకరించకూడదనే దానిపై కారణాలను చూపించే సంజాయిషీ పత్రాన్ని కేటాయించిన వ్యక్తికి జారీ చేయాలి (సహేతుకమైన సమయంలో). పేర్కొన్న అధికారి సంతృప్తి చెందేలా సంజాయిషీని సమర్పించడంలో కేటాయించిన వ్యక్తి విఫలమైతే, ఐఏఎల్ఏ తగిన సవరణలతో ఆదేశాలను నిర్ధారించవచ్చు, అలాంటి ఆదేశానికి యజమాని కట్టుబడి ఉండాలి.

వార్షిక అద్దె విలువ నుండి మూలధన విలువకి ఆస్తి పన్నును విధించే విధానాన్ని మార్చాలని పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీ చేసింది (2020 నవంబర్). 2021 ఏప్రిల్ నుండి అమలులోకి వచ్చే ఆస్తి పన్ను సమీక్ష కోసం నిబంధనలను జారీ చేసినట్లు రికార్డుల పరిశీలనలో వెల్లడైంది.

పై సూచనలను దృష్టిలో ఉంచుకుని, గాజువాక ఐఏఎల్ఏ, విశాఖపట్నం పారిశ్రామిక ప్రాంతం అన్ని యూనిట్ల ఆస్తి పన్ను మదింపులను సమీక్షించింది, 2021-22 సంవత్సరానికి మూలధన విలువ ప్రకారం ఆస్తి పన్నును సవరించి, డిమాండ్‌ను పెంచింది. ఆస్తిపన్నును లెక్కించడానికి, పరిశ్రమలు నిర్మించిన స్థల కొలతలు మరియు నిర్మాణాల రకాలు పరిగణనలోకి తీసుకోబడ్డాయి. కొలిచే సమయంలో, ఐఏఎల్ఏ అధికారులు పారిశ్రామిక పార్కుల్లోని 1,303 యూనిట్లలో (గాజువాక ఆటోనగర్ ఐఏఎల్ఏ: 1,159 యూనిట్లు, విశాఖపట్నం ఐఏఎల్ఏ: 144 యూనిట్లు) 896 యూనిట్ల (గాజువాక ఆటోనగర్ ఐఏఎల్ఏ: 872 యూనిట్లు మరియు విశాఖపట్నం ఐఏఎల్ఏ: 24 యూనిట్లు) అనధికార నిర్మాణాలను గుర్తించారు.

ఐఏఎల్ఏ అధికారుల దృష్టికి రాకుండా చేపట్టిన అనధికారిక నిర్మాణాలు కఠినమైన పర్యవేక్షణ యంత్రాంగం, ఆస్తుల రక్షణ లోపాన్ని ఎత్తిచూపుతున్నాయి. కాలక్రమేణా, ఐఏఎల్ఏ ఈ నిర్మాణాలపై ఆస్తి పన్నును కోల్పోయింది. ఈ అనధికార నిర్మాణాలపై తీసుకున్న చర్యలు రికార్డుల్లో లేవు. ఇతర పారిశ్రామిక పార్కులలో కూడా అనధికార నిర్మాణాలకు అన్ని అవకాశాలు ఉన్నాయి

2022 జూన్ నాటికి అన్ని ఐఏఎల్ఏలు సర్వే నిర్వహించి మూలధన విలువ పద్ధతికి వెళ్లాలనే సూచనలు అందించబడ్డాయి. అనధికార నిర్మాణాలకు నిబంధనల ప్రకారం జరిమానాలు విధించబడతాయని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2023 డిసెంబర్).

ఇలా అనధికార నిర్మాణాల వల్ల ఆస్తిపన్ను, భవన ప్రణాళికల రుసుముల ద్వారా వచ్చే ఆదాయానికి గండి పడింది. అందువల్ల, ఐఏఎల్ఏల అధీనంలో ఉన్నా లేకున్నా, అన్ని పారిశ్రామిక పార్కుల్లో నిర్మాణ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

#### 5.3.3.5 ఆమోదానికి మించి పరిపాలనా వ్యయం

ఐఏఎల్ఏ ద్వారా పరిపాలనా పద్దుపై సంవత్సరానికి మొత్తం ఖర్చు, మొత్తం ఆదాయంలో 20 శాతానికి మించకుండా (స్థానిక సంస్థల వాటా మినహా) లేదా ₹20 లక్షలు ఏది తక్కువ అయితే దానిని చేయాలని పేర్కొంటూ ఏపీఐఐసీ సర్క్యులర్‌ని జారీ చేసింది (అక్టోబర్ 2013).

2017-22 మధ్య కాలంలో 15 జోన్లలో పరిపాలనాపరమైన వ్యయం ₹25.58 కోట్లు ***అనుబంధం 5.5*** లో వివరించిన విధంగా అనుమతించదగిన పరిమితి కంటే ఎక్కువగా ఉన్నట్లు రికార్డుల పరిశీలనలో వెల్లడైంది.

కొన్ని ఐఏఎల్ఏలలో పరిపాలన ఖర్చుల క్రింద సంబంధం లేని వ్యయం చూపబడింది, అది సరిదిద్దబడింది. అత్యవసర పారుగు సేవల సిబ్బంది చిన్న ఐఏఎల్ఏలలో నిమగ్నమై ఉన్నారు. పారుగు సేవల సిబ్బందికి కనీస వేతనాలు మరియు భవిష్య నిధి వంటి చట్టబద్ధమైన విరాళాలు చెల్లించవలసి ఉన్నందున, అదనపు పరిపాలనా వ్యయం అవుతుంది. ఇంకా, చిన్న ఐఏఎల్ఏల కోసం ఉమ్మడి పరిపాలన అధికారులు మరియు సిబ్బంది ప్రణాళిక చేయబడి, అమలు చేయబడుతుందని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2023 డిసెంబర్).

ప్రత్యుత్తరం ఆమోదయోగ్యం కాదు, సవరించిన రుసుముల ఛార్జీల సిఫార్సులు ఖర్చు చేసిన తర్వాత జారీ చేయబడ్డాయి (2022 ఏప్రిల్). అయితే, దీనికి సంబంధించి ఎలాంటి సర్క్యులర్/అంతర కార్యాలయ మెమో జారీ చేయలేదు. అందువల్ల, పరిపాలనా వ్యయం కోసం చేసిన అదనపు వ్యయం ఐఏఎల్ఏలకి ఇచ్చిన ఆర్థిక అధికారాలకు సంబంధించి జారీ చేయబడిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండకపోవడానికి దారితీసింది. పారుగు సేవల సిబ్బంది నియామకం ఖర్చుకు అనుమతించిన మొత్తంలోనే జరిగి ఉండాలి.

ఇలా ఐఏఎల్ఏలపై ఏపీఐఐసీ పర్యవేక్షణ యంత్రాంగం లేకపోవడం, కేటాయింపుదారుల నుంచి విధించిన ఆస్తిపన్ను వసూలు చేయకపోవడం, సంబంధిత స్థానిక సంస్థలకు ఆస్తి పన్నులో చట్టబద్ధమైన వాటాను తక్కువగా చెల్లించడం, అనధికార నిర్మాణాలను గుర్తించడంలో జాప్యం, అనుమతించిన పరిమితికి మించి పాలనాపరమైన ఖర్చులు చేయడం వంటివి ఐఏఎల్ఏల అసమర్థమైన పనితీరుకు దారితీసాయి.

***సిఫార్సు 5.4: ఏపీఐఐసీ ద్వారా పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థల పనితీరును నియంత్రించడానికి ప్రభుత్వం అంతర్గత నియంత్రణ యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలి.***

### 5.3.4 ఆర్థిక నిర్వహణ

విధాన స్థాయిలో తీసుకున్న నిర్ణయాలు నిధులను వృథా చేయకుండా లేదా మళ్లించకుండా పరిపాలనా స్థాయిలో విజయవంతంగా అమలు చేయబడేలా సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ నిర్ధారిస్తుంది.

### 5.3.4.1 నిధుల అస్తవ్యస్త వినియోగం, నిర్వహణ

#### (ఎ) ఋణ మొత్తాల మళ్లింపు

(i) ఏపీఐఐసీ వివిధ ప్రాజెక్టులలో భూమిని సేకరించేందుకు ₹5,000 కోట్ల మొత్తానికి హామీని అందచేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించింది (2016 మార్చి). ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఆర్థిక మండలి, అచ్యుతాపురం, నాయుడుపేట మరియు ఇతర పారిశ్రామిక పార్కులలో అంగీకరించిన ₹ 2,000 కోట్లకు ప్రభుత్వం హామీ[131]ఇచ్చింది (2017 జూన్).

ఏపీఐఐసీ మంజూరైన ₹2,000 కోట్లలో ₹520[132] కోట్ల ఋణ మొత్తాన్ని తీసుకుంది (2017 అక్టోబర్/డిసెంబర్). మిగిలిన ఋణ మొత్తం ₹1,480 కోట్లు పొందాలని, ప్రభుత్వ ఆర్జనోపాయాలను సులభతరం చేయడానికి, ఏపీఐఐసీ ద్వారా చెక్కులు సేకరించబడినప్పుడు మొత్తాలను వెంటనే విడుదల చేయాలనే షరతుతో ఏపీఐఐసీ యొక్క వ్యక్తిగత డిపాజిట్ల[133] (పీడీ) ఖాతాలో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక శాఖ, ఏపీఐఐసీని ఆదేశించింది[134] (జనవరి 2018), ఏపీఐఐసీ పీడీ ఖాతాలలో డబ్బును ఉంచడానికి చెల్లించే వడ్డీని కూడా ప్రభుత్వం చెల్లిస్తుంది.

దీని ప్రకారం, ఏపీఐఐసీ మిగిలిన ₹1,480 కోట్ల ఋణాన్నీ వినియోగించుకుంది (2018 జనవరి). 2022 మార్చి నాటికి, మొత్తం ₹2,000 కోట్ల రుణంలో, అమలులో ఉన్న ప్రాజెక్టులు ఏపీసెజ్, అచ్యుతాపురం, నక్కపల్లి, నాయుడుపేట మరియు ఇతర పారిశ్రామిక పార్కుల ఏపీఐఐసీ ₹505 కోట్లు ఖర్చు చేసింది. ఇంకా ₹1,020 కోట్లు ఇంకా పీడీ ఖాతాలో ఉన్నాయి, ₹46 కోట్లు ఏపీఐఐసీ వద్ద ఉండగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి చెల్లించే ప్రాతిపదికన ఒక సంస్థకి[135] మౌలిక సదుపాయాల కోసం ₹429 కోట్లు ఖర్చు చేయబడ్డాయి.

ఆడిట్ క్రింది విషయాలను గమనించింది:

- పారిశ్రామిక పార్కుల్లో అంగీకరించిన పనులకు ₹2,000 కోట్లు అవసరమని ఏపీఐఐసీ అంచనా వేసింది. అయితే, ₹1,480 కోట్లు ఉద్దేశించిన పనులకు కాకుండా పీడీ ఖాతాకు తక్షణమే బదిలీ చేయబడ్డాయి.
- రీయింబర్స్‌మెంట్‌కు లోబడి ఒక సంస్థ యొక్క అంగీకరిచబడిన మౌలిక సదుపాయాలకు భూమి ధరపై రాయితీ కోసం ₹450.29 కోట్ల మొత్తాన్ని తిరిగిచెల్లించే ప్రాతిపాదికన వెచ్చించడానికి ప్రభుత్వం మంజూరు చేసింది (సెప్టెంబర్ 2017), తదనుగుణంగా ఏపీఐఐసీ ద్వారా మొత్తం ₹429 కోట్లు 2022 మార్చి నాటికి ఖర్చు చేయబడ్డాయి. అయితే, ఏపీఐఐసీ ఎలాంటి తిరిగి చెల్లింపునూ అభ్యర్థించనూలేదు లేదా ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ మొత్తాన్ని తిరిగి చెల్లించనూ లేదు.

భూసేకరణ అనేది సుదీర్ఘ ప్రక్రియను కలిగి ఉంటుంది, అందువల్ల ప్రతిపాదించిన విధంగా భూసేకరణను వెంటనే పూర్తి చేయడం సాధ్యం కాదు. పొందిన మొత్తం ఋణాలలో, భూమిని ₹584.80 కోట్లకు సేకరించారు, ఒక సంస్థ కోసం చేసిన మౌలిక సదుపాయాల వ్యయం ₹348.72 కోట్లు పోగా మిగిలిన మొత్తం ₹1,066.48 కోట్లు మాత్రమేనని ఏపీఐఐసీ ప్రత్యుత్తరం ఇచ్చింది (2022 అక్టోబర్).

ఏపీఐఐసీ ఖాతాల్లో ఋణాల కింద తీసుకున్న మొత్తం ఋణ బాధ్యతగా చూపబడింది. ఏపీఐఐసీ డబుల్ ఎంట్రీ సిస్టమ్ ఆఫ్ అకౌంటింగ్‌ను అనుసరిస్తున్నందున, పీడీ ఖాతాలో మొత్తం డిపాజిట్ చేయబడినందున అదే డిపాజిట్ల క్రింద కూడా చూపబడిందని, ముగింపు సమావేశం సందర్భంగా ప్రభుత్వం తెలియచేసింది. (2023 డిసెంబర్).

---

131 ప్రభుత్వం నుండి రావలసిన మొత్తాల్లో ₹40 కోట్లు (17/01/2018న ₹10 కోట్లు, పద్దుల్లో సర్దుబాటు ద్వారా ₹29,63,26,590 చెల్లించబడ్డాయి) "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇతర ఖర్చులకు" + 31/03/2018న ₹36,72,410 "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇతర ఖర్చులకు –వ్యాపార ప్రోత్సాహక ఖర్చులు"

132 యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి ₹500 కోట్లు (31/10/2017 న), కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి చెరో ₹10 కోట్లు (10/12/2017న)

133 రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో బ్యాంక్ పద్దుల రూపంలో ఉంచబడుతున్నాయి.

134 లేఖ సంఖ్య 21025/23/సీఎం/ 2017 తేదీ 02/01/2018

135 మెస్సర్స్ కియా మోటార్స్ కార్పొరేషన్

పారిశ్రామిక పార్కులలో అంగీకరించిన పనుల కోసం ఋణ మొత్తాన్ని ఉపయోగించకపోవడానికి మరియు ఇతర వాణిజ్యేతర కార్యకలాపాలకు మళ్లించడానికి గల కారణాల గురించి ప్రభుత్వం యొక్క సమాధానం మౌనంగా ఉంది, దీని ఫలితంగా ఋణ మొత్తాన్ని పీడీ ఖాతాలో జమ చేయడం, ఒక సంస్థ తరపున ఖర్చు చేయడం వంటి ఆర్థిక దుర్వినియోగం జరిగింది. ఇలా, ప్రభుత్వం ఋణ మొత్తాన్ని ఉద్దేశించిన ప్రయోజనం కాకుండా వేరే దానికి మళ్లించడానికి గల కారణాలను పరిశీలించి, అటువంటి చర్యకు కారణమైన వారిని బాధ్యులను చేయాలి.

### (బి) ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ తీసుకున్న స్వల్ప కాలిక ఋణాన్ని తిరిగి చెల్లించకపోవడం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ భూసేకరణ రుసుముల ఖర్చును భరించడం కోసం ఏపీఐఐసీ నుండి ₹ 230 కోట్ల స్వల్పకాలిక ఋణం తీసుకోవడానికి ప్రభుత్వం అనుమతినిచ్చిందని ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్) నిర్వాహక సంచాలకులకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలియచేశారు (2020 ఆగస్టు).

తదనుగుణంగా, ఏపీఐఐసీ ₹220 కోట్లను ఏపీఏడీసీఎల్ బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసింది (2020 ఆగస్టు). కరెంట్ బ్యాంక్ ఖాతా నుండి ₹120 కోట్లు మరియు ఏపీఐఐసీ చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుండి ₹100 కోట్లు ఉపసంహరించడం ద్వారా మొత్తం బదిలీ చేయబడింది. ఋణాన్ని వీలైనంత త్వరగా తిరిగి చెల్లించడానికి ఏపీఏడీసీఎల్‌ని సంప్రదించాలనే సూచనలతో ఏపీఐఐసీ వీసీ & ఎండీ ద్వారా ఇది ఆమోదించబడింది (2020 ఆగస్టు).

తదనంతరం, తగినంత నిధులు లేనందున, మంజూరు చేసిన స్వల్పకాలిక ఋణాన్ని తిరిగి చెల్లించమని ఏపీఏడీసీఎల్‌ని ఏపీఐఐసీ అభ్యర్థించింది (2020 ఆగస్టు). దీనికి సంబంధించి, ఏపీఏడీసీఎల్‌కి అనేక అభ్యర్థనలు చేయబడ్డాయి, అయితే, 2022 సెప్టెంబర్ వరకు ఎటువంటి మొత్తమూ అందలేదు.

ఆడిట్ క్రింది విషయాలను గమనించింది:

- మొత్తం నేరుగా ఏపీఏడీసీఎల్‌కి బదిలీ చేయబడింది మరియు అధికారిక ఒప్పందం ఏదీ నమోదు కాలేదు. వడ్డీ రేటు, తిరిగి చెల్లించే తేదీలు, గ్యారెంటీలు, పెనాల్టీ మొదలైన ముఖ్యమైన ఋణ పారామితుల గురించి ప్రస్తావించబడలేదు. హామీలేని ఋణ మొత్తాన్ని ఎటువంటి నిబద్ధత లేకుండా బదిలీ చేయడం వలన ఋణగ్రహీత వైపు నుండి చెల్లింపు జరగకపోవచ్చు.
- ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుండి మొత్తాన్ని ఉపసంహరించుకోవడం ద్వారా ఏపీఏడీసీఎల్‌కి మొత్తం ఇవ్వబడింది, ఇది అవకాశ ఆదాయాన్ని కోల్పోవడానికి దారితీసింది.

ప్రభుత్వం దీనికి సంబంధించి ప్రత్యుత్తరం ఇవ్వలేదు, అయితే ముగింపు సమావేశం (2023 డిసెంబర్) సందర్భంగా, అడ్వాన్స్‌గా ఇచ్చిన మొత్తానికి ఒప్పందం కుదుర్చుకోవాల్సిందని ప్రభుత్వం అంగీకరించి, దానిని పరిశీలించాలని ఏపీఐఐసీని ఆదేశించింది.

సరైన డాక్యుమెంటేషన్ లేకుండా స్వల్పకాలిక ఋణాన్ని అందించడం, క్లిష్టమైన పారామితులను పేర్కొనపోవడం వలన ఏపీఏడీసీఎల్ ఋణం మరియు వడ్డీని తిరిగి చెల్లించలేదు. ఇంకా, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను సమయానికి ముందే ఉపసంహరించడం, వడ్డీ రేటును పేర్కొనకుండా నిధులను ఏపీఏడీసీఎల్ కి బదిలీ చేయడం వలన అవకాశ ఆదాయాన్ని కోల్పోవడం అసమగ్ర ఆర్థిక నిర్వహణకు సమానం.

### 5.3.4.2 వినియోగించని భూమి విలువను రెవెన్యూ అధికారుల నుండి తిరిగి పొందలేక పోవడం

ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్ యొక్క ఆర్టికల్ 4 ప్రకారం, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి యొక్క విధి కేవలం ఆర్థిక విషయాలలో పూర్తి చిత్తశుద్ధిని పాటించడమే కాకుండా, అతను లేదా అతని నియంత్రణలో ఖర్చు చేసిన అన్ని ప్రభుత్వ నిధులకు సాధ్యమైనంత ఉత్తమమైన విలువను పొందేలా నిరంతరం జాగ్రత్త వహించడం, ప్రభుత్వ నిధులను వృధా ఖర్చుల నుండి జాగ్రత్తగా కాపాడటం.

ఇరవై భూసేకరణ కేసులకు సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద ఏపీఐఐసీ ₹179.84 కోట్లు జమ చేసినట్లు ఆడిట్ గుర్తించింది. ఇందులో, దిగువ **పట్టిక** 5.5 లో వివరించిన విధంగా 2022 మార్చి నాటికి ₹140.91 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు చూపబడింది:

**పట్టిక 5.5: రెవెన్యూ అధికారుల నుండి తిరిగి పొందని వినియోగించని మొత్తం**

*(₹ కోట్లలో)*

| క్రమ సంఖ్య | జోన్ పేరు | సేకరణ కేసుల సంఖ్య | రెవెన్యూ అధికారుల వద్ద జమ చేసిన మొత్తం | రెవెన్యూ అధికారుల వద్ద పెండింగ్‌లో మొత్తం | రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న పెండింగ్ (రోజులలో) |
|---|---|---|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 2 | 32.66 | 11.02 | 499 నుండి 2,100 |
| 2 | విశాఖపట్నం | 3 | 26.77 | 23.17 | 1,832 నుండి 2,219 |
| 3 | విశాఖపట్నం ప్రత్యేక ప్రాంతం | 7 | 34.78 | 34.78 | 530 నుండి 2,040 |
| 4 | తిరుపతి | 2 | 2.5 | 0.70 | 1,039 నుండి 1,956 |
| 5 | చిత్తూరు | 4 | 14.83 | 2.94 | 512 నుండి 2,485 |
| 6 | కడప | 2 | 68.30 | 68.30 | 2,007 & 2,015 మధ్య |
| మొత్తం | | **20** | **179.84** | **140.91** | |

***మూలం**: సంబంధిత జోనల్ మేనేజర్ అందించిన సమాచారం*

499 నుండి 2,485 రోజులపాటు చిక్కుబడిపోయిన మొత్తాలను సరిచూసి రెవెన్యూ అధికారులు ఖర్చు చేయని మొత్తాన్ని తిరిగి పొందడానికి ఏపీఐఐసీ ఎటువంటి చర్య తీసుకోలేదని ఆడిట్ గమనించింది.

రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న మిగిలిన మొత్తం ₹271.63 కోట్ల (2021 ఏప్రిల్ నాటికి) నుండి ₹186.18 కోట్లకు (2023 మార్చి నాటికి) కొంత కాల వ్యవధిలో తగ్గింది. ఖర్చు చేయని మొత్తాల వాపసు కోసం సంబంధిత జిల్లా కలెక్టర్లతో ఏపీఐఐసీ ఉత్తరప్రత్యుత్తరాలు చేస్తోంది. ఏపీఐఐసీ కూడా తదుపరి డిపాజిట్లు చేయకుండా చర్యలు తీసుకుంటోంది, డిపాజిట్ల నుండి ఏవైనా డిమాండ్లు వస్తే, రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న డిపాజిట్లతో సర్దుబాటు చేస్తున్నారని ప్రభుత్వం ప్రత్యుత్తరం ఇచ్చింది (2023 డిసెంబర్).

అందుచేత, ఏపీఐఐసీ ఖర్చు చేసే ప్రభుత్వ నిధులు ఉద్దేశించిన ప్రయోజనం కోసం లాభసాటిగా ఉపయోగించబడేలా చూడటానికి నిరంతరం జాగ్రత్తగా ఉండాలి, ఖర్చు చేయని మొత్తాన్ని తిరిగి పొందడానికి రెవెన్యూ అధికారులతో క్రమం తప్పకుండా సంప్రదింపులు కొనసాగించాలి.

### 5.3.4.3 అద్దె రుసుములు సేకరించకపోవడం

ఏపీఐఐసీ భవనాలలో వివిధ ప్రభుత్వ శాఖలు మరియు కార్యాలయాలకు కార్యాలయ స్థలాలను ఏపీఐఐసీ కేటాయించింది (2020 జూలై నుండి 2022 మార్చి వరకు). లీజు అద్దె నెలకు చదరపు అడుగుకు ₹45గా, నిర్వహణ ఛార్జీలు చదరపు అడుగుకు ₹8 చొప్పున నిర్ణయించబడింది. (కేటాయింపు లేఖల ప్రకారం).

పైన పేర్కొన్న వ్యవధిలో చేసిన ఆరు కేటాయింపులను మచ్చుకు తనిఖీ చేయగా, ఆడిట్ క్రింది విషయాలను గమనించింది:

- డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ మినహా ఎవరితోనూ లీజు ఒప్పందం కుదుర్చుకోలేదు. 'ది కమీషనర్ ఆఫ్ సర్వే, సెటిల్‌మెంట్ & ల్యాండ్ రికార్డ్స్'కు కేటాయించిన స్థలం లీజు ప్రాతిపదికన ఉందా లేదా ఉచితంగా ఉందా అని నిర్ధారించడానికి రికార్డులు అందుబాటులో లేవు.
- నివాసితులు ఎవరూ ఇప్పటి వరకు లీజు అద్దె, నిర్వహణ మొత్తాన్ని చెల్లించలేదు. ఫలితంగా, లీజు అద్దె, నిర్వహణ రుసుముల రూపంలో నివాసితుల నుండి 2022 మార్చి నాటికి ₹3.12 కోట్లు సేకరించబడలేదు.

కేటాయించిన వారందరూ ప్రభుత్వ శాఖలే కాబట్టి, లీజు ఒప్పందాన్ని అమలు చేసి, నెలవారీ అద్దెల చెల్లింపు కోసం ఏపీఐఐసీ ప్రయత్నిస్తోందని ప్రభుత్వం బదులిచ్చింది (2023 డిసెంబర్).

భుక్తిదారులతో అధికారిక ఒప్పందం లేదని, అద్దెను ఎవరూ చెల్లించడం లేదని స్పష్టమైంది. ఏపీఐఐసీ యొక్క ఆర్థిక నిర్వహణ లేమి కారణంగా, లీజు అద్దెల రూపంలో ₹3.12 కోట్ల ఆదాయాన్ని సేకరించలేదు.

### 5.3.4.4 ఋణాలను పొందటానికి కేటాయింపుదారులకు నిరభ్యంతర ప్రమాణపత్రాన్ని జారీ చేయడం

కేటాయింపు నిబంధనలు, 2015లోని 34.3వ నియమం ప్రకారం, ప్రభుత్వ ఆదేశాల మేరకు కేటాయింపులు జరిగినప్పుడల్లా, బ్యాంకులు/ఆర్థిక సంస్థలకు అనుకూలంగా భూమిని తనఖా పెట్టేందుకు కేటాయింపుదారులచే నిరభ్యంతర ప్రమాణపత్రం (ఎన్ఓసీ) ప్రభుత్వ ఆమోదంతో మాత్రమే ఇవ్వబడుతుంది.

పారిశ్రామిక పార్కుల దస్త్రాల పరిశీలనలో ప్రాజెక్ట్ ప్రతిపాదకులు దాఖలు చేసిన వ్యక్తిగత దరఖాస్తుల ఆధారంగా ఎకరాకు ఎనిమిది లక్షల రూపాయల చొప్పున 86.32 ఎకరాల విస్తీర్ణంలో కృష్ణా జిల్లా వీరపనేనిగూడెంలో ఇంజినీరింగ్ క్లస్టర్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది (2016 జూలై). అదేవిధంగా, కృష్ణా జిల్లా మల్లవల్లిలో 1,341.67 ఎకరాల విస్తీర్ణంలో పలు ఉత్పత్తుల పారిశ్రామిక పార్కు కోసం ఎకరానికి ₹16.50 లక్షల చొప్పున భూములు కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది (2017 మే).

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకురాకుండానే నేరుగా ఏపీఐఐసీ ద్వారా తొమ్మిది కేసుల్లో ఎన్ఓసీలు జారీ చేశారని (2018 ఆగస్టు-2019 డిసెంబర్), ఆరు సందర్భాల్లో సంస్థలు ఏపీఐఐసీ నుంచి ఎన్ఓసీ పొందకుండానే ఋణాలు తీసుకున్నాయని ఆడిట్ గుర్తించింది. ఇంకా, ఐదు సంస్థలు భూమి కేటాయింపు కోసం ప్రాజెక్ట్ రిపోర్టులో ఏపీఐఐసీకి అందించిన ప్రతిపాదిత ప్రాజెక్ట్ వ్యయం (ఎన్ఓసీతో: మూడు సంస్థలు మరియు ఎన్ఓసీ లేకుండా: రెండు సంస్థలు) కంటే ఎక్కువ ఋణాలు పొందాయి.

భూమి తనఖా పెట్టదగిన ఆస్తి, ఋణం కోసం కేటాయించిన వ్యక్తి తాకట్టు పెడతారు. అయితే, చాలా బ్యాంకులు కేవలం ప్రభుత్వం ఇచ్చిన ఎన్ఓసీ ఆధారంగా ఋణం ఇవ్వడం లేదు, దానితోపాటు, అదనపు జామీనును బ్యాంకుకు సమర్పించాలి. ఎక్కడ ఉల్లంఘన జరిగినా చర్యలు తీసుకుంటున్నారని ముగింపు సమావేశంలో ప్రభుత్వం పేర్కొంది (2023 డిసెంబర్).

ప్రత్యుత్తరం ఆమోదయోగ్యం కాదు, ఏపీఐఐసీ భూమిని బ్యాంకులు/ఆర్థిక సంస్థల వద్ద తనఖా పెట్టడం, ఎన్ఓసీలు తీసుకోకుండా, ప్రభుత్వ ఆమోదం కూడా తీసుకోకపోవడం వలన అర్హత కంటే ఎక్కువ డబ్బును కేటాయింపుదారులు పొందడానికి అనుమతించబడవచ్చు. ఋణాన్ని తిరిగి చెల్లించడంలో కేటాయింపుదారులు విఫలం అయినట్లయితే, ఆస్తి యొక్క వాస్తవ ధర కంటే ఎక్కువ చెల్లింపును ఏపీఐఐసీ చేయవలసి వచ్చి, అదనపు ఆర్థిక భారాన్ని కలిగిస్తుంది.

ఏపీఐఐసీ ₹2,000 కోట్ల ఋణాన్ని సక్రమంగా వినియోగించకపోవడం, ఏపీఏడీసీఎల్‌కి ₹220 కోట్ల అసురక్షిత స్వల్పకాలిక రుణాన్ని అందించడం, రెవెన్యూ అధికారుల నుండి ₹140.95 కోట్ల ఖర్చు చేయని భూమి ధరను తిరిగి పొందలేక పోవడం, నివాసితుల నుండి ₹3.12 కోట్ల అద్దె రుసుములు వసూలు చేయకపోవడం, కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మొత్తంలో ఋణాలను పొందడం కోసం కేటాయించినవారిలో కొందరికి నిరభ్యంతర ప్రమాణ పత్రాన్ని అక్రమంగా జారీ చేయడం అసమర్థ, వ్యర్థమైన ఆర్థిక నిర్వహణకు సమానం.

***సిఫార్సు 5.5: ఏపీఐఐసీ ఆర్థిక వనరులను సమర్థవంతంగా, ప్రభావశీలంగా, ఆర్థిక దుర్వినియోగం లేకుండా నిర్వహించాలి. మెరుగైన ఆర్థిక నిర్వహణ కోసం సాధారణ ఆర్థిక సూత్రాలకు అనుగుణంగా ఖర్చులు చేస్తూ, ఆదాయాలను సాధించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.***

# 6వ అధ్యాయం

# నియమపాలన తనిఖీ పేరాలు

# నియమపాలన తనిఖీ పేరాలు

## ఉన్నత విద్యా శాఖ

### 6.1 కాంట్రాక్టు గరిష్ఠ డిమాండ్ (సీఎండీ) పునఃగణన చేయని కారణంగా ₹ 1.89 కోట్ల నివారించదగిన వ్యయం

***వాస్తవ అవసరాల ఆధారంగా కాంట్రాక్టు గరిష్ఠ డిమాండ్‌ను అంచనా వేయడంలో వైఫల్యం, వినియోగ సరళిని కాలానుగుణంగా సమీక్షించడం మరియు తక్కువ విలువను సకాలంలో తీసుకుని ఉంటే ₹1.89 కోట్ల ఖర్చును నివారించగలిగివచ్చు.***

ఆంధ్రప్రదేశ్ రిటైల్ విద్యుత్ పంపిణీ ధరల నియమాలు, 2021-22[136]లోని నియమం 6.4, బిల్లింగ్ డిమాండ్[137] అనేది నెలలో వినియోగించే గరిష్ట విద్యుత్ లేదా కాంట్రాక్ట్ గరిష్ట డిమాండ్[138] (సీఎండీ)లో 80 శాతం, వీటిలో ఏది ఎక్కువ అయితే దానిని కాలానుగుణంగా వర్తించే రేటుగా నిర్దేశిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా కమీషన్[139] జారీ చేసిన విద్యుత్తు పంపిణీ యొక్క సాధారణ నియమ నిబంధనల (జీటీసీఎస్) లోని నియమం 5.9.4.2 ప్రకారం, వినియోగదారుడు గడువు ముగిసే కనీసం నెల కంటే ముందుగా[140] నోటీసు ఇవ్వడం ద్వారా సీఎండీని తగ్గించుకోవచ్చు లేదా హెచ్‌టీ ఒప్పందాన్ని రద్దు చేయవచ్చని పేర్కొంది. ఏ కారణం చేతనైనా, ఒప్పందం యొక్క పరిమితి కనీస ఒక సంవత్సరం గడువు[141] ముగిసేలోపు వినియోగదారు సీఎండీ విలువ తగ్గించాలని లేదా ఒప్పందాన్ని ముగించాలని అనుకుంటే, ఒప్పందం యొక్క ఒక సంవత్సరం వ్యవధి లేదా ఒక నెల నోటీసు గడువు ఈ రెండింటిలో ఏది ముందు ముగిస్తే దాని ప్రకారం సీఎండీ నిలిపివేయబడుతుంది లేదా మొదటి గడువు ముగిసిన తేదీ నుండి ఒప్పందం రద్దు చేయబడుతుంది.

వేంపల్లి మండలం, ఇడుపులపాయలోని, రాజీవ్ గాంధీ విజ్ఞాన మరియు సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ), నీటి సరఫరా ఏర్పాట్లు అంటే మురుగునీటి శుద్ధి, హాస్టళ్లు, ప్రయోగశాల సముదాయ భవనాలు, కార్యాలయాలు, తరగతి గదులు మొదలైన వివిధ ప్రయోజనాల కోసం సీడీపీ-172[142], సీడీపీ -692, సీడీపీ -233 మరియు సీడీపీ -264 అనే నాలుగు హై టెన్షన్ (హెచ్‌టీ) విద్యుత్ కనెక్షన్‌లను[143] 1000 కేవీఏ, 1500 కేవీఏ, 83 కేవీఏ మరియు 450 కేవీఏ లను అంగీకరించిన సీఎండీతో కలిగి ఉంది. 2013 నవంబర్ నుండి 2022 జూన్ వరకు నాలుగు హెచ్‌టీ కనెక్షన్‌లకు[144] సంబంధించి, 5.4 నుండి 79 శాతం; 0 నుండి 5 శాతం; 0 నుండి 75 శాతం; 7 నుండి 78 శాతం వినియోగ ఛార్జీలు విశ్వవిద్యాలయం చెల్లించింది. నాలుగు హెచ్‌టీ కనెక్షన్‌లకు సంబంధించిన విద్యుత్తు యొక్క అర్ధ వార్షిక సగటు వినియోగం దిగువ **పటం 6.1** లో చూపబడింది.

---

136 25/03/2021న 2021-22 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ రిటైల్ అమ్మకం కోసం ధరలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) యొక్క సారాంశం

137 హై టెన్షన్ (హెచ్‌టీ) వినియోగదారుల కోసం కేటగిరీ-I(బి): అంటే, టౌన్‌షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు

138 సీఎండీ అంటే వినియోగదారుడు సిస్టమ్‌పై ఉంచాలనుకుంటున్న గరిష్ట డిమాండ్ మరియు పార్టీల మధ్య సరఫరా ఒప్పందంలో పేర్కొనబడింది

139 ప్రొసీడింగ్స్ సంఖ్య సెకీ /01/2006 తేదీ 06/01/2006 నవీకరించబడిన సంస్కరణలో13/04/2018 వలే చదవవలసినది

140 ప్రొసీడింగ్స్ సంఖ్య సెకీ/01/2006 తేదీ 06/01/2006 ప్రకారం మూడు నెలల ముందు ఇచ్చిన నోటీసు నుండి సవరించబడింది

141 ప్రొసీడింగ్స్ సంఖ్య సెకీ /01/2006 తేదీ 06/01/2006 నవీకరించబడిన సంస్కరణలో 13/04/2018 చదవబడింది

142 రెండు నెలల విషయంలో దాని వినియోగం 100 శాతం మించిపోయింది

143 11/08/2008 నుండి సీడీపీ-172, 18/09/2019 నుండి సీడీపీ -692, 20/03/2010 నుండి సీడీపీ -233, 12/09/2011 నుండి సీడీపీ -264

144 సీడీపీ -172 కోసం వినియోగ పరిధి 54 కేవీఏ నుండి 800 కేవీఏ వరకు; సీడీపీ -692 కోసం 0 నుండి 78 కేవీఏ; సీడీపీ -233 కోసం 0 నుండి 62 కేవీఏ; సీడీపీ -264 కోసం 31 నుండి 350 కేవీఏ వరకు

**పటం 6.1: అర్ధ సంవత్సరాల వారీగా విద్యుత్ వినియోగ ధోరణులను సూచించే పటం**




నాలుగు కనెక్షన్ల ద్వారా 2013 నవంబర్ నుండి 2022 జూన్ వరకు వినియోగించబడిన విద్యుత్ వాస్తవానికి సీఎండీలో 80 శాతం కంటే తక్కువగా ఉందని పై పటాలను బట్టి చూడవచ్చు. విశ్వవిద్యాలయం (2022 సెప్టెంబర్ 20) హెచ్‌టీ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న పరికరాలు లేదా భవనాలను నిష్క్రియంగా ఉండటం/స్థాపించక పోవడం మరియు దిగువ వివరించిన ఇతర సంఘటనల కారణంగా ఊహించిన సీఎండీ కంటే తక్కువ వినియోగం జరిగిందని ప్రత్యుత్తరం ఇచ్చింది:-

- అకడమిక్ బ్లాక్-1, పాత ప్రాంగణం, 1,2,3,4 భోజనశాలలు, నీటి నిల్వ ప్రాంతం, ఒక బాలుర వసతి గృహం, ఒక బాలికల వసతి గృహం,అతిథి గృహాల విద్యుత్ అవసరాలను తీర్చడానికి సర్వీస్ నంబర్ సీడీపీ 172 తీసుకోబడింది. రెండు 1500 టన్నుల నీటిని చల్లబరచు యంత్రాలు, ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్లలో ఉన్న 16, 10 హెచ్‌పీ మోటార్లు మరియు అకడమిక్ బ్లాక్-1లో ఎనిమిది మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఒక ఆటో డోర్ ఎలివేటర్ 2013 అక్టోబర్ నుండి పని చేయకపోవడం వల్ల సీడీపీ 172 తక్కువగా వినియోగించబడింది.

- ఏడు కొత్త విద్యా భవనాలు & ప్రయోగశాలలు, విద్యార్థికార్యకలాపాల కేంద్రం (ఎస్ఏసీ), మురుగునీటి శుద్ధి కర్మాగారం (ఎస్టీపీ), నీటి శుద్ధి కర్మాగారం (డబ్ల్యూటీపీ) మరియు కొత్త ఫలహారశాలల విద్యుత్ అవసరాలను తీర్చడానికి సర్వీస్ నంబర్ సీడీపీ 692 తీసుకోబడింది. అకడమిక్ భవనాలు మరియు ఎస్ఏసీ భవనంలోని ల్యాబ్‌లు పూర్తి కాకపోవడంతో సీడీపీ 692 నిరుపయోగంగా ఉంది.
- నాలుగు 25 హెచ్‌పీ మోటార్లు కలిగిన గండి నీటి సరఫరా పథకం యొక్క విద్యుత్ అవసరాలను తీర్చడానికి సర్వీస్ నంబర్ సీడీపీ 233 తీసుకోబడింది. కరోనా కారణంగా తరగతులు 2020 మార్చి నుండి 2021 నవంబర్ వరకు నిర్వహించబడక పోవడం వల్ల తక్కువ వినియోగం జరిగింది. ఇంకా, 2021 నవంబర్లో, పాపాఘ్ని నది భారీ వరదలు సర్వీస్‌ను పూర్తిగా దెబ్బతీశాయి. ఈ సర్వీస్ 2020 మార్చి నుండి ఉపయోగించబడలేదు మరియు ఇది 2022 జూలై నుండి తొలగించబడింది.
- అకడమిక్ బ్లాక్-2, 5-8 భోజనశాలలు, కేంద్ర గ్రంధాలయం, రెండు బాలుర వసతి గృహాలు, రెండు బాలికల వసతి గృహాలు, ప్రయోగశాలల భవనం, వర్క్‌షాప్ మరియు లాండ్రీ యొక్క విద్యుత్ అవసరాలను తీర్చడానికి సర్వీస్ నంబర్ సీడీపీ 264 తీసుకోబడింది. తరగతి గదులు వేరే భవనానికి మార్చబడినందున ఈ సర్వీస్ తక్కువగా ఉపయోగించబడింది.

నాలుగు హెచ్‌టీ కనెక్షన్లకు సంబంధించి వినియోగాన్ని ప్రాథమికంగా అంచనా వేసిన చోట భవనాలు పాక్షికంగా గాని లేదా పూర్తిగా గాని నిర్మించబడలేదు, పరికరాలు కూడా పని చేయలేదు. ఆ విధంగా, సీఎండీలో 80 శాతం కంటే తక్కువ విద్యుత్ వినియోగం ***అనుబంధం 6.1, అనుబంధం 6.2, అనుబంధం 6.3, అనుబంధం 6.4*** లో వివరించినట్లు ₹1.89 కోట్ల అదనపు వ్యయానికి దారితీసినట్లు క్రింద **పట్టిక 6.1** లో సంగ్రహించబడింది:

**పట్టిక 6.1: సీఎండీ కంటే తక్కువ వినియోగం కారణంగా నివారించదగిన వ్యయం యొక్క సారాంశం**

*(విలువ ₹ లలో)*

| హెచ్‌టీ కనెక్షన్ | సీఎండీ | ఖర్చు నివారించగల కాలావధి | నివారించదగిన మొత్తం ఖర్చు | వ్యాఖ్యలు |
|---|---|---|---|---|
| సీడీపీ-172 | 2014 జనవరి వరకు సీఎండీ = 1300 కేవీఏ<br>2014 ఫిబ్రవరి నుండి సీఎండీ = 1000 కేవీఏ | 2013 నవంబర్ – 2020 ఫిబ్రవరి & 2021 డిసెంబర్ – 2022 జూన్ | 1,10,09,419 | 2021 ఫిబ్రవరిలో సౌర పరికరాలను ఏర్పాటు చేసిన తర్వాత నివారించదగిన ఖర్చు-₹ 18,77,699 కూడా ఇందులో ఉంది |
| సీడీపీ-233 | 83 | 2019 మే – 2020 ఫిబ్రవరి & 2021 డిసెంబర్ – 2022 జూన్ | 2,77,686 | |
| సీడీపీ-692 | 1500 | 2019 అక్టోబర్ – 2020 ఫిబ్రవరి & 2021 డిసెంబర్ – 2022 జూన్ | 66,45,014 | 2021 ఫిబ్రవరిలో సౌర పరికరాలను ఏర్పాటు చేసిన తర్వాత నివారించదగిన ఖర్చు-₹38,88,825 కూడా ఇందులో ఉంది. |
| సీడీపీ-264 | 450 | 2019 జనవరి – 2020 ఫిబ్రవరి & 2021 డిసెంబర్ – 2022 జూన్ | 10,17,374 | |
| మొత్తం | | | **1,89,49,493** | |

***గమనిక** : 2020 మార్చి నుండి 2021 వరకు కోవిడ్ మహమ్మారి నెలలు మినహాయించబడ్డాయి.*

హెచ్‌టీ కనెక్షన్ సీడీపీ-692కి సంబంధించి సీఎండీని 1500 కేవీఏ నుండి 1000 కేవీఏకి తగ్గించడాన్ని ఆంధ్రప్రదేశ్ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్‌పీడీసీఎల్) 2021 అక్టోబర్ 14న ఆమోదించినప్పటికీ, కనీస వినియోగ ఛార్జీలు (80 శాతం సీఎండీ) 2021 అక్టోబర్ నుండి 2022 జూన్ వరకు (తొమ్మిది నెలలు) 800 కేవీఏ (అంటే,

1000 కేవీఏలో 80 శాతం)కి బదులుగా 1200 కేవీఏ (అంటే, 1500 కేవీఏలో 80 శాతం) ఛార్జ్ చేయబడింది, ఫలితంగా ₹17,10,000[145] అధికంగా చెల్లించబడింది. ఆ విధంగా, అదనంగా చెల్లించిన ₹17,10,000 మొత్తాన్ని ఏపీఎస్‌పీడీసీఎల్ విశ్వవిద్యాలయానికి వాపసు చేయాల్సి ఉంది.

విశ్వవిద్యాలయంతో, మెస్సర్స్ వర్షిణి ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందని విశ్వవిద్యాలయం (2022 జూలై 5) ప్రత్యుత్తరం ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ నూతన మరియు పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్., (ఎన్ఆర్ఈడీసీఏపీ) విద్యుత్‌పై వ్యయాన్ని తగ్గించడానికి విశ్వవిద్యాలయానికి సమీపంలో 2020 ఆగస్టులో గ్రిడ్ కనెక్ట్ చేయబడిన సోలార్ ప్లాంట్‌ను స్థాపించడానికి మరియు సోలార్ ప్లాంట్‌కు సీఎండీతో 1000 కేవీఏ కంటే తక్కువ కాకుండా హెచ్‌టీ కనెక్షన్‌లు అవసరం పడింది. అందువల్ల, సోలార్ గ్రిడ్‌కు మద్దతుగా హెచ్‌టీ కనెక్షన్‌లు సీడీపీ-172 మరియు సీడీపీ 692, 1000 కేవీఏ యొక్క సీఎండీతో నిర్వహించబడుతున్నాయి. ఇంకా, 2021 ఫిబ్రవరి నుండి అమలులోకి వచ్చే 1000 కేవీఏ హెచ్‌టీ కనెక్షన్‌ల సరఫరా అవసరమయ్యే సోలార్ గ్రిడ్ నుండి విద్యుత్ వినియోగించుకోవడం వల్ల ₹85.62 లక్షలు ఆదా అయిందని విశ్వవిద్యాలయం పేర్కొంది.

హెచ్‌టీ సర్వీస్ కనెక్షన్‌ల సీడీపీ 172 మరియు సీడీపీ 692కి సంబంధించి ఫిబ్రవరి 2021 తర్వాత ఖర్చుల భారం నిరంతరం కొంచెం ఎక్కువ తక్కువగా ఒకే రకంగా (***అనుబంధం 6.1 & అనుబంధం 6.2***) ఉన్నందున సోలార్ గ్రిడ్‌ని ఉపయోగించడం వల్ల పైన పేర్కొన్న విధంగా ఆదా అయిందని చెప్పడం ఆమోదయోగ్యం కాదు.

అందువల్ల, ఉపయోగంలో ఉన్న అన్ని పరికరాలు, భవనాలు మరియు ఇతర అవసరాలను పరిగణనలోకి తీసుకుని సీఎండీని వాస్తవికంగా అంచనా వేయడంలో వైఫల్యంవల్ల, మరియు వినియోగ సరళిని క్రమానుగతంగా సమీక్షించి సీఎండీని తగ్గించాలని అభ్యర్థించక పోవడం వలన చివరికి ₹1.89 కోట్ల అదనపు వినియోగ ఛార్జీలను చెల్లించాల్సి వచ్చింది. ఇది నివారించగలిగిన వ్యయం.

## గిరిజన సంక్షేమ శాఖ

### 6.2 శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గిరిజన సంగ్రహాలయ భవనాల నిర్మాణాన్ని పునఃప్రారంభించకపోవడం వల్ల నిష్ఫలమైన ఖర్చు – ₹75.25 లక్షలు

***రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల కారణంగా నిలిచిపోయిన శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గిరిజన సంగ్రహాలయం భవన నిర్మాణానికి సంబంధించి కన్సల్టెన్సీ సేవలకు ₹34.27 లక్షలు, సివిల్ పనులకు ₹41 లక్షల ఖర్చు నిష్ఫలమైంది.***

విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం కాపులుప్పాడ గ్రామంలో శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గిరిజన సంగ్రహాలయం కోసం విద్య మౌలిక సదుపాయాల గ్రాంట్ కింద ₹15 కోట్ల అంచనా వ్యయంతో భవనాల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (జీఓఏపీ) పరిపాలనా అనుమతులు [146] ఇచ్చింది. తొలుత కాపులుప్పాడ (వి)లోని సర్వే నెం 407లో నాలుగు ఎకరాల స్థలాన్ని భవనాల నిర్మాణానికి కేటాయించారు. తదనంతరం, రివాల్వింగ్ రెస్టారెంట్, యాంఫీథియేటర్ మొదలైన ఇతర ప్రతిపాదిత భాగాల నిర్మాణం కోసం కాపులుప్పాడలోని సర్వే నెం 407/1లో అదనంగా మూడు ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించారు.

గిరిజన సంగ్రహాలయం యొక్క సంభావిత డ్రాయింగ్‌లు, అంచనాలు మరియు డిజైన్‌ల ఖరారు కోసం లేఅవుట్ ప్లాన్‌ను రూపొందించడానికి ప్రభుత్వేతర కన్సల్టెంట్‌ను నియమించడానికి ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) (గిరిజన

145 ₹51,30,000 (1200★475★9) - ₹34,20,000 (800★475★9) = ₹17,10,000

146 జీఓఎంఎస్ సంఖ్య 43 తేదీ 02/07/2015

సంక్షేమం)కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతినిచ్చింది[147] (2015 ఏప్రిల్). దీని ప్రకారం, డిజైన్లను ఖరారు చేయడానికి ఒక కన్సల్టెంట్‌ను[148] నియమించారు. ఒప్పందంలోని 7వ నియమం ప్రకారం, ఆంధ్రా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ డిజైన్లు, ఇంజనీర్ల క్షేత్ర పరిశీలనకు శాఖకు అవసరమైనపుడు ప్రతి దశలో చెల్లించాల్సిన ఒక శాతంతో సహా, సేవలను అందించిన పనులకు సంబంధించిన వాస్తవ ధరలో (స్థాపన ఛార్జీలు మరియు శాఖ నేరుగా చేసిన సేవలకు చెల్లింపులు మినహా) రుసుము 3.5 శాతానికి మించకూడదు. ఒప్పందం యొక్క షరతులను ఉల్లంఘిస్తూ, కన్సల్టెంట్‌కి ఒకేసారి మొత్తం చెల్లింపు చేయడానికి బదులుగా, కన్సల్టెంట్‌కు కన్సల్టెన్సీ ఛార్జీల కోసం శాఖ ₹24,47,813[149]ని రెండు విడతలుగా, అలాగే ₹9,79,200 విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలకు విడిగా చెల్లించారని (2018 డిసెంబర్) గమనించడమైనది.

ఇంకా, శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గిరిజన సంగ్రహాలయ భవనాల నిర్మాణానికి టెండర్ ప్రాతిపదికన అంచనా కాంట్రాక్ట్ విలువ కంటే 16.22 శాతం తక్కువగా నిర్ణీత రెండు సంవత్సరాల సమయం అనగా 2019 అక్టోబర్ 27 లోగా పూర్తి చేసే విధంగా గుత్తేదారుతో[150] ఒప్పందం[151] కుదుర్చుకుంది(2017 అక్టోబర్ 28న). 2019 అక్టోబర్ 27కి ముందు. కేటాయించిన ప్రదేశం కొండపై ఉన్నందున మరియు కన్సల్టెంట్ సూచన మేరకు, అంచనాలో ఉన్న నిబంధనల ప్రకారం అనుకున్న ఎత్తులో కొండను పగలకొట్టడం ద్వారా ఆ ప్రాంతాన్ని చదును చేయాలని నిర్ణయించారు. దీని ప్రకారం, గుత్తేదారు పనిని ప్రారంభించి, నిర్దిష్ట స్థాయికి మట్టిని తీయించారు. అయితే, పని చేస్తున్నప్పుడు, ఒక పెద్ద బండ రాయి ఉన్నట్లు గుర్తించారు. అందుకోసం డీవియేషన్ స్టేట్‌మెంట్‌ను తయారు చేసి ఆమోదం కోసం ఇంజనీర్-ఇన్-చీఫ్ (టీడబ్ల్యూ), విజయవాడకు సమర్పించారు. అర్హత కల అధికారి నుంచి డీవియేషన్‌కు అనుమతి లేకుండా తదుపరి పనులు చేసేందుకు గుత్తేదారు సుముఖంగా లేకపోవడంతో పాడేరు గిరిజన సంక్షేమశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ పేర్కొన్నట్లు, పని పురోగతి సాధించలేక పోవడమే కాకుండా ఒప్పంద గడువుకూడా ముగిసింది. చేసిన తవ్వకం/చదును చేసే పని కోసం గుత్తేదారుకు ₹40,97,772 చెల్లించబడింది (2018 మార్చి).

అంచనా వ్యయంలో 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన అన్ని పనులను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు[152] జారీ చేసింది (2019 మే).

కన్సల్టెన్సీ ఛార్జీల[153] కోసం, 2018 మార్చి 24 నాటికి, ₹34,26,813 ఖర్చు చేయబడింది మరియు సివిల్ పని కోసం గుత్తేదారుకు ₹40,97,772 చెల్లించబడింది. భవన నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదని మరియు అది ఇంకా గ్రౌండ్ లెవల్లోనే ఉందని గమనించబడింది (2022 డిసెంబర్).

ఇంజనీర్-ఇన్-చీఫ్ పనిని పునఃప్రారంభించడం కోసం ప్రభుత్వాన్ని అభ్యర్థించినట్లు (2019 ఆగస్టు & 2022 అక్టోబరు), దీని కోసం ప్రభుత్వ ఉత్తర్వులు ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నట్లు శాఖ ప్రత్యుత్తరం ఇచ్చింది (2022 డిసెంబర్).

ఆ విధంగా, శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గిరిజన సంగ్రహాలయ భవనాల నిర్మాణాన్ని పునఃప్రారంభించక పోవడం వల్ల ₹75.25 లక్షల ఖర్చు నిష్ఫలమైంది.

---

147 మెమో సంఖ్య 9688/టీడబ్ల్యూ జీసీసీ/2014 తేదీ 25/04/2015

148 మిస్టర్ నితీశ్ రాయ్, కన్సల్టెంట్ ఆర్కిటెక్ట్, కోల్‌కతా

149 ₹9,79,200 (2016 సెప్టెంబర్), ₹14,68,613 (2017 అక్టోబర్)

150 మెస్సర్స్ హయగ్రీవ ఇన్ఫ్రా టెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్

151 సర్క్యులర్ ఏజీటీ సంఖ్య 247/2017-18 తేదీ 28/10/2017

152 యూ ఓ నోట్ ఫిన్/01-ఎఫ్ఎంయూ0ఏఎస్‌డీ(డబ్ల్యూఆర్-1)/80/2019 తేదీ 29/05/2019

153 నితీశ్ రాయ్ డిజైన్స్ అండ్ మీడియా, హైదరాబాద్ (₹24,47,813), రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం (₹9,79,000)

## యువజనాభివృద్ధి, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ

## 6.3 భవానీ ద్వీపం వద్ద పక్షుల సమూహ ప్రాంతం, సింహాల పార్కు మరియు సముద్ర క్షీరదాలతో కూడిన కృష్ణా నదీ వన్యప్రాణి ఉద్యానవనం – ₹1.33 కోట్ల నిరుపయోగమైన వ్యయం

***ప్రభుత్వ విధానంలో మార్పు కారణంగా వన్య ప్రాణి ఉద్యానవన అభివృద్ధికి వెచ్చించిన ₹1.33 కోట్ల ఖర్చు నిరుపయోగంగా మారింది.***

భవానీ ద్వీప పర్యాటక సంస్థ (బీఐటీసీ) విజయవాడలోని భవానీ ద్వీపంలో " కృష్ణా నదీ వన్య ప్రాణి ఉద్యానవనం & సముద్ర సింహాలు మరియు సముద్ర క్షీరదాలు' పేరుతో కొత్త సందర్శకులను ఆకర్షించడానికి దీనిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా చేయాలని ప్రతిపాదించింది. ప్రాజెక్ట్ అంచనా వ్యయం ₹10 కోట్లు. టెండర్ విధానాలను అనుసరించి, 2018 మేలో, మెస్సర్స్ ఒక్యానస్ ఆక్వేరియం ఇన్రా ప్రైవేట్ లిమిటెడ్, టర్కీ (ఏజెన్సీ)కి ₹9.99 కోట్లకు ప్రాజెక్ట్ అందించబడింది. అంగీకార లేఖ ప్రకారం (2018 జూన్ 01), **పట్టిక 6.2** లో వివరించిన అంచనాల ప్రకారం ప్రాజెక్ట్ రెండు భాగాలుగా అంటే సేవలు, సంస్థాపన భాగాలుగా చేపట్టాలి.

**పట్టిక 6.2: ప్రాజెక్ట్ యొక్క ప్రతి భాగానికి సంబంధించిన ఒప్పంద విలువ వివరాలు**

*(₹ లక్షల్లో)*

| క్రమ సంఖ్య | వివరం | సేవల భాగం (వివరణాత్మక రూపకల్పన, ప్రాజెక్ట్ నిర్వహణ, ప్రత్యేక సేవలు) | సంస్థాపన భాగం (పక్షులు మరియు జంతువుల సేకరణ, రవాణా మరియు వాతావరణ అలవాటుకు సంబంధించినది) |
|---|---|---|---|
| 1 | పక్షుల సందర్శన ప్రాంతం | 325 | 33.20 |
| 2 | సముద్ర సింహాల ప్రాంతం | 421 | 65.20 |
| 3 | పక్షుల గూళ్ళు | 139 | 15.60 |
| మొత్తం | | **885** | **114.00** |

ఒప్పందంలో ఉన్న తేదీ అనగా 2018 జూన్ 27 నుండి పని ప్రారంభించబడింది.అంగీకార లేఖలో ఉన్న ఒప్పందం యొక్క చెల్లింపు షెడ్యూల్[154] ప్రకారం, ప్రాజెక్ట్ యొక్క వివరణాత్మక డిజైన్లను ఆమోదించిన తర్వాత, బీఐటీసీ ఏజెన్సీకి ₹1.33 కోట్లు[155] ను చెల్లించింది (2019 మే). ఇది మొత్తం సేవలలో[156] 15 శాతానికి సంబంధించినది.

అంగీకార లేఖ చెల్లింపు షెడ్యూల్ (vii) ప్రకారం, సంస్థాపన పనిలో భాగంగా ప్రతిపాదనను ఆమోదించిన తర్వాత 10 శాతం మొబిలైజేషన్ చెల్లింపు చేయాలి. దీని ప్రకారం, ఏజెన్సీ ₹11,40,000 చెల్లింపు కోసం బిల్లును సమర్పించింది (2018 సెప్టెంబర్). కానీ, పనులు మొదలు పెట్టి, అంచనా వేసిన విలువలో 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసినట్లయితే, ఆ పనులను ఆపాలనే ప్రభుత్వ విధానం కారణంగా చెల్లింపుకు ముందే బిల్లు రద్దు చేయబడింది (2019 మే) దీనిని మళ్ళీ సమీక్షించాలి.

అయితే వారికి చెల్లించాల్సిన మొత్తాలు విడుదల కాకపోవడంతో డిజైన్‌లు పూర్తయిన వెంటనే సంస్థాపన భాగాన్ని[157] ఏజెన్సీ ప్రారంభించలేదు. ఇంకా, బీఐటీసీ కూడా పనిని మొదలు పెట్టాలని పట్టుబట్టలేదు. దాంతో ప్రాజెక్ట్ తాత్కాలికంగా[158] ఉపసంహరించబడింది.

---

[154] పనిని మొదలుపెట్టిన తేదీ 2018 జూన్ 27, ఒప్పందం ముగిసే కాలావధి 9 నెలలు

[155] వర్తించే జీఎస్‌టీ తో కలిపి ₹63,15,000 మరియు ₹69,60,000

[156] వివరణాత్మక రూపకల్పన, ప్రాజెక్ట్ నిర్వహణ, ప్రత్యేక సేవలకు ₹8,85,00,000

[157] పక్షులు మరియు జంతువుల సేకరణ, రవాణా మరియు వాతావరణ అలవాటుకు సంబంధించి ₹1,14,00,000

[158] లేఖ సంఖ్య.53/బీఐటీసీ/ఈడీ (పి & ఈ)/వన్యప్రాణుల ఉద్యానవనం /2018, తేదీ 24/07/2019

ప్రాజెక్ట్ కొనసాగింపుపై ధృవీకరించడానికి బీఐటీసీ ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థను కోరింది(2020 డిసెంబర్), అక్కడ నుండి ఎటువంటి ప్రత్యుత్తరం రాలేదు (2023 ఆగస్టు).

ఈ విధంగా, వన్య ప్రాణి ఉద్యానవన అభివృద్ధికి వెచ్చించిన ₹1.33 కోట్లను అర్హత కల అధికార యంత్రాంగం (పర్యాటక శాఖ) సమీక్షించకపోవడం వల్ల నిరుపయోగమయ్యింది.

## రవాణా, రహదారులు & భవనాల శాఖ

### 6.4 ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీల నియమాలను అవలంబించకపోవడం

***ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అద్దె ప్రాతిపదికన ఇచ్చిన బస్సుల కోసం ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీలను వసూలు చేయడంలో విఫలమవడంతో ₹1.66 కోట్ల మేరకు ఆదాయాన్ని కోల్పోయింది. దీని ఫలితంగా ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీలపై వస్తు, సేవల పన్ను విధించకపోవడం వల్ల ప్రభుత్వానికి ₹1.57 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది.***

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్‌టీసీ) కార్యకలాపాల నియమావళి నిబంధనల ప్రకారం, ఏపీఎస్ఆర్‌టీసీ, తీర్థయాత్రలు, వివాహం, విహారయాత్రలు, సమావేశాలు, విజ్ఞాన పర్యటనలు మొదలైన వాటి కోసం ప్రభుత్వ[159]/ప్రభుత్వేతర పార్టీలకు అద్దె ప్రాతిపదికన ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుంది. అద్దె ఛార్జీలు. బస్సులను అద్దెకు తీసుకోవాలనుకునే పార్టీలు సంబంధిత డిపో కార్యనిర్వాహకులకు ముందుగానే వివరాలను[160] సమర్పించాలి. ఏపీఎస్ఆర్‌టీసీ అంచనా మొత్తం (ఈఏ) తో పాటు అందులో 15 శాతం అదనపు ముందస్తు ధరావత్తును[161] కిరాయిదారు నుండి ముందుగానే సేకరిస్తుంది. గుర్తింపు పొందిన విద్యా సంస్థల విద్యార్థులకు అందించే బస్సుల విషయంలో 10 శాతం రాయితీ అనుమతించబడుతుంది. ఇంకా, 2020 మార్చిలో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ప్రత్యేక అద్దె ఛార్జీలపై 18 శాతం జీఎస్‌టీని కిరాయిదారు నుండి వసూలు చేయాలి.

దస్త్రాల పరిశీలనలో దిగువ వివరించిన విధంగా పై నిబంధనలను పాటించని కేసులు వెల్లడయ్యాయి.

(ఎ) తొమ్మిది జిల్లాల[162] నుండి గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మైదానానికి ఒక రాజకీయ పార్టీ[163] నిర్వహించే సర్వసభ్య సమావేశాలకు హాజరయ్యేందుకు (2022 జూలై) ప్రజల రవాణా కోసం 1,823 బస్సుల సరఫరా కోసం ఏపీఎస్ఆర్‌టీసీకి అభ్యర్థన వచ్చింది[164]. పెద్ద సంఖ్యలో బస్సులు బుక్ అయినందున కిరాయిదారు రాయితీని అభ్యర్థించారు. ఏపీఎస్ఆర్‌టీసీ (2022 జూలై) అంచనా మొత్తాన్ని సాధారణ ఛార్జీల రేటుతో ₹3.74 కోట్లుగా[165] లెక్కించింది. సర్వసభ్య సమావేశాలను వైజ్ఞానిక పర్యటనలుగా పరిగణించి అంచనా మొత్తంలో 10 శాతం పొడిగించిన రాయితీతో, సరఫరా చేసిన అవే బస్సులకు ఉపాధ్యక్షులు మరియు కార్యనిర్వాహక సంచాలకులు (వీసీ & ఎండీ) అనుమతినిచ్చారు (2022 జూలై). దీని ప్రకారం, సెషన్ పూర్తయిన తర్వాత కిరాయిదారు (2022 జూలై) ఏపీఎస్ఆర్‌టీసీలో ₹3.38 కోట్ల[166] మొత్తాన్ని డిపాజిట్ చేశారు.

---

159 కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ శాఖలు, రాజకీయ పార్టీలకు

160 పేరు మరియు చిరునామా, అవసరమైన బస్సు రకం, సీటింగ్ సామర్థ్యం, ప్రయాణ తేదీ, దూరం కిలో మీటర్లలో

161 కార్యక్రమం పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించబడుతుంది

162 పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం మరియు నెల్లూరు

163 యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ, ఒక ప్రాంతీయ రాజకీయ పార్టీ

164 కార్యకలాపాల మాన్యువల్ ప్రకారం తేదీ, వివరాలు లేకుండా

165 అంచనా మొత్తం ₹3.61 కోట్లు+ ₹0.13 కోట్లు

166 అంచనా మొత్తం ₹3.61 కోట్లు – ₹3.61 కోట్లపై 10 శాతం రాయితీ + ₹0.13 కోట్ల టోల్ ఛార్జీలు

(బి) అదేవిధంగా, మరొక సందర్భంలో, విజయవాడలో నిర్వహించే ఎన్నుకోబడిన మరియు నామినేటెడ్ ప్రతినిధులచే నిర్వహించబడే వెనుకబడిన తరగతుల మహాసభలకు హాజరయ్యేందుకు 1,439 బస్సులను సరఫరా చేయాలని ఏపీఎస్ఆర్టీసీ సంబంధిత జిల్లాల జిల్లా అధికారుల నుండి అభ్యర్థనను అందుకుంది (2022 డిసెంబర్). సమావేశం పూర్తయిన తర్వాత రవాణా ఛార్జీలు చెల్లిస్తామని జిల్లా యంత్రాంగం తెలియజేసింది. దీని ప్రకారం, ఏపీఎస్ఆర్టీసీ బస్సులను సరఫరా చేసింది, అయితే ఆడిట్ సూచించగా ఈ ₹3.99 కోట్ల రవాణా ఛార్జీలను వసూలు చేసింది (2023 మార్చి).

ఏపీఎస్ఆర్టీసీ, కార్యకలాపాల నిబంధనావళి నిబంధనలకు విరుద్ధంగా, ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీలు మరియు కిరాయిదారు నుండి కార్యక్రమ వివరాలను ముందుగానే తెలుసుకోకుండా బస్సులను సరఫరా చేసినట్లు ఆడిట్ గుర్తించింది. ఇంకా, ప్రత్యేక అద్దె ఛార్జీల కింద వర్తించే విధంగా ఛార్జీలను నిర్ణయించి వసూలు చేయడానికి బదులుగా, ఏపీఎస్ఆర్టీసీ సాధారణ ఛార్జీలను వసూలు చేసింది. మొదటి సందర్భంలో, ఏపీఎస్ఆర్టీసీ రాజకీయ పార్టీ సర్వసభ్య సమావేశాన్ని వైజ్ఞానిక పర్యటనగా పరిగణించి అంచనా మొత్తంపై 10 శాతం రాయితీని అందచేసింది, ఇది సరైనది/సమర్థించదగినది కాదు. ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీల నిబంధనలను ఆమోదించకపోవడం, దిగువ వివరించిన విధంగా రెండు సందర్భాల్లోనూ అద్దె ఛార్జీలు తక్కువగా వసూలు చేయడానికి దారితీసింది. ఇంకా, 18 శాతం చొప్పున వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కూడా కిరాయిదారుపై విధించబడలేదు.

**పట్టిక 6.3: ప్రత్యేక అద్దె ఛార్జీలు, జీఎస్టీ చార్జీల వివరాలను చూపే పట్టిక**

*(₹ కోట్లలో)*

| బస్సులు సరఫరా చేయబడిన సమావేశాల వివరాలు | నిబంధనల ప్రకారం వసూలు చేయాల్సిన ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీలు | ఏపీఎస్ఆర్టీసీచే వసూలు చేయబడిన మొత్తం | వ్యత్యాసం (తక్కువగా సేకరించడం మూలంగా రాబడి నష్టం) | అద్దె ఛార్జీలపై వసూలు చేయని 18 శాతం జీఎస్టీ |
|---|---|---|---|---|
| ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణం, గుంటూరులో సర్వసభ్య సమావేశాలు (2022 జూలై) | 4.13[167] | 3.38 | 0.75 | 0.72[9] |
| విజయవాడలో వెనుకబడిన వర్గాల మహాసభ (2022 డిసెంబర్) | 4.90[168] (ఆడిట్ లెక్కించిన వివరణ ***అనుబంధం 6.5*** లో ఇవ్వబడింది) | 3.99 | 0.91 | 0.85[10] |
| మొత్తం | **9.03** | **7.37** | **1.66** | **1.57** |

100 శాతం ఆక్యుపెన్సీ చొప్పున కిలోమీటరుకు వసూలు చేయాల్సిన మొత్తంపై ప్రత్యేక కేసుగా బస్సులు సరఫరా చేయబడ్డాయి. 2022 జూన్‌లో ఏపీఎస్ఆర్టీసీ సగటు ఆక్యుపెన్సీ 77.37 శాతంగా ఉంది, ప్రతి కిలోమీటరుకు రాబడి (ఈపీకే) ₹38.34, కాబట్టి మొదటి సందర్భంలో ప్రతి కిలోమీటరుకు ₹49.67 రాబడితో 90 శాతం ఆక్యుపెన్సీని గుర్తించడం సహేతుకమైనది. అదే విధంగా రెండవ సందర్భంలో, 2022 నవంబర్‌కి సంబంధించి ఏపీఎస్ఆర్టీసీ యొక్క రాబడి ప్రతి కిలోమీటరుకు ₹36.42, కాబట్టి ప్రతి కిలోమీటరుకు ₹38.31 రాబడిని పరిగణనలోకి తీసుకోవడం సహేతుకమైనది. ఇంకా, కండక్టర్లు లేకుండా బస్సులు నడపడం వల్ల ప్రతి కిలోమీటరుకు ₹8/- వరకు ఖర్చును నివారించడం ద్వారా 10 శాతం రాయితీని మంజూరు చేయడం సమర్థనీయం. ఏపీఎస్ఆర్టీసీ బస్సులను సరఫరా చేయకపోతే, కిరాయిదారులు ప్రభుత్వేతర బస్సులతో సహా ఇతర రవాణా మార్గాల కోసం వెళ్లినట్లయితే ఏపీఎస్ఆర్టీసీ ₹7.37 కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశాన్ని కోల్పోయేది. ప్రత్యేక అద్దె ప్రాతిపదికన బస్సులు నడపకపోవడంతో జీఎస్టీ వసూలు చేయలేదని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2023 అక్టోబర్).

167 ప్రత్యేక అద్దె ఛార్జీలు: ₹4.00 కోట్లు, టోల్ ఛార్జీలు: ₹0.13 కోట్లు; ప్రత్యేక అద్దె ఛార్జీలపై జీఎస్టీ: ₹4.00★0.18=₹ 0.72 కోట్లు

168 ప్రత్యేక అద్దె ఛార్జీలు: ₹4.74 కోట్లు, టోల్ ఛార్జీలు: ₹0.15 కోట్లు; ప్రత్యేక అద్దె ఛార్జీలపై జీఎస్టీ: ₹4.74★0.18=₹0.85 కోట్లు

ప్రత్యుత్తరం సమర్థించదగినది కాదు, ఎందుకంటే సమావేశాల ప్రయోజనం కోసం ప్రభుత్వేతర పార్టీలకు బస్సుల సరఫరా ప్రత్యేక అద్దె ఛార్జీల క్రింద నిర్ణయించిన ఛార్జీల ప్రకారం వసూలు చేయాలి, వైజ్ఞానిక పర్యటనగా పరిగణించి సర్వసభ్య సమావేశానికి మరింత రాయితీ ఇవ్వడం నిబంధనల ప్రకారం సరియైనది కాదు. కార్యకలాపాల నిబంధనావళి నియామక స్వభావాన్ని (ప్రత్యేక అద్దె ఛార్జీలు సాధారణ అద్దె ఛార్జీలకు) మార్చే అధికారం వీసీ & ఎండీకి కల్పించిన ఆర్థిక అధికారాల ప్రకారం లేదు. రెండో కేసుకు సంబంధించిన రికార్డులో ప్రభుత్వ ఆదేశాలకు మద్దతుగా ఎలాంటి ఆధారాలు దస్త్రాలలో లేవు. ఇంకా, ప్రభుత్వేతర పార్టీలు రవాణా వాహనాలను అద్దెకు తీసుకున్నపుడు జీఎస్టీ విధించబడుతుంది.

ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీల నిబంధనలను పాటించకపోవడంతో, ఏపీఎస్ఆర్టీసీ ₹1.66 కోట్ల మేరకు ఆదాయాన్ని కోల్పోయింది. దీని ఫలితంగా ప్రత్యేక అద్దె బస్సు ఛార్జీలపై వస్తు, సేవల పన్ను విధించకపోవడం వల్ల ప్రభుత్వానికి ₹1.57 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది.

## 6.5 ప్రమాద పరిహార క్లెయిమ్‌లను రికవరీ చేయకపోవడం

***ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో డిపాజిట్ చేసిన ₹1.58 కోట్ల కోసం అద్దె బస్సు యజమానుల నుండి ప్రమాద పరిహారం క్లెయిమ్‌ను రికవరీ చేయడానికి ఒప్పంద నిబంధనలను అమలు చేయలేదు. రికవరీ చేయకపోవడం వల్ల ₹0.76 కోట్ల వడ్డీని కోల్పోయింది.***

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ), సొంత బస్సులతో పాటు, అద్దె బస్సుల యజమానులతో ప్రామాణిక ఒప్పందాన్ని అమలు చేస్తూ అద్దె[169] ప్రాతిపదికన బస్సులను నడుపుతుంది.

ఒప్పంద నిబంధనల[170] ప్రకారం, "మోటారు వాహన చట్టం, 1988 నిబంధనల ప్రకారం ప్రమాదాల కారణంగా తలెత్తే అన్ని క్లెయిమ్‌లకు[171] అద్దె బస్సు యజమాని చెల్లింపుల బాధ్యత వహించాలి. ప్రమాదాలకు సంబంధించి మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (ఎంఏసీటీ) ద్వారా అందించబడే నష్టపరిహారాన్ని చెల్లించడానికి, ఏపీఎస్ఆర్టీసీ ఎటువంటి పరిస్థితుల్లోనూ బాధ్యత వహించదు. ఏపీఎస్ఆర్టీసీ అద్దె బస్సు ప్రమాదాల ద్వారా గాయపడిన వ్యక్తులు లేదా మరణించిన వ్యక్తులపై ఆధారపడిన వారికి లేదా దెబ్బతిన్న ఆస్తి యొక్క యాజమానులకు నష్టపరిహారం చెల్లించే సందర్భంలో, బస్సులను అద్దెకు తీసుకోవడానికి ప్రమాదానికి సంబంధించిన కేసులలో ఎంఏసీటీ/కోర్టు యొక్క ఏదైనా అవార్డ్ ద్వారా, ఏపీఎస్ఆర్టీసీకి అద్దె బస్సు యజమాని నుండి పేర్కొన్న పరిహారాన్ని తిరిగి పొందే హక్కు ఉంటుంది".

89 అద్దె బస్సు ప్రమాద కేసులకు సంబంధించి, గాయపడినవారు లేక మరణించిన వారిపై ఆధారపడినవారు లేదా దెబ్బతిన్న ఆస్తి యజమానులు ఎంఏసీటీలో అప్పీల్ చేసి (1999-2018) ₹4.58 కోట్లు పరిహారంగా క్లెయిమ్ చేసినట్లు ఆడిట్ గుర్తించింది. ఏపీఎస్ఆర్టీసీ ద్వారా చెల్లింపుల కొరకు ఎంఏసీటీ (2006-2020 సమయంలో) ₹2.99 కోట్ల పరిహారాన్ని అందించింది. ఎంఏసీటీ అవార్డుకు వ్యతిరేకంగా, ఏపీఎస్ఆర్టీసీ స్టే ఆర్డర్‌ల కోసం గౌరవనీయమైన హైకోర్టులో అప్పీల్ చేసింది (2006 ఫిబ్రవరి నుండి 2020 ఫిబ్రవరి వరకు). ఇంకా ఎంఏసీటీలో ₹1.18 కోట్లు డిపాజిట్[172] చేసింది. ఈ వ్యవహారం ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం లేకుండా గౌరవ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది.

[169] 2022 జూన్ నాటికి, ఏపీఎస్ఆర్టీసీ 2,224 బస్సులను అద్దెకు తీసుకుంది

[170] అద్దె బస్సు యాజమానుల చట్టబద్ధమైన బాధ్యతలు

[171] అద్దె బస్సు యజమాని చెల్లించిన సమగ్ర బీమా ప్రీమియం యొక్క వాస్తవ ధరను ఏపీఎస్ఆర్టీసీ తిరిగి చెల్లిస్తుంది లేదా సులభతరం చేస్తుంది

[172] మోటారు వాహన చట్టం, 1988లోని సెక్షన్ 173 జమ చేసిన మొత్తంలో 50 శాతం లేదా ₹25,000 ఏది తక్కువగా ఉంటే అది డిపాజిట్ చేయాలని నిర్దేశించింది

పైన పేర్కొన్న వాటికి అదనంగా, ఏపీఎస్ఆర్టీసీ ఖాతాలలో (2022 మార్చి నాటికి), ₹0.40 కోట్లు[173] (***అనుబంధం 6.6*** లో వివరించినట్లు) ఎంఏసీటీకి చెల్లించి[174], దాని నుండి తిరిగి పొందగలిగే మొత్తంగా చూపబడింది. ఏపీఎస్ఆర్టీసీ వద్ద అద్దె వాహనం నంబర్, అద్దె బస్సు యజమాని పేరు మరియు యజమాని ఆధార్ వివరాలు లేనందున రికవరీ సాధ్యం కాలేదు.

ఇటువంటి ఒక సందర్భంలో, గౌరవ సుప్రీం కోర్టు "ఎంఏసీటీ ద్వారా అందించబడిన మొత్తాన్ని బీమా కంపెనీ మాత్రమే చెల్లించాలి" అని సూచించింది/ఆదేశించింది[175] (2020 జూన్). ఇంకా, కోర్టు యొక్క ఏదైనా ఉత్తర్వుకు లోబడి రోడ్డు రవాణా సంస్థ (కార్పొరేషన్) ఏదైనా చెల్లింపు చేసినట్లయితే, దానిని తిరిగి పొందేందుకు కార్పొరేషన్‌కు అధికారం ఉంటుందని కూడా ఆదేశించింది. అందువల్ల, అద్దె బస్సు ప్రమాదాల విషయంలో బీమా కంపెనీ నష్టపరిహారాన్ని చెల్లించవలసి ఉంటుంది.

అద్దె బస్సు యజమానుల నుండి ఏపీఎస్ఆర్టీసీ చెల్లించిన పరిహారం మొత్తాలను వసూలు చేయడానికి ఒప్పంద నిబంధనలు పేర్కొన్నప్పటికీ, అద్దె బస్సు యజమానుల నుండి డిపాజిట్ చేసిన ₹1.18 కోట్ల మొత్తాన్ని రికవరీ చేయడానికి ఏపీఎస్ఆర్టీసీ ఎటువంటి చర్యను ప్రారంభించలేదు. దీని ఫలితంగా, ఏపీఎస్ఆర్టీసీ ₹ 0.76 కోట్ల వడ్డీ (***అనుబంధం 6.7*** లో వివరించినట్లు) కోల్పోయింది. ఇంకా, గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, బీమా కంపెనీ ఇప్పటికే ఏపీఎస్ఆర్టీసీ, ఎంఏసీటీకి జమ చేసిన మొత్తాన్ని ఏపీఎస్ఆర్టీసీ నుండి క్లెయిమ్‌ల రసీదుపై ఏపీఎస్ఆర్టీసీకి చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లోక్ అదాలత్ తీర్పును వెలువరించింది (2022 నవంబర్).

అద్దె బస్సు యజమానుల నుండి ₹0.40 కోట్ల పరిహారం మొత్తాన్ని రికవరీ చేయాలని కార్యకలాపాల విభాగం యూనిట్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసిందని, ₹1.18 కోట్ల రికవరీకి సంబంధించి, గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ విషయాన్ని గౌరవ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లామనీ, తదనుగుణంగా జాతీయ లోక్ అదాలత్ జోక్యంతో బీమా కంపెనీల్లో ఒకటి[176] 15 కేసులను పరిష్కరించిందని (2022 నవంబర్), ఇంకా, ఇతర బీమా కంపెనీలు కేసులను పరిష్కరించడానికి సమయం తీసుకుంటున్నాయని ఏపీఎస్ఆర్టీసీ బదులిచ్చింది (2023 ఫిబ్రవరి).

సమాధానం ఆమోదయోగ్యం కాదు. తిరిగి వసూలు చేయాల్సిన అద్దె బస్సు యజమానుల వివరాలు ఏపీఎస్ఆర్టీసీ వద్ద లేనందున ₹0.40 కోట్లను తిరిగి పొందే అవకాశం సుదూరంగా కనిపిస్తుంది. 15 కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నప్పటికీ, ఏపీఎస్ఆర్టీసీ బీమా కంపెనీ నుండి దామాషా ప్రకారం డిపాజిట్ చేసిన పరిహారం మొత్తాన్ని అందుకోలేదు మరియు ఇప్పటి వరకు అద్దె బస్సు యజమానుల నుండి ₹1.18 కోట్లు తిరిగి పొందలేదు.

ఒప్పంద షరతులను అమలు చేయకపోవడం, ఏపీఎస్ఆర్టీసీ యొక్క అలసత్వం కారణంగా, అద్దె బస్సు యజమానుల నుండి ₹1.58 కోట్ల[177] మొత్తం తిరిగి రాబట్టలేదు, ఫలితంగా ₹0.76 కోట్ల వడ్డీని కోల్పోవలసి వచ్చింది.

---

173 అకౌంటింగ్ హెడ్ 2456: "అద్దె బస్సుల కోసం చెల్లించిన ఎంఏసీటీ – తిరిగి పొందదగినది" క్రింద ఖాతాలలో (మార్చి 2022 నాటికి) ప్రతిబింబించినట్లు

174 2017-18కి ముందు చెల్లించిన ₹20.21 లక్షలు మరియు 2018-19 నుండి 2021-22 వరకు చెల్లించిన ₹19.81 లక్షలు

175 ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, శ్రీమతి రాజేందరి దేవి మరియు ఇతరుల మధ్య 2020 సివిల్ అప్పీల్ నంబర్ 2526

176 మెస్సర్స్ న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ (ఎన్ఐఏసీ)

177 ₹1.19 కోట్లు + ₹0.40 కోట్లు

## 6.6 కాంపౌండింగ్ రుసుమును తక్కువగా విధించడం లేదా అసలు విధించక పోవడం

***వాహన తనిఖీ నివేదికల (వీసీఆర్) లో నివేదించబడిన నేరాలకు కాంపౌండింగ్ రుసుము యొక్క పెంచిన రేట్లు విధించబడనందున మరియు మోటారు వాహన చట్టం, 1988 ప్రకారం తనిఖీ అధికారులు వాహన తనిఖీ నివేదికలను సంబంధిత రోడ్డు రవాణా అధికారులకు పంపించకపోవడం వలన ₹13.16 కోట్ల వరకు కాంపౌండింగ్ రుసుము తక్కువగా పొందింది/అసలు పొందలేదు.***

మోటారు వాహనాల (ఎంవీ) చట్టం, 1988లోని సెక్షన్ 200 ప్రకారం, అంచనా అధికారులు ప్రభుత్వం సూచించిన విధంగా శిక్షలకు బదులుగా కాంపౌండింగ్ రుసుమును వసూలు చేయడం ద్వారా శిక్షార్హమైన కొన్ని నేరాలను ఈ చట్టం కింద సమ్మిళితం చేయవచ్చు. ప్రభుత్వం, తన ఆదేశం సంఖ్య (రవాణా, రహదారులు, భవనాల శాఖ (టీఆర్ 1) జీఓఎంఎస్ సంఖ్య 108, తేదీ 2011 ఆగస్ట్ 18) లో వివిధ నేరాలకు కనీస కాంపౌండింగ్ రుసుములను నిర్దేశించింది, వీటిని 2020 అక్టోబర్[178] నుండి పెంచారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సహాయక మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ కంటే తక్కువ స్థాయి రవాణా శాఖ అధికారులు కాంపౌండింగ్ నేరాలకు[179] రుసుములు విధించకూడదు.

రవాణా శాఖ తనిఖీ అధికారులు వారు తనిఖీ చేసిన మోటారు వాహనాలపై వాహన తనిఖీ నివేదికలు (వీసీఆర్‌లు) తయారు చేస్తారు మరియు ఒకవేళ, కాంపౌండింగ్ రుసుము వసూలు చేయకపోతే, సంబంధిత రుసుములు చెల్లించని వాహనాల అనుమతి కలవారు/యజమానులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి సంబంధిత ప్రాంతీయ రవాణా అధికారులకు (ఆర్‌టీఏ) పంపిస్తారు.

రవాణా కమీషనర్ (టీసీ), 10 ఉప రవాణా కమీషనర్ (డీటీసీలు)[180] కార్యాలయాల దస్త్రాల పరిశీలన మరియు సమాచార విశ్లేషణలో ఈ క్రింది విషయాలు వెల్లడయ్యాయి.

(ఎ) ఆరు డీటీసీలలో[181], 2022 మార్చి నాటికి వివిధ నేరాలకు సంబంధించి 4,445 కేసులు (2020 ఏప్రిల్ నుండి 2022 మార్చి మధ్య) నమోదయ్యాయి. ఈ సందర్భాలలో, కాంపౌండింగ్ రుసుము ముందుగా సవరించిన రేట్ల ప్రకారం (2011 ఆగస్టులో నిర్ణయించబడింది) తక్కువ ధరలకు విధించబడిందని ఆడిట్ గుర్తించింది. 2020 అక్టోబరులో నిర్ణయించిన విధంగా పెంచిన ధరలకు బదులుగా. వీసీఆర్‌లు సంబంధిత ఆర్‌టీఏలకు పంపబడినప్పటికీ, సవరించిన కాంపౌండింగ్ రుసుమును తిరిగి వసూలు చేయడానికి చర్యలు ప్రారంభించబడలేదు. దీని ఫలితంగా ***అనుబంధం 6.8*** లో వివరించిన విధంగా కాంపౌండింగ్ రుసుము ₹6.47 కోట్ల మేర తక్కువగా వసూలు అయింది.

(బి) 10 డీటీసీలలో[182], 2022 మార్చి నాటికి వివిధ నేరాలకు సంబంధించి 25,002 కేసులు (2020 ఏప్రిల్ నుండి 2022 మార్చి మధ్య) నమోదయ్యాయి. వీసీఆర్‌లను సంబంధిత ఆర్‌టీఏలకు పంపని కారణంగా వర్తించే రేట్ల వద్ద కాంపౌండింగ్ రుసుమువసూలు చేసినట్లు ఆడిట్ గుర్తించింది. దీని ఫలితంగా ***అనుబంధం 6.9*** లో వివరించిన విధంగా ₹6.36 కోట్ల విలువైన కాంపౌండింగ్ రుసుము విధించబడలేదు, వసూలు కాలేదు.

[178] జీఓఎంఎస్ సంఖ్య 21, రవాణా రహదారులు & భవనాల (టీఆర్-I) విభాగం, తేదీ 21/10/2020. చేసిన నేరాలను బట్టి కనీసం ₹150 నుండి అత్యధికంగా ₹20,000 వరకు పెంచబడింది

[179] పరిమితిని మించి బరువును వేయడం, డ్రైవింగ్ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ సమర్పించలేకపోవడం, పరిమితిని మించి ఎక్కువ మంది ప్రయాణికులను తీసుకెళ్లడం, మోటారు వాహనాన్ని మార్చడం మరియు ప్రమాదకరంగా వాహనాన్ని నడపడం మొదలైనవాటి కొరకు

[180] ఉప రవాణా కమీషనర్లు: అనంతపురము, చిత్తూరు, ఏలూరు, గుంటూరు,కాకినాడ, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం

[181] ఉప రవాణా కమీషనర్లు: అనంతపురము, చిత్తూరు, ఏలూరు, గుంటూరు,కాకినాడ, నెల్లూరు

[182] ఉప రవాణా కమీషనర్లు: అనంతపురము, చిత్తూరు, ఏలూరు, గుంటూరు,కాకినాడ, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం

(సి) నాలుగు డీటీసీలలో[183], మోటారు వాహనాల చట్టం, 1988లోని సెక్షన్ 196 (ఎ) ప్రకారం "బీమా ప్రమాణపత్రం లేకుండా వాహనాలు నడపడం" కింద 2022 మార్చి నాటికి 692 కేసులు (2021 ఏప్రిల్ నుండి 2022 మార్చి మధ్య) నమోదయ్యాయి. ఈ సందర్భాలలో, రెండవ మరియు తదుపరి నేరాలలో, 2020 అక్టోబర్లో నిర్ణయించిన విధంగా పెంచిన రేట్లకు[184] బదులుగా తక్కువ ధరలకు కాంపౌండింగ్ రుసుము విధించబడిందని ఆడిట్ గుర్తించింది. వీసీఆర్‌లను సంబంధిత ఆర్‌టీఏలకు పంపినప్పటికీ, కాంపౌండింగ్ రుసుమును వసూలు చేయడానికి చర్యలు ప్రారంభించలేదు. దీని ఫలితంగా ***అనుబంధం 6.10*** లో వివరించిన విధంగా కాంపౌండింగ్ రుసుము ₹0.14 కోట్ల మేర తక్కువగా వసూలైంది.

(డి) ఎనిమిది డీటీసీలలో[185], 2022 మార్చి నాటికి 1,620 కేసులు (2019 ఏప్రిల్ నుండి 2022 మార్చి మధ్య) నమోదయ్యాయి, ఇవి ఈ విషయంలో జారీ చేయబడిన ప్రభుత్వ ఉత్తర్వు (2008 నవంబర్) [186]తో సహా మోటారు వాహనాల చట్టం 1988లోని సెక్షన్ 86(5) కిందకు వస్తాయి.

పైన పేర్కొన్న ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం, "పన్ను చెల్లించకుండా"[187] తిరిగే మోటారు వాహనాల అనుమతి రద్దు లేదా తాత్కాలిక రద్దును నిరోధించడానికి కాంపౌండింగ్ రుసుము చెల్లించవలసి ఉంటుంది.

వీసీఆర్‌ల పరిశీలనలో ప్రభుత్వ ఉత్తర్వులో పైన పేర్కొన్న రేట్ల కంటే తక్కువ ధరలకు కాంపౌండింగ్ రుసుమును విధించినట్లు వెల్లడైంది. ఇది ***అనుబంధం 6.11*** లో వివరించిన విధంగా కాంపౌండింగ్ రుసుము ₹0.19 కోట్ల మేరకు తక్కువ వసూలుకి దారితీసింది.

దీనికి ప్రతిస్పందిస్తూ, ఏలూరు, చిత్తూరు మరియు కాకినాడ డీటీసీలు (2023 జూలై/సెప్టెంబర్) నమోదైన కేసులపై శాఖ చర్యలు ప్రారంభించిందని మరియు కొంతమంది వాహనాల యజమానుల నుండి కాంపౌండింగ్ రుసుము వ్యత్యాసాన్ని వసూలు చేసిందని బదులిచ్చారు. ఇతర డీటీసీల నుండి సమాధానం ఇంకా అందలేదు. ఆ విధంగా, ₹13.16 కోట్ల మేర కాంపౌండింగ్ రుసుము తక్కువగా/అసలు వసూలు కాకుండా ఖజానాకు నష్టం వాటిల్లినట్లు గుర్తించబడింది.

ఖజానాకు నష్టం కలిగించే విధంగా ఆదాయాన్ని తక్కువ వసూలు చేయడం/వసూలు చేయకపోవడాన్ని నివారించేటట్లు కాంపౌండింగ్ రుసుమును పెంచినప్పుడల్లా ఆన్లైన్ వ్యవస్థలో నవీకరణ జరగకపోవడాన్ని పైన పేర్కొన్న లోపాలు/అనుసరించిన విధానం సూచిస్తుంది. రవాణా శాఖ ఆన్‌లైన్ సిస్టమ్/సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు నవీకరణ చేయాలి, తద్వారా ఆదాయాన్ని సత్వరమే పొందవచ్చు.

---

183 ఉప రవాణా కమీషనర్లు, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, నెల్లూరు

184 ₹4,000 కి బదులుగా ₹2,000

185 జిల్లా రవాణా కమీషనర్లు: అనంతపురము, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, నెల్లూరు, విజయవాడ

186 జీఓఎంఎస్ సంఖ్య 332, రవాణా ఆర్ & బీ (టీఆర్-I) తేదీ 13.11.2008

187 13 కంటే ఎక్కువ సీట్ల సామర్థ్యం ఉన్న విద్యా సంస్థ బస్సులు ₹ 2500, మోటార్ క్యాబ్ ₹1,000, 13 సీట్ల కంటే ఎక్కువ సీట్ల సామర్థ్యం ఉన్న ప్రభుత్వేతర సేవల వాహనాలు ₹1,250 మరియు 13 సీట్ల కంటే ఎక్కువ ఉన్న కాంట్రాక్ట్ క్యారేజీ ₹2,500 చెల్లించాలి

## 6.7 ఫిట్‌నెస్ ప్రమాణపత్రాల పునరుద్ధరణపై పర్యవేక్షణ లేకపోవడం

***రవాణా వాహనాల ఫిట్‌నెస్ ప్రమాణపత్రాల పునరుద్ధరణను రవాణా శాఖ పర్యవేక్షించలేదు. ఫలితంగా ఫిట్‌నెస్ రుసుము ₹1.45 కోట్లను పొందకపోవడమే కాకుండా రోడ్డు భద్రతకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది***

వాహనాల (ఎంవీ) చట్టం, 1988 లోని సెక్షన్ 56, రవాణా వాహనం యొక్క రిజిస్ట్రేషన్ చెల్లుబాటు కావాలంటే నిర్ణీత అధికారం ద్వారా జారీ చేయబడిన ఫిట్‌నెస్ ప్రమాణపత్రం (ఎఫ్‌సీ)ని కలిగి ఉండాలని నిర్దేశిస్తుంది. కేంద్ర మోటారు వాహనాల (సీఎంవీ) నియమాలు, 1989 లోని 62వ నియమం ప్రకారం, రవాణా వాహనాలకు సంబంధించి ఫిట్‌నెస్ ప్రమాణపత్రం ప్రతి సంవత్సరం పునరుద్ధరించబడుతుంది.

సీఎంవీ నియమాలలోని 81వ నియమం, రవాణా వాహనాల నుండి ఫిట్‌నెస్ ప్రమాణపత్రం మంజూరు లేదా పునరుద్ధరణ కోసం వసూలు చేయవలసిన రుసుమును నిర్దేశిస్తుంది. రవాణా శాఖ సీఎంవీ నియమాలు, 1989 లోని 81వ నియమం కింద సవరణలు[188] చేసింది మరియు తదనుగుణంగా ఫిట్‌నెస్ ప్రమాణపత్రం మంజూరు లేదా పునరుద్ధరణ కోసం వాహనం యొక్క పరీక్ష నిర్వహణ రుసుమును సవరించింది (2017 జనవరి).

2021-22 కాలానికి రవాణా కమీషనర్ మరియు ఐదు డీటీసీలు[189] అందించిన సమాచార విశ్లేషణలో 24,183 రవాణా వాహనాలకు సంబంధించి ఫిట్‌నెస్ ప్రమాణపత్రాల చెల్లుబాటు, శాఖ సమాచార నిధిలో 'వాడుకలో ఉన్న' ట్లుగా చూపబడినప్పటికీ, వాటి స్థితి గడువు ముగియగా పునరుద్ధరించబడలేదని కూడా తెలిపింది. దీని ఫలితంగా ***అనుబంధం 6.12*** లో వివరించిన విధంగా, ఫిట్‌నెస్ ప్రమాణపత్రం రుసుము ₹1.45 కోట్లను రాబట్టలేకపోయింది. ఫిట్‌నెస్ ప్రమాణపత్రాలు లేని వాహనాలను అనుమతించడం వల్ల ఆదాయం ప్రభావితం కావడమే కాకుండా రహదారి భద్రత మరియు పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది.

ప్రతిస్పందనగా, 625 వాహనాలలో, 41 వాహనాల యజమానులు ఫిట్‌నెస్ ప్రమాణపత్రం రుసుము చెల్లించారని డీటీసీ కాకినాడ పేర్కొనగా (2023 సెప్టెంబర్), మిగిలిన కేసులలో నమోదు కాబడిన యజమానులను ఫిట్‌నెస్ ప్రమాణపత్ర పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేయమని శాఖ బలవంతం చేయలేదని డీటీసీ కాకినాడ, డీటీసీ ఏలూరు బదులిచ్చారు (2023 ఆగస్టు). రవాణా వాహనాల యొక్క నమోదిత యజమాని ఏదైనా లావాదేవీ కోసం కార్యాలయాన్ని సంప్రదించినప్పుడు, అటువంటి వాహనాలు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ ప్రమాణపత్రాన్ని కలిగి ఉండకపోతే ఎటువంటి దరఖాస్తును స్వీకరించమని డీటీసీ, చిత్తూరు జవాబిచ్చారు (2023 జూలై). రవాణా వాహనాల యజమాని నుండి ఫిట్‌నెస్ ప్రమాణపత్ర రుసుమును స్వచ్ఛందంగా వసూలు చేసినప్పటికీ, ఫిట్‌నెస్ ప్రమాణపత్రం లేకుండా తిరుగుతున్న రవాణా వాహనాలను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇతర డీటీసీల నుండి సమాధానాలు ఇంకా అందవలసి ఉంది.

ఎంవీ చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం శాఖ యొక్క వాదన సమర్థనీయం కాదు, ఫిట్‌నెస్ ప్రమాణపత్రాలను పునరుద్ధరించడం తప్పనిసరి. ఇంకా, రవాణా వాహనాలకు సంబంధించి ఫిట్‌నెస్ ప్రమాణపత్రాలను ప్రతి సంవత్సరం పునరుద్ధరించాలని సీఎంవీ నియమాలలోని 62వ నియమం నిర్దేశిస్తుంది. ఫిట్‌నెస్ ప్రమాణపత్రాల పునరుద్ధరణ మరియు ఫిట్‌నెస్ ప్రమాణపత్ర రుసుము రాబట్టడం కోసం ఆన్‌లైన్ సిస్టమ్ ఫీజుల సవరణ జరిగినప్పుడు పర్యవేక్షించబడలేదని/నవీకరణ చేయబడలేదని పైన పేర్కొన్న లోపాలు సూచిస్తున్నాయి. ఇది ఖజానాకు నష్టం కలిగిస్తూ ఆదాయ వసూలును అడ్డుకుంటుంది. ఇలా, ఈ 'వాడుకలో ఉన్న' వాహనాల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయడంలో శాఖ వైఫల్యం ఫిట్‌నెస్ రుసుము వసూలు కాకపోవడానికి దారితీసింది.

---

188 సర్క్యులర్ మెమో సంఖ్య 81/ఆర్/2017 తేదీ 12/01/2017

189 ఉప రవాణా కమీషనర్లు: చిత్తూరు, ఏలూరు, గుంటూరు,కాకినాడ, నెల్లూరు

## 6.8 రవాణా వాహనాలపై త్రైమాసిక పన్ను మరియు అపరాధ రుసుమును వసూలు చేయక పోవడం

***ఆంధ్రప్రదేశ్ మోటారు వాహనాల పన్ను చట్టం, 1963 ప్రకారం నిర్దేశించిన త్రైమాసిక పన్ను, అపరాధ రుసుమును నిర్ణీత సమయంలోగా రవాణా వాహనాల యజమానుల నుండి వసూలు చేయని ఫలితంగా ₹6.51 కోట్ల ఆదాయం పొందే అవకాశం కోల్పోయింది.***

ఆంధ్రప్రదేశ్ మోటారు వాహనాల పన్ను విధాన (ఏపీఎంవీటీ) చట్టం, 1963లోని సెక్షన్ 3, రాష్ట్రంలో వినియోగించే లేదా ప్రజల కోసం వినియోగించడానికి ఉంచిన మోటారు వాహనాలపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు పేర్కొన్న రేట్ల ప్రకారం పన్ను విధించాలని నిర్దేశిస్తుంది. చట్టంలోని సెక్షన్ 4, త్రైమాసికం, అర్ధ సంవత్సరం లేదా సంవత్సరం ప్రారంభమైన 15 రోజులలోపు లైసెన్స్‌పై ముందస్తుగా పన్ను చెల్లించాలని నిర్దేశిస్తుంది.

ఇంకా, చట్టంలోని సెక్షన్ 6 మరియు ఏపీఎంవీటీ నియమాలు, 1963లోని 13వ నియమం ప్రకారం, ప్రభుత్వ ఉత్తర్వు (2008 నవంబర్) [190] ప్రకారం, ప్రతి త్రైమాసిక ప్రారంభం నుండి ఒక నెల ఆలస్యంగా చెల్లించిన పన్నుపైన కనీసం 50 శాతం అపరాధ త్రైమాసిక పన్నుగా విధించబడుతుంది.

రవాణా కమీషనర్ (టీసీ), మరియు ఎనిమిది ఉప రవాణా కమీషనర్ (డీటీసీలు) [191] ల దస్త్రాల పరిశీలనలో [192] (2020-2022) త్రైమాసిక పన్ను మొత్తం ₹4.06 కోట్లను 5,164 వాహన యజమానులు నిర్ణీత వ్యవధిలోగా చెల్లించలేదని తేలింది. అదనంగా, 6,578 కేసుల్లో ₹2.45 కోట్ల జరిమానా కూడా వసూలు కాలేదు. దీని ఫలితంగా ***అనుబంధం 6.13*** లో వివరించిన విధంగా ₹6.51 కోట్ల విలువైన త్రైమాసిక పన్ను మరియు కనీస అపరాధ రుసుము కూడా రాబట్టలేకపోయారు.

ప్రతిస్పందనగా, 2021 మార్చి వరకు త్రైమాసిక పన్ను వసూలు చేయబడిందనీ, 2021-22 తదుపరి కాలానికి వసూలు ఇంకా పెండింగ్‌లో ఉందనీ డీటీసీ చిత్తూరు బదులిచ్చారు (2023 జూలై). 1,336 మంది వాహన యజమానులపై చర్యలు ప్రారంభించారనీ, 2022 మార్చి 31 వరకు పన్ను వసూలు చేశారని, అయితే ఎటువంటి అపరాధ రుసుమూ వసూలు చేయలేదని డీటీసీ ఏలూరు బదులిచ్చారు (2023 ఆగస్టు). డీటీసీ కాకినాడ బదులిస్తూ (2023 సెప్టెంబర్) 88 కేసులకు గాను 31 కేసుల్లో పన్ను వసూలు చేశామని, అయితే ఇప్పటి వరకు ఎలాంటి అపరాధ రుసుమూ వసూలు చేయలేదని తెలిపారు. డీటీసీ విజయనగరం బదులిస్తూ (2022 మే), 47 కేసులలో పన్ను వసూలు చేయబడిందనీ, అయితే, ప్రస్తుతానికి ఎటువంటి అపరాధ రుసుమూ వసూలు చేయలేదన్నారు. యజమానులకు సంజాయిషీ నోటీసులు జారీ చేశామని, బకాయిలతో త్రైమాసిక పన్ను వసూలుకు చర్యలు తీసుకుంటామని ఇద్దరు డీటీసీలు[193] బదులిచ్చారు. ఇతర డీటీసీల నుండి ప్రత్యుత్తరాలు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రభుత్వం నుంచి కూడా స్పందన పెండింగ్‌లో ఉంది.

---

190 జీఓఎంఎస్ సంఖ్య 318 రవాణా, రహదారులు & భవనాలు (టీఆర్. 1) శాఖ, తేదీ 03.11.2008

191 ఉప రవాణా కమీషనర్లు: అనంతపురము, చిత్తూరు, ఏలూరు, గుంటూరు,కడప, కాకినాడ, నెల్లూరు, విజయనగరం

192 ప్రజలకు ఆన్ లైన్ సేవలు అందించుటకు ఒక ఐటీ అప్లికేషన్ 'రవాణా శాఖలో పౌరులు సులభంగా పొందే సేవలు' (సిఎఫ్ఎస్‌టీ)

193 ఉప రవాణా కమీషనర్లు: అనంతపురము, కడప

## అంతరంగిక శాఖ

### 6.9 నిర్వహణ మరియు మరమ్మతుల కోసం నిధుల లేమి కారణంగా నిరుపయోగంగా ఉంచబడిన ఫాస్ట్ ఇంటర్‌సెప్టర్ బోట్లు

***మరమ్మతులు మరియు నిర్వహణ కోసం నిధులు విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల తీర ప్రాంత భద్రతకు విఘాతం కలిగిస్తూ 2018 నుంచి ఫాస్ట్ ఇంటర్‌సెప్టర్ బోట్‌లు (ఎఫ్ఐబీలు) పనికిరాకుండా పోయాయి.***

100 శాతం కేంద్ర సహాయంతో 'తీర ప్రాంత భద్రత పథకం' కింద ₹32.67 కోట్ల వ్యయంతో 2005 నవంబర్లో ఆరు మెరైన్ పోలీస్ స్టేషన్‌ల (ఎంపీఎస్) ఏర్పాటును భారత ప్రభుత్వం (జీఓఐ) ఆమోదించింది. దేశం యొక్క తీరప్రాంత రక్షణలో అదనపు రక్షణను అందించడం, చొరబాట్లు మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు వ్యతిరేకంగా తీరప్రాంత జలాల పోలీసింగ్‌లో క్లిష్టమైన అంతరాన్ని పరిష్కరించడం ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ పథకం కింద, భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ₹30 కోట్ల అంచనా వ్యయంతో (2009 జూలై మరియు 2011 నవంబర్ మధ్య) 18 ఫాస్ట్ ఇంటర్‌సెప్టర్ బోట్‌లను (ఎఫ్ఐబీలు) అందించింది. సముద్ర జలాలపై పెట్రోలింగ్ కోసం ప్రభుత్వం ఈ ఎఫ్ఐబీలను ఆరు మెరైన్ పోలీస్ స్టేషన్[194]లలో మోహరించింది మరియు ప్రతి ఎఫ్ఐబీ సంవత్సరానికి కనీసం 1,800 గంటలు (నెలకు 150 గంటలు) పని చేయాలి (2018 జనవరి). ఎఫ్ఐబీల నిర్వహణ వ్యయాన్ని 2017 జూలై 19 వరకు భారత ప్రభుత్వం భరించింది, రాష్ట్ర ప్రభుత్వం వారి బడ్జెట్ నుండి నిర్వహణ వ్యయాన్ని చెల్లించడానికి నిధులను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేయాలని పదేపదే తెలియజేసింది (2016 డిసెంబర్, 2017 ఏప్రిల్, మే, జూలై, ఆగస్టు). తదనంతరం, ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), ఎఫ్ఐబీల మరమ్మత్తులను చేపట్టడానికి కాకినాడ ఓడ రేవుల సంచాలకులతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నారు (2018 ఏప్రిల్).

ఎఫ్ఐబీల వినియోగానికి సంబంధించిన రికార్డుల మచ్చుకు తనిఖీను (2020 సెప్టెంబర్) ఆడిట్ చేపట్టగా, దానికి సంబంధించిన విషయాలు, మరియు పరిశీలనలు తదుపరి పేరాల్లో వివరించబడ్డాయి.

(i) ఎఫ్ఐబీల మరమ్మతు పనుల కోసం ₹2.75 కోట్ల కేటాయింపు కోసం డీజీపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు (2018 జూలై). అయితే, ప్రభుత్వం (2018 ఆగస్టు) మరమ్మతుల ఖర్చును భారత ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని, నిర్వహణ వ్యవధిని



విశాఖపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌లో నిరుపయోగంగా ఉంచబడిన ఎఫ్ఐబీలు (తేదీ: 2023 మే 17)

194 శ్రీకాకుళంలోని కళింగపట్నం, విశాఖపట్నంలోని రుషికొండ, తూర్పుగోదావరిలోని వాకలపూడి, కృష్ణాలోని గిలకలదిండి, గుంటూరులోని సూర్యలంక మరియు ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరులోని దుగరాజపట్నం

2019 జూలై తర్వాత పొడిగించడం కోసం భారత ప్రభుత్వాన్ని సంప్రదించాలని డీజీపీకి సూచించింది.

బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసినందున నిధులు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సమర్థనీయమైనది కాదు. ప్రత్యేక బడ్జెట్ మద్దతుతో ఎఫ్ఐబీల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేయడానికి భారత ప్రభుత్వం నుండి స్పష్టమైన సూచనలు ఉన్నాయి. ఇది ఎఫ్ఐబీలకు షెడ్యూల్ చేయబడిన నిర్వహణ మరియు మరమ్మతులను ప్రతికూలంగా ప్రభావితం చేసింది. పర్యవసానంగా, అన్ని ఎఫ్ఐబీలు 2018 ఆగస్టు[195] నుండి నిరుపయోగంగానే ఉండిపోయాయి.

(ii) తీరప్రాంత కార్యకలాపాలకు ఎఫ్ఐబీల అనుకూలతను ధృవీకరించడం కోసం, ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ (ఐఆర్ఎస్) లోపాలను సక్రమంగా సంకలనం చేస్తూ ఒక వివరణాత్మక నివేదికను సమర్పించింది (2018 మార్చి), లోపాలను సరిదిద్దిన తర్వాత ఫిట్‌నెస్ ప్రమాణపత్రాలు జారీ చేయబడతాయి. ఐఆర్ఎస్ ద్వారా ఎఫ్ఐబీల తనిఖీ కోసం శాఖ ₹44.10 లక్షల మొత్తాన్ని చెల్లించింది (2018 మార్చి). మూడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో లోటుపాట్లను సరిదిద్దలేదు. లోపాలను సరిదిద్దడంలో విపరీతమైన జాప్యం కారణంగా ఎఫ్ఐబీలు మరింత చెడిపోవడాన్ని తోసిపుచ్చలేము.

(iii) ఎఫ్ఐబీలు పని చేయనందున, కోస్ట్ గార్డ్ మరియు కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ (మెరైన్ పోలీస్) సిబ్బంది మధ్య సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించబడే 'సాగర్ కవచ్' అనే ఉమ్మడి తీర భద్రతా అభ్యాసం[196] కోసం శాఖ ప్రభుత్వేతర యాంత్రిక చేపల పడవలను అద్దెకు తీసుకుంది. ఈ కార్యకలాపం కోసం 2018 ఏప్రిల్ నుండి 2020 జూన్ వరకు ₹31.70 లక్షలు చెల్లించబడింది. పడవలు పనిచేసే పరిస్థితిలో ఉన్నట్లయితే ఆ చెల్లింపులు నివారించబడి ఉండేవి.

(iv) 2011 మార్చి తో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన తనిఖీ నివేదిక (సివిల్)లో 'సబ్-ఆప్టిమల్ యుటిలైజేషన్ ఆఫ్ ఇంటర్‌సెప్టర్ బోట్‌లు' అనే పేరా ముద్రితమైంది. ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ), పెట్రోలింగ్ గంటల విషయంలో భారత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని సిఫార్సు చేసింది[197]. ప్రతి పడవ మరియు ఎఫ్ఐబీల యొక్క వాంఛనీయ వినియోగాన్ని శాఖ నిర్ధారించాలి. పెట్రోలింగ్ కోసం ప్రామాణికమైన ప్రోటోకాల్‌ని నిర్ణయించినట్లు శాఖ పేర్కొంది (2020 ఫిబ్రవరి). అయినప్పటికీ, ఎఫ్ఐబీల సగటు వినియోగం 2017లో 18.65 శాతం నుండి 2019లో 0.68 శాతానికి తగ్గిందని మరియు 2020 సంవత్సరం మొదటి రెండు త్రైమాసికాలలో ఎటువంటి పెట్రోలింగ్ నిర్వహించబడలేదని గమనించింది. నిధుల లేమి కారణంగా పీఏసీ యొక్క నిర్దిష్ట సిఫార్సు ఉన్నప్పటికీ ఎఫ్ఐబీలు ఉత్తమంగా ఉపయోగించబడలేదు.

---

195 18 ఎఫ్ఐబీలలో, అన్నింటిలో పాతది 2016 డిసెంబర్ నుండి, తాజాగా 2018 నుండి వివిధ తేదీలలో మొత్తం 16 పాడైపోయాయి. ఒకటి పాక్షికంగా పని చేస్తుండగా, మరొకటి పని చేస్తున్నప్పటికీ, ఐఆర్ఎస్ ప్రమాణీకరణ లేని కారణంగా ఉపయోగించబడుటలేదు

196 భద్రత, నౌకాయానం, నిర్వహణ, నిఘా మరియు సముద్రాల ప్రాదేశిక జలాల్లో దర్యాప్తు మొదలైన వివిధ అంశాలలో శిక్షణను కలిగి ఉండే బలగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం శిక్షణ యొక్క లక్ష్యం

197 నివేదిక సంఖ్య 14 పీఏసీ – XIII ఆంధ్రప్రదేశ్ శాసనసభలోని పేరా 1.52

అందువల్ల, తీరప్రాంత భద్రతకు సంబంధించిన ఒక ముఖ్యమైన పథకానికి ఆర్థిక సహాయం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపలేదు.ప్రధాన లక్ష్యాలైన చొరబాటు మరియు ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు, తద్వారా, రాజీ పడాల్సివచ్చింది.

ఈ విషయమై ప్రశ్నించగా, ₹6.50 కోట్లు మరమ్మతులు చేయడానికి, ఒక సంవత్సరం వార్షిక నిర్వహణ కోసం ₹6.00 కోట్లు, మంజూరు చేయడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించబడ్డాయనీ (2021 సెప్టెంబర్), మంజూరు ఉత్తర్వులు ఇంకా అందలేదనీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, విశాఖపట్నం ప్రత్యుత్తరమిచ్చారు (2022 మార్చి).

ఈ విషయం ప్రభుత్వానికి విన్నవించడమైనది (2022 సెప్టెంబర్) కానీ వారి సమాధానం ఇంతవరకు అందలేదు (2023 ఏప్రిల్).

(శరత్ చతుర్వేది)
ప్రధాన మహాగణకులు (తనిఖీ)
ఆంధ్రప్రదేశ్

విజయవాడ
ది 30 జూన్ 2025

ధ్రువీకరించడమైనది

(కె. సంజయ్ మూర్తి)
భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్

న్యూ ఢిల్లీ
ది 03 జులై 2025

# అనుబంధాలు

**అనుబంధం–1.1**

**(పేరా 1.6.1, పేజీ 3)**

**శాఖల వారీగా బకాయిగా ఉన్న తనిఖీ నివేదికలు మరియు పేరాలు**

| క్రమ సంఖ్య | శాఖ | 31 డిసెంబర్ నాటికి బకాయిగా ఉన్న ఐఆర్‌ల /పేరాల సంఖ్య | |
|---|---|---|---|
| | | ఐఆర్‌లు | పేరాల సంఖ్య |
| 1. | మహిళలు, పిల్లలు, వికలాంగులు మరియు వయో వృద్ధులు | 14 | 106 |
| 2. | మైనారిటీల సంక్షేమం | 21 | 191 |
| 3. | వెనుకబడిన తరగతుల సంక్షేమం | 41 | 420 |
| 4. | గిరిజన సంక్షేమం | 64 | 1,020 |
| 5. | సాంఘిక సంక్షేమం | 26 | 234 |
| 6. | ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమం | 103 | 1,546 |
| 7. | పాఠశాల విద్య | 217 | 2,587 |
| 8. | ఉన్నత విద్య | 214 | 1,808 |
| 9. | యువజన అభివృద్ధి, పర్యాటకం మరియు సాంస్కృతిక శాఖ | 56 | 522 |
| 10. | నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ | 192 | 1,161 |
| 11. | కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్స్ & బీమా వైద్య సేవలు | 74 | 418 |
| 12. | వ్యవసాయం మరియు సహకారం | 223 | 1,394 |
| 13. | పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి మరియు మత్స్య పరిశ్రమ | 137 | 879 |
| 14. | వినియోగదారుల వ్యవహారాలు ఆహారం & పౌర సరఫరాలు | 08 | 63 |
| 15. | ఇంధనము | 85 | 282 |
| 16. | ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ | 07 | 47 |
| 17. | పరిశ్రమలు మరియు వాణిజ్యం | 83 | 517 |
| 18. | నీటి వనరులు | 449 | 1,465 |
| 19. | రవాణా, రోడ్లు మరియు భవనాలు | 429 | 2,365 |
| 20. | ఆంతరంగిక శాఖ | 153 | 1,068 |
| మొత్తం | | **2,596** | **18,093** |

## అనుబంధం-1.2

(పేరా 1.6.3, పేజీ 4)

### బకాయిగా ఉన్న వివరణాత్మక నివేదికలు (2023 జూన్ 30 నాటికి)

ఎ. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినవి

| శాఖ | 2014-15 | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| సాధారణ పరిపాలన | – | – | – | – | 1 | 1 |
| ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ | – | 2 | – | – | – | 2 |
| ఉన్నత విద్య | – | – | 1 | 2 | 2 | 5 |
| కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు అభివృద్ధి | – | – | – | 1 | – | 1 |
| పుర పరిపాలన మరియు పట్టణ అభివృద్ధి | – | – | 1 | 3 | 3 | 7 |
| మైనారిటీల సంక్షేమ శాఖ | 1 | – | – | – | – | 1 |
| పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి | – | – | 2 | – | 2 | 4 |
| పాఠశాల విద్య | 1 | – | – | – | – | 1 |
| గిరిజన సంక్షేమం | – | – | 1 | – | – | 1 |
| మహిళలు, బాలలు, వికలాంగులు మరియు వయో వృద్ధులు | 1 | 1 | – | – | – | 2 |
| యువజన అభివృద్ధి, పర్యాటకం మరియు సాంస్కృతిక శాఖ (క్రీడలు) | – | – | – | – | 1 | 1 |
| వ్యవసాయం మరియు సహకార శాఖ | – | 0 | 1 | 0 | 0 | 1 |
| నీటి వనరుల శాఖ | – | 1 | 2 | 0 | 0 | 3 |
| పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ | – | 2 | 0 | 1 | 0 | 3 |
| పశుసంవర్ధక మరియు మత్స్య శాఖ | – | 0 | 1 | 0 | 0 | 1 |
| రవాణా, రోడ్లు మరియు భవనాలు | – | 6 | 5 | 4 | 7 | 22 |
| రెవెన్యూ శాఖ | – | 0 | 1 | 0 | 0 | 1 |
| రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) | – | 31 | 5 | 0 | 0 | 36 |
| **మొత్తం** | **3** | **43** | **20** | **11** | **16** | **93** |

బి. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించినవి

| శాఖ | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 | 2013-14 | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| వెనుకబడిన తరగతుల సంక్షేమం | – | – | 1 | – | – | 1 |
| ఆర్థిక శాఖ | 1 | – | 1 | 1 | – | 3 |
| ఆంతరంగిక శాఖ | – | – | – | – | 1 | 1 |
| గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్యం | – | – | 1 | – | – | 1 |
| గిరిజన సంక్షేమం | – | 1 | – | – | 1 | 2 |
| యువజన అభివృద్ధి, పర్యాటకం మరియు సాంస్కృతిక శాఖ | 1 | – | – | – | 1 | 2 |
| వ్యవసాయం మరియు సహకార శాఖ | – | – | 0 | 1 | 0 | 1 |
| నీటి వనరుల శాఖ | – | – | 0 | 0 | | 0 |
| పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ | – | – | 1 | 0 | 1 | 2 |
| పశుసంవర్ధక మరియు మత్స్య శాఖ | – | – | 0 | 0 | 0 | 0 |
| రవాణా, రోడ్లు మరియు భవనాలు | – | – | 1 | 1 | 3 | 5 |
| రెవెన్యూ శాఖ | – | – | 0 | | 0 | 0 |
| పుర పరిపాలన మరియు పట్టణ అభివృద్ధి | – | – | 0 | 0 | 0 | 0 |
| పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి | – | – | 0 | 0 | 0 | 0 |
| రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) | – | – | 38 | 4 | 2 | 44 |
| మొత్తం | 2 | 1 | 45 | 8 | 13 | 62 |

అనుబంధం-1.3

(పేరా 1.6.4, పేజీ 4)

బకాయిగా ఉన్న తీసుకున్న చర్యలపై నివేదికలు (2023 జూన్ 30 నాటికి)

ఎ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినవి – శాసనసభ (ఎల్ఎ) వారీగా

| శాఖ | 13వ ఎల్ఎ | 14వ ఎల్ఎ | మొత్తం |
|---|---|---|---|
| | 2009-14 | 2014-18 | |
| ఉన్నత విద్యా శాఖ | 1 | – | 1 |
| పుర పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ (ఎమ్ఏ) | 6 | – | 6 |
| పుర పరిపాలన మరియు పట్టణాభివృద్ధి (పీహెచ్ విభాగం) | 1 | 2 | 3 |
| రెవెన్యూ శాఖ | – | 1 | 1 |
| మౌలిక సదుపాయాలు & పెట్టుబడి శాఖ | 0 | 1 | 1 |
| మొత్తం | 8 | 4 | 12 |

బి. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించినవి – శాసనసభ (ఎల్ఎ) వారీగా

| శాఖ | పది వరకు | 11వ ఎల్ఎ | 12 | 13వ ఎల్ఎ | 14వ ఎల్ఎ | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| | 1994-99 | 1999-2004 | 2004-2009 | 2009-14 | 2014-18 | |
| వెనుకబడిన తరగతుల సంక్షేమం | - | - | - | 1 | - | 1 |
| సాధారణ పరిపాలన శాఖ | - | - | - | 3 | - | 3 |
| ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ | - | - | - | 2 | 2 | 4 |
| ఉన్నత విద్యా శాఖ | - | - | - | 1 | - | 1 |
| పుర పరిపాలన మరియు పట్టణ అభివృద్ధి (ఎమ్ఏ) | - | - | - | 1 | 1 | 2 |
| పుర పరిపాలన మరియు పట్టణ అభివృద్ధి (పిహెచ్ విభాగం) | - | - | - | 1 | - | 1 |
| పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ | - | 3 | - | - | - | 3 |
| పాఠశాల విద్యా శాఖ | - | - | - | 2 | - | 2 |
| మహిళలు, బాలలు, వికలాంగులు మరియు వయో వృద్ధులు | - | - | - | 1 | 1 | 2 |
| నీటి వనరుల శాఖ | -- | -- | 1 | 0 | 1 | 2 |
| రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) | 378 | 52 | 32 | 0 | 0 | 462 |
| రవాణా, రోడ్లు మరియు భవనాలు | 15 | 0 | 1 | 0 | 0 | 16 |
| మొత్తం | 393 | 70 | 35 | 12 | 5 | 499 |

## అనుబంధం-2.1
(పేరా 2.6.1, పేజీ 9)
### బీఓసీడబ్ల్యూ చట్టం 1996 మరియు ఓఎస్‌హెచ్‌డబ్ల్యూసీ కోడ్ 2020 పోలిక

| క్రమ సంఖ్య | విభాగం | బీఓసీడబ్ల్యూ చట్టం 1996 | విభాగం | ఓఎస్‌హెచ్‌డబ్ల్యూసీ కోడ్ 2020 |
|---|---|---|---|---|
| 1 | 1(4) | ఇది గడచిన పన్నెండు నెలల్లో ఏ రోజునైనా, ఏదైనా భవనం లేదా ఇతర నిర్మాణ పనిలో పది లేదా అంతకంటే ఎక్కువ మంది బిల్డింగ్ కార్మికులను నియమించుకున్న లేదా నియమించిన ప్రతి స్థాపనకు వర్తిస్తుంది. | 2 (యూ) (వి) | స్థాపన అంటే ఏదైనా పరిశ్రమ, వాణిజ్యం, వ్యాపారం, తయారీ లేదా వృత్తి నిర్వహించబడే ప్రదేశం, ఇందులో పది లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులు పనిచేయాలి. |
| 2 | 2(ఎ) | సముచితమైన ప్రభుత్వం అంటే: (i) పారిశ్రామిక వివాదాల చట్టం, 1947 (1947లో 14వ) ప్రకారం సంబంధిత ప్రభుత్వం (1947లో 14వ) స్థాపనకు సంబంధించి (ప్రత్యక్షంగా లేదా కాంట్రాక్టర్ ద్వారా భవన కార్మికులను నియమించుకుంటుంది) కేంద్ర ప్రభుత్వం; (ii) అటువంటి స్థాపనకు సంబంధించి, ప్రభుత్వ రంగ సంస్థ అయినందున, కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా నేరుగా లేదా కాంట్రాక్టర్, కేంద్ర ప్రభుత్వం ద్వారా భవన కార్మికులను నియమించేదని పేర్కొనవచ్చు. | 2(డి) | సముచిత ప్రభుత్వం అంటే: (i) కేంద్ర ప్రభుత్వం లేదా మెట్రో రైల్వేలు, గనులతో సహా రైల్వేల స్థాపనకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం లేదా దాని తరపున పేర్కొన్న ఏదైనా నియంత్రిత పరిశ్రమకు సంబంధించి, లేదా కేంద్ర ప్రభుత్వ అధికారం కింద నిర్వహించబడుతున్న సంస్థలకు సంబంధించి , చమురు క్షేత్రం, ప్రధాన నౌకాశ్రయాలు, వాయు రవాణా సేవ లేదా టెలికమ్యూనికేషన్ సేవ, బ్యాంకింగ్ కంపెనీ లేదా కేంద్ర చట్టం ద్వారా స్థాపించబడిన ఏదైనా భీమా సంస్థ లేదా కార్పొరేషన్ లేదా కేంద్ర చట్టం ద్వారా స్థాపించబడిన ఇతర అధికారం లేదా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ లేదా కేంద్రం ఏర్పాటు చేసిన అనుబంధ సంస్థలు ప్రభుత్వ రంగ సంస్థలు లేదా స్వయంప్రతిపత్త సంస్థలు కేంద్ర ప్రభుత్వం యాజమాన్యం లేదా నియంత్రణలో ఉంటాయి. |
| 3 | 2(జె) | స్థాపన అంటే ప్రభుత్వం లేదా ఏదైనా కార్పొరేట్ సంస్థ లేదా సంస్థ, ఒక వ్యక్తి లేదా సంఘం లేదా ఏదైనా భవనం లేదా ఇతర నిర్మాణ పనిలో బిల్డింగ్ కార్మికులను నియమించుకునే వ్యక్తుల యొక్క ఇతర సంస్థకు చెందిన లేదా నియంత్రణలో ఉన్న ఏదైనా స్థాపన; మరియు కాంట్రాక్టర్‌కు చెందిన స్థాపనను కలిగి ఉంటుంది, కానీ అలాంటి కార్మికులను తన స్వంత నివాసానికి సంబంధించి ఏదైనా భవనం లేదా కాంట్రాక్టు పనిలో నియమించుకునే వ్యక్తిని చేర్చలేదు, అటువంటి నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చు రూ. పది లక్షలకు మించకూడదు. | 2(హెచ్) | భవనం లేదా ఇతర నిర్మాణ పనులు, ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం వారి సొంత నివాసం కోసం సొంత నివాస ప్రయోజనాల కోసం మరియు మొత్తం పని ఖర్చు ₹ యాభై లక్షలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తం మరియు అంత కంటే ఎక్కువ మంది కార్మికులను నియమించడం. తగిన ప్రభుత్వం ద్వారా తెలియజేయవచ్చు. |
| 4 | 7(3) | స్థాపన నమోదు: స్థాపన నమోదు కోసం దరఖాస్తును స్వీకరించిన తర్వాత, రిజిస్టర్ చేసే అధికారి స్థాపనను నమోదు చేసి, దాని యజమానికి రిజిస్ట్రేషన్ | 3(3) | రిజిస్టరింగ్ అధికారి అలా చేసిన దరఖాస్తు క్రింద ఒక స్థాపనను నమోదు చేయడంలో లేదా నిర్ణీత వ్యవధిలోపు దరఖాస్తును స్వీకరించడంలో విఫలమైతే, స్థాపన మరియు వ్యవధి ముగిసిన వెంటనే ఈ కోడ్ క్రింద నమోదు చేయబడినట్లు పరిగణించబడుతుంది |

| క్రమ సంఖ్య | విభాగం | బీఓసీడబ్ల్యూ చట్టం 1996 | విభాగం | ఓఎస్‌హెచ్‌డబ్ల్యూసీ కోడ్ 2020 |
|---|---|---|---|---|
| | | సర్టిఫికేట్‌ను నిర్దేశించిన రూపంలో మరియు అటువంటి సమయంలో మరియు నిర్దేశించబడిన షరతులకు లోబడి జారీ చేయాలి. | | మరియు ఎలక్ట్రానిక్ సర్టిఫికేట్ రిజిస్ట్రేషన్ స్వయంచాలకంగా ఉత్పత్తి చేయబడుతుంది మరియు అటువంటి వైఫల్యానికి బాధ్యత రిజిస్టర్ చేసే అధికారిపై ఉంటుంది. |
